# తెలుగు సాహిత్య విమర్శ

## బి. ఎ. స్పెషల్ తెలుగు
## ద్వితీయ సంవత్సరం, సెమిష్టర్ – 4


**రచయితలు**

**శ్రీ అరిపిరాల హరిహరనాథ శాస్త్రి**
ఆంధ్ర శాఖాధ్యక్షులు,
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల,
నరసరావుపేట.

**డా॥ యలమర్తి భానుభవాని,**
రీడర్, తెలుగు విభాగం,
పి.బి.ఎన్. కళాశాల, నిడుబ్రోలు,
గుంటూరు.

**డా॥ మేళ్లచెరువు భానుప్రసాదరావు**
రీడర్, తెలుగు విభాగం,
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల,
నరసరావుపేట.

**డా॥ వెలమల సిమ్మన్న**
డిప్యూటీ డైరెక్టర్,
స్కూల్ అఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
చైర్మన్ బి.ఓ.ఎస్. తెలుగు,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం,
అనంతపూర్.

**ఆచార్య ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**డా॥ సిహెచ్. సుశీలమ్మ**
ఉప సంచాలకులు,
తెలుగు సంస్కృత అకాడమి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

**సంపాదకులు,**

**ఆచార్య జి. కృపాచారి**
డిపార్ట్మెంట్ అఫ్ తెలుగు &
ఓరియంటల్ లాంగ్వేజ్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంచాలకులు**

**డా. నాగరాజు బట్టు**
*ఎం.బి.ఏ., ఎం.హెచ్.ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజి), ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సోషియాలజి), ఎం.ఇ. డి., ఎం.ఫిల్., పిహెచ్.డి.*
దూర విద్యాకేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ – 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**Website : www.anucde.info**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. ఎ. స్పెషల్ తెలుగు
# ద్వితీయ సంవత్సరం   సెమిష్టర్ – 4
# తెలుగు సాహిత్య విమర్శ

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

© **ఆచార్య నాగార్జున యూనివర్శిటి**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున యూనివర్శిటిలోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు,**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికిసంతోషిస్తున్నాను.ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

## బి.ఏ., తదితర ప్రోగ్రాములు

## అంశం: స్పెషల్ తెలుగు సెమిస్టర్-4

## 414STL21 - కోర్సు-5 : తెలుగు సాహిత్య విమర్శ

యూనిట్ల సంఖ్య: 5 | పీరియడ్ల సంఖ్య: 75

---

❖ **అభ్యసన ఫలితాలు:-**

ఈ కోర్సు విజయవంతంగా ముగించాక, విద్యార్థులు క్రింది అభ్యసన ఫలితాలను పొందగలరు.

1. కళలు, సాహిత్యం ఎలా పుడుతున్నాయో గుర్తిస్తూ, కళల్లోని రకాలను, కవిత్వం యొక్క ప్రత్యేకతను గ్రహిస్తారు.
2. కావ్య స్వరూపాన్ని; ప్రాచీన, ఆధునిక కవుల అభిప్రాయాలను అవగాహన చేసుకుంటారు.
3. కావ్యహేతువులను, కావ్య ప్రయోజనాలను, కావ్యభేదాలను గుర్తించడం ద్వారా సాహిత్యం ఎందుకోసమో విశ్లేషించగలుగుతారు.
4. రససూత్రాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా కళాభిరుచిని పొందుతారు.
5. ధ్వని స్వరూపాన్ని గ్రహించడం ద్వారా కావ్యానందాన్ని ఆస్వాదిస్తారు.
6. కావ్యలక్షణాలను సంప్రదాయ పద్ధతిలో విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం ద్వారా సంప్రదాయసాహిత్యంలోని విశిష్టతను గ్రహిస్తారు.

25.2.21

# పాఠ్య ప్రణాళిక

**యూనిట్–I: 'కళలు' – కావ్యము / కవిత్వము**

1. కళ–ఉత్పత్తి–భిన్న వాదాలు; దృశ్య–శ్రవ్యకళలు, లలితకళలు; లలితకళల్లో కవిత్వస్థానం
2. కావ్యం–కవి; కావ్య నిర్వచనాలు–ప్రాచ్యులు, పాశ్చాత్యులు
3. కావ్యం/కవిత్వం–ప్రాచీన, ఆధునిక తెలుగు కవుల అభిప్రాయాలు

**యూనిట్–II: కావ్యహేతువులు, కావ్యప్రయోజనాలు, కావ్యభేదాలు**

4. కావ్యహేతువులు – ప్రతిభ, వ్యుత్పత్తి–అభ్యాసము–సమగ్ర విశ్లేషణ
5. కావ్యప్రయోజనాలు–ప్రాచీన, ఆధునిక దృక్పథాలు
6. కావ్యభేదాలు

**యూనిట్–III: రసతత్వం**

7. రససూత్రము–విభావ, అనుభావ, సాత్విక, సంచారీ భావాలు
8. రసోత్పత్తి వాదాలు (రసనిష్ఠ)–భట్టలోల్లటుడు, భట్టనాయకుడు, శ్రీశంకుకుడు, అభినవగుప్తుడు
9. రససంఖ్య; రస సమీకరణ వాదాలు/ రసైకత్వం

**యూనిట్–IV: ధ్వని**

10. ధ్వని : ధ్వని స్వరూపం, ధ్వని నిర్వచనం, ధ్వని సిద్ధాంతం, ధ్వనికావ్య లక్షణం
11. అభిధ, లక్షణ, వ్యంజన
12. ధ్వని భేదాలు

**యూనిట్–V: సంప్రదాయసాహిత్యం–విమర్శాపద్ధతులు**

13. సాహిత్య విమర్శ–మౌలికాంశాలు, ప్రయోజనాలు
14. సాహిత్య విమర్శ– సంప్రదాయ విమర్శాపద్ధతులు
15. విమర్శా వ్యాసం – (తిక్కన తెరువులు) ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం
    (చూ. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు – పుట 55 నుండి 60 వరకు)

25.2.21

**ఆధారగ్రంథాలు :**

1. సాహిత్య సోపానాలు- ఆచార్య దివాకర్ల వేంకటావధాని
2. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
3. కావ్యాలోకము-నండూరి రామకృష్ణమాచార్య
4. ధ్వన్యాలోకము (లోచన సహితం) - ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు
5. రసోల్లాసము - ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం
6. భారత ధ్వని దర్శనము - ఆచార్య శలాక రఘునాథ శర్మ

**సూచించబడిన సహపాఠ్య కార్యక్రమాలు**

1. స్థానిక విమర్శకుల చేత ప్రసిద్ధ కావ్యాలపై ప్రసంగవ్యాసాలు ఇప్పించడం.
2. ప్రసిద్ధకావ్యాల పైన వచ్చిన విమర్శాగ్రంథాలలోని వ్యాసాలను విద్యార్థులచేత చదివించి, సొంత మాటల్లో రాయించడం.
3. ఆధునిక కవుల ప్రసంగాలను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (ఆడియో విజువల్) సాయంతో విద్యార్థులకు ప్రదర్శించడం.
4. ప్రాచీన సంస్కృత ఆలంకారిక గ్రంథాలను పరిశీలింపజేయడం.
5. భారతీయాలంకారిక శాస్త్ర కావ్యలక్షణాలను ప్రాచీన కావ్యాల్లో సమన్వయించడం.
6. చారిత్రిక, సాంస్కృతికాంశాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలను సందర్శించడం.

**MODEL QUESTION PAPER** **(414STEL21)**

# B. A. Degree Examination

**Second Year – Fourth Semester**

**Part – II : Special Telugu**

**Paper – V : TELUGU SAHITHYA VIMARSA**

**Time : Three hours** **Maximum Marks : 70**

**విభాగము – అ** **(5 x 4 = 20 మార్కులు)**

**ఈ క్రింది వానిలో ఐదింటికి సంక్షిప్త సమాధానాలు వ్రాయండి.**

**ప్రతి సమాధానానికి 4 మార్కులు.**

1) ఉత్పత్తి. .

2) దృశ్య – శ్రావ్య కళలు.

3) కావ్య బేధాలు.

4) ప్రతిభ.

5) సంచారీ భావాలు.

6) రసైకత్వం.

7) ధ్వని బేధాలు.

8) సాహిత్య ప్రయోజనాలు.

**విభాగము – ఆ** **(5 x 10 = 50 మార్కులు)**

**ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.**

**ప్రతి సమాధానానికి 10 మార్కులు.**

9) (a) కళలను నిర్వచించి, భిన్న వాదాలు వ్రాయండి.

Or

(b) కవిత్వంలో ప్రాచీన ఆధునిక కవుల అభిప్రాయాలను తెలిచేయండి.

10) (a) కావ్య హేతువులు అనగానేమి? సమగ్ర విశ్లేషణ రాయండి.

Or

(b) కావ్య ప్రయోజనాలను విశదీకరించండి.

11) (a) రస సూత్రము విభావ , అనుభావములను విపులీకరించండి.

Or

(b) రస సంఖ్య, రస సమీకరణ వాదాలను తెలియచేయండి.

12) (a) ధ్వని స్వరూప, నిర్వచనాలను విశదీకరించండి.

Or

(b) ధ్వని భేదాలను వ్రాయండి.

13) (a) సాహిత్య విమర్శ ప్రయోజనాలను తెలిచేయండి.

Or

(b) సాహిత్య విమర్శ సంప్రదాయ పద్ధతులను వివరించండి.

-----------------

# విషయ సూచిక


| పాఠం సంఖ్య | పాఠం పేరు | పేజి సంఖ్య నుండి వరకు |
|---|---|---|
| 1 | కళలు | 1.1 – 1.13 |
| 2 | కావ్యం / కవిత్వం | 2.1 – 2.15 |
| 3 | కావ్య హేతువులు | 3.1 – 3.9 |
| 4 | కావ్య ప్రయోజనాలు | 4.1 – 4.9 |
| 5 | కావ్య భేదములు | 5.1 – 5.19 |
| 6 | రస స్వరూపము | 6.1 – 6.8 |
| 7 | రస నిష్ఠ | 7.1 – 7.4 |
| 8 | రస సంఖ్య | 8.1 – 8.5 |
| 9 | ధ్వని : త్రివిధ శబ్ద వృత్తులు | 9.1 – 9.11 |
| 10 | విమర్శ – విమర్శకుడు | 10.1 – 10.17 |
| 11 | విమర్శ – పద్ధతులు | 11. 1 – 11.11 |
| 12 | విమర్శా వ్యాసం – తిక్కన తెరువులు | 12. 1 – 12.4 |

# పాఠం – 1
# కళలు

## ఉద్దేశ్యం :

విద్యార్థికి కళలు గురించి, లలిత కళల గురించి మరియు లలితకళల్లో కవిత్వ స్థానం గురించి అవగాహన కలిగించటం.

## పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :

1.1 కళలు – నిర్వచనం

1.2 కళల – పుట్టుక

1.3 కళలు – విభజన

1.3.1 ఔపయోగిక కళలు

1.3.2 లలిత కళలు

1.4 లలితకళలు – విభజన

1.4.1 శ్రవ్య కళలు

1.4.2 దృశ్య కళలు

1.4.3 ఉభయకళ

1.5 లలితకళలు – లక్షణాలు

1.5.1 మనోహరత్వం

1.5.2 విశ్వజనీనత

1.5.3 అనుకరణం

1.6 లలితకళలు – ప్రాశస్త్యం

1.6.1 సంగీతం

1.6.2 కవిత్వం

1.6.3 చిత్రలేఖనం

1.6.4 శిల్పం

1.6.5 నాట్యం

1.7 లలితకళల్లో కవిత్వస్థానం

1.7.1 సౌందర్య చలనం

1.7.2 భౌతిక ద్రవ్యాపేక్ష

1.7.3 రూప చిత్రణ

1.7.4 చిత్త ధృతి కలిగించటం

1.8 సారాంశం

1.9 ముఖ్య పదకోశం

1.10 స్వీయ మదింపు ప్రశ్నలు

1.11 ఉపయుక్త గ్రంథాలు

## 1.1 కళలు – నిర్వచనం :

లలితకళలు అనే పదం ఆంగ్లంలోని Fine Arts" అనే పదానికి సమానార్థకంగా వాడబడుతుంది. "Ars" అనే గ్రీకు పదం నుంచి "Arts" అనే పదం పుట్టింది. Arts అనగా ప్రకృతికానిది అని అర్థం. ఏదైనా ఒక పనిని నేర్పుగా చేయడాన్ని 'కళ' అనవచ్చు. హృదయానికి ఆనందాన్ని కలుగజేసేది కళ. సృష్టికి ప్రతిసృష్టి చేసి మానవ హృదయాన్ని కదిలించి మైమరపింపజేయగల శక్తిని కలిగున్నది కళ. అందం గొలిపేదే కళ అవుతుంది.

కళలు మానవ సంస్కృతికి ప్రతిబింబాలు. ఏదేశం కళలకు నిలయమవుతుందో ఆ దేశం నాగరికమైనట్లు భావించాలి. కళల మీద ఆధారపడి దేశ గౌరవం, ఔన్నత్యం, జాతి పురోభివృద్ధి ఆధారపడి ఉంటాయి. భారతదేశం కళలకు పుట్టినిల్లుగా ప్రాచీన కాలం నుంచి విరాజిల్లుతుంది.

## 1.2 కళలు – పుట్టుక :

మానవుడు ప్రకృతి సౌందర్యాన్ని తనివి తీరా చూచి తన్మయత్వం చెందుతాడు. తనకు కలిగిన ఆనందాన్ని అతడు వ్యక్తం చేయడానికి ఎప్పుడైతే ప్రారంభించాడో అప్పుడే కళలుపుట్టాయి. పరవశించి ఆనందంతో కూనిరాగాలు తీయగా సంగీతం పుట్టింది. భక్తి పారవశ్యంతోను, పిల్లల్ని నిద్రపుచ్చటానికి, శారీరక శ్రమ చేసే సమయంలో పాటల అవసరం ఏర్పడి "సంగీతకళ" వచ్చింది. తన మనసులో కలిగిన భావాల్ని అందమైన మాటల పొందికతో వ్యక్తీకరించగా "కవిత్వం" అయ్యింది. దేవుడిని స్తుతించడానికి, భావస్ఫూర్తి కోసం, ఛందోమయ భారతిని, శబ్దార్థాలంకారాలను మానవుడు ఆశ్రయించడంతో కవిత్వం ప్రాణం పోసుకొంది. అలాగే రకరకాల బొమ్మలు వేయగా "చిత్రలేఖనం", విగ్రహాలను చెక్కగా "శిల్పం" అయ్యాయి. తాను చూసిన అందమైనవాటిని తిరిగి పునః సృష్టించి చిత్రాలుగా, శిల్పాలుగా తీర్చిదిద్ది వాటికి చిరస్థాయిత్వం కల్పించాడు. అంతేగాక తాను ఇంట్లో ఉపయోగించే వస్తువులను కూడా వివిధ ఆకృతులతో, రంగులతో, బొమ్మలతో చేయడంతో "చిత్రకళ" పుట్టింది. అలాగే దేవాలయాల

కారణంగా "విగ్రహశిల్పం", గృహ నిర్మాణంలో "సౌదశిల్పం" జనించాయి. మనిషి ఆనందం ఎక్కువై పరవశంతో చిందులు తొక్కాడు. అదే నాట్యమైంది. మిగిలిన లలితకళలు నాలుగిటికంటే సహజంగా ఆవిర్భవించింది నాట్యకళ.

మానవుడి జీవితంలో రెండు పార్శ్వాలు ఉంటాయి. ఒకటి అతడు భౌతికంగా సుఖమయ జీవనం ఏర్పాటుచేసుకొని నాగరికుడిగా ఎదగడం, రెండవది అతడి ఆధ్యాత్మిక సాధన. ఆదిమానవుడిగా అడవులలో జంతువుల్లో జంతువుగా జీవించిన అతడు యుగాలు కష్టపడి ఎంతో జ్ఞానాన్ని సంపాదించాడు. తన మానవత్వాన్ని నిరూపించుకోవటమేకాక దివ్యత్వాన్ని అందుకున్నాడు, ఆత్మానుసంధానం పొంది తానే బ్రహ్మంగా, బ్రహ్మమే తానుగా అద్వైత సిద్ధి సాధించాడు. ఇలా మనిషి అభివృద్ధి సాధించే క్రమంలో అతడి విలాసమైన జీవితానికి కళలు, ఆధ్యాత్మిక జీవితానికి విద్యలు ఉపయోగపడ్డాయి. మానవుడి లౌకిక నాగరికత కళల ద్వారా, ఆత్మిక పారలౌకిక జ్ఞానం విద్యల ద్వారా సాధించబడ్డాయి. ఎరుకను కలిగించేది విద్య, అందం గొలిపేది కళ అని చెప్పవచ్చు. విద్య శాస్త్ర రూపం పొందింది. విద్యను అభ్యసించేటప్పుడు శాస్త్రమయితే, ఆ శాస్త్రాన్ని ఉపయోగించేటప్పుడు కౌశలంతో కూడిన ఆ పనులు కళలవుతాయి.

అంటే ఉదాహరణకు ఒక వైద్యుడు విద్య నభ్యసించేటప్పుడు అది శాస్త్రమే. అతడు ఆ శాస్త్రాన్ని ఉపయోగించి రోగులకు చికిత్స చేసేటప్పుడు అది కళ అవుతుంది. అలాగా ప్రతి పనిని నైపుణ్యంతో చేస్తే దానిని కళగానే మనవారు భావించారు. అందుకే 64 కళలని చెప్పారు. అందులో దొంగతనాన్ని కూడా చోరకళగా చేర్చటం కనిపిస్తుంది. మనవారేకాదు పాశ్చాత్యులు కూడా అలాగే భావించారు. కనుకనే ఫ్రెంచి భాషలో “Murder as an art” అనే గ్రంథం వచ్చి ఉంటుంది.

## 1.3 కళలు – విభజన :

కళలు ముఖ్యంగా రెండు రకాలు.

అవి : 1. ఔపయోగిక కళలు 2. లలిత కళలు

### 13.1 ఔపయోగిక కళలు :

నిత్య జీవితంలో ఉపయోగించే వస్తువులను తయారుచేసే వృత్తి విద్యలన్నీ ఔపయోగిక కళలే. వీటిని వ్యవహార కళలు అని కూడా అంటారు.

ఉదా: కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి మొదలైనవి.

Good Heart Rendell అనే అతడు ఔపయోగిక కళల గురించి "Fine Arts are those which must please and may serve and useful arts are those which must serve and may please" అని చెప్పాడు.

### 1.3.2 లలిత కళలు :

హృదయానికి ఆనందాన్ని కలిగించేవి అలిత కళలు. సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం – ఈ

ఐదింటిని లలితకళలంటారు. క్రియాలాలిత్యం కలవి కనుక లలితకళలన్నారు. ఇవి రసానంద జనకాలు కనుక సరసకళలయ్యాయి. జయదేవుడు తన గీతగోవిందంలో వీటికే విలాసకళలని పేరుపెట్టాడు.

"యది హరిస్మరణే సరసం మనో
యది విలాసకలాను కుతూహలమ్
మధుర కోమల కాంత పదావళీమ్
శృణు తదా జయదేవ సరస్వతీమ్"

ఇక్కడ విలాస శబ్దం సరస శబ్దానికి సమానార్థకంగా ప్రయోగించారేమో! రసాస్వాదనను కలిగించే మనో విలాసాన్ని, ఉల్లాసాన్ని లోకానికి కలిగిస్తాయి. కనుక విలాసకళలని ఉండవచ్చు. వీటినే చిత్రకళలు అని కూడా వ్యవహరిస్తారు. చిత్రణా సామర్థ్యం కలివి కనుక చిత్రకళలన్నారు.

సరసత్వం కవిత్వ సంగీత కళలలో, చిత్రణ చిత్రలేఖనంలో, లాలిత్యం విగ్రహశిల్పంలో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ నాలుగే లలితకళలు, నాట్యం కాదనే వాదన ఉంది. నాట్య మంటే నాటక ప్రదర్శనం. ఆ ప్రదర్శన సంగీత కవిత్వాలను ఆశ్రయించుకొని ఉంటుంది. సంగీత సాహిత్య సహాయం లేకుండా నాట్యం లేదు. కాబట్టి దీనిని లలితకళగా స్వీకరించ కూడదని కొందరి అభి ప్రాయం. అందుకే నాట్యాన్ని సమాహార కళగా భావించారు.

## 1.4 లలితకళలు – విభజన :

లలిత కళలు మూడు రకాలు.

1) శ్రవ్య కళలు 2) దృశ్య కళలు 3) ఉభయకళ

### 1.4.1 శ్రవ్య కళలు :

విని ఆనందించే కళలు కనుక వీటిని "శ్రవ్యకళలు" అన్నారు. వీటినే "చరకళలు " అని కూడా అన్నారు. సంగీతం, కవిత్వం శ్రవ్యకళలవుతాయి. వీటిలో వర్ణించే వస్తువు చలరూపం కలిగి వుంటుంది. కాబట్టి చరకళలయ్యాయి.

### 1.4.2 దృశ్య కళలు :

చూచి ఆనందించేవి "దృశ్య కళలు". ఇవి చిత్రలేఖనం, శిల్పం. చిత్రలేఖనం, శిల్పంలో వర్ణించబడిన వస్తువు నిశ్చలంగా ఉంటుంది. కనుక వీటిని "స్థిరకళలు" అన్నారు.

### 1.4.3 ఉభయకళ :

విని, చూచి అందించేది. అది నాట్యం. ఇది సమాహారకళ.

## 1.5 లలితకళలు – లక్షణాలు :

లలితకళలు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉంటాయి.

అవి :

1) మనోహరత్వం 2) విశ్వజనీనత 3) అనుకరణం

### 1.5.1 మనోహరత్వం :

మనోహరత్వం లలితకళల ముఖ్య లక్షణం. ప్రకృతిలో సహజంగా కొన్ని చాలా అందంగా ఉంటాయి. దానిని అనుకరిస్తూ మనిషి అంత అందంగానూ వస్తువుల్ని తయారుచేశాడు. మొదట్లో మనిషి తన అవసరాలకు ప్రకృతి మీదనే ఆధారపడ్డాడు. ఆ తర్వాత తనకు అవసరమైన వస్తువులను ప్రకృతిని ఉపయోగించి తానే తయారు చేసుకున్నాడు. ఉదాహరణకు మొదట్లో కొండగుహల్లో, చెట్టు తొర్రలలో నివసించినవాడు ఇప్పుడు ఎంతో అందమైన సౌధాలను నిర్మిస్తున్నాడు కదా. ఈ రోజుల్లో మనం ఉపయోగించే అనేక వస్తువులు అంటే కుర్చీలు, బల్లలు, పాత్రలు, దుస్తులు, ఆభరణాలు గమనిస్తే అన్నీ అందంగా ఉండాలనే తాపత్రయం కనిపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందేటంత గొప్పగా నిర్మాణాలు కనిపిస్తాయి. ఉదాహరణకు తాజ్ మహల్. ఆ తాజ్ మహల్ మనోహరత్వం కారణంగానే దేశ విదేశీయులని ఆకర్షిస్తుంది, అనేకమంది సందర్శకులు నిత్యం దర్శించి వెళుతుంటారు.

### 1.5.2 విశ్వజనీనత :

లలితకళల వలన విశ్వంలోని ప్రతి ఒక్కరు ఆనందిస్తారు. ఒక చిత్రాన్నో, శిల్పాన్నో చూసినవారు భాషకు, ప్రాంతానికి సంబంధం లేకుండా ఆనందించటం చూస్తాం. అలాగే అర్థం కాకపోయినా ఇతర భాషా గీతాలు వినినప్పుడు ఆ సంగీతానికి మైమరపు కలగటం సహజంగా కనిపిస్తుంది. అంటే లలితకళలనేవి ఏ ఒక్కరి సొత్తు కాదు, విశ్వజనులది. ఇక్కడ ఇంకో విషయం కూడ గమనించాలి. లోకంలో అందమైన భార్యాభర్తల జంటని చూసినప్పుడు జీవిత భాగస్వామి లేనివారు వారిని చూసి అసూయ పడవచ్చు. కానీ అందమైన చిత్రంగానో, శిల్పంగానో ఒక జంటను మలిస్తే అది చూసి ఎవరూ బాధపడరు, అసూయ చెందరు. చూసిన అందరు ఎంత అందమైన జంట అని అబ్బురంతో ఆనందపడతారు.

### 1.5.3 అనుకరణం :

లోకోత్తర సుందరమైన దృశ్యాలను, వస్తువులను అనుకరిస్తూ ఉన్నదున్నట్లుగా చేసినప్పుడు అది ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఒక అందమైన వ్యక్తిని చూసి ఆనందించటం కంటే అదే అందమైన వ్యక్తి చిత్రపటాన్ని చూసినప్పుడు ఎక్కువ ఆనందిస్తాం. ఆ చిత్రకారుడిని ప్రశంసించకుండా ఉండలేం. ఒక్కో సందర్భంలో నిజమైన వస్తువులకి, ప్రతిగా సృశించబడిన వాటికి అసలు భేదమే కనుక్కోలేనంతగా ఉంటాయి. ఉదాహరణకు ఒక బండిపై పండ్లు పెట్టబడి ఉంటే అవి పండ్లే అని ముందుకు దాటిపోయిన తర్వాత అవి సహజమైనవి కాదు, కృత్రిమమైనవని తెలిసినప్పుడు వెనక్కి వచ్చి మరీ వాటిని పట్టుకొని, చూసి పరీక్షించటం సహజంగా జరుగుతుంది. అవి నిజమైనవే అనేటంత భ్రమకలిగించేటంత సహజంగా చేయటం అనుకరణ.

ఏకళలో అనుకరణ ఎక్కువగా ఉంటుందో, ఏది మనిషిని భ్రమింప చేస్తుందో అది ఉత్తను కళ అవుతుంది. దీనికి ఉదాహరణగా ఒక సందర్భం చెప్పుకోవచ్చు. కళాపిపాసి అయిన ఒక రాజు చిత్రకళ పోటీని పెట్టగా తమ

చిత్రపటాలతో కొందరు పోటీలో పాల్గొన్నారు. మొదటి చిత్రకారుడు చిత్రించిన పువ్వులపై తుమ్మెదలు వచ్చి వాలాయి. రెండవ చిత్రకారుడు చిత్రించిన ద్రాక్ష పండ్లపై పక్షి వచ్చి వాలింది. మూడవ చిత్రకారుడి చిత్రపటం చూసి రాజుగారి కుక్క మొరిగింది. నాల్గవ చిత్రకారుడిని నీ పటం ఏది అంటే రాజుగారినే చూడమన్నాడు. రాజుగారు చిత్రం చూడాలని తెర తొలగించబోయాడు. కానీ ఆ తె రే అతడి చిత్రం, ఇక్కడ సహజమైన అనుకరణ కారణంగా కీటకాలను, పక్షులను, జంతువులను భ్రమింపచేసిన దాని కంటే మనిషినే భ్రమింపజేయడం ఎక్కువ కాబట్టి నాలుగవవాడికే బహుమతి అని వేరే చెప్పనవసరం లేదు.

సాహిత్యంలోనూ ఈ అనుకరణ వర్ణనల రూపంలో ఉంటుంది. కవి తన వర్ణనలతో వర్ణనా వస్తువుని పాఠకుడి మనోనేత్రం ముందు ఉంచుతాడు. తన మనసుతో చూడగలిగిన పాఠకుడు రూప సౌందర్యానికి ముగ్ధుడై ఆనందపరవశుడవుతాడు. అలాగే నాట్యంలో ఇంకా అనుకరణ ఎక్కువగా ఉంటుంది. నటుడు పూర్తిగా పాత్రను అనుకరించి తానే ఆ పాత్ర అని భ్రమింపజేస్తాడు, మనం ఏవైతే చూసి అసహ్యించుకుంటామో అటువంటి వాటికి కళారూపం కలిగినప్పుడు వాటిని అసహ్యించుకోం, చూసి ఆనందిస్తాం.
ఉదా : ఎండిన వృక్షం, అస్తిపంజరం, కరువు ప్రాంతం మొదలైనవి.

## 1.6 లలితకళలు – ప్రాశస్త్యం :

భారతీయ సంస్కృతిలో కళలు అంతర్భాగం. ప్రాచీన కాలంలోనే 64 కళల గురించి వాత్సాయనుడి కామసూత్రాలలోను, భరతుడి నాట్యశాస్త్రంలోను రచించబడింది. ఆ అరవైనాలుగు కళలలో సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం లలితకళలు. ఈ లలితకళలు మాత్రమే మిగిలిన కళలకంటే ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి. లలితకళల వలన కలిగే ఆనందం అలౌకికమైనది. అది అనుభవిస్తేనే తెలిసేటటువంటిది.

### 1.6.1 సంగీతం :

సంగీతం శ్రవ్యకళ. విని ఆనందించేటటువంటిది. సంగీతంలో ధ్వని, లయ ముఖ్యమైనవి. సంగీతం "గాత్రసంగీతం", "జంత్రవాద్య సంగీతం" అని రెండు రకాలు. గొంతుతో పాడేది గాత్ర సంగీతం. వీణ, మృదంగం, వయోలిన్, సితారా, తబలా, పియానో, గిటార్, వేణువు, సన్నాయి, మాండొలిన్ వంటి వాద్యాలను ఉపయోగించేది వాద్యసంగీతం.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి గానరసం ఫణి" అని సంగీతం గురించి చెప్పారు. అంటే శిశువులను, పశువులను, పాములను కూడా సంగీతం ఆనందింపజేస్తుంది. ఏడుస్తున్న పసివాడు పాట వినగానే ఏడుపు ఆపివేస్తే, వేణుగానం విన్న ఆవులు అధికంగా పాలు ఇస్తాయి, సంగీతానికి పాములు కూడా నాట్యం ఆడతాయి. మధురాతి మధురమైన సంగీతం వినగానే హృదయం ఆనందంలో మునిగి పోవటం సర్వసామాన్యమే. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు"వేదానాం సామవేదోస్మి" అని చెప్పాడు. సామవేదమంటేనే సంగీత ప్రధానమైనదని. సంగీతాన్ని 'గాంధర్వం' అని కూడా అంటారు. గంధర్వుల విద్య సంగీతం కనుక ఎవరైనా బాగా పాడితే 'గంధర్వ గానం' అంటారు.

మన వాగ్గేయకారులైన త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య వంటివారు తమ సంగీతంతో, గానంతోనే

భగవంతుడిని పొందగలిగారు. తాన్ సేన్, మీరా, కబీర్ మొదలైనవారు భక్తిపారవశ్యంతో ఆలపించినవారే.

సంగీతంలో రెండు భాగాలున్నాయి.

1. శాస్త్రీయ సంగీతం 2. లలిత సంగీతం

భారతీయ సంగీతంలో హిందుస్థానీ, కర్ణాటక సంగీతరీతులున్నాయి. ఆధునిక కాలంలో జానపద సంగీతం, పాశ్చాత్య సంగీతం అనేవి సంగీతంలో చోటుచేసుకున్నాయి. ఆధునిక కాలంలో రవిశంకర్, బిస్మిల్లాఖాన్, ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాల మురళీకృష్ణ వంటి సంగీత విద్వాంసులు అనేకమందున్నారు.

## 1.6.2 కవిత్వం :

కవిత్వం మిగిలిన కళలలాగా కాక అనేకళలను తనలో ఇముడ్చుకున్న లలితకళ. దీని పరిధి ఎంతో విస్తృతమైంది. కవిత్వం విని ఆనందించే శ్రావ్యకళ. భాష, భావం రెండు కవిత్వానికి ప్రధానమే. లోకంలోని రమణీయ వస్తువుల్ని వర్ణించడమే కవిత్వం అని ఒకప్పుడు అనుకొని అదే చేసేవారు. కానీ ఆధునిక కవిత్వంలో కాదేది కవితకనర్హం అనే భావనతో అన్నిటిపై కవిత్వం చెబుతున్నారు.

వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, భవభూతి, భాసుడు మొదలైనవారు సంస్కృతభాషలో మంచి కవులు. తిక్క నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు, పెద్దన, చేమకూర వెంకటకవి, కందుకూరి, గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, శ్రీశ్రీ మొదలైనవారు తెలుగు భాషలో ఎంతో గొప్పకవిత్వాన్ని సృష్టించారు. అన్ని భాషలలోనూ కవిత్వసృష్టి చేసి ఆయా భాషా కవులు ప్రజలకు రసానందాన్ని అందిస్తున్నారు.

## 1.6.3 చిత్రలేఖనం :

కుంచె రంగులతోఒక కాగితంపై కానీ, వస్త్రంపై కానీ, గోడపై కానీ వివిధ రూపాలను చిత్రించడాన్ని చిత్రలేఖనం అంటారు. చిత్రలేఖనం దృశ్యకళ, చిత్రాలు రెండు రకాలు. అవి వర్ణ చిత్రాలు, రేఖా చిత్రాలు; రంగులతో చిత్రించేవి వర్ణచిత్రాలు. కేవలం గీతల ద్వారా చిత్రించేవి రేఖాచిత్రాలు. ప్రాచీన కాలంలో గుహాలయాలలో చిత్రించేవారు. వాటిని కుడ్య చిత్రాలు అంటారు. నేటికీ దేవాలయాలలో ఈ కుడ్యచిత్రాలను చూడవచ్చు.

మన దేశంలో అజంతా, లేపాక్షిలలో పూర్వచిత్రకళా వైభవాన్ని దర్శించవచ్చు. లియోనార్డో డావిన్సీ, పికాసో, రవివర్మ వంటివారు గొప్ప చిత్రకారులు. భారతీయ చిత్రకారులలో ఆంధ్రుల స్థానం ప్రత్యేకమైంది. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి వీరి చిత్రాలలో కనిపిస్తుంది. లేపాక్షి, అమరావతి, నాగార్జున కొండ మొదలైన ప్రదేశాలలో ఆంధ్రుల చిత్రకళను దర్శించవచ్చు. దామెర్ల రామారావు, అడివి బాపిరాజు, సూర్యదేవర సంజీవదేవ్ వంటివారు ఆధునిక చిత్రకారులకు మార్గదర్శకులు. వీరు తమ జీవితాన్ని కళలకే అంకితం చేశారు. వరదా వెంకట రత్నం, వరహాగిరి వెంకట భగీరధి, సి.ఎన్. వెంకటరావు, చామకూర భాష్యకార్లు రావు, అంకాల వెంకట సుబ్బారావు, కౌతా రామమోహనశాస్త్రి, ఆనందమోహనశాస్త్రి, మొక్కపాటి కృష్ణమూర్తి, మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే, హెచ్. వి. రాంగోపాల్, దామెర్ల బదరీ నారాయణరావు, అంట్యాకుల పైడిరాజు మొదలైన వారు తెలుగు చిత్రకారులలో కొందరు.

### 1.6.4 శిల్పం :

శిల్పం దృశ్యకళ. రాతిని బొమ్మలుగా చెక్కడం శిల్పం. శిలతో శిల్ప నిర్మాణం చేయడం అద్భుత విషయం. శిల్పం చెక్కడానికి రాళ్ళు, సుత్తి, ఉలి మొదలైన పరికరాలుండాలి. రాళ్ళ మీదనే కాక మట్టి, కొయ్య, ప్లాస్టిక్, లోహాలు మొదలైన వాటి మీద కూడా మూర్తి చిత్రణం, రూప చిత్రణం చెయ్యడం శిల్పం. శిల్పం గోడలమీద చెక్కిన శిల్పాలు, శిలల్ని లోహాల్ని విడిగా చెక్కిన శిల్పాలు అని రెండు రకాలు. అజంతా, ఎల్లోరా, హరప్పా, హంపి, బేలూరు, హళేబీడు, మహాబలిపురం అమరావతి, రామప్ప, సాంచీ, కోణార్క్, ఖజురహోలలోని శిల్ప సంపద భారతీయ శిల్పానికి నిదర్శనంగా నిలిచింది దేవాలయ నిర్మాణాలలో, భవన నిర్మాణాలతో తమ నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. రాళ్ళతోనే రాగాలు పలికించగలిగినవారు భారతీయ శిల్పులు.

### 1.6.5 నాట్యం :

నాట్యం అభినయ ప్రధానమైన కళ. అభినయం,ఆంగికం, వాచికం , ఆహార్యం, సాత్త్వికం అని నాలుగు రకాలు. నాట్యంలో రూపం, సంగీతం, సాహిత్యం అన్నీ ఉంటాయి. కనుక ఇది సమాహారకళ. శరీర అవయవాలను కదిలిస్తూ హావభావాల్ని వెలయిస్తూ, ఆనందం కలిగించే రీతిలో గానం చేస్తూ అభినయించడాన్ని నాట్యం అంటారు. నాట్యానికి నాట్యశాస్త్రం సంగీత శాస్త్రం, సాహిత్యం అవసరం. ప్రాచ్యపాశ్చాత్య నాట్య సంప్రదాయాలున్నాయి. భారతదేశంలో భరతనాట్యం, మణిపురి, కథక్, ఒడిస్సీ, కూచిపూడి నాట్యాలు ప్రఖ్యాతి వహించాయి. ఆంధ్రదేశంలో కూచిపూడి నాట్యం జనించి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసింపబడింది. భారతదేశంలో ఎందరో నాట్యకళాకారులు తమ కళాచాతుర్యంతో రసజ్ఞులని అలరిస్తున్నారు.

వేదాంతం సత్యనారాయణశర్మ, ప్రహ్లాదశర్మ, కోరాడ నరసింహారావు, నటరాజ రామకృష్ణ, యామినీ కృష్ణమూర్తి, శోభానాయుడు వంటి నాట్యకళాకారులు అనేకమంది తమ అభినయంతో ఆంధ్రులను అలరించారు.

## 1.7 లలితకళల్లో కవిత్వ స్థానం :

శ్రవ్య, దృశ్యకళలలో శ్రవ్యకళలు, దృశ్యకళలకంటే అధికమైనవిగా అంగీకరించబడ్డాయి. అలాగే లలితకళలు ఐదింటిలో ఏది గొప్పది అనే వాదం వచ్చినప్పుడు కొందరు కవిత్వాన్ని కళగానే అంగీకరించలేదు. కానీ ఎక్కువమంది లలితకళలన్నిటిలోకీ కవిత్వమే ఉత్తమోత్తమమైన కళ అని నిరూపించారు. అలా నిరూపించటానికి కొన్ని అంశాలను పరిశీలించారు. అవి : చిత్తధృతి కలిగించటం, ఇతరకళలలో ప్రాధాన్యత ఉండటం, పాత్రచిత్రణా సామర్థ్యం కలిగుండటం, రూపం సాక్షాత్కరింప జేయగలగటం, సౌందర్య చలనముండటం, భౌతిక ద్రవ్యాపేక్ష తక్కువగా ఉండటం.

### 1.7.1 సౌందర్య చలనం :

కళలన్నీ సౌందర్యాన్ని కలిగించేవే. అయితే ఏ కళలో ఆ సౌందర్యం చలిస్తుందో అది గొప్పకళ అని చెప్పారు. చలనం సౌందర్యానికి మోహనత్వాన్ని ఇస్తుంది. ఉదాహరణకు నిశ్చలంగా నీటితో నిండిన చెరువు విచ్చిన తామరపూలతో నిండి ఉన్నప్పుడు చూడటానికి ఎంతో బాగుంటుంది. అలా చూసే సమయంలో అనుకోకుండా గాలి

వీచి ఆ గాలికి చిన్నచిన్న అలలు వచ్చి ఆ అలలు కదులుతుంటే తామరలు కూడా ఊగుతుంటే అప్పుడు అది ఇంకా అందంగా ఉంటుంది. అలాగే అందమైన నర్తకి అభినయానికి తగిన అలంకరణ చేసుకొని ఉన్నప్పుడు బాగుంటుంది. అదే అభినయం చేస్తూ పాదాలు, హస్తాలు కదిలిస్తూ రంగస్థలం పై నాట్యం చేస్తుంటుందో ఇంకా మనోహరంగా ఉంటుందికదా. కాబట్టి చలనం అనేది సౌందర్యాన్ని పెంచుతుంది.

ఈ చలనం శ్రవ్యకళలలోనేగాని, దృశ్యకళలలో ఉండదు. చిత్రలేఖనం, శిల్పం స్థిరకళలు కనుక చిత్రకారుడో, శిల్పో ఏ అవస్థలో ఆ రూపాన్ని చిత్రిస్తే అదే అవస్థలో ఆచిత్రం, శిల్పం ఉంటాయి, కానీ వాటిలో చలనముండదు. అంటే ఏకసమయ, ఏకావస్థ, ఏక భంగిమనే చూడగలుగుతారు. ఇక చరకళైన సంగీతంలో ఆ చలనం ప్రవాహగతిలో సాగుతుంది. గానానికి గాయకుడికి మంచి గాత్రం ఉండటం అవసరం. మంచి గాత్రం గల గాయకుడి నోటి నుండి గానం వెలువడినపుడు అందులోని మాధుర్యమే దాని సౌందర్యం, రాగాలాపన, స్వర ప్రస్తర, విలంబ ద్రుతతాళగతులలో నాదం వెల్లివిరియటం దాని చలనం. ఈ చలనమే నాద మాధుర్యానికి మోహనత్వం కలిగిస్తుంది.

కవిత్వంలో కూడా స్పష్టమైన చలనం ఉంటుంది. కథాత్మకమైన కావ్యమైతే ఆ కథాగమనం, అందులోని పాత్రల వర్ణనలు, వారి మానసిక భావాల వర్ణనలు చలనం కలిగి ఉంటాయి. కావ్యం లో కథ లేకపోయినా కవి తాను కవిత్వం చెబుతూ తాను ఎంచుకున్న వస్తువును అనేకరకాలుగా వర్ణిస్తాడు. ఆ వర్ణనల ద్వారా ఆ వస్తుచునాన్ని చూడగలం. మేఘసందేశంలోని మేఘ వర్ణనలో చలన లక్షణం ఉంది కదా! ఒకవేళ వర్ణించే వస్తువు అందమైనది కాకపోయినా, భావుకుడైన కవి దృష్టిలో ఎంత అందంగా ఊహించబడిందో అదంతా కవిత్వంలో కనిపిస్తుంది. మొదట ఏ మాత్రం అందంగా లేనిది ఎంతో రమ్యంగా ఆ తరువాత కనిపిస్తుంది. ఈ సౌందర్యం కూడా వినీ, చదివేవారి సహృదయత ననుసరించి ఇంకా ఇనుమడిస్తుంది. ఒక్కొసారి వర్ణించటానికి ఏ వస్తువు లేకపోయినా కవి భావనే వర్ణనగా బహిర్గతమైనపుడు ఆ వర్ణన భావ సౌందర్య చలనమే అవుతుంది.

## 1.7.2 భౌతిక ద్రవ్యాపేక్ష :

ఏ కళ నిర్మించటానికి భౌతిక ద్రవ్యాపేక్ష తక్కువగా ఉంటుందో అది ఉత్తమకళ. భౌతిక ద్రవ్యాపేక్ష అంటే భౌతికమైన వస్తువుల వ్యయం. స్థిర కళలైన చిత్రలేఖనం, శిల్పం రూపొందించటానికి ఎన్నో వస్తువుల అవసరమవుతాయి. చిత్రలేఖనానికి కాగితమో వస్త్రమో కావాలి, కుంచెలు, రంగులు కావాలి. శిల్పం తయారు చేయడానికి శిలో, మైనమో, చెక్కో, ప్లాస్టర్ ఆఫ్ పారిసో, ముట్టో ఏదో ఒకటి కావాలి. చెక్కడానికి ఉలి, సుత్తి మొదలైన సాధనాలు కావాలి. ఇంకా చిత్రలేఖనం ద్విదిశాత్మకం (టు డైమెన్షన్స్), శిల్పం త్రిదిశాత్మకం (త్రి డైమెన్షన్స్). శ్రవ్యకళలో సంగీతానికి కొంత ద్రవ్యం అవసరం. వాద్య పరికరాల వంటివి కావాలి. వాద్యపరికరాలు లేకున్నా గాయకుడి గాత్రం కావాలి. మానవ శరీరం భౌతికమే, కాబట్టి భౌతిక ద్రవ్యాన్ని అపేక్షించే కళే సంగీతం కూడా. అదే కవిత్వ సృష్టికి ఏ భౌతిక ద్రవ్యం అవసరం లేదు. కవి భావనలోనే కవిత్వం పుడుతుంది. భావనా ద్రవ్యంతో కవి మనసులోనే రచించబడేది కవిత్వం. దానితోనే కవి తృప్తిచెందుతాడు. అయితే ఆ కవిత్వాన్ని ఇంకొకరికి వినిపించాలన్నప్పుడు కంఠస్వరం, ప్రచారం చేయాలనుకున్నప్పుడు కాగితం, కలం అవసరమవుతాయి. అంటే లోకం కోసమే వస్తువులు అవసరంగానీ కవిత్వ సృష్టికి ఏ వస్తువు అవసరమే లేదు. కాబట్టి భౌతిక ద్రవ్యాపేక్ష అసలులేని కళ కవిత్వం మాత్రమే.

### 1.7.3 రూప చిత్రణ :

ప్రత్యక్ష రూప చిత్రణ స్థిరకళలలో ఉంటుంది. విగ్రహ శిల్పంలో నిర్మింపబడిన మానవమూర్తిగాని, మానవేతర మూర్తిగాని ఎంత పరిమాణంలో ఉంటే అంత పరిమాణంలో చూపించవచ్చు. చిత్రలేఖనంలో అలాంటి అవయవ పరిమాణం ప్రత్యక్షంగా కనిపించకపోయినా వాస్తవికమనిపించే మూర్తి నిర్మాణం సాధ్యమే. ఆ మూర్తి మనవంక చూస్తున్నట్లు, మనతో మాట్లాడబోతున్నట్లు స్ఫురింపజేసే శక్తి ఈ చిత్రకళకు విగ్రహ శిల్పం కంటే ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా చిత్రలేఖనంలో నానావర్ణశోభితమైన ప్రకృతి దృశ్యాలనెన్నో చిత్రించవచ్చు. శిల మీద అలాంటి ప్రయత్నం ఫలించదు.

చరకళయైన సంగీతంలో రూపచిత్రణ లేనేలేదు. మారీచుడిని సంహరించేటప్పటి, శివ ధనుర్భంగం చేసేటప్పటి రాముడి కౌమార సుందర మూర్తిని చూసి విశ్వామిత్రుడు ఎంతగానో ఆనందించినట్లు గా

అలకలలాడగగని అరాణ్ముని ఎటు పొంగెనొ ॥అ॥
చెలువు మీరగను మారీచుని మదమణచేవేళ ॥అ॥
మునికనుసైగ దెలిపి శివ ధనువును విరిచే సమయ
మున త్యాగరాజు వినుతుని మోమున రంజిల్లు ॥అ॥

అని త్యాగరాజు పాటపాడేటప్పుడు స్ఫురించే బాల రాముడి ముద్దు మొగం కవిత్వ సృష్టేగాని, సంగీత సృష్టి కాదు. సాహిత్యంతో కలిసే సంగీతం మిశ్రకళ అవుతుంది. సాహిత్యం లేకపోతే అది శుద్ధగానమే. దీనినే pure music అంటారు. కవిత్వంలో కూడా కేవలం భావవర్ణనగల కవిత్వం శుద్ధ కవిత్వం, ఏదైనా వర్ణ్యవస్తువునుగాని, కథనుగాని స్వీకరించిన కవిత్వం మిశ్రకవిత్వం.

కవిత్వంలో మూర్తి దర్శనం కళ్ళకు కాక మనోనేత్రానికి దర్శితమవుతుంది. మనోగోచరమైన ఆ మూర్తి వాస్తవికం కాదు, ఆదర్శం. దానిని భావించి చూడడానికి భావుకులు మాత్రమే అర్హులుగాని తదితరులు సమర్థులు కారు. భావనా గోచరాలైన రూపాలు చిత్రలేఖనంలో కాక కవిత్వంలో ఊరక మనకు దర్శనమివ్వటమే కాకుండా, మనతో భాషిస్తాయి కూడా. ఒక్కోసారి ఆ మూర్తులను చిత్రకారుడు కూడా కవి చిత్రించినట్లు చిత్రించలేడు. మనుచరిత్రలో

"చూచిఝుళంఝుళత్కటక సూచిత వేగ పదారవిందయై
లేచి కుచంబులుందుఋము లేనడు మల్లలనాడ నయ్యెడం
బూచిన యొక్కపోక నునుబోదియఁ జేరి విలోకన ప్రభా
వీచికలం దదీయ పదవీకలశాంబుధి వెల్లి గొల్పుచున్"

అని వర్ణింపబడిన వరూధిని మూర్తిని ఏ చిత్రకారుడు చిత్రించగలడు? "ఎక్కడివా డో? యక్ష తనయేందు వసంత జయంత కంతులం జక్కదనంబున గెలువఁ జాలినవాడు" – అని ఆశ్చర్యంతో తనలో తాననుకొన్న వరూధిని మాటలు ఏ చిత్రపటంతో వినగలం? చిత్రపటమూర్తి మనతో మాట్లాడటానికి ప్రయత్నించినట్లే వుంటుంది గాని ఆ మాటలు

పలకటం కాని, వాటిని మనం వినటంగాని తటస్థించదు. ఒక్కమాటలే కాదు, ఆ మూర్తి చేష్టలు అంతే. ఈ అర్థాన్నే నన్నెచోడుడి కుమార సంభవంలోను చూడవచ్చు.

"కలకల నవ్వునట్లు తమకంబునఁ గన్గవవిచ్చి భ్రూలతల్
పొలయగఁ జూచునట్లు తని వోనఁగఁదెల్వియుఁ గౌఁగిలింపఁ జే
తులు పచరించునట్లు తమితో రతికేళికి నిప్పళించున
ట్లెలమి నటించుచుండె సతికీశ్వరు రూపెదుటన్ బ్రసన్నమై"

కవిత్వం ఏదో ఒక మూర్తిని చిత్రించడమే కాదు, అనేక ప్రాణాలతో కూడిన ఒక కథను వస్తువుగా స్వీకరించి సృష్టికి ప్రతిసృష్టి చేస్తుంది. ఈ సామర్థ్యం మిగిలిన ఏ కళకు లేదు.

## 1.7.4 చిత్త ధృతి కలిగించటం :

కళలన్నిటి ప్రయోజనం భావనాత్మకమైన ఆనందసిద్ధి కలిగించటం. ఆనందావస్థలో బాహ్యజగత్తును విస్మరించి అనిర్వచనీయమైన పరవశత్వం కలిగించటమే కళల పరమావధి. ఆనందం కలిగించటంలో సంగీతానికిగల శక్తి మరో కళకు లేదు. ప్రాచీనాలంకార శాస్త్రాలలో హృదయ ద్రవీకరణ శక్తికి 'మాధుర్యం' అని పేరుపెట్టారు. సంగీతం ఆద్యంతం ఈ మాధుర్య గుణ మయం. ఆ గుణం గొప్పతనం ఆ కళ పరిసర విస్మృతిని కలిగించి జీవుడిని ఆనంద ప్రవాహంలో ఓలలాడిస్తుంది.

కవిత్వంలో కూడా ఇలాంటి ఆనందమే కలుగుతుంది గాని, ఆ అనుభవానికి సహృదయుడిలో కొంత భావనాబలం, బుద్ధి ప్రౌఢి, కొంత వైదుష్యం కలిగి ఉండటం అవసరం. వీటి సహాయంతో పుట్టే ఆనందం సంగీతంలోలాగా ఆపాత మధురం మాత్రమే కాదు, దానిలాగా క్షణభంగురం కాదు. కవిత్వాన్ని ఆనందించాలంటే పూర్వజన్మ సంస్కారం కూడా ఉండాలి. ఈ సంస్కారం సంగీతాన్ని ఆస్వాదించటానికి అవసరం లేదు. అరిస్టాటిల్ కూడా ఒకచోట "ఉత్తమమైన కళారసాస్వాదనము పరిణత మానవత్వము గల వారికే చెల్లును గాని ఎల్లరకు చెల్లదని" సిద్ధాంతీకరించాడు. ఒక్కొక్క చోట ఏ బుద్ధి ప్రయత్నం లేకుండానే సంగీతం ఆనందాన్నందిస్తుంది. కాని ప్రపంచంలో ఉత్తమ కవిత్వమనిపించుకొన్నదంతా ఆలోచనామృతమేగాని ఆపాత మధురం కాదు. అది కలిగించే ఆనందం కూడా క్షణభంగురం కాదు.

కవితారచన ఒక అలౌకిక జగత్తును సృష్టించి, ఆత్మలను ఆ జగత్తులో సంచరింపజేస్తుంది. ఈ సంచారం కావ్యం చదువుతూ ఉన్నంతసేపు మాత్రమే కాక పఠనానంతరం కూడా కొనసాగుతూనే ఉంటుంది. కావ్యపఠనం వలన ఎలాంటి ఆనందం కలుగుతుందో ఆ అర్థాన్ని స్మరించినప్పుడల్లా కూడా అలాంటి ఆనందమే కలుగుతుంది.
అంటే చిత్తధృతి కవిత్వంలోనే ఎక్కువగా ఉంటుంది.

లలితకళల్లో ఇంకో సమానధర్మం అని శ్రుతిలయబద్ధములవటం సృష్టంతా కూడా శ్రుతిలయబద్ధమైనదే. జగత్తు యొక్క యథార్థ స్వరూపం కళలలో కనిపిస్తుంది. కళలకు మూలధర్మాలైన శ్రుతిలయలు కళాదర్శన శ్రవణ సమయాలలో మనకు సంక్రమించి చిత్త విక్షేపాలన్నీ అణచి ఏకాగ్రతను కలిగించి మన ప్రయత్నం లేకుండానే

యోగధారణావస్థకు తీసుకొని వెళతాయి. ఏకాగ్రత లేని సమయంలో మనసు కళలను ఆస్వాదించలేదు. శృతిలయలు సంగీతంలో అందరికీ స్పష్టంగా తెలుస్తాయి. ఈ శృతిలయలు కవిత్వంలో ఛందోరూపంలో, వాక్యగత శబ్ద విన్యాస రూపంలో వ్యక్తమవుతాయి. ఇంకొక విశేషమేమంటె స్థిర కళలైన చిత్రలేఖనం, శిల్పం కనులు లేనివారికి పనికిరావు. వారు ఆ కళలను ఆస్వాదించలేరు. అలాగే సంగీతం వినలేని వారికి ఆనందాన్ని ఇవ్వలేదు. అదే కవిత్వం కనులు లేని వారు విని, వినలేని వారు చదివి ఆస్వాదించగలరు. అది కవిత్వానికున్న విశిష్టత.

ఈ విధంగా లలితకళలన్నిటి లోకి కవిత్వం ఉత్తమోత్తమైనదని సర్వులు అంగీకరించారు. కళలన్నీ గొప్ప వే కళాకారులందరూ సోదరులే. అయితే ఈ నాలుగింటిలో కావ్యకళయే గొప్పదని Lane Cooper, “Poetry is the most vital and the lasting achievement of man” అని చెప్పారు. ఇది శబ్ద శక్తి గొప్పదనమని James Cousins అనే కళా విమర్శకుడు ఈ క్రింది విధంగా ప్రశంసించారు.

"A word in itself, above all world well – chosen and transfigured by poetry, is the most energetic, the most universal of all artistic symbols equipped with this talisman of its own creation, poetry reflects all the images of the world of senses like sculpture and painting, reflects in all it's variations, which music cannot reach, variations which come in rapid succession which painting cannot follow, while it remains as sharply turned and full of grace as sculpture. Nor is that all. It expresses what is inaccessible to all other arts. I mean thought, because thought has no colour".

## 1.8 సారాంశం :

ఆలంకారికులు చెప్పిన అరవై నాలుగు కళలలోను లలిత కళలు ప్రత్యేకమైనవి. సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం లలిత కళలు. ఈ ఐదు కళల్లోను సంగీతం, కవిత్వం శ్రవ్య కళలు. చిత్రలేఖనం, శిల్పం దృశ్య కళలు, నాట్యం ఉభయ కళ. ఐదు కళల్లోను కవిత్వం ఉత్తమోత్తమైన కళ.

## 1.9 ముఖ్య పదకోశం :

లలిత కళలు, సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, మనోహరత్వం, విశ్వజనీనత, అనుకరణ, చిత్త ధృతి, భౌతిక ద్రవ్యాపేక్ష, రూప చిత్రణ, ఉత్తమోత్తమా.

## 1.10 స్వీయ మదింపు ప్రశ్నలు :

1. లలితకళల గురించి రాయండి.

2. లలితకళల్లో కవిత్వ స్థానాన్ని నిర్ణయించండి.

## 1.11 ఉపయుక్త గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న.

2. సాహిత్య సోపానములు – డా. దివాకర్ల వెంకటావధాని.

3. సాహిత్య శిల్ప సమీక్ష – పింగళి లక్ష్మీకాంతం.

**ఆచార్య ఇరపని మాధవి**

పాఠం 2

# కావ్యం/కవిత్వం

## 2.0 లక్ష్యం:

కావ్యం/కవిత్వం అనే భావనల్ని పరిచయం చెయ్యడం, అందులోని అంతర విభాగాలను విశ్లేషించి చూపడం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠం ద్వారా మీరు కావ్యం, కవిత్వం అనే అంశాలను గురించిన సర్వవిషయాలను అవగాహన చేసుకుంటారు.

**విషయసూచిక**


2.1. కావ్య కవిత్వ శబ్దచర్చ

2.2. కవి కావ్య సంబంధం

2.3. కావ్య-కవిత్వ నిర్వచనం

2.4. కావ్య శరీర ఆత్మ జీవితవాదాలు

2.5. కావ్య హేతువులు

2.6. కావ్య ప్రయోజనం

2.7. కావ్య స్వరూపం

2.8. నమూనా ప్రశ్నలు

2.9 చదువదగిన గ్రంథాలు


## 2. 1. కావ్య, కవిత్వ శబ్దచర్య:

కావ్యంలో కవిత్వం ఉంటుంది. కవిత్వంతో కూడినది కావ్యం. భారతీయ ఆలంకారికులు కావ్యచర్చ చేశారు. పాశ్చాత్యులు కవిత్వచర్య చేశారు. "నానృషికురుతే కావ్యం" అపారా కావ్యసంసారే కవి రేవ ప్రజాపతిః" "కవయతేతి కవిః తస్యకర్మ కావ్యం" "శబ్దార్థే సహితౌకావ్యం" ఇలా మన ప్రాచీనులు 'కావ్య' శబ్దాన్నే ఉపయోగించారు. అలంకార శాస్త్రాల పేర్లలో 'కావ్య' శబ్దమే ఉపయోగింపబడింది: కావ్యాలంకారం, కావ్యాదర్శం, కావ్యప్రకాశం, కావ్యమీమాంస, కావ్యకౌతుకం, కావ్యానుశాసనం మొ॥. కవిత్వ మీమాంస వంటి మాటల్ని ఎవరూ ఉపయోగించినట్లు లేదు. ప్రాచీన తెలుగు కవులు మాత్రం కావ్య, కవిత్వ శబ్దాలను రెండింటినీ ఉపయోగించారు.

"ఇక్కావ్యంబ రచియించెద" నన్నయ్య. ఆంధ్రమహాభారతం, అవ-20.
"కృతులు చెప్ప" నన్నెచోడుడు - కుమార సంభవం. అవ-42.
"తెలుగు, కవిత్వము జెప్పదలంచిన కవి" తిక్కన - నిర్వచనోత్తర రామాయణం. అవ-7.
"కావ్యంబు నిర్మింప గదంగి" - పింగళిసూరన. కళాపూర్ణోదయం - అవ - 16
"కవిత్వము రచించు మేటి కవులు - రఘునాథనాయకుడు - వాల్మీకి చరిత్ర - అవ-14.

భారతీయ సాహిత్య సంప్రదాయంలో 'కావ్య' శబ్దము ఉపయోగింపబడింది. తెలుగు కవులు, కావ్య, కవిత్వ శబ్దాలను రెండింటినీ ఉపయోగించారు. కవిత్వంతో నిండింది కావ్యం. కవిత్వం లేకుండా కావ్యం ఉండదు.

## 2. కవి - కావ్య సంబంధం:

కవికీ కావ్యానికీ మధ్య సంబంధం విడదీయరానిదీ, విడదీయకాది, విడదీయలేనిది. కవి కళాకారుడు, కావ్యం కళ. కవి శిల్పి, కావ్యం శిల్పం. కవికీ, కావ్యానికీ మధ్య గల సంబంధం రైతుకూ, పంటకు మధ్య గల సంబంధం వంటిది. కార్మికునికీ వస్తువుకీ మధ్యగల సంబంధం వుంది. కావ్యం కవి ఉత్పత్తి. అతని శ్రమఫలం. కవి స్రష్ట. కావ్యం అతని సృష్టి. కవి దార్శనికుడు. కావ్యం అతని దర్శనం. కవి అనుభూతికి అక్షరాకృతి కావ్యం. కవి నిబద్ధతకు అద్దం కావ్యం. కవి దోసిళ్ళలోంచి జారిన అక్షరాల అల్లిక కావ్యం. కవి చూపుడువేలు కావ్యం. కవి ఆలోచనల పేటిక కావ్యం. కవి అనుభూతుల మాలిక కావ్యం. కవి అంతరంగ గీతిక కావ్యం. కవి సమాజంతో చేసే సంభాషణ కావ్యం. కవి న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు కావ్యం. కవి వైద్యుడు చేసే వైద్యం కావ్యం కవి. వీరుడు ధరించిన ఆయుధం కావ్యం. కవి నర్తకుని నాట్యం కావ్యం. కవిగాయకుని గానం కావ్యం. కవి కుమ్మరి కావ్యం కుండ. కవి మేదరి కావ్యం చాప. కవి వడ్రంగి కావ్యం నాగలి.

దుష్టవ్యవస్థ మీద కవి దూసే కరవాలం కావ్యం. శిష్ట వ్యవస్థకు కవి అందించే స్నేహహస్తం కావ్యం. ఊపిరాడని సమాజానికి కవి అందించే ప్రాణవాయువు కావ్యం. దిక్కు తోచనివాళ్ళకు కవి ఇచ్చే అభయహస్తం కావ్యం. స్థలకాలబద్ధమైన జీవితానికి కవిచేసే కళాత్మక వ్యాఖ్యానం కావ్యం. చారిత్ర కవిభాత సంధ్యల మధ్య నిలబడి కవివేసే పొలికేక కావ్యం. చరిత్ర నిర్మాతలకు కవి ఇచ్చే కితాబు కావ్యం. సమాజ గమనంలో కవి గుర్తించిన పాదముద్ర కావ్యం.

## 2.3. కావ్య/కవిత్వ నిర్వచనం:

ప్రాచీన భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్య కవులు విమర్శకులు, ప్రాచీన తెలుగు కవులు, ఆధునిక తెలుగు కవులు విమర్శకులు కావ్యాన్ని-కవిత్వాన్ని నిర్వచించారు. వీళ్ళ నిర్వచనాలు దౌలకాల సామాజిక సందర్భాలను విభిన్న రకాలుగా ఉన్నాయి. ప్రతిదేశంలోనూ ప్రతియుగంలోనూ కవిత్వం తనను తాను నిర్వచించుకుంటూ వస్తున్నది. వాటిలో కొన్నిటిని తెలుకుందాం.

### ప్రాచీన భారతీయ ఆలంకారికుల కావ్యనిర్వచనం:

భామహుడు: శబ్దార్థౌ సహితౌ కావ్యమ్ (కావ్యాలంకారం)
శబ్దార్థాలతో కూడుకున్నది కావ్యం.

దండి: ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావలీ కావ్యం (కావ్యాదర్శం)
ఇష్టార్థంతో కూడిన పద సమూహం కావ్యం

రుద్రటుడు: ననుశబ్దార్థౌకావ్యం (కావ్యాలంకారం)
శబ్దార్థాలు కావ్యం

వామనుడు: కావ్యశబ్దో యం గుణాలంకార సంస్కృతయోః శబ్దార్థయోః
వర్తత (కావ్యాలంకార సూత్ర వృత్తి)

మమ్మటుడు: తత్-అదోషౌ, శబ్దార్థౌ సగుణా వనలంకృతా పునః క్వాపి (కావ్య ప్రకారం)
దోషాలు లేనివి. గుణాలతో కూడినవీ, కొంచెం
నిరంకారికాలైనా శబ్దార్థాలు కావ్యం

విద్యానాథుడు: గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ
గద్యపద్యోభయమయం కావ్యం. కావ్యవిరోవిదుః (ప్రతాపరుద్ర యంచ భూషణం)

విశ్వనాథుడు: వాస్యం రసాత్మకం కావ్యం (సాహిత్య దర్పణం)
రసాత్మకమైన వాస్యమే కావ్యం

జగన్నాథుడు: రమనాశాయార్థ ప్రతిపాదక శబ్దఃకావ్యం (రసగంగాధరం)
రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దం కావ్యం

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే శబ్దమే కావ్యమని అనేకులు నిర్వచించినట్లు అర్థమౌతుంది. మరికొందరు శబ్దార్థాల సమాహారాన్ని కావ్యంగా భావించారు. భాష శబ్దం రూపం. అభిప్రాయం భాషలో వ్యక్తమౌతుంది. భాషశబ్దరూపం. కవిత్వం శబ్దరూపంలోనే వ్యక్తమౌతుంది. అయితే కావ్యశబ్దం నిస్సారంగా నిస్తేజంగా ఉండకూడదు. శబ్దం అర్థవంతమై ఉండాలి. అర్థగాంభీర్యం కలిగి ఉండాలి. వ్యావహారిక శబ్దం వేరు, కావ్యం శబ్దం వేరు. కావ్య శబ్దం పాఠకునిలో గాఢమైన అనుభూతి ముద్రవేసేదిగా ఉండాలి. కావ్యం శబ్దం పాఠకునిలో ఆనందాన్ని, ఆలోచనను కలిగించాలి. పాఠకుని 'మూడ్'ను 'డిస్టర్బ్' చెయ్యాలి. సాధారణ శబ్దం కావ్యంలో అసాధారణ అర్థాన్ని సంతరించుకొని కావ్యానికి జన్మనిస్తుంది. 'ఇష్టార్థం', 'రసాత్మకం', 'రమణాయార్థం' – వంటి పదాలు ఈ అభిప్రాయాన్నే ధ్వనిస్తాయి. శబ్దార్థాలను దంపతులతో పోల్చారు ప్రాచీనులు. అవి విడదీయరానివని అర్థం. కావ్యంలో శబ్దం రూపమైతే, అర్థం వస్తువు. ప్రకృతిలో ప్రతిరూపమూ వస్తురూప సమ్మేళనమే. కావ్యమూ అంతే శబ్దమే కావ్యమన్నంత మాత్రాన, శుష్క శబ్దమని అర్థం కాదు. అర్థసహితమైన శబ్దమే కావ్యం.

"కవిత్వం పిడకకాదు
పిడకలో మెరిసే నిప్పు" (కందుకూరి శ్రీరాములు)

పిడక శబ్దం – రూపం, నిప్పు అర్థం – వస్తువు. నిప్పు లేని పిడక అంటే అర్థం లేని శబ్దం. నిప్పుతో కూడిన పిడక రమణీయార్థాన్ని ప్రతిపాదించే శబ్దం. అదే కావ్యం.

**పాశ్చాత్యుల కవిత్వ నిర్వచనం:**

పాశ్చాత్యులు కవిత్వాన్ని నిర్వచించారు. భారతీయలంకారికులెవరూ కవిత్వం ఛందస్సులో ఉండాలని చెప్పలేదు. భారతీయ కవులకు కవిత్వం ఛందస్సులోనే ఉంటుందనన్నది అవగాహన. కాని డా. జాన్సన్ **"Poetry is Metrical Composition"** అని చెప్పాడు. అలాగే కార్లైల్ పండితులు కవిత్వాన్ని లయాత్మక భావన అన్నాడు. **"Poetry we call Musical thought"** ప్రపంచ ప్రసిద్ధి చెందిన కాల్పనిక కవి వర్డ్స్‌వర్త్" **"All good poetry is the spontaneous overflow of powerful feelings. It takes its origin from a motion recollected in tranquility"** అన్నాడు. అప్రయత్నంగా పొర్లుకొని వచ్చే తీవ్రమైన భావోద్వేగం కవిత్వమౌతుంది. ఆ భావోద్వేగాన్ని ప్రశాంత సమయంలో స్మృతికి తెచ్చేది కవిత్వం అని అర్థం. బేన్ అనే పండితుడు భాషలో వ్యక్తం చేసే భావరూపంలో నిర్వహించే లలిత కళ కవిత్వమంటున్నాడు"

**"Poetry is a fine art operating by means of thought conveyed in language".** ఉత్తమ కవిత్వ గొప్ప తాత్త్వికార్థాన్ని ప్రతిపాదిస్తుందని యీ అభిప్రాయం. **"The best poetry is that which is informed by the soundest Philosophy".** కోల్‌రిజ్ కవిత్వానికి మహోన్నతమైన గౌరవాన్నిస్తూ" కవిత్వం మానవవిజ్ఞానం, ఆలోచనలు, అభిరుచులు, అనుభవాలు, భాష మొదలైన వాటిసారం, పరిమళం" అన్నారు. **"Poetry is the blossom and the**

**fragnance of all human knowledge, human thought, human passions, human language etc."** మాథ్యూ ఆర్నాల్డ్ వాస్తవిక దృక్పథంతో "ఒక్క మాటలో చెప్పాలంటే కవిత్వం జీవిత విమర్శనం" అన్నాడు. **Poetry is, at bottom, a criticism of life".** అంతేకాక మానవ భాష చేరుకోగల అత్యున్నత సమగ్ర అభివ్యక్తి దశ కవిత్వమని కీర్తించాడు. **"Poetry is simply the most delightful and perfect form of utterence that human word cam reach".** మనం ప్రారంభంలోనే డా. జాన్సన్ ఛందోబంధం గలది కవిత్వమని చెప్పినట్లు చెప్పుకున్నాం. కాని కోల్ రిజ్ అనే కవి, గొప్ప కవిత్వం ఛందస్సు లేకపోయినా రాణిస్తుందన్నాడు. **"Poetry of the highest kind mayescist without metra."**

**తెలుగు కవులు:**

ప్రాచీన తెలుగు కవులు కావ్యాన్ని గురించి కవిత్వాన్ని కావ్యావతారికలలో, కావ్యకథా సందర్భాలలో అనేకాభిప్రాయలు వ్యక్తం చేశారు. నన్నెచోడుడు కావ్యం సప్తసంతానాలలో ఒకటిని చెప్పారు. అగ్రహారం, కొడుకు, దేవాలయం, ఉద్యానవనం, చెరువు, నిధి, కావ్యం–అనేవి సప్త సంతానాలని, వీటిలో ఉత్కృష్ట సంతానంబు కృతియ" అని పేర్కొన్నాడు. ఆ తర్వాత శ్రీకృష్ణదేవరాయలు మొదలుకొని అనేకమంది కవులు ఈ ప్రసక్తి తెచ్చారు. వీళ్ళు కావ్యం అక్షర సముదాయమని, అది ఎప్పటికి నాశనంకాదని, కావ్యం గొప్పభావ ప్రచారసాధనమని భావించినట్లు తెలుస్తుంది. ప్రాచీన తెలుగు కవులు చాలామంది కవిత్వం సరస్వతీదేవి దయ వల్లనే పుడుతుందనే అభిప్రాయముంది!! "చతుర కవిత్వతత్త్వ పటు సంపద భారతిదయ" అన్నారు అనిరుద్ధ చరిత్రములో కనుపర్తి అభ్యమాత్యుడు. "వాణిశబ్దముల నర్థములన్ సతతంబు మానిదున్" అని ప్రార్థించారు రామాభ్యుదయములో అయ్యలరాజు రామభద్రుడు. ప్రాచీన తెలుగు కవులు చేసిన కావ్యచర్యలో పింగళి సూరన కళాపూర్ణోదయంలో చెప్పిన పద్యం అనుభూతి భావకతల సంగమమై ఆంగ్ల కాల్పనిక కవులకన్న ముందే భావ కవిత్వ సంప్రదాయాన్ని తలపిస్తున్నది.

"చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను, సౌరభము జలువయు దలిర్పం
బొలుపెసగు కప్పురపుబలుకులకు గోమలత
నెలకొనిన, సౌరభము జలువ పథసయుంగో
మలతయును గలిగి జనముల మిగుల బెంపెసగు
మలయ పవనంపు గొదమలకు మధురత్వం
బలవడిన నీడును మతిగలదనగ వచ్చుగడు
వెలయగల సుకవి పలుకులకు నెంచన్"

చల్లదనం గలిగిన వెన్నెల అందానికి వాసన జోడైతె, వాసన, చల్లదనం గల కర్పూరం పలుకులకు కోమలత్వం తోడైతే, వాసన, చల్లదనం, కోమలత్వం గల మలయపవనానికి మాధుర్యం తోడైతే సుకవి చెప్పిన కవిత్వానికి ఈడు కుదురుతుంది అని భావం. అంటే కవిత్వ శబ్దానికి రంగు రుచి వాసనలతోపాటు సౌకుమార్యాది గుణాలు కూడా ఉండాలని సూరన అభిప్రాయం. క్రీ.శ. 17, 18 శతాబ్దాలలో కావ్య/కవిత్వ తత్వాన్ని గురించి ఇలాంటి అభిప్రాయాలు చాలామంది కవులు వ్యక్తం చేశారు.

ఉదా : చెప్పవలె గప్పురంబులు
కుప్పులుగా బోసినట్లు, కుంకుమపైపై
గుప్పిన క్రియ, విరిపొట్లము
విప్పిన గతి ఘమ్మనం గవిత్వము సభలన్ (రఘునాథ నాయకుడు – వాల్మీకి చరిత్ర)

ఆధునిక కవులు విభిన్న ఉద్యమ కాలాలలో మారిన సామాజిక సందర్భాల కనుగుణంగా కవిత్వ/కావ్య నిర్వచనాలను చేసుకుంటూ వచ్చారు. కందుకూరి వీరేశలింగం పంతులు నుండి ఈ ధోరణీని మనం గమనింపవచ్చు. 'సరస్వతీ నారద విలాపం' అనే అధిక్షేప కావ్యంలో సరస్వతి నారదునితో ఇలా అంది.

"సుందర బహురసపుష్టి నమందానందంబు బుధులమది కిడదేనిన్

ఛందోబద్ధంబగు పదబృందాటోపంబు తా కవిత్వంబగునే?"

ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో క్షీణయుగంగా పేరు పడ్డ నాటి కవిత్వ తీరును నిరసించిన కందుకూరి, రసానందం కలిగించని, కేవలం ఛందస్సులో కూర్చిన పద సమూహం కవిత్వం కాదని తేల్చి చెప్పాడు. అప్పటి నుంచి అనేకమంది కవులు తమ కవితల్ని నిర్వచించుకుంటూ వస్తున్నారు.

"ఆకులందున అణశిమణిగే
కవిత కోయిల పలుకవలెనోయ్" (గురజాడ)

కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేది
మునుముందుకు సాగించేదీ
పెనునిద్దర వదిలించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకావ్యానికి (శ్రీశ్రీ)

"కవిత కొత్త అనుభవాల కాంతి పేటికలను తెరవాలి కదిలించాలి
నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి, నీలోంచి రావాలి చించుకు రావాలి
కవిత్వం అంతరాంతర జ్యోతి స్సామల్ని బహిర్గతం చెయ్యాలి" – (బాలగంగాధర తిలక్)

"ఈనాడు కవిత్వం
వర్తమాన చరిత్రలోని ప్రజోద్యమ చైతన్యానికి
పేరు మోసిన ప్రతినిధి" (కుందుర్తి)

"ఇవ్వాలటి కావ్యానికి ఛంధస్సు – ఉద్యమం
కవి సమయం – తిరుగుబాటు
విప్లవం యీనాటి కావ్యానికి స్పందన" (వరవరరావు)

"కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం" (సి.నారాయణరెడ్డి)

"ప్రజల కన్నీటి బొట్టు
నా కలంలోన సిరాచుక్క" (కె.శివారెడ్డి)

"కలలో మనస్కలించిన నైరూప్రభావం కవిత"
"బహిరంతర చైతన్యాల సంఘర్షణ స్వప్నం

అంతర్బహిర్వేదనల సమాన్వయం కవిత
తగాదాగల రాజీ కవిత" (వేగంటి మోహన ప్రసాద్)

"కవిత్వం వేడుక కాదు
గాయాల గొంతుక" (నదిని సిధారెడ్డి)

"కవిత్వం కావాలి కవిత్వం"
అక్షరం నిండా జలజలలాడిపోయే
కవిత్వం కావాలి కవిత్వం" (త్రిపురనేని శ్రీనివాస్)

"నా కవితలో కమ్మని కలలుంటాయి
అంతుచిక్కని ఊహలుంటాయి
అక్షరాల గమ్మత్తులుంటాయి
నా కవితకు రంగు ఉంది రసం ఉంది వాసనా ఉంది
అన్నింటినీ మించి అనుభూతి నిలువెల్లా ఉంది (పాపికాని శివశంకర్)

ఈ ఉదాహరణలన్నీ పరిశీలిస్తే కావ్య, కవిత్వ నిర్వచనం కాలానుగుణంగా మారుతూ వస్తున్నట్లు అర్థమౌతుంది.

## 2.4. కావ్యం : శరీర ఆత్మ జీవితవాదాలు

భారతీయ ఆలంకారికులు కావ్యాన్ని నిర్వచించడమే కాకుండా కావ్యానికి ఒక శరీరం, దానికొాస ఆత్మ, జీవితం ఉంటాయని కూడా గుర్తించారు. అంటే మనిషికి ఉంటాయనుకున్నవన్నీ కావ్యానికి కూడా ఉంటాయని వాళ్ళు భావించారన్నమాట.

మనకు లభిస్తున్నంతలో తొలిభారతీయ ఆలంకారికుడు భరతుడు. ఈయన గ్రంథం నాట్యశాస్త్రం. ఈయన "ఇతివృత్తంతు నాట్యస్య శరీంర పరికీర్తితం" అని చెప్పారు. నాటకానికి నాటక ఇతివృత్తమే శరీరం అని స్పష్టంగా భరతుడు చెప్పాడు. ఈయన ఆత్మను గురించి ప్రత్యేకంగా చర్చించినట్లు లేదు. ఆ భరతుడు పేర్కొన్న కావ్య శరీరానికి అలంకారాలు సౌందర్యాపాదకాలని భావహుడు, అలంకారాలు కావ్యబాహ్య సౌందర్యాన్ని పెంచగా, గుణాలు కావ్యం అంతః సౌందర్యాన్ని పెంచుతాయని దంతి ప్రతిపాదించారు. భామహుని ప్రకారం శబ్దార్థాలు రెండూ కావ్య శరీరమని వ్యాఖ్యాతలు విమర్శకులు భావించారు.

కావ్యానికి ఆత్మ ఉంటుందని మొదట ప్రతిపాదించినది వామనుడు. ఈయన "రాతి రాత్మాకావ్యస్య" అని కావ్యానికి ఆత్మరీతి అని చెప్పాడు. రాతి అంటే విశిష్టపదరచన అని కూడా వామనుడు స్పష్టం చేశాడు. ఇతని తరువాత వచ్చిన ఆనంద వర్ధనుడు వామనుని సిద్ధాంత స్థానంలో కొత్త సిద్ధాంతాని ప్రతిపాదించాడు. ఈయన ధ్వని కావ్యాత్మ అన్నాడు. "కావ్యస్యాత్మా ధ్వనిరి తిబుధైః" కావ్యానికి ధ్వని ఆత్మ అని బుధులు చెప్పారు అన్నారు. ధ్వని అంటే కావ్యంలో స్ఫురించే వ్యంగ్యార్థం కావ్యంలో పైకి కనిపించే అర్థం ఉన్నట్లుగానీ ప్రతీయమానార్ధం – స్ఫురించే అర్థం కూడా ఉంటుందని చెప్పారు. అది స్త్రీల అవయవాల మీద స్ఫురించే లావణ్యం వంటిదని వివరించాడు.

"ప్రతీయ మానం పునరన్యదేవ వస్త్వస్తివాణీషు మహాకవీకాం
యతతత్ ప్రసిద్ధావయవాతిరిస్తం విభాతి లావణ్యమివాంగనాసు"

ధ్వనిని వస్తు, అలంకార, రసధ్వనులని మూడు రకాలుగా విభజించారు. ఆనంద వర్ధనుడూ ఇతని ధ్వన్యా లోకానికి అభినవలోచనమ్ అనీ వ్యాఖ్య రాసిన అభినవగుప్తుడు. కావ్యానికి రసధ్వనీ ఆత్మ అని మరింత స్పష్టం చేశాడు.

"రసేనైవ సర్వం జీవతి కావ్యం
నహిరస శూన్యం కావ్యం నించిదపి
రసపవ వస్తుతః ఆత్మా
వస్త్వలంకార ధ్వనీతుసర్వధా
రసం ప్రతిపర్యవస్యతే"

రసం చేతనే కావ్యం జీవిస్తుంది. రసశూన్యమైన కావ్యం ఉండదు. నిజానికి రసధ్వనీ కావ్యాత్మ. వస్తు, అలంకార ధ్వనులు రసపర్యవసాయులు అవుతాయి. భరతుడు ఇంతబలంగా కాకపోయినా రస ప్రాధాన్యాన్ని ప్రతిపాదించాడు. "నహిరసాదృత్ కశ్చిదర్థః ఏప్రవర్తతే", రసం లేకుండా కావ్యార్థమేదీ ప్రవర్తింపదు.

వీళ్ళ తర్వాత మహిమభట్టు వ్యక్తి వివేకమనీ గ్రంథంలో ధ్వని సిద్ధాంతాన్ని అనుమానాల మీద ఆధారపడినదిగా ఖండించాడు. అయితే ఇతని ప్రతిపాదనను తర్వాత వచ్చిన మమ్మట విశ్వనాథ జగన్నాథులు వ్యతిరేకించారు.

ఈ నేపథ్యంలో ధ్వని సిద్ధాంతం జోలికి పోకుండా కావ్యానికి జీవితం ఉంటుందని ప్రకటించాడు కుంతకుడు" "వక్రోక్తిః కావ్య జీవితం" కావ్య జీవితం వక్రోక్తి అన్నది ఈయన వాదం. శబ్దార్థాలు రెండింటినీ కావ్య శరీరంగా గుర్తించి వక్రోక్తిని దాని జీవితంగా భావించారు.

"శబ్దార్థౌ సహితౌ వక్రకవివ్యాపారశాలిని

బంధౌ వ్యవస్థితౌ కావ్యం తద్విహ్లాదకారిణి

వక్రోక్తిని వర్ణవిన్యాస, పదపూర్వార్థ, పదపరార్థ, వాక్య, ప్రకరణ, ప్రబంధ వక్రతలని ఆరు విధాలుగా విభజించారు. ఇతని తర్వాత క్షేమేంద్రుడు ఔచిత్యాన్ని కావ్య జీవితంగా ప్రతిపాదించాడు. ఔచిత్యం రస "సిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం". అయితే ఆనంద వర్ధనుడు అనోచిత్యాన్ని గురించి ముందే ప్రస్తావించడం గుర్తు పెట్టుకోవాలి.

అనౌచిత్యాద్రాత్ నాన్య ద్రస భంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోప నిషత్పుణ
అనౌచిత్యం కన్నా రసభంగానికి వేరే కారణం లేదు. ఔచిత్యం గల కావ్యం రసోప నిషత్ - అని అర్థం.
ఇలా భారతీయ ఆలంకారికులు కావ్య శరీరాత్మ జీవితాలను గురించి వారాలు చేశారు.

## 2.5. కావ్యహేతువులు:

ప్రకృతిలోగాని ప్రపంచంలోని కారణం లేకుండా ఏ కార్యం జరగదు. ప్రతిదీ హేతుబద్ధంగానే జరుగుతుంది. కవిత్వం పుట్టుక కూడా అంతే. భారతీయాలంకారికులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం, ఈ మూడింటిని హేతువులుగా పేర్కొన్నారు.

"నైసర్గికోచ ప్రతిభాశ్రుతంచ బహునిర్మలమ్
అమందశ్చాభియోగో స్యాః కారణం కావ్య సంపదః" (దండి - కావ్యాదర్శం)
(సహజమైన ప్రతిభ, బహునిర్మలమైన పాండిత్యం, గొప్ప రచనా ప్రయత్నం-ఈ మూడూ కలిసి కావ్యసంపదకు కారణం)

"శక్తిర్నిపుణతా లోకశాస్త్ర కావ్యాద్య లేక్షణాత్

కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుర్భతౌ" (మమ్మటుడు - కార్యప్రకాశం)

శక్తిని, (ప్రతిభ)లోకాన్ని శాస్త్రాలను, కావ్యాలను చదవడం ద్వారా లభించిన నిపుణత, పండితుల శిక్షణ ద్వారా చేసే ఆభ్యాసం ఈ మూడూ కలిసి కావ్య హేతువు.

"త్రితయమిదం వ్యాప్రియతౌ శక్తిర్వ్యుతృత్తిరభాసః" (రుద్రటుడు-కావ్యాలంకారం)

శక్తి, వ్యుతృత్తి, అభ్యాసం, ఈ మూడు కావ్యహేతువులవుతున్నవి. ఈ అభిప్రాయాలన్నిటినీ బట్టి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం-అనే హేతువుల వల్ల కావ్యం పుట్టుతున్నదని మన ఆలంకారికుల అభిప్రాయమైనట్లు తెలుస్తుంది.

ప్రతిభ ఏదైనా ఒక పనిని అందంగా ఆకర్షణీయంగా యుక్తియుక్తంగా చేసే శక్తి గల వానిని ప్రతిభావంతుడు అంటుంటాం. ఒక పనిని సమర్థవంతంగా సృజనాత్మకంగా నిర్వహింపగల శక్తి ప్రతిభ.

"ప్రజ్ఞానవనతోన్మేష శాలనీ ప్రతిభామతా"

తదనుప్రాణనా జీవ వర్ణనా నిపుణఃకవిః

"తస్య కర్మస్మృతం కావ్యం" అని భట్టతౌతురు తన "కావ్యకాతుకం'లో నిర్వచించారు. కొత్త కొత్త పోకడలను కలిగించే ప్రజ్ఞయే ప్రతిభ. దానిననుసరించి వర్ణన చేసేవాడు కవి. అతని కర్మ కావ్యం అని అర్థం. అభినవగుప్తుడు "ప్రజ్ఞా అపూర్వ వస్తునిర్మాణక్షమా" కొత్తకొత్త వస్తువులను నిర్మించే నేర్పు ప్రతిభ-అని ప్రతిభను నిర్వచించాడు. ఒక వస్తువును అపూర్వంగా ముందటి కవుల కన్నా మహోన్నంతా నిర్మించగల శక్తి ప్రతిభ. వస్తువుకు సంబంధించిన అనుభూతి ముద్రను పాఠకునిలో గాఢంగా వెయ్యగల విద్య ప్రతిభలో దాగి ఉంటుంది. ఈ ప్రతిభనే భావనాశక్తి అని ఇవాళ అంటున్నాం. ఒక సామాజికాంశాన్ని కావ్యయోగ్యాంశంగా రూపాంతరీకరింపగలిగిన విద్య భావనాశక్తి.

ఈ ప్రతిభ రెండు రకాలుగా ఉంటుందని జగన్నాథ పండిత రాయలు అభిప్రాయం. 1. అదృష్ట జన్యం 2. వ్యుత్పత్తి అభ్యాస జన్యం. 3. పూర్వ జన్మ సుసృతం వల్ల, దైనవాను గ్రహం వల్ల సిద్ధించేది అదృష్ట జన్య ప్రతిభ. కవి సమాజాన్ని సాహిత్యాన్ని అధ్యయనం చేసి పొందిన కవిత్వ శక్తి రెండవది. మొదటి దానికి రుజువు లేదు. రెండవది అనుభవసిద్ధం.

రాజశేఖరుడనే ఆలంకారికుడు ప్రతిభ కారయిత్రి, భావయిత్రి అని రెండు రకాలుగా ఉంటుందని, వస్తువును భావింపజేసేది భావయిత్రి, రచనను చెయ్యించేది కారయిత్రి అని పేర్కొన్నాడు. ఈ రెండు రకాల ప్రతిభ కావ్యరచనకు అవసరమే. భావయిత్రి ఆంతరం, కారయిత్రి బాహిరం. "రచయిత చైతన్యం కేవలం భౌతిక జగత్తును ప్రతిఫలించదు. దానిని సృష్టించదు" అంటాడు లెనిన్. ఇందుకు ప్రతిభ ప్రధాన కారణం.

## వ్యుత్పత్తి:

కవి స్థలకాలబద్ధమైన జీవితాన్ని అనుభవించి, అధ్యయనం చేసి పొందే జ్ఞానం వ్యుత్పత్తి. కవి అధ్యయనం ద్వారా అనేక సామాజికాంశాలను అర్థం చేసుకుంటాడు. శాస్త్రార్థాలను తెలుసుకుంటారు. సాహిత్య రహస్యాలను అవగతం చేసుకుంటాడు.

భాషాపాటవం సంపాదిస్తాడు. ఇవన్నీ కలిసి వ్యుత్పత్తి అవుతాయి. కవికి ఇతర కళల పరిజ్ఞానం ఉండడం కూడా మంచిది. గుడ్‌హర్ట్ రెండెల్ **Some general knolwedge of all the Art is soil in which particular knowledge in any one of them should be planted if it is to flourish and bear fruit** అని సూచించారు.

రచనకు రక్తమాంసాలు చేకూర్చడానికి ప్రతిభతోపాటు వ్యుత్పత్తి కూడా అవసరం. "కవి బాధ్యత ఎంతటిదో కదా" అని భామహుడు ఆశ్చర్యాన్ని ప్రకటించింది వుత్పత్తి దృష్టితోనే.

**అభ్యాసం**

"అభ్యాసం కూసు విద్య" అని సామెత "అనగ నగ రాగ మతిశయిల్లుచునుండు" అన్నాడు వేమన. "సాధనము పనులు సమకూరు ధరలోన" అన్నది మరో సూక్తి. కావ్యరచనలో నిరంతర అభ్యాసం కవిని ఉత్తమ కావ్యనిర్మాణదక్షుని చేస్తుంది. సాధారణ జీవితంలోనే సాధన జీవితానికి సానబెట్టుతుంది. చెట్లెక్కడం, ఈతాడడం, పొలం దున్నడం, మోటతోలడం వంటి వాటిలో అభ్యాసం చేసినవాడికి చేయనివాడికి తేడాను కనిపెట్టవచ్చు. కవిత్వ రచనలో కూడా అంతే. రాసిన ప్రతిదీ గొప్ప రచన కాదు. మాటిమాటికీ సంస్కరించుకున్నదే మహారచన అవుతుంది. చాగంటి సోమయాజులు అనేక పథల్ని అనేక పర్యాయాలు రాసేవారట.

కావ్యహేతువులుగా మన పూర్వికులు ప్రతిభ వ్యుత్పత్తి అభ్యాసాలను పేర్కొని వాటిలో ఏది ముఖ్యం అనే విషయాన్ని కూడా చర్చించారు.

"కావ్యంతు జాయత్ కస్యచిత్ ప్రతిభావతః"

అని భామహుడు ప్రతిభావంతుడైన ఒకానొకవికి మాత్రమే కావ్యనిర్మాణం సాధ్యమౌతుందన్నాడు. వ్యుత్పత్తి అభ్యాసం ప్రతిభను సంస్కరించి ఉత్తేజితం చేస్తామని రుద్రటుడు, హేమచంద్రుడు అభిప్రాయపడ్డారు.

"అవ్యుత్పత్తికృతో దోషః శక్త్యా సంవ్రియతేకవేః
యస్త్వశక్తి కృతో దోషః సఝటిత్యవభాసత్" (ధ్వన్యాలోకం)

అన్నాడు ఆనందవర్ధనుడు. వ్యుత్పత్తి కొరత వల్ల కలిగే దోషాన్ని ప్రతిభ పూర్తిగా కప్పిపెడుతుంది. ప్రతిభ లేకపోవడం వల్ల కలిగే దోషం వెంటనే కనిపిస్తుంది అని ఆనందవర్ధనుని అభిప్రాయం. అందుకే ఆయన "ప్రతిభావ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసే." అని ప్రతిభకు అగ్రస్థానమిచ్చాడు. ఇలాంటి అభిప్రాయాన్నే రాజశేఖరుడు కూడా వ్యక్తం చేశారు. అయినా ప్రాపంచిక జ్ఞానం లేకుండా భావనా శక్తి ఒక్కటే ఉన్నా, భావనాశక్తి లోపించి, ప్రాపంచిక జ్ఞానమొక్కటే ఉన్నా, ఈ రెండూ ఉండి రచనా సామర్థ్యం లోపించినా కావ్యం రాణించదు. సమాజానికి మేలు జరగదు. అందువల్ల గొప్పకావ్యం పుట్టడానికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం మూడూ అవసరమే.

**మరొక్క విషయం:**

మంచి కవిత్వం రాయడానికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అనేవి ఉండాల్సినవే. కాని, గొప్పరచన పుట్టడానికి ఇవే సరిపోవు. ఈ మూడింటిని కవిత్వహేతువులనడం కన్నా, కవి కుండవలసిన అర్హతలనడం మేలు. ఈ మూడూ ఉంటేనే కవిత్వం పుట్టుతుంది. ఇంకేమి అక్కర్లేదా ? ఇవి లేకుంటే గొప్పకావ్యం రాయలేని మాట వాస్తవమే. అయితే వీటితోపాటు ఉండవలసింది, అనివార్యంగా ఉండేది మరొకటుంది. అది సామాజిక ప్రేరణ.

సామాజిక ప్రేరణ లేకుండా కావ్యం పుట్టదు. విభిన్న కాలాల్లో విభిన్న సామాజిక వస్తువులతో కావ్యాలు రావడానికి ఆయాకాలాల సామాజిక ప్రేరణలే లేదా సామాజిక అవసరాలే. అలాగే ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒక్కోరకం సాహిత్యం రావడానికి కూడా సామాజిక ప్రేరణలే హేతువులు. సామాజిక పరిస్థితి కవిని రెచ్చగొట్టితే ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసం గల కవి కావ్యం రాస్తున్నాడు. కోడికి కూత వెయ్యడం చేతనౌనని అది ఎప్పుడు కూస్తే అప్పుడు తెల్లవారదు. కూతవేసే శక్తి కోడి కుండాలనడంలో సందేహంలేదు. కాని కూత కుయ్యాల్సిన సమయానికి కూయాలి. కవికి కావ్యానికి కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. "ఒక సమస్య ఉన్నందువల్లనే మహా గ్రంథం రాదు. గొప్ప రచయిత ఉన్నందువల్లనే అది వచ్చును". "వరవిక్రయ" నాటక కాలమున కంటే వరకట్న పద్ధతి యిప్పుడే ముమ్మరముగా నున్నను 'వరవిక్రయ' నాటకస్థాయికయినను వచ్చు ఒక్క రచన కూడా ఇప్పుడు రాలేదే?" అన్నది డా॥ సర్దేశాయి తిరుమలరావు ప్రశ్న (కన్యాశుల్కనాటక కళ) అప్పటికే నశించిపోతున్న కన్యాశుల్క నాటక సమస్య మీద గురజాడ రాసిన కన్యాశుల్క నాటకం, ఆ సమస్య నశించిపోయినా ఇవాళ కూడా సజీవంగా ఉంది. వరవిక్రయ నాటకం నాటికన్నా ఇవాళ వేయిరెట్లు బలపడి ఉంది వరకట్న సమస్య. అయినా అంతగొప్ప నాటకం కాలేదు. అంటే ఒక గొప్పరచన రావడానికి అనుకూలమైన సామాజిక పరిస్థితి ఇవాళ ఉంది. దానికి ప్రతిభా రాహిత్యమే కారణం కాదు. ఇందుకు వేరే కారణాలు చెప్పుకోవాలి.

సాహిత్యం సామాజిక చైతన్యరూపం. దీని సృష్టికి ఆయాకాలాల సామాజిక అస్తిత్వమే ప్రేరణ. సాహిత్యానికి జన్మస్థానం, గమ్యస్థానం. రెండూ సమాజమే. మరోరకంగా కవి పాత్రధారి, సమాజం సూత్రధారి. ప్రపంచం తనను తాను అందంగా సుఖంగా మార్చుకోవడానికి, పురోగామిగా దిద్దుకోడానికి విభిన్న కాలాల్లో తనదైన సాహిత్యాన్ని సృష్టించుకుంటుంది. అందుకు కవులు, రచయితలు ఉపకరణాలుగా ఉపయోగపడతారు. అందువల్ల అసలైన కవిత్వ హేతువు స్థలకాలబద్ధమైన సామాజిక ప్రేరణ. ప్రతిభ వ్యుత్పత్తి అభ్యాసం కవికి కావలసిన అర్హతలు, పరిసరాలు.

## 2.6. కావ్య ప్రయోజనం:

ప్రకృతిలో ప్రపంచంలో ప్రయోజనారహితంగా ఏదీ పుట్టదు, బతకదు. కవిత్వం కూడా అంతే. కవిత్వం సమాజంలోంచే పుట్టుతుంది. సమాజంలోకే చేరుతుంది. ఈ ప్రక్రియ ప్రయోజనారహితంగా జరగదు. జ్వరం వచ్చిన పిల్లవాడు కోతి నవ్వినా లేచి కూర్చుంటాడు. అలాంటిది సాహిత్యంవల్ల ప్రయోజనం ఉండదా? అన్న డా॥ సర్దేశాయి తిరుమలరావు ప్రశ్నను అర్థం చేసుకోవాలి. కవిత్వానికి సమాజమే రంగస్థలం కనుక దాని ప్రయోజనం కూడా సామాజికమే. కవిత్వ ప్రయోజనమంటే కవిత్వం నిర్వహించే సామాజిక భూమిక అని అర్థం.

కవిత్వ / కావ్య ప్రయోజనాన్ని గురించిన ఆధునిక ఆలోచనల్ని చెప్పుకునే ముందు, ప్రాచీన ఆలంకారికులు ఏమనుకున్నారో సమీక్షించుకుందాం. ప్రాచీన భారతీయ ఆలంకారికులు సాహిత్యానికి ఆనందం ఉపదేశం అనే రెండు ప్రధాన ప్రయోజనాలను ఉద్దేశించారు.

భరతుడు నాట్యశాస్త్రం ఉపదేశాత్మకం కావడమే గాక, హితాన్ని, ధైర్యాన్ని, క్రీడను, సుఖాన్ని కలిగిస్తుందని చెప్పాడు. సర్వకర్మలతోను, కూడి భావరసాల మూలంగా అందరికీ ఉపదేశజనకమౌతుందన్నాడు.

"దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాంతపస్వినామ్
విశ్రామజననం లోకే నాట్యమే తద్భవిష్యత్" అన్న శ్లోకంలో విశ్రాంతిని నాట్యప్రయోజనంగా భామహుదు పేర్కొన్నాడు.
ధర్మార్థకామ మోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
ప్రీతించ కరోతికీర్తించ సాధుకావ్యనిషేవణం (భామహుడు–కావ్యాలంకారం)

చతుర్విధపురుషార్థాలు, కళావైచక్షణ్యం ప్రీతి కీర్తి మంచికావ్యం వల్ల కలిగే ప్రయోజనాలు.

"కావ్యంయశస్సేర్థస్పతే వ్యవహారవిదే శివేతర క్షతయే

సద్యఃపరని ర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే (మమ్మటుడు-కావ్యప్రకాశం)

యశస్సు, ధనం, వ్యవహార జ్ఞానం, అమంగళ పరిహారం, తక్షణానందం మంచిమాటలతో సన్మార్గోపదేశం మమ్మటుని దృష్టిలో కావ్యప్రయోజనాలు.

దండి కావ్యంలో ఆది రాజయశోబింబాలు ప్రతిబింబిస్తాయన్నాడు. భోజుడు సరస్వతీ కంఠాభరణంలో కీర్తిని ప్రీతిని కావ్య ప్రయోజనాలుగా పేర్కొన్నాడు.

"నిర్దోషం గుణవత్కావ్యమలంకారైరలంకృతం

రసానిత్వం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిందతి"!

వామనుడూ ఇలాగే భావించాడు.

కావ్యం సత్‌దృష్టా దృష్టార్థం ప్రీతి కీర్తి హేతుత్వాత్ (కార్యాలంకార సూత్రవృత్తి)

ఇలా భారతీయ ఆలంకారికులు ప్రధానంగా ఆనందోపదేశాలను కావ్యప్రయోజనాలుగా భావించగా ఆనందవర్ధనుని కాలానికి ఆనందమే పరమప్రయోజనమైంది. ఆనందవర్ధనుడు "సహృదయ జన మనంః ప్రకాశం" ప్రధాన కావ్యప్రయోజనమనగా, ధ్వన్యాలోక వ్యాఖ్యాత అభినవ గుప్తుడు "తధా పి ప్రీతిరేవ ప్రధానం" అని తేల్చాడు. "చతుర్వర్గ వ్యుత్పత్తేరపిచ ఆనందపవ పార్యంతికంఫలం" అని కూడా నిగ్గుతేల్చాడు. అయితే ప్రాచీనులు చెప్పిన ఆనందం ఎలాంటిది ? ఎవరికది ఆనందం, వాళ్ళ ఉపదేశం ఏది ? ఎలాంటింది ? – అన్న ప్రశ్నలు నేటి పాఠకులకు కలగడం సహజం. ఒకరికి ఆనందదాయకమైంది అందరికీ ఆనందదాయకం కాదు. ఒకరు చేసిన ఉపదేశం అందరికీ సదుపదేశం కాకపోవచ్చు. అందువల్ల ఆనందోపదేశాలను సాపేక్షపదాలుగా గుర్తించాలి.

నన్నయ భారతంలోను, పోతన భాగవతంలోనూ 'జగద్ధితం' తమ కావ్య ప్రయోజనంగా పేర్కొన్నారు. వాళ్ళ దృష్టిలో హితమైనది ఆధునిక కాలానికి హితం కాకపోవచ్చు.

ఆధునిక రచయితల్లో గురజాడ ఉన్నత నైతిక విలువల్ని ప్రతిపాదించడం కన్యాశుల్క నాటక రచనోద్దేశ్యంగా పేర్కొన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రగతిశీల రచయిత మాక్సిమ్‌గోర్కీ "ఉద్దేశపూర్వకంగా గానీ అనుద్దేశపూర్వకంగా గానీ సర్వకళలచే వుండే ప్రయోజనం యేమిటంటే మనవునిలో కొన్ని అనుభూతులను జాగృతం చెయ్యడం, ఒక ప్రత్యేక జీవిత దృగ్విషయం పట్ల ఒక ప్రత్యేక దృక్పథాన్ని పెంపొందించడం" అని చెప్పారు. (గోర్కు సాహిత్య వ్యాసాలు). అలాగే ప్రసిద్ధ భారతీయ ప్రగతిశీల రచయిత "జీవిత సమస్యలను పరిష్కరించటానికి జీవితాన్ని సుఖవంతంగాను అర్థవంతంగాను చెయ్యటానికి సాహిత్యం ఉపయోగపడటం కంటే ఎక్కువ ప్రయోజనం ఏమీ వుండదు" అన్నారు. (ప్రేమ్‌చంద్-సాహిత్య వ్యాసాలు)

ఈ అభిప్రాయాలను అర్థం చేసుకుంటే కవిత్వం కేవల ఉపదేశం కన్నా మించిన ప్రయోజనాన్ని సాధించే ప్రక్రియగా బోధపడుతుంది. సాహిత్యం ఉన్నత భావప్రచారం చెయ్యాలి. కవిత్వం భావప్రచార సాధనమని పూర్వ కవులే గుర్తించారు. ఏ భావాలను ప్రచారం చెయ్యాలన్నదని కాలం నిర్ణయిస్తుంది. కవిత్వం భావ ప్రచార సాధనంటే ఆధునిక కాలంలోని సంప్రదాయవాదులు అభ్యంతరం చెప్పవలసిన పనిలేదు. ఏ. శివరామ కారంత్ అనే కన్నడ రచయిత తాను మరణించే లోపల ఈ ప్రపంచాన్ని మరింత అందంగా మలచడమే తన రచనోద్దేశంగా పేర్కొన్నారు. పి.సి.గుప్త అనే విమర్శకుడు కళ జీవితాన్ని సౌందర్యాత్మకం చెయ్యాలనే

కోరికతో మొదలవుతుందన్నారు. ఈ అభిప్రాయాలు కవిత్వ ప్రయోజనం విషయంలో ఆధునికులకు విభిన్నమైన ఆలోచనలున్నట్లు తెలుస్తుంది.

"ఆత్మ కోసం సాహిత్యం, రాజుకోసం సాహిత్యం. ఆనందం కోసం సాహిత్యం అనేది సంప్రదాయ దృక్పథం. సాహిత్యం కోసం సాహిత్యం. అందం ఆనందం కోసం సాహిత్యం. సౌందర్యంకోసం సాహిత్యం అనేది ఆధునిక ముసుగులోని సాంప్రదాయిక దృక్పథం. కళ ప్రజలకోసం. మానవతామహితమైన వర్గరహిత సమాజ ధ్యేయం కోసం సాహిత్యం నిబద్ధం కావాలి" అంటారు త్రిపురనేని మధుసూదనరావు (సాహిత్యంలో వస్తుశిల్పాలు). ఇది ఆధునిక సాహిత్యచైతన్యం లోంచి పుట్టిన ఆలోచన. అందువల్ల సాహిత్యం నుంచి ప్రాచీనులు ఆశించిన ప్రయోజనం వేరు. ఆధునికులు ఆశిస్తున్న ప్రయోజనం వేరు అని అర్థం చేసుకోవాలి.

ఆధునిక కాలంలో సామాజిక ఉద్యమాలు వస్తున్న కొలదీ సాహిత్య ప్రయోజనం విషయంలో ఆలోచనలు మారాయి. సంఘసంస్కరణోద్యమ సాహిత్యం శాస్త్రీయాలోచనల్ని ప్రచారం చేసింది. సంస్కరణ భావాలను వెదజల్లింది. మూఢనమ్మకాలను, మూఢాచారాలను ఖండించింది. భారతజాతీయోద్యమం. దేశీయత దేశభక్తి, స్వపరిపాలన వంటి భావాలను ప్రచారం చేసింది. అభ్యుదయ విప్లవ సాహిత్యాలు వర్గరహిత సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా ప్రచారం చేశాయి. దళిత సాహిత్యం కులరహిత సమాజాన్ని, స్త్రీవాద సాహిత్యం పురుషాధిక్యత లేని సమాజాన్ని ప్రచారం చేశాయి.

"సాహిత్యం కేవలం మనోరంజనానికే పరిమితంగా వున్నంత వరకు జోలపాటలుపాడి నిద్రపుచ్చటానికి ప్రయత్నించినంత వరకు క్రియాశక్తి అవసరము వుండదు. అది ఒక ఉన్మాదం లాంటింది. కాని మనము సాహిత్యం కేవలం మనోరంజనానికి విలాసానికి అనుకోవటం లేదు. మన గీటురాయి మీద సాహిత్యానికి మెరుగు పెట్టాలి. దానిలో ఉన్నత భావాలు స్వతంత్రాలోచనలు, సౌందర్యారాధన, ఆత్మవికాసం, నిండి వుంటాయి". (ప్రేమ్‌చంద్-సాహిత్య వ్యాసాలు)

మానవ సంబంధాలలో ఆరోగ్యపరమైన మార్పుతేవడం ఉత్తమ కవిత్వ ప్రయోజనం. మనిషి సంస్కారాన్ని ఉన్నతీకరించడం మంచి కవిత్వ లక్ష్యం. కవిత్వం సామాజిక స్పృహను సామాజిక చైతన్యాన్ని పాఠకులలో కలిగించాలి, వాళ్ళను కర్తవ్యోన్ముఖుల్ని చెయ్యాలి. మనిషిని స్వావలంబుని చెయ్యడం గొప్ప కావ్యప్రయోజనం. మహాప్రస్థానం చదివితే మనకొక నూతన ప్రపంచం కనిపిస్తుంది. జీవితం మీద విశ్వాసం కుదురుతుంది. కవిత్వ/కావ్య ప్రయోజనమదే.

## 2.7. కావ్యస్వరూపం:

ప్రాచీన సాహిత్యంలో పురాణేతిహాసాలు కావ్యప్రబంధాలు విభిన్న ప్రక్రియలుగా వచ్చాయి. ఆధునిక సాహిత్యంలో మహాకావ్యాల జోరు తగ్గింది. స్వాతంత్ర్యానంతరం ఇంకాబాగా తగ్గిపోయింది. ఆధునిక కవిత్వంలో ప్రాచీన కవిత్వంలోలాగా పద్దెనిమిది పర్వాలుండవు. పద్దెనిమి పాదాలుంటాయి. అందుకనే ఒక ఆధునిక కవి అన్నారు. "ఎన్ని గజాలు రాశామన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పామన్నది ప్రధానం" అని. అభ్యుదయ సాహిత్యంలోనూ వచన కథాకావ్యాలు రావాలని కుందుర్తి ఆంజనేయులు బాగా ప్రచారం చేశారు. అయినా ఆయన రాసిన 'తెలంగాణా', ఆరుద్ర 'త్వమేవాహం' సోమసుందర్ 'వజ్రాయుధం' వంటి కావ్యాలు ఎక్కువ రాలేదు. ఇటీవలి కాలంలో నగ్నముని 'కొయ్యగుర్రం', శేషేంద్రశర్మ 'నాదేశం నాప్రజలు', సి. నారాయణరెడ్డి 'విశ్వంభర', 'మట్టీమనిషీ ఆకాశం', కె.శివారెడ్డి 'ఆసుపత్రిగీతం', ఛాయారాజ్ 'శ్రీకాకుళం' వంటి దీర్ఘకావ్యాలు సుమారుగా వచ్చాయి. ఇవి ఆధునిక కావ్యాలు. ప్రాచీనకాలం కవులు చెప్పిన కావ్య స్వరూప లక్షణాలు వీటిని సరిపడవు. వీటిలో పాత్రలు, రసం వంటి ప్రాచీన కవ్య విశేషాలుండవు. అందువల్ల ఇప్పుడు మనం తెలుసుకునే కావ్యస్వరూపం భారతీయలంకారికులు చెప్పిన సంప్రదాయ కావ్య స్వరూపమే. మొదట భామహుడు చెప్పిన కావ్య స్వరూపం తెలుసుకుందాం.

"సర్వబంధోమహాకావ్యం మహతాం చమహచ్చయత్
అగ్రామ్య శబ్ద మర్థంచ సాలంకారం సదాశ్రయం
మంత్ర దూత ప్రయాణాజి నాయకాభ్యుదయైశ్చయత్
పంచభిః సంధిభిర్యుక్తం నాతివ్యాఖ్యేయే మృద్ధిమత్
చతుర్వర్గాభిధానే పి భూయసార్థో పదేశకృత్
యుక్తం లోకస్వభావేన రసైశ్చసకవైః పృథన్" (కావ్యాలంకారం)

మహాకావ్యం సర్గలలో బంధింపబడి ఉంటుంది. గొప్ప విషయాన్ని నిరూపించేదిగా ఉంటుంది. గ్రామ్యాలు కాని శబ్దార్థాలతో, అంలకారాలతో కూడుకొని మంచిని ఆశ్రయించి ఉంటుంది. మంత్రం, దూతం, ప్రయాణం, యుద్ధం, నాయకాభ్యుదయం-అనే అయిదు వర్ణనలు కావ్యంలో ఉంటాయి. పంచసంధులుంటాయి. అతివ్యాఖ్యానాన్ని కోరనిదై ఉంటుంది కావ్యం. అది సమగ్రతను కలిగి ఉంటుంది. ధర్మార్థకామ మోక్షాలనే చతుర్విధపురషార్థాలను ప్రతిపాదిస్తుంది. ఉపదేశం, లోకస్వభావంలతో కూడిన కావ్యం సకల రసాలతో అలరారుతుంది. భామహుని తర్వాత దండి మరింత విస్తృతంగా కావ్య స్వరూపాన్ని చెప్పాడు - కావ్యదర్మంలో

సర్గబంధో మహాకావ్యముచ్య తౌతస్య లక్షణం
ఆశీర్న మస్క్రియా వస్తు నిర్దేశోహిపి తన్ముఖం
ఇతిహాసకథోద్భూత మితరద్వాసదాశ్రయం
చతుర్వర్గఫలాయత్తం చతురోదాత్తనాయకం
నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయం వర్ణనైః
ఉద్యాన సలిల క్రీడా మధుపానరతోత్సవైః
విప్రలంభ వివాశ్చ కుమారోదయ వర్ణనైః
మంత్రదూత ప్రయాణాజినాయకాభ్యుదయై రపి
అలంకృతర సంక్షిప్తం రసభావ నిరంతరం
సర్గే నతి విస్తే ర్ణైః శ్రవ్య వృత్తైః సుసంధిభిః
సర్వభిన్న వృత్తాం తైరుపేతం లోకరంజనం
కావ్యం కల్పోత్తరస్థాయి జాయతే సదలంకృతి
న్యూనమప్యత్రయైః కైశ్చిదంగైః కావ్యం నదుష్యతి

యద్యుపాత్తేషు సంపత్తి రారాధయతి తద్విధః

సంధి బంధమైనది మహాకావ్యమౌతుంది. దాని లక్షణం చెప్పబడుతున్నది. కావ్యం ఆశీస్సుతోగాని, నమస్కారంతోగాని, వస్తువును నిర్దేశిస్తూగాని ప్రారంభం కావాలి. ఇతిహాస ప్రసిద్ధమైన కథమీదగాని, ఇతరత్రా ఉత్కృష్టమైన కథపైన గాని ఆధారపడి ఉండాలి. ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను ప్రతిపాదించాలి. చతురుడు ఉదాత్తుడు అయిన నాయకుని ఆశ్రయించి ఉండాలి. నగరం సముద్రం, పర్వతం, ఋతువులు, సూర్యచంద్రోయాలు, ఉద్యానవనం, జలక్రీడ, మధుపానం, రతోత్సవం, విప్రలంభం, వివాహం, పుత్రజననం, మంత్రం, దూతం, ప్రయాణం, యుద్ధం, నాయకాభ్యుదయం అనే పద్దెనిమిది (అష్టాదశ) వర్ణనలు ఉండాలి. కావ్యం అలంకృతం కావాలి. అసంక్షిప్తమై రసభావాలు ఎడతెగకుండా పరిమిత విస్తీర్ణం గల సర్గలతో కూడి,

శ్రవ్యవృత్తాలతో సుసంధులతో ఒప్పారాలి. ఇందులో కొన్ని విషయాలు లేకున్నా మహాకావ్య గుణసంపత్తి సహృదయులను రంజింప జేసినట్లైతే కావ్యానికి దోషం అంటదు.

ఇంకా అనేక మంది ఆలంకారికులు అనేక అదనపు అంశాలను కలిపి కావ్య స్వరూపాన్ని నిర్వచించారు. విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో నాయుకుడు దేవజాతికిగాని క్షత్రియ జాతికి గాని చెందినవాడు కావాలన్నాడు. ఒకే వంశంలో పుట్టిన పలువురైనా నాయకులు కావచ్చన్నాడు. శృంగార వీర రసాలలో ఒకటి అంగి (ప్రధాన) రసంగాను, తక్కినవి అంగ (సహాయక) రసాలుగానూ ఉండాలన్నాడు. కావ్యవిభాగాలైన సర్గలు ఎనిమిది నుండి ముప్ఫై లోపల ఉండాలన్నాడు. కావ్య వర్ణనల్ని ఇరవై నాల్గింటికి పెంచారు. వీటిలో వేట మొదలైనవి ఉన్నాయి. విద్యానాథుడు ముప్ఫై రెండు వర్ణనల్ని పేర్కొన్నాడు. వీటిలో రాణి, దేశగ్రామ ఆశ్రయాదులున్నాయి.

ప్రాచీనాలంరికులు పేర్కొనిన కార్యవర్ణనలు కథకు సంబంధించిన స్థలకాలపాత్ర క్రియావర్ణనలే. అంటే కథ ఎక్కడ జరుగుతున్నది, ఎప్పుడు జరుగుతున్నది, ఎవరి మధ్య జరుగుతున్నది, ఏమి జరుగుతున్నది అనే నాలుగు అంశాలను కావ్యవర్ణనలు వివరిస్తాయి. కావ్యం ఒక నాయకుని చుట్టూ తిరుగుతుంది. నాయకుడున్నాడు గనుక నాయిక, ప్రతినాయకుడు ఉంటారు.

ఈ రకమైన కావ్యస్వరూపం ఆధునిక కాలంలో వచ్చిన సంప్రదాయ కావ్యాలకు, చారిత్రక కావ్యాలకు వర్తిస్తుంది. ఆధునిక జీవితాన్ని ఆధునిక దృక్పథంతో చిత్రించే కావ్యాలు ఈ స్వరూపంలో ఒరగవు.

**భారతీయ ఆలంకారికులు - అలంకార శాస్త్రాలు**

| | | |
|---|---|---|
| భరతుడు | : | నాట్యశాస్త్రం (క్రీ.పూ.4వ శతాబ్దం) |
| భామహుడు | : | కావ్యాలంకారం (క్రీ.శ.6వ శతాబ్దం) |
| దండి | : | కావ్యాదర్శం (క్రీ.శ.6వ శతాబ్దం) |
| వామనుడు | : | కావ్యాలంకార సూత్రవృత్తి (క్రీ.శ.8వ శతాబ్దం) |
| ఉద్భటుడు | : | అలంకార సారసంగ్రహం (క్రీ.శ.8వ శతాబ్దం) |
| ఆనంద వర్ధనుడు | : | ధ్వన్యాలోకం (క్రీ.శ.840-870) |
| రాజశేఖరుడు | : | కావ్యమీమాంసం (క్రీ.శ.870-950) |
| కుంతకుడు | : | వక్రోక్తి జీవితం (క్రీ.శ10వ శతాబ్దం) |
| ధనంజయుడు | : | దశరూపకం (క్రీ.శ.900-1000) |
| భట్టతౌతుడు | : | కావ్యకౌతుకం (క్రీ.శ. 950-980) |
| అభినవ గుప్తుడు | : | ధ్వన్యాలోకలోచనం (క్రీ.శ.11వ శతాబ్దం) |
| మహిమభట్టు | : | వ్యక్తివివేకం (క్రీ.శ.1020-1060) |
| క్షేమేంద్రుడు | : | ఔచిత్య విచారచర్చ (క్రీ.శ.1000-1063) |
| భోజుడు | : | సరస్వతీ కంఠాభరణం (క్రీ.శ 1000-1050) |
| మమ్మటుడు | : | కావ్యప్రకాశం (క్రీ.శ 1050-1150) |
| విద్యానాథుడు | : | ప్రతాపరుద్ర యశో భూషణం (క్రీ.శ.1296-1325) |
| విశ్వానాథుడు | : | సాహిత్యదర్పణం (క్రీ.శ.14వ శతాబ్దం) |
| జగన్నాథుడు | : | రసగంగాధరం (క్రీ.శ.1620-1660) |

## 2.8 ప్రశ్నలు నమూనా

1. కవికి కావ్యానికి ఉండే సంబంధాన్ని మీ మాటల్లో రాయండి.
2. కావ్యాన్ని కవిత్వాన్ని ప్రాచ్యపాశ్చాత్య ఆలంకారికులు నిర్వచించిన తీరును విశ్లేషించండి.
3. కావ్యం శరీరం, ఆత్మ, జీవితాలను గురించి భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను సమీక్షించండి.
4. కావ్య హేతువులను గురించి రాయండి.
5. కావ్య ప్రయోజనాన్ని గురించి ఆలోచించండి.
6. భారతీయ సంప్రదాయంలో కావ్య స్వరూపాన్ని తెలపండి.
7. కావ్యం అంటే తెలియజేసి కవిత్వ స్వరూపస్వభావాలను వివరించండి.
8. కావ్యం – కవిత్వం అంటే వివరించండి.

## 2.9 చదువదగిన గ్రంథాలు

1. లక్ష్మీకాంతం, పింగళి : సాహిత్య శిల్ప సమీక్ష
2. నరసింహం, కె.వి.ఆర్ : సాహిత్య దర్శనము
3. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం (వ్యాఖ్యాత) : కావ్యాలంకార సంగ్రహము
4. నారాయణరెడ్డి సి. : ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోజనములు.

**– ఆచార్య . రాచపాళెం. చంద్రశేఖర్ రెడ్డి.**

# పాఠం – 3
# కావ్య హేతువులు

**ఉద్దేశ్యం :**

**ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం**

- **కావ్య సృష్టికి సాధనా సామగ్రీ అయిన శక్తి, వ్యుత్పత్తి, అభ్యాసాల గురించి తెలియచేయటం.**
- **ప్రతిభ, పాండిత్యం, అభ్యాసాలలో ఏది గొప్పదో విశ్లేషిచటం.**

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

3.1 కావ్యహేతువులు

3.1.1 శక్తి

3.1.2 వ్యుత్పత్తి

3.1.3 అభ్యాసం

3.2 హేతువులలో గుణోత్తరం ఏది?

3.3 సారాంశం

3.4 ముఖ్య పదకోశం

3.5 స్వీయ మదింపు ప్రశ్నలు

3.6 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 కావ్యహేతువులు :

ఎన్నో గుణాలతో విశిష్టమైన ఈ కావ్యజగత్తు నిర్మాణానికి కావలసిన సాధన సామగ్రి ఏది? కావ్య నిర్మాత మిగిలిన వారి కంటే ఏవిధంగా భిన్న ప్రకృతి కలిగి ఉంటాడు? ఇలాంటి ప్రశ్నలకు మన ఆలంకారికులు కవిత్వం పుట్టుకతోనే వస్తుందని, పూర్వజన్మ సంస్కారం వలనో, ఈశ్వరానుగ్రహం వలనో కవికి కవితాసృష్టికి ఉపకరించే అంతరింద్రియ ప్రవృత్తి జన్మ సిద్ధంగానే ఉంటుందని నిర్ధారించారు. పాశ్చాత్య విమర్శకులు కూడా కవిత్వం జన్మ సిద్ధం అని అంగీకరించారు. సహజ కవితా ప్రతిభ కలిగినవారు చిన్ననాటి నుంచే చెవికి, కంటికి ఇంపు కలిగించే మధురమైన వాక్యాలను విన్నప్పుడు రమ్యమైన వస్తువులను చూసినప్పుడు మిగిలినవారి కంటే ఎక్కువగా సంతోషిస్తుంటారు. ఆ సంతోషంతో పరవశులై తమలో తామానందించటం, కనులు మూసుకొని ఏవేవో చూస్తుండటం వంటి సాధారణ చర్యలు చేస్తుంటారు. వారిలో భావ స్థిరమై ఇంకా అంకురించని కవితా బీజం ఉద్భిన్నమవటానికి చేసే ప్రయత్నమే ఆ

చేష్ట స్వరూపం. అవ్యక్తంగా ఉన్న ఆ బీజం కాలక్రమంగా మొలకెత్తి వారి నోటి వెంట చాలీచాలని, వచ్చీరాని భాషలో ఒక పాటగానో, మాటగానో వెలువడుతుంది. కవులందరూ అంతే అని కాదుకానీ ఆ శక్తి జన్మ సిద్ధంగానే సంక్రమిస్తుందని చెప్పవచ్చు. మన భాషలోగల పదకవిత్వశాఖలో చాలాభాగం పాండిత్య వాసనలేని సహజ కవుల నోటి నుంచి వెలువడిందే. కాబట్టి కవిత్వ రచనకు అవసరమైన సాధన సామగ్రిలో సహజశక్తియే ప్రథమ సాధనమని విమర్శకులందరు ఏకగ్రీవంగా అంగీకరించారు. మన ఆలంకారికులు ఈ సాధన సామగ్రినే కావ్యహేతువులని చెప్పారు.

ఈ కావ్య హేతువులు – శక్తి, వ్యుత్పత్తి, అభ్యాసం.

### 3.1.1 శక్తి :

శక్తికే ప్రతిభ అని నామాంతరం ఉంది. అది నిసర్గం. కవి కష్టపడి సంపాదించదగింది కాదు. కవిత్వం లాగానే ఈ శక్తిని సమగ్రంగా నిర్వచించటానికి సాధ్యం కానిది. దేనివల్ల వస్తు విస్తరంలో అనంతత్వం, ఆనందమయత్వం కవి చూడగలుగుతున్నాడో ఆ దర్శనమే ఆ శక్తి యొక్క లక్షణమని, అది క్రాంతదర్శనమని మన పండితులు, అది దివ్యదర్శనం అని పాశ్చాత్య విమర్శకులు అనిర్వచనీయ గుణంగా వక్కాణించారు.

నైసర్గికమైన ఈ ప్రతిభతోపాటు నిర్దుష్టమైన పాండిత్యం, నిరంతరాభ్యాసం కలిసి కావ్య హేతువులు మూడని అలంకార శాస్త్రాలలో చెప్పబడి ఉంది.

దండి – కావ్యాదర్శము లో

"నైసర్గికీ చ ప్రతిభా శ్రుతంచ బహు నిర్మలమ్
అమ దశ్చాభియోగో ఒ స్యాః కారణం కార సంపదః "

మమ్మటుడు – కావ్య ప్రకాశంలో

"శక్తిర్నిపుణతా లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణాత్
కావ్యాజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుద్భవే"

అని మూడు హేతువులను చెప్పాడు.

ఇంకొక ఆలంకారికుడు ఈ ప్రతిభను "అపూర్వ వస్తు నిర్మాణ క్షమా పజ్ఞా" అని నిర్వచించి, అనిర్వచనీయమైన ఆ శక్తికి కొంచెం మూర్తిమత్యం కల్పించాడు. ఎంత సహజ శక్తున్నా, అది కావ్య నిర్మాణక్షమమైనపుడే కావ్యహేతువుగా కొనియాడబడుతుంది. కానీ లేకపోతే పరిగణనీయమే కాదు – అని దీని అర్థం.

కవిలాగానే హృదయం చేత, మనస్సు చేత, వస్తు సౌందర్యాన్ని భావించి ఆనందించగలవారు అనేకులుంటారు. వారి అంతర ప్రకృతి నిర్మాణం, కవి అంతర ప్రకృతి నిర్మాణం ఒకటే. రామణీయ దర్శనంతో వారు కవిలాగానే ఆనందతన్మయులవుతారు. కనుక కావ్య హేతువులలో మొదటిదైన సహజశక్తి వారికీ పుట్టుకతో లభించినప్పటికీ వారు కవిలాగా కావ్యనిర్మాణం చేయలేక పోవటంతో ఆ శక్తి వారిలో అంతలోనే ముగుస్తుంది. కవిలో

అది కావ్య నిర్మాణ రూపంలో సఫలత పొందుతుంది. ఈ సాఫల్యం చెందిన ప్రతిభనే కావ్యహేతువులలో ఒకటిగా పరిగణించడం సమంజసం.

దీని వలన ప్రతిభ రెండు ముఖాలని ఒకదానితో దర్శనం, రెండవదానితో ప్రదర్శనం జరుగుతుందని తాత్పర్యం. ఈ అర్థాన్నే రాజశేఖరుడు తన కావ్య మీమాంసలో శక్తి భావయిత్రి, కారయిత్రి అని రెండు విధాలని నిర్ధారించాడు. కవిచే భావింపచేసేది భావయిత్రి. అతనిచే కావ్యాన్ని రచింపచేసేది కారయిత్రి. ఉభయాత్మకమైన ఈ శక్తే కావ్యహేతువులతో ప్రథమగణ్యమైంది. ఈ రెండు శక్తులు సాధారణంగా ఒకే సమయంలో వ్యవహరించబడవు. కావ్య నిర్మాణ వ్యాపారంలో వీటి మధ్య కొంత వ్యవధానముంటుంది. ఒక్కొక్కసారి చూడడంతోటే భావావిష్టుడైన కవి ఎటువంటి వ్యవధానం లేకుండా తన ఆవేశాన్ని వాగ్రూపంలో వెలువరిస్తాడు."మనిషాద ప్రతిష్ఠాంత్వ" అని వాల్మీకి పలికిన శాపవాక్యం అటువంటిదే. భావావేశం అధికమైనపుడు ఇటువంటి ఒకటి రెండు శ్లోకాలు / పద్యాలు ఏ కవి నోటి నుంచైనా వెలువడతాయి. కానీ గ్రంథం అనిపించుకోదగిన ఒక చిన్న కావ్యాన్నిగానీ, పెద్ద కావ్యాన్నిగానీ రచించాలంచే కొంత కాలవ్యవధి ఆవశ్యకం. మొదట కలిగిన ఆవేశం యొక్క తీవ్రత శ్రమించి, దాని పునఃస్మరణ సమయంలో నిజమైన కావ్య నిర్మాణం జరుగుతుంది. ఈ అర్థాన్నే వర్డ్స్ వర్త్ “Emotion Recollected in tranquility” అని స్వానుభవం చెప్పాడు. మొదటి భావావేశానికి తర్వాతి పునఃస్మరణకు మధ్యకాలంలో అంటే భావయిత్రి వ్యాపారానికి కారయిత్రి వ్యాపారానికి మధ్యకాలంలో కావ్యరూపం దాల్చవలసిన ఆ భావ రామణీయకం. కవి మనసు నుంచి ఎగిరిపోయే దురవస్థ కలగచవచ్చు. అలాంటి దుస్థితి కలుగకుండా కవి అయినవాడు దానిని మనః పంజరస్థం చేసి పోషించాలి.

అదే కవి చేసే వస్తుమననం. ఈ మననాన్నే “సమాధి” అని రాజశేఖరుడు పేర్కొన్నాడు. ఈ సమాధిలో మనస్సుకు ఏకాగ్రత కలిగి వర్ణనీయమైన వస్తువు చక్కగా భాసిస్తుంది. కావ్యం పెద్దదైతే ఆ వ్యవధానం ఎక్కువవుతుంది. ఆ చిత్తావస్థలో కవి లోకయాత్ర నడుపుతున్నా అతడి ఆత్మ మాత్రం అతడు సృష్టించే కావ్య ప్రపంచంలోనే తిరుగుతుంది.

ఏదైనా కావ్యం మనకు రసానందంగాని, వర్ణ్యవస్తు దర్శనంగాని కలిగించకపోతే ఆ లోపానికి రెండు కారణాలు చెప్పవచ్చు. ఒకటి – కవికి చక్కటి భావావిష్టత లేకపోవటం, ఆ విష్టత వున్నా అది మనకు స్ఫురించే విధంగా రసవంతంగా రచించే నైపుణ్యం అతడికి లేకపోవటం. నిపుణత్వం కలవాడై, లబ్ధ ప్రతిష్ఠుడైనా కావ్యం బాగలేకపోతే కారణం సమాధిలోపం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. సమాధిలోపం వలన క్షీణించిన శక్తితో చేసిన రచన క్షీణగుణమే కలదగుటలో సందేహం లేదు.మహాకవులు తమ గ్రంథ రచన వేళ పూనే దీక్షకు, నిష్ఠకు ఈ సమాధి అనే అర్థం.

క్లైవ్ బెల్ అనే విమర్శకుడు ఈ అర్థాన్నే ఇలా చెప్పాడు.

“Between the moment of inspiration and the finished work of art, there is room for many a slip feeble or defective emotion is at best only one explanation of an unsatisfactory form. But we cannot be sure that because the forms are wrong and the state of mind of the artist in the

begining is also wrong. Right forms imply right feelings, but wrong forms do not necessarily imply wrong feelings. The letter may be due to the lack of concentrating his energies".

కవికి భావావిష్టత కలిగింది మొదలు కావ్య నిర్మాణం పూర్తయ్యేలోపు ఎన్నో భంగాలు కలిగే అవకాశముంది. కావ్య రసహీనతకు నీరసమైనది కానీ, దోషభూయిష్టమైనదిగానీ కవి యొక్క భావనయే కారణమని చెపుతాం. కాని కావ్య నిర్మాణం భాగలేకపోవటం, ఆదిలో కవి చిత్తస్థితి బాగుండక పోవటం ఒకటే కారణంకాదు. రసవంతమైన కావ్యం కవి భావుకత్వానికి నిదర్శనం. కానీ రసహీనమైన కావ్యం విధిగా అతడి భావుకతాలోపానికి నిదర్శనం కాదు. ఈ రెండవది అతడి సమాధిలోపం వలన కలగవచ్చు.

భావుకత్వమంటే ఏంటి? మానవుడి అంతఃకరణలో మూర్తమైన హృదయకోశమొకటి, అమూర్తమైన మనఃకోశమొకటి అతడి కవితా ప్రవృత్తికి ప్రథమాధారభూతాలు. ఈ రెండింటిలో హృదయం వేదనకు (Feeling) స్థానం. అతడికి సంతోషం కాని దుఃఖం కాని కలిగితే దాని విక్రియకు మొదట లోనయ్యేది హృదయకోశం. కవి అయినవాడు పదార్ధ రామణీయకాన్ని దర్శించినంతనే ఆ సౌందర్యదర్శన జన్యమైన విక్రియ హృదయాన్ని స్పందింపచేస్తుంది. ఆ స్పందనలకు అతడు ఆనందంతో ఆవేశం పొందుతాడు. ఈ ఆవేశాన్ని భావమని, భావావేశమని (Emotion) అంటారు. ఈ భావానికి సహచరి అయినది భావన (Imagination). దాని క్షేత్రం మనస్సు. దీని ప్రథమధర్మం అప్రత్యక్ష వస్తువులను కూడా సాక్షాత్కరింపచేయటం. అలాంటి మూర్తి సాక్షాత్కారమే కాక, అది ప్రాణవంతమైతే ఆ మూర్తి యొక్క నానావిధ చిత్తవృత్తులను కూడా చూడగలగటం అయితే హృదయ ధర్మాన్ని, మనోధర్మాన్ని వేరు చేసి చెప్పటం సాధ్యం కాని పని కాబట్టి మన పూర్వులు ఈ రెండు వ్యాపారాలకు 'భావించుట అనే ధాతువునే ప్రయోగిస్తున్నారు. కనుక భావించుటనగా హృదయంలో భావావేశం పొందుట మనస్సులో వస్తువు బహిరంతర రూపదర్శనం చేయుటని తాత్పర్యం, సౌలభ్యం కోసం హృదయ వ్యాపారానికి భావించుటని, మనోవ్యాపారానికి భావన చేయుటని రెండు పదాలని వాడుకోవటం మంచిదే. మొత్తం మీద ఈ రెండు ధర్మాలు కలిసి భావుకత్వమవుతుంది. ఆ శక్తి కలవాడు భావుకుడు. ఈ భావుకత్వాన్నే మన శాస్త్రాలు శక్తి అని ప్రతిభ అని పేర్కొన్నాయి.

### 3.1.2 వ్యుత్పత్తి :

కావ్య హేతువులతో రెండవది వ్యుత్పత్తి. దీనినే పాండిత్యమని వ్యవహరిస్తారు. కవిత్వం శబ్ద చిత్ర నిర్మాణాత్మకమైన కళ గనుక శాబ్దికమైన పాండిత్యాన్ని వ్యుత్పత్తిలో ప్రధానాంశంగా పరిగణిస్తున్నారు. కవికి పుష్కలమైన శబ్ద సామగ్రి సంపాదన, ఛందోవ్యాకరణాలంకార శాస్త్రాల సాంకేతిక పరిజ్ఞానం అవసరమనటం ఎంతైనా సత్యం. హృదయంలో భావం ఉప్పొంగుతున్నా దాన్ని వ్యక్తం చేయగల ఉచిత శబ్ద పరిజ్ఞానం లేని కవులెందరో ఉన్నారు. అలాగే చ్యుత సంస్కార దోషంగా పరిగణించబడే ఛందోవ్యాకరణాది దోషాలు చేసేవారు ఉన్నారు. అటువంటి లోపాలు, దోషాలు దొర్లకుండటానికి కవికి పాండిత్య సంపాదన ఆవశ్యకం. అలాంటి సంపాదన ఆవశ్యకమే కానీ అది మాత్రమే వ్యుత్పత్తి కాదు. ఈ శాస్త్ర పరిజ్ఞానంతో పాటు లోకవృత్త పరిజ్ఞానం, ధర్మాధర్మ సత్యాసత్య వివేచన, ఉచితానుచిత జ్ఞానం సర్వప్రాణి సానుభూతి మొదలైన చిత్త సంస్కారమంతా వ్యుత్పత్తిగానే భావించబడుతుంది. అది అమూల్యమైన బుద్ధి సంపన్నత భావించుట, భావన చేయుట అనే వ్యాపారాలు కవితా నిర్మాణానికి ఏ విధంగా ప్రాథమిక ధర్మాలో ఈ సంస్కృతి ఆ ప్రాథమిక ధర్మాలకు పరిపుష్టిని కలిగించే మరొక ఉత్తమధర్మం. భావావేశం, భావన లేనివాడు కవి

కాజాలని విధంగానే చిత్త సంస్కారం లేనివాడు ఉత్తమకవి కాజాలడు. ఉత్తమకవి కాదలచిన కవి ప్రతిభాసంపన్నతతోపాటు పాండిత్య సహితమైన చిత్త సంస్కారాన్ని అలవరచుకోవాలి. ఈ కళకు సజాతీయాలైన ఇతర కళల అనుభవ పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుంది. సంగీత కళానుభవంగల కవి తన పద్యరచనలో శ్రావ్యతను సులభంగా సాధించగలడు. రామరాజ భూషణుడు సంగీతకళా రహస్యనిధైన సాహిత్యమూర్తి కనుకనే అతడి పద్యాలు కీర్తనలలాగా శ్రావ్యతామయాలై వుంటాయి. పాత్రను ధరించి రంగస్థలంలో నటించగల కవి నాటక రచనను అతి నిపుణంగా నిర్వహించగలడు. చిత్రలేఖకుడు కవి అయితే అతడి రూపచిత్రణ అనన్యంగా ఉంటుంది. ఈ సందర్భంలో తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోని అమలోదాత్త మనీషనే నుభయ కావ్య ప్రౌఢి ఁ బాటించు శిల్పమునన్ బారగుఁ డన్ గళావిదుఁడ అనే వాక్యం గమనించాలి.

సంస్కృతాంధ్ర ఉభయకావ్యశిల్ప ప్రౌఢి లో పారంగతుడేగాక బహుకళావిదుడని ఆ కావ్యశిల్ప పారంగతత్వం అమలమై, ఉదాత్తమైన బుద్ధిసహితమట. శిల్పమునపారం ముట్టుటకు చిత్తసంస్కారమనే అమలోదాత్త మనీష ఎంత ఆవశ్యకమో అన్యకళావేతృత్వం అంతే ఆవశ్యకమని ఈ వాక్యం అర్థం.

ఈ సజాతీయ కళాపరిజ్ఞానం కూడా వ్యుత్పత్తిలో భాగమే. తన కళలో ఉన్నంత పరిజ్ఞానం లేకపోయినా కనీసం కొంచెమైనా ఇతర కళలలో ప్రావీణ్యం ఉండటం కవికెంతో మంచిది. ప్రామాణికులైన విమర్శకులీ సిద్ధాంతాన్ని శిరసావహించారు, తిరస్కరించలేదు. " Some general knowledge of all the Arts is the soil in which particular knowledge in any one of them should be planted, if it is to flourish and bear fruit", Good heart Rendell.

(ఏ కళ అయినా వికాసం పొంది ఫలించాలంటే, దానిని అన్యకళా సామాన్యం పరిజ్ఞానమనే క్షేత్రంలో నాటాలి)

### 3.1.3 అభ్యాసం :

కావ్యహేతువులలో మూడవది అభ్యాసం, సంస్కారం సహజ ప్రజ్ఞకు గంభీరత చేకూర్చిన విధంగా అభ్యాసం పద్యరచన మెరుగుపడటానికి కారణమవుతుంది. ఉత్తమ కావ్యరచనా పరిణతికి ఇది మొదటి రెంటితో సమ ప్రాధాన్యం గల సాధనమే. అభ్యాసం వల్ల శైలి వన్నె దేరటమే కాక ప్రజ్ఞకు దార్ఢ్యం కలుగుతుంది. కనుక ఈ సాధన వల్ల కేవల పద్య రచనా పరిణతియే కాక ప్రజ్ఞా నిశితత్వం కూడా కలుగుతుందని చెప్పవచ్చు. రచన మాట ఎలా ఉన్నా, అభ్యాసం మానివేస్తే ప్రజ్ఞ శిథిలమవు తుందని మౌల్టన్ చెప్పాడు.

"You can improve the faculty by practice or impair it by negligence"
(ప్రజ్ఞను అభ్యాసంతో పోషించుకోవచ్చు. లేదా ఉపేక్షించి క్షీణింప చేయవచ్చు).

గాయకులు ఏ సభ లేకపోయినా తెల్లవారుజామునే లేచి సాధన చేయటం ఈ ఉద్దేశ్యంతోనే రాజశేఖరుడు "నిరంతర కృత్య వస్తు పరిశీలనమ్" అభ్యాసమని, దాని వలన నిరతిశయమైన నేర్పు కలుగుతుందని వివరించాడు. "ప్రాచీనకవి సంప్రదాయాన్ని గ్రహిస్తూ, పూర్వకావ్యాలను అనుకరించి రచనలు సాగిస్తూ, సమస్యా పూరణాధికాలను కూడా నిర్వహిస్తూ కావ్యకళా కౌశలం కైవసం చేసుకోవచ్చని" రుద్రటుడు నిర్దేశించాడు. ఈ శిక్షా ప్రణాళిక ఎలా వున్నా

నిరంతరం పూర్వకవి కృతాలైన సమకాలికాలైన ఉత్తమ కావ్యాను శీలన చేస్తూ ప్రకృతిని పరిశీలిస్తూ భావావిష్టత కలిగినప్పుడు దానికి రూపకల్పన చేస్తూ భావనకు సారస్వత లోక విహారావకాశం కలిగించుట దండి చెప్పిన 'అమందాభియోగం' గా పరిగణించవచ్చు. అదే నిరంతరాభ్యాసం.

కావ్య నిర్మాణానికి ఈ ప్రజ్ఞా వ్యుత్పత్త్యభ్యాసాలు కారణంగా సమూహం మీద చెప్పబడినా వాటిలో గుణ తారతమ్యం ఉంది. సహజశక్తి కవిత్వానికి మూలకారణం. అది లేనివాడు ఎలాంటి వ్యుత్పన్ను డయినా, ఎంత అభ్యాసం చేసినా, చమత్కారార్థాలతో చక్కని, చిక్కని పద్యాలు రాయగలడేగాని కళాస్రష్ట కాలేడు. వ్యుత్పత్తి జన్యమైన బుద్ధి సంపన్నత ప్రజ్ఞకు సహాయపడినపుడు అతడు ప్రౌఢకావ్య నిర్మాత కాగలడు.

## 3.2 హేతువులలో ఏది గుణోత్తరం ? :

ఈ మూడు హేతువులలో ఏది గుణోత్తరం అని ఆలంకారికులు చర్చించారు. ప్రతిభాసీనుని వ్యుత్పత్తి అభ్యాసాలు నిష్ఫలమని, ప్రతిభా కావ్య రచనకు కారణమని దానికి మిగిలిన రెండు సంస్కారం కలిగిస్తాయని ఆలంకారికులు అనేకమంది చెప్పారు.

" ప్రతిభైవచ కవీనం కార్యకారణకారణమ్
వ్యుత్పత్త్యభ్యాసౌతస్యాఏవ సంస్కార కారకౌ,
నతు కావ్యహేతౌ"

రాజశేఖరుడు ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభే గొప్పదని, ఆ ప్రతిభ వ్యుత్పత్తి హీనతవల్ల కలిగే దోషాలను కప్పివేయగలదని, ఈ మతమే ఆనందవర్ధనాదులకు సమ్మతమని, ప్రతిభ హీనత వల్ల కలిగే దోషాన్ని ఎలాంటి వ్యుత్పత్తి కప్పి పుచ్చలేదని ఖండితంగా వక్కాణించాడు.

"ప్రతిభా వ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసీ– ఇత్యానందం
సాహికవే అవ్యుత్పత్తి కృతం దోషమ శేషమాచ్ఛాయదతి తత్ర అహ"

(ప్రతిభా వ్యుత్పత్తులలో, ప్రతిభే గొప్పది. అది కవి యొక్క అవ్యుత్పత్తి కృతమైన దోషాలన్నిటిని కప్పివేస్తుంది).

"అవ్యుత్పత్తి కృతో దోషః శక్త్యా సంప్రియతే కవేః
యస్త్వ శక్తి కృత స్తస్య ఝడిత్యా వావభాసతే"

అవ్యుత్పత్తి కృతమైన దోషం శక్తివలన కప్పివేయబడుతుంది. ఆశక్తి కృతమైన దోషం వెంటనే బయటపడుతుంది.)

అయినా మంగళుడు అనే వేరే ఆలంకారికుడు ప్రతిభాహీనత వల్ల కలిగే లోపాలను వ్యుత్పత్తి కప్పివేయ గలదని భావించినట్లు అయినా ప్రతిభలేని శబ్దార్థ గుంఫన సహృదయులకు అసహ్యం క లిగిస్తాయని ఆతడే అంగీకరించినట్లు రాజశేఖరుడే ఆ ఆలంకారికుని వాక్యాన్ని ఉదహరించి చూపాడు.

"కవే స్సంద్రియతే శక్తిః వ్యుత్పత్త్యా కావ్య వర్త్మని
వైదగ్ధీ హృత చిత్తానాం హేయన్ శబ్దార్థ గుంఫనా"

(కవి యొక్క శక్తి హీనత, వ్యుత్పత్తిచే కప్పి పుచ్చబడును. కాని, సరసులైన వారి హృదయాలకు, కేవల శబ్దార్థ గుంఫనహేయమే).

ఈ చర్చలో ఈ ఆలంకారికులందరు వ్యుత్పత్తి అనగా శాస్త్ర పాండిత్యమని, శాబ్దిక పరిజ్ఞానమని గ్రహించారేగాని విద్యాపరిశ్రమ జన్యమైన చిత్త సంస్కారమని భావించలేదనుట స్పష్టం, ఆ సంస్కారంలేని కవి ఎంతటి ప్రజ్ఞాశాలి అయినా ఎంతటి వ్యుత్పన్నుడైనా జుగుప్సావహమైన గ్రామ్యతాదోషాలకు అవకాశం కల్పించినవాడు కావచ్చు. పేరు పొందిన పెద్ద పెద్ద కవుల కావ్యాలలో కూడా అక్కడక్కడ అశ్లీల వాక్యాలు, గ్రామ్య భావాలు దొర్లటానికి ఈ సంస్కారరాహిత్యమే కారణం. కనుక సంస్కారయుతమైన ప్రజ్ఞ కావ్యకళకు ప్రథమ కారణం.

ఈ కావ్య హేతువులన్నీ కవిగతాలైన గుణవిశేషాలు. ఇంచుమించు వీటినే కావ్యగతాలైన తత్త్వాలుగా (Elements of Poetry) పాశ్చాత్య విమర్శకులలో ప్రముఖుడైన విన్చెస్టర్ వ్యాకరించి ఒక శాస్త్రీయమైన పద్ధతిని ఏర్పరచెను. మన ఆలంకారికుల వివరణకు ఆతని వివరణకు వాస్తవమైన భేదమేమీ లేదు . కవిగతం కాని గుణం కావ్య గతం కాలేదు. కావ్య గతం కానిది సహృదయగోచరం కాలేదు. కావ్యాలలో సహృదయానికి గోచరించు అంశాలనే విన్చెస్టర్ 'కావ్య తత్త్వాలు' అని ప్రతిపాదించాడు.

చరాచర ప్రకృతి అంతా భిన్నభిన్న నామరూపాలతో కన్పిస్తున్నా తత్త్వదృష్టితో పరిశీలిస్తే అది అంతా పంచభూతాత్మకం అని నిరూపితమైనట్లే. సారస్వతం కావ్య, నాటక, ఆఖ్యాయికాది అనేక మూర్తి భేదాలు ప్రక్రియ భేదాలు కలిగివున్నా చతుర్భూతాత్మకమైన ఒక సామాన్యాంశం కలదని ఒక పండితుడు నిర్ణయించాడు. భావం (Emotion), భావన (Imagination), ఆలోచన (Thought), పదగుంఫన (Form) అనే ఈ నాలుగు అన్ని కావ్యాలలో అంతర్భాగాలుగా ఉండే తత్త్వాలని, ఇవన్నీ కలిసి పాఠకుడికి ఆనందం కలిగిస్తాయని, ఆ ఆనందమే సర్వకావ్య సాధారణంశమ ని చెప్పటమేకాక, ఈ తత్త్వాల ఉత్కృష్టతా నికృష్టతలను అనుసరించే కావ్యం యొక్క, తత్కర్త యొక్క ఉత్తమ, మధ్యమ, అధమ జాతి నిరూపణ చేయవచ్చని అతడి సిద్ధాంతం.

కావ్యం చదివే సమయంలో మనకు కలిగే భావావేశం మొదట కవిహృదయంలో కలిగి, అతడు రచించిన కావ్యానికి సంక్రమించి, దానిని చదివే సమయంలో మన హృదయంలో తిరిగి జనిస్తుంది. అందుకనే కవిలో లేనిది కావ్యంలో, కావ్యంలో లేనిది సహృదయుడిలో పొడమదని చెప్పటం. మహాకవి అయిన కవి విజ్ఞానమయాలైన ఏ పరమార్థాలను తన బుద్ధి విశేషంతో ఆలోచిస్తాడో అది కావ్యంలో వుండి దానిని చదివే సమయంలో మన బుద్ధికి గోచరిస్తాయి. ఈ ఆవేశం, ఈ భావన, ఈ ఆలోచన సముచితమైన, రమ్యమైన పదాల కూర్పుతో రూపొందుటే రచన.

ఈ నాలుగంశాలలో భావం, భావన ప్రతిభకు రెండు ముఖాలని ఆలంకారికులు నిర్దేశించినా, అవి పరస్పరాశ్రయాలుగా వర్తిస్తున్నప్పటికీ అవి భిన్నాలే. ప్రతిభాశాలురైన కవులలో కొందరు రసదీప్తిని కలిగించినంతగా

మూర్తి చిత్రణ చేయలేనివారుగా వుండటం, స్పష్టమైన మూర్తి చిత్రణ చేయగలవారు భావావేశం కలిగించలేనివారుగా ఉంటారు. అలాంటి కవుల ప్రతిభలో ఒక అంశం సమగ్రం కాదని చెప్పాలి.

తన దర్శనాన్ని ప్రదర్శనగా చేయనుంకించిన కవి ఏక్షణాన ఆలోచనా నిమగ్నుడై ఆ ప్రయత్నానికి ఉపక్రమిస్తాడో ఆక్షణం నుండే బుద్ధి సంపద అతడికి ఉపకరించటం మొదలుతుంది. అది మొదలు రచన పూర్తయ్యేవరకు ఈ శేముషీ దేవత అతడి ప్రతిభకు చేదోడుగా సంచరిస్తూనే ఉంటుంది. కావ్యంలో ఔచిత్య పరిపాలన ఈ బుద్ధి వ్యాపారమే. ఔచిత్యం అనేకరకాలు. ఔచిత్యం లేని కావ్యం సంస్కృతి సంపన్నుడైన సహృదయుడి మనస్సుకు అసహ్యం కలిగించే అశ్లీలాదులతో కూడి వుంటుంది.

శాస్త్రాలలో చెప్పిన, చెప్పబడని కావ్యగుణాలన్నీ బుద్ధి గమ్యం (Intellectual), భావ స్ఫోరకం (Emotional), శ్రవఃపేయం (Aesthetic) అనే మూడు వర్గాలకు చెంది ఉంటాయి. ప్రతి కావ్యంలో ఈ మూడు వర్గాల గుణాలు సమ్మిళితమై వుంటాయి. ప్రధానంగా ఒక్కొక్క కవికి ఒక్కొక్క శైలి ఆత్మధర్మమై వుంటుంది. ఇంకొక విశేషం : ఏ రచనలో అర్థం మోయలేని శబ్దభారాన్ని, శబ్దం మోయలేని అర్థభారాన్ని కలిగుండక, అర్థానికి తగిన శబ్ద ప్రయోగం మాత్రమే కలిగి రెండు సరితూగుతుంటాయో అది ఉత్తమ రచనని వాల్టర్ పీటర్ అనే ఒక విమర్శకుడు చెప్పాడు.

"That is the best piece of Art in which the distinction between matter and manner is minimised".

కావ్యం చదివే సమయంలో భావనాత్మకమైన నిర్వృతిని (Imagine true pleasure) కలిగించేది 'భావం' అనే అంశం మాత్రమే.

"న భావహీనోఽ స్తిరసః న భావో రసవర్జితః
పరస్పర కృతాసిద్ధి రసయో రసభావయోః"

(భావంలేని రసంలేదు. రసవర్జితమైన భావంలేదు. ఆరెండు అన్యోన్యాశ్రయాలై సిద్ధి పొందును).

కావ్యంలోని భావంలో ఇంద్రియ సంపర్కంలేని మానసికానందం నిచ్చే గుణం వుంది, దానినే రసంగా పరిణమించే శక్తి అంటారు. ఆధునిక విమర్శకులు కావ్యహేతువుల గురించి తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు.విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణ కల్పవృక్షంలో

"కవి ప్రతిభ లోన నుండును కావ్యగతశ
తాంశముల యందు దొంబదియైన పాళ్ళు"

అని ప్రతిభకే పట్టం కట్టారు.

ఆచార్య యస్వీజోగారావుగారు

"ప్రతిభ యన్నది నిత్యనూత్నం
ప్రతిభ కవితకు ప్రాణసారం
ప్రతిభ కవిత్వమునకు హేతువు
ప్రతిభ కవిత్వమునకు జీవనాడి

మిగిలినవి ఉపస్కారకాలు
ప్రతిభ ప్రకటితమైన చోటను
ప్రాత కొత్తలు లేవు కవితకు"

అని ప్రతిభకే అధిక ప్రాధాన్యతనిచ్చారు.

ఈ విధంగా కావ్య హేతువులను ప్రతిభ, పాండిత్యం, అభ్యాసం అని చెబుతూనే చిత్త సంస్కారం, ఔచిత్యం కూడా వాటిలో భాగమేనని చెప్పారు.

## 3.3 సారాంశం :

కావ్యాన్ని రచించాలి అంటే ఉపకరించే సాధనాసామగ్రినే కావ్య హేతువులు అంటారు. ఇవి శక్తి, వ్యుత్పత్తి, అభ్యాసం. శక్తినే ప్రతిభ అని, వ్యుత్పత్తిని పాండిత్యమని వ్యవహరించారు. ఈ ప్రతిభ, పాండిత్యం, అభ్యాసాలలో ఉత్తమమైనది ప్రతిభే. ప్రతిభ లేకపోతే ఎంత పాండిత్యమున్న, ఎంతగా అభ్యాసం చేసినా కావ్యాన్ని రచించలేరు.

## 3.4 ముఖ్య పదకోశం :

కావ్యహేతువులు, శక్తి, ప్రతిభ, వ్యుత్పత్తి, పాండిత్యం, అభ్యాసం, సమాధి, భావుకత్వం, దర్శనం, ప్రదర్శనం.

## 3.5 స్వీయ మదింపు ప్రశ్నలు :

1. కావ్య హేతువులు గురించి వ్రాయండి.
2. కావ్య హేతువులలో ప్రధానమైనదేదో విశ్లేషించండి.

## 3.6 ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న
2. సాహిత్య సోపానములు – డా. దివాకర్ల వెంకటావధాని.
3. సాహిత్య శిల్ప సమీక్ష – ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

**డా. సిహెచ్ . సుశీలమ్మ.**

# పాఠం – 4
# కావ్య ప్రయోజనాలు

**ఉద్దేశ్యం :**

విద్యార్థికి కావ్య ప్రయోజనాలను తెలియచేయుటం. ప్రాచ్యులు, పాశ్చాత్యులు కావ్య ప్రయోజనం గురించి చెప్పిన అంశాలను విశ్లేషించటం.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

4.1 కావ్య ప్రయోజనం

4.1.1 ప్రాచీన ఆలంకారికులు

4.1.2 తెలుగు కవులు

4.1.3 పాశ్చాత్యులు

4.2 సారాంశం

4.3 ముఖ్య పదకోశం

4.4 స్వీయ మదింపు ప్రశ్నలు

4.5 ఉపయుక్త గ్రంథాలు

## 4.1 కావ్య ప్రయోజనం :

ఎవరు ఏ పని చేసినా ఏదో ఒక ప్రయోజనం లేకుండా చేయరు. "ప్రయోజన మనుద్దిశ్యన మందోపి ప్రవర్తతే" అని పెద్దల మాట ప్రయోజనాన్ని ఉద్దేశింపక మందబుద్ధి కూడా ప్రవర్తించదు అని దీని భావం.

ఎన్నో జన్మల నుంచి చేసిన పుణ్యం వలన సాహిత్యాన్ని ఆస్వాదించాలనే కోరిక కలుగుతుంది. ఎంతటి శాస్త్ర పండితుడైనా చదవదగింది సాహిత్యమే. మానవుడు మానవుడిగా మనుగడ సాగించడానికి ఎక్కువ సహకరించేది సాహిత్యం. సమాజంపై సాహిత్య ప్రభావాన్ని గుర్తించే ఎందరో రాజులు కవులను పోషించారు, కావ్యరచన చేయించారు. జాతిని జాగృతం చేస్తూ సమాజానికి అవసరమైన త్రైకాలిక సత్యప్రబోధం చేస్తూ కవులు కావ్యసృష్టి చేస్తూనే ఉంటారు.

### 4.1.1 ప్రాచీన ఆలంకారికులు :

ప్రాచీనులైన ఆలంకారికులు కావ్యప్రయోజనాలని తెలియజేశారు.

**భామహుడు :**

అలంకారికులలో ప్రాచీనుడైన భామహుడు. తన 'కావ్యాలంకారం' అనే అలంకారశాస్త్రంలో కావ్య ప్రయోజనాలని ఈ విధంగా తెలిపాడు.

"ధర్మార్థ కామ మోక్షేషు వైచక్షణ్యం కలాసు చ
కరోతి కీర్తిం ప్రీతించ సాధు కావ్య నిషేవణమ్"

ధర్మ అర్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో నైపుణ్యం, కీర్తి, ఆనందం ఉత్తమ కావ్యాన్ని సేవించడం వలన కలుగుతాయి. నిషేవణం అంటే సేవించడం. ఆ పదానికి చదవడం, రచించడం అని రెండు అర్థాలు చెప్పుకొని సమన్వయం చేయాలి. ఆ ప్రయోజనం చదవడం అన్నప్పుడు పాఠకుడికి, రచించడం అన్నప్పుడు రచయితకు చెందుతుంది.

ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాల ఆధారంగానే భారతీయ సాహిత్యం సాగుతుంది. కాబట్టి ఏ కావ్యం చూసినా ఏదో ఒక సందర్భంలో ఆ పురుషార్థ పరిజ్ఞానానికి సంబంధించిన విషయాలు చెప్పబడే ఉంటాయి.

ఉదాహరణకు మహాభారతం తీసుకున్నా భారత స్వరూపాన్ని వేదవ్యాసుడు ఇలా వివరించాడు.

" ధర్మే చార్థే చ కామేచ మోక్షేచ పురుషర్షభ
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్"

ధర్మార్థ కామ మోక్షాలలో ఈ భారతంలో నిరూపించబడిందే లోకంలో ఉంటుంది. ఏది భారతంలో నిరూపించబడలేదో అది లోకంలో కూడా ఉండదని భావం.

ఉత్తమ కావ్యాన్ని సేవిస్తే సంగీతం, చిత్రలేఖనం, నాట్యం వంటి కళలలో మంచి ప్రావీణ్యం కలుగుతుందని భామహుడు చెప్పాడు. కవి శాస్త్రాలలో పండితుడు కావటమే కాక కళలలో కూడా మంచి పరిజ్ఞానం కలిగినవాడై ఉంటాడు. వివిధ శాస్త్రాలతో అనేక కళలలో ఇంకా విభిన్న విషయాలలో నిష్ణాతుడైతేగాని మహాకవి కావ్యరచన ప్రారంభించడు. అందుకే కవి తన రచనలలో సంగీతానికి, నాట్యానికి ఇతర కళలకి సంబంధించిన విషయాలని సందర్భానుసారంగా అక్కడక్కడ చెబుతుంటాడు. ఆ కళలలోని మెళకువలని ప్రదర్శిస్తాడు. కనుక అటువంటి కావ్యాన్ని చదివిన వారికి కళా పరిజ్ఞానం లభించక మానదు.

యశస్సు, ఆనందం అనేవి కూడా సత్కావ్య సేవ వల్ల లభించే ప్రయోజనాలని భామహుడు చెప్పాడు. సత్కావ్య రచన వల్ల కీర్తి లభించటం సహజమే. కాబట్టి వాల్మీకి, కాళిదాసు, నన్నయ, శ్రీనాథుడు, పెద్దన వంటి నాటి కవులు విశ్వనాథ, జాషువా, కరుణశ్రీ వంటి ఆధునిక కవులు సాహిత్యలోకంలో సజీవంగా ఉన్నారు. మంచి కావ్యాన్ని రచించి కవి కీర్తిని పొందితే అటువంటి కావ్యాలను రచింపజేసి రాజులు , కవి పోషకులు కీర్తి గడించారు. అటువంటి సత్కావ్యాన్ని చదివిన పాఠకుడు కీర్తి పొందుతాడు.

**మమ్మటుడు :**

కావ్య ప్రకాశం అనే తన అలంకార గ్రంథంలో మమ్మటుడు కావ్యప్రయోజ నాలని కొంచెం విపులంగా తెలిపాడు.

"కావ్యం యశసే ఒ ర్థకృతే వ్యవహారవిదే శివేత రక్షతయే
సద్యః పర నిర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే"

కీర్తి, సంపద, వ్యవహారజ్ఞానం, అమంగళక్షతి, వెంటనే ఉత్కృష్టమైన ఆనందం, కాంతా సమ్మితంగా ధర్మోపదేశం అనేవి కావ్యప్రయోజనాలని భావం.

కావ్యం కీర్తినిస్తుందనేది భామహుడు చెప్పినదే. మమ్మటుడు సత్కావ్యం అర్థాన్ని ఇప్పిస్తుందని చెప్పాడు. కావ్యం ఐశ్వర్యం కలిగిస్తుందని దీనర్థం. కావ్యరచన చేసి రాజుల నుంచి సొమ్ములు, వాహనాలు, అగ్రహారాలు స్వీకరించిన కవులెందరో ఉన్నారు. నేటి రచయితలు తమ రచనలు ముద్రింపజేసి ధనాన్ని ఆర్జిస్తున్న విషయం తెలిసిన దే. కాబట్టి సత్కావ్యం ఐశ్వర్యప్రదం అనడం సముచితమే.

మమ్మటుడు కావ్యం వ్యవహారజ్ఞానాన్ని కలిగిస్తుందని సూచించాడు. కవులు బహు లోకజ్ఞులు కనుక తమ కావ్యంలో అనేక సన్నివేశాలు చిత్రిస్తూ లోకపు తీరుతెన్నులు విశదపరుస్తారు.రాజుతో, సేవకుడితో, పండితుడితో, పామరుడితో, నిగర్వితో,అహంకారితోఇంకా అనేకమందితో ఎలా వ్యవహరించాలో కావ్యం ఉపదేశిస్తుంది. ఈ వ్యవహారజ్ఞానం పాఠకుడికి లభిస్తుంది.

సత్కావ్యం వలన శివేతరక్షతి అవుతుందని మమ్మటుడు తెలియజేశాడు. అమంగళం తొలగుతుందని అర్థం. కుష్టురోగ పీడితుడైన మయూరుడు సూర్యశతకాన్ని రచించి రోగవిముక్తిని, రమణీయమైన శరీరాన్ని పొందాడని ప్రసిద్ధి. రామాయణ, భారత, భాగవత పఠనం, శ్రవణం వలన అనేక అనర్థాలు తొలగుతాయని, ఇప్పటికీ జనులు విశ్వసిస్తారు. సత్కావ్యాన్ని రచించటం వలన కవికీ, చదవటం వలన పాఠకుడికి అశుభ నివారణ జరుగుతుంది.

మమ్మటుడు చెప్పిన మరో ప్రయోజనం సద్యఃపరనిర్వృతి, పరనిర్వృతి అంటే పరమానందం. ఇది ఎక్కువగా పాఠకుడికి సంబంధించినది. కావ్యంలోని రసాస్వాదన వలన కలిగే ఆనందం,కావ్యాన్ని చదవటం వలన పాఠకుడు విగళిత వేద్యాంతరమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. కావ్యంలో సందర్భానుసారంగా, సన్నివేశానుగుణంగా పోషించబడిన రసాన్ని ఆస్వాదిస్తూ పాఠకుడు తెలుసుకోవలసిన వేరొక స్థితి లేనివాడై ఆ పరమానందాన్ని అనుభూతి చెందుతాడు. ఆ ఆనందం బ్రహ్మానందానికి కొంచెం తక్కువయినది.సబ్రహ్మచారి అయినది. ఇది కావ్య ప్రయోజనాలలో అతిముఖ్యమైనది. దీనినే భామహుడు ప్రీతి అన్నాడు.

మమ్మటుడు చెప్పిన చివరి ప్రయోజనం కాంతా సమ్మితంగా లోకానికి ఉపదేశించడం ఉత్తమ కావ్యం సమాజానికి ధర్మాన్ని కాంతవలె ఉపదేశిస్తుందని భావం. కాంత తన హావభావ ప్రకటనలతో నాయకుడిని ముగ్ధుడిని చేసి చెప్పవలసిన విషయాన్ని చమత్కారంగా చెబుతుంది. దాన్ని కాంతా సమ్మితం అంటారు.

అందుకే నరసభూపాలీయంలో భట్టుమూర్తి ఈ విధంగా చెప్పాడు.

"వేదంబుల్ నృపశాసనంబులు సుహృద్విజ్ఞాపనంబుల్ పురా
ణాది గ్రంధములంగనాజన విలాసాలాపలీలా సమ
ప్రాదుర్భావములౌర కావ్యములు కర్తవ్యోపదేశక్రియా
వాద ప్రక్రియనెన్నఁ గావ్య మహిమల్ వర్ణింపగా శక్యమే"

వేదాలు ధర్మాన్ని ప్రభుశాసనంగా ఉపదేశిస్తాయని, పురాణాలు మిత్రుడి వలె ఉపదేశిస్తాయని, కావ్యాలు కాంతా సమ్మితంగా పాఠక లోకానికి ఉపదేశిస్తాయని పెద్దలు చెప్పినదే. కాంతా సమ్మితంగా ఉపదేశించడం అంటే వ్యంగ్య వైభవంగా నిరూపించడం అని ఆలంకారికుల అభిప్రాయం. కావ్యంలో ధర్మోపదేశం వాచ్యంగా ఉండరాదని వ్యంగ్యంగా పోషించబడాలని ఆలంకారికుల సూచన.

కావ్య ప్రయోజనాన్ని గురించి భామహుడు, మమ్మటుడు చెప్పిన అభిప్రాయాలు దాదాపు రెండూ ఒకటిగానే కనిపిస్తాయి. కావ్య ప్రయోజనాలు ఎన్నో చెప్పబడినప్పటికీ అందులో ముఖ్యమైనవి రెండు. మొదటిది ఆనందాన్ని కల్గించడం, రెండవది ధర్మాన్ని ఉపదేశించడం. ఈ రెండిటిలో కూడా ఆనందాన్ని అనుభవింప చేయటమే ప్రధానం అనే విధంగా అనేక మంది ఆలంకారికులు ఆనందానికే పెద్ద పీట వేశారు. మమ్మటుడు సద్యః పరనిర్వృతి అనేచోట వివరిస్తూ “సకల ప్రయోజన మౌళిభూతమ్” అని పేర్కొన్నాడు. అభినవగుప్తుడు “చతుర్వర్గ వ్యుత్పత్తరసి ఆనందమైన పార్యంతికం ఫలమ్” అన్నాడు. పురుషార్థ పరిజ్ఞానాన్ని కల్గించడం కంటే ఆనందమే అత్యుత్తమ ఫలం అని స్పష్ట పరిచారు.

కావ్యం ధర్మోపదేశం చేయాలా వద్దా అనే విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. భారతీయ సాహిత్యంలో ఉపదేశానికి ప్రాధాన్యం లేకపోలేదు. సమాజాన్ని మంచి మార్గంలో నడపటానికి సత్కావ్య రచన సాధనమవుతుంది. కళ కళ కోసమే అనేది పాశ్చాత్యుల వాదమే కానీ భారతీయుల వాదన కాదు. ధర్మోపదేశం చేసినా చేయకపోయినా అధర్మ ప్రబోధం మాత్రం చేయకూడదు. ఔచిత్యం మరచి రచింపబడిన అహల్యా సంక్రదనం, తారాశశాంకం వంటి కావ్యాలు దుర్నీతి బోధకాలు కాబట్టి సమాజాన్ని అపమార్గంలో నడిపించే ప్రమాదం లేకపోలేదు. సాహిత్యం అంత ప్రభావితం చేస్తుంది కాబట్టి ఆ సాహిత్యాన్నే సృష్టించే కవికి సమాజంలో అంత ప్రాధాన్యత ఉండాలి. అందుకే కావ్యానికి, కావ్యకర్తకుగల ఎనలేని గౌరవాన్ని జగన్నాథ పండిత రాయలు ఇలా చెప్పారు.

“వ్యాసతు సతుగౌతమతు వ్యాకేంద్రతు యస్య నాస్తి సాహిత్యం
తం ప్రతి సంప్రతి కంప్రతి శిరోమమ తిరశ్చన పురశ్చన”

సాహితీవ్రతుడు కానివాడు వ్యాసుడు కానిమ్ము, గౌతముడుకానిమ్ము, పతంజలి కానిమ్ము, వారానికి నా శిరస్సు తిరస్కారం కానీ పురస్కారం కానీ చూపక ఉదాసీనతనే ప్రకటిస్తుందని దీనర్థం.

అభినవ గుప్తుడు పురాణాల్లో కావలసినంత ధర్మోపదేశం ఉంది కదా, దానికోసం కావ్యం ఎందుకు చదవాలంటాడు.

"చతుర్వర్గ వ్యుత్పత్తే రపిచ ఆనంద
ఏవ పార్యంతికం ఫలం" అని అన్నాడు.

**ఆనంద వర్ధనుడు :**

" సహృదయ హృదయాహ్లాది శబ్దార్థమయత్వమేవ కావ్యలక్షణమ్" అని అన్నాడు.

**భరతుడు :**

నాట్యం వినోదంగా, నిరాశకు జనకంగా ఉంటుందని నాట్యశాస్త్రంలో చెప్పాడు. ఇది నాట్యానికే కాక అన్ని కళలకు వర్తింప చేసుకోవచ్చు.

"దుఃఖార్తా నాం శ్రమార్తానాం శోకార్తా నాం తపస్వి నామ్
విశ్రామ జననం లోకే నాట్యమే తత్ భవిష్యతి"

అని మరోచోట భరతుడు చెప్పాడు.

**హేమచంద్రుడు :**

"కావ్య మానందాయ యశసేకాంతాతుల్యతయోపదేశాయ చ"
అని ఆనందానికీ, ఉపదేశానికి ప్రాధాన్యత నిచ్చాడు.

## 4.1.2 తెలుగు కవులు :

సంస్కృతాలంకారికుల అభిమతాలివైతే ఆంధ్రశబ్ద చింతామణికర్త "విశ్వశ్రేయః కావ్యమ్" అని అన్నాడు. అంటే కావ్యం ఉపదేశార్థంగానే ఉండాలనే అభిప్రాయాన్ని వ్యక్తీకరించాడు. సమాజ శ్రేయస్సే కావ్య ప్రయోజనం అనే అభిప్రాయాన్ని నన్నయ, పోతన కూడా వ్యక్తీకరించారని ఈ క్రింద వారు చెప్పిన పద్యాలు చూస్తే అర్థమవుతుంది.

నన్నయ – మహాభారతం :

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింపనా
నారుచిరార్థ సూక్తి నిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్"

**పోతన – భాగవతం :**

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్"

నన్నయ, పోతనలు ఇద్దరు కావ్య ప్రయోజనం "జగద్ధితం" అని వక్కాణించారు. అంటే కావ్యంలోఉపదేశం ముఖ్యంగా ఉండాలి అని చెప్పారు.

**తిక్కన – మహా భారతం :**

తిక్కన ఉపదేశానికన్నా ఆనందానికి అధిక ప్రాధాన్యత నిచ్చాడేమో అనే విధంగా "కావున భారతామృతము కర్ణపుటంబుల నార గ్రోలి యాంధ్రావళి మోదముం బొరయునట్లుగ" అన్నాడు.

**ఆచార్య యస్వీ జోగారావు – ప్రసన్న కుసుమాయుధం :**

"కావ్యకళా రసజ్ఞత వికాసము బొందెన యేని మానవుం
డవ్యయమైన హ్లాద మెదసాక్షిగఁ బొందుట మాత్రగాదుస
ర్వ్యసనాత్మ నాశనము బాయును దైవము తోడి భవ్యబాం
ధవ్య మెసంగి యొక దైవ మగున్ దన తోడి వారికిన్ "

కావ్యకళలో రసజ్ఞత వికాసం పొందితే మానవుడు హృదయమే సాక్షిగా అవ్యయమైన ఆనందాన్ని పొందటమే కాదు, అన్ని వ్యసనాలు నాశనమవుతాయి, దేవుడితోనే బంధం ఏర్పడి తానూ ఒక దైవం లాగా అవుతాడని జోగాగావుగారు చెప్పారు.

"ఉత్తమహ్లాదముపదేశ మొసగజాలు
కావ్యము ప్రియురాలగు భిషగ్వర్యు బోలు
వ్యాధి యున్న లేకున్న నావామి నుండి
అధర సుధలు వలయునొ ఔషధమె వలెన్"

అని చెప్పారు.

కావ్యానికి, కావ్యకర్తకి, సహృదయ పాఠకుడికి మన భారతీయులు అంత ప్రాధాన్యత నిచ్చారు.

### 4.1.3 పాశ్చాత్యులు :

భారతీయుల లాగానే పాశ్చాత్యులు కూడా ఆనందం, ఉపదేశం అనే చెప్పారు.

**లోవెల్ :**

ఏవిధమైన తత్త్వబోధనలేని కావ్యం నాకు ఉపాదేయం కాదని ఉపదేశానికే అధిక ప్రాధాన్యతనిచ్చాడు.

**జాన్ డ్రైడన్ :**

ఏకైక ప్రయోజనం కాకున్నా కావ్యానికి ముఖ్య ప్రయోజనం ఆనందం. ఉపదేశాన్ని ఆనుషంగికంగా మాత్రమే అంగీకరించవచ్చని ఆనందానికే ప్రాధాన్యతనిచ్చారు.

**ఎమర్సన్ :**

మనకు కవుల కావ్యాలు కల్గించే చిత్త సంస్కారాన్ని బట్టి వాళ్ళ కావ్యాల స్థానం నిర్ణయించబడుతుందని చెప్పి ఉపదేశమే ప్రధానమని చెప్పాడు.

**కెప్టెల్ వెట్రా :**

కేవల ఆనందమే కావ్య ప్రయోజనం.

**స్కాలిజర్ :**

ఆనందకరమైన బోధయే కావ్య ప్రయోజనం.

**సర్ ఫిలిఫ్ సిడ్నీ :**

ఉపదేశించటం, ఆనంద పరచటం కావ్యప్రయోజనం.

**జాన్సన్ :**

ఆహ్లాదకరంగా ఉపయోగించటం కావ్య ప్రయోజనం, కవిత్వం ఆనందసత్యాలకు ఐక్యతను సంఘటించే కళ.

**షెల్లీ :**

ఆనందం కావ్యాన్ని ఎప్పుడూ వెన్నంటి ఉంటుంది.

**హోరేస్ :**

విజ్ఞాన వినోదాల సమ్మేళనం కావ్య ప్రయోజనం.

ఈ విధంగా ప్రాచ్యపాశ్చాత్యులు కావ్యానికి ఆనందం ముఖ్యమని కొందరు, ఉపదేశం ముఖ్యమని మరికొందరు అభిప్రాయపడ్డారు. కాల స్వభావం అనుసరించి కావ్య ప్రయోజనంలోని ప్రాధాన్యత తారుమారవు తుంది. జాతి స్వధర్మభ్రష్టమై పతనాన్ముఖమయ్యేటప్పుడు కవులు ధర్మాన్ని బోధించి జాతిని ఉద్ధరించవలసిన అవసరం ఉంటుంది. కాబట్టి ఆ కాలానుగుణంగా కావ్యానికి ప్రయోజనం ఉపదేశమే అవుతుంది. ఆనందం ఆనుషంగికం అవుతుంది. నన్నయ కాలంలో వేదమత పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాబట్టి తన రచన జగద్ధితం కోసం చేశానన్నాడు. అదే ప్రబంధాల కాలంలో జాతి భోగభాగ్యాలతో తులతూగుతుంది. కాబట్టి అప్పటి కావ్యాలలో ఆనందమే ప్రధానంగా ఉండి అదే ప్రయోజనంగా కనిపిస్తుంది. ఇప్పుడైతే కళ కళ కోసమే అనే వాదన బయలుదేరింది. దానిని వ్యతిరేకించేవారు కవిత్వం అభ్యుదయ హేతువని అది విశ్వశ్రేయ సాధనమని వాదిస్తారు.

దేశకాలాలతో సంబంధం లేకుండా కావ్య ప్రయోజనం నిర్ణయించాలంటే ఆనందం ప్రధాన ప్రయోజనమని, ఉపదేశం తరువాతి ప్రయోజనమని చెప్పాలి. వేదశాస్త్రాల కన్నా కావ్యం విలక్షణంగా ఉండటానికి అందరినీ ఆకర్షించటానికీ, అలరించటానికి కారణం ఆనందమే. కాబట్టి కావ్యంలో ఆనందం లోపిస్తే అది కావ్యము కాదు కాబట్టి ఆనందమే ప్రధాన ప్రయోజనం, ఆనుషంగికంగా ఉపదేశముంటే బంగారానికి పరిమళం జోడైనట్లే.

## 4.2 సారాంశం :

కావ్య రచన వలన కవికి, కావ్య పఠనం వలన పాఠకుడికి ప్రయోజం కలుగుతుంది. కావ్య సేవనం వలన ఆనందం, కీర్తి, అర్థం, ఉపదేశం,వ్యవహార జ్ఞానం లభిస్తాయి. ప్రాచీన ఆలంకారికులు, తెలుగు కవులు, పాశ్చత్యులు అందరు కావ్య ప్రయోజం ఆనందాన్ని కలిగించటం, ఉపదేశాన్ని అందించటం అని చెప్పారు. ఎక్కువమంది ఆనందమే కావ్య ప్రయోజనాలలో ముఖ్యమైనదని తెలిపారు.

## 4.3 ముఖ్య పదకోశం :

యశస్య, కీర్తి, ప్రీతి, మోక్షం, నిషేవణమ్, అమంగళక్షతి, శివేతరక్షతి, సందేశం.

## 4.4 స్వీయ మదింపు ప్రశ్నలు :

1. కావ్య ప్రయోజనాల గురించి భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలనురాయండి.
2. పాశ్చాత్యులు తెలిపిన కావ్య ప్రయోజనాలేంటి ?
3. కావ్య ప్రయోజనాల గురించి రాయండి.

## 4.5 ఉపయుక్త గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న
2. సాహిత్య సోపానములు – డా. దివాకర్ల వెంకటావధాని.
3. సాహిత్య శిల్ప సమీక్ష – ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.

**డా. సిహెచ్. సుశీలమ్మ.**

## పాఠం - 5

# కావ్య భేదములు

పాఠ్యనిర్మాణక్రమం

5.0 లక్ష్యం
5.1 కావ్య భేదములు
5.2 ప్రబంధము
5.3 ఉదాహరణ కావ్యము
5.4 చతుర్విద కవిత్వములు
5.5 ముక్తక కవిత్వము
5.6 ఖండ కావ్యము
5.7 లఘు కృతులు
5.8 బిరుదావళి
5.9 శతకములు
5.10 దండకము
5.11 ఆఖ్యాయిక
5.12 ఉపాఖ్యానము - ఆఖ్యానము
5.13 ఇతిహాసము
5.14 పురాణము
5.15 చాటువులు
5.16 యక్షగానములు
5.17 సమీక్ష
5.18 ప్రశ్నలు
5.19 ఉపయుక్త గ్రంథాలు

## 5.0 లక్ష్యం

రచన సుందరమై, సార్వజనీన ప్రయోజనము కలిగి భావనాత్మకమైన ఆహ్లాదము నిచ్చుచు, కర్త యొక్క ఆత్మీయులును స్ఫురింపచేయు గ్రంథము "కావ్యము". ఆ కావ్యజాలమే సాహిత్యము. సాహిత్యమున భిన్న భిన్న నామములచే పిలవబడు వివిధ కావ్యములు ఇమిడి యుండును. అవన్నియు తత్తత్కావ్య విశేషములుగా లోకమున నెగడుచుండును. ఈ విశేషము లన్నింటిని వర్గీకరించి వాటి వాటి లక్షణములను బట్టి కొన్ని భాగములుగా వేర్పాటు చేయుటకై ఆలంకారికులును, పాశ్చాత్యులును కొన్ని ప్రమాణములను అనుసరించిరి. పాశ్చాత్య విభాగ పద్ధతికిని, మన ఆలంకారిక పద్ధతికిని ఒక్కొక్క యెడ సాదృశ్యమును, ఒక్కొక్క యెడ విభేదమును కానవచ్చుచుండును. ఈ కావ్య భేదాల్ని పరిశీలించడం ఈ పాఠ లక్ష్యం.

## 5.1 కావ్య భేదములు

భారతీయాలంకారికులు ఛందస్సును ప్రమాణముగా గైకొని, దాని భావా భావములను బట్టి కావ్యములను . . . .

"గద్య పద్యోభయ మయం చంపూ రిత్యభా దేయత్"

పద్య, గద్య చంపువులని మూడు విధములుగా విభజించిరి. ప్రదర్శన ప్రమాణమును పురస్కరించుకొని, ప్రదర్శన యోగ్యములైన వాటిని దృశ్య కావ్యములనియు, శ్రవణ యోగ్యములను శ్రవ్య కావ్యములనియు, వేరొక విభాగము చేసిరి. అప్పకవి మొదలగు లాక్షణికులు గీతిని పురస్కరించుకొని, సంగీత కావ్యమనియు, సాహిత్య కావ్య మనియు ఇంకొక విభాగము చేసిరి. ఇదియే పాఠ్య గేయ విభాగము.

పద్య కవిత్వమును మార్గ కవిత్వమనియు, పద కవిత్వమును దేశి కవిత్వమనియు వ్యవహరింతురు. అనగా సంస్కృత పద భూయిష్టమై, సంస్కృత ఛ్ఛంద శాస్త్ర సంగీతములగు వృత్తములు గల రచన మార్గ కవిత. దేశీయములగు మాత్రా ఛ్ఛందస్సు నుండి పుట్టిన జాతి వృత్తమగు రచన దేశి కవిత. ఈ దేశి కవితకు జాను తెనుగు, పద కవిత, గేయ వాఙ్మయము అనియు నామాంతరములు గలవు.

ఆంధ్ర కావ్యములలో నిర్వచనోత్తర రామాయణము తప్ప మిగిలిన కావ్యములన్నియు చంపూ కావ్యములే. వీనికిపుడు "ప్రబంధము" లని వ్యవహారము వచ్చినది. వర్ణనాభూయిష్టమగు ఈ ప్రబంధమును నన్నెచోడుడు "వస్తు కవిత" యనియు, లక్షణ దీపికా కారుడు "విస్తర కవిత" యనియు వ్యవహరించిరి. చంపూ కావ్యములనందు వలెనే ఆంధ్ర ప్రబంధము లందును నొక్కొక్క యాశ్వాసము నందును పెక్కు వృత్తములను కవులు వాడుదురు. వర్ణ్య, వస్తు భేదమును బట్టి గద్య, పద్యాది భేదములను పాటింప వలయునని సరస్వతీ కంఠాభరణ వ్యాఖ్యాతయగు రత్నేశ్వరుడిట్లు తెలుపుచున్నాడు.

"కశ్చి ద్గద్యేన పద్యేన కశ్చిన్మి శ్రేణ శక్య తే
కవియం కశ్చన ద్యాభ్యాం కావ్యఽర్థ కశ్చనత్రిభిః"

"యధాహి అటవీ వర్ణనా దౌ గద్యం ప్రగల్భతే తధాన పద్యం"
యధాచ కావ్య శాస్త్రతా నిర్వహణోచితేఽ ర్ధే పద్యముత్స హటే
న తధా గద్యం" ఇత్యాది పాదోపాత్త బందౌచితీ ద్రష్టవ్యా"

అరణ్యా వర్ణమున గద్యము శోభిల్లు నట్లు పద్యము శోభిల్లదు. కావ్య శాస్త్ర రూపములగు కావ్యములందు పద్యము శోభిల్లునట్లు గద్యము శోభిల్లదు. కథా, ఆఖ్యాయికాదులందు గద్యమే శోభిల్లును. చంపువులందు భయము నుండవచ్చును. దీనినే ధ్వనికారుడు ప్రబంధౌచిత్యములని చెప్పెను. మహా కావ్యమునగానీ, ఖండ కావ్యమునగానీ, ఒక్కడే నాయకుడుండవలెను. అతడు ధీరోదాత్తుడు. శృంగార వీర రసములలో ఒకటి ప్రధానముగా నుండవలెను. నాటకము నందు వలెనే కావ్యమందున నవరసములు ప్రధానముగా నుండవలెను. కావ్యారంభమున ఇష్టదేవతా నమస్కారముగానీ, ఆశీర్వాదముగానీ, వస్తు నిర్దేశము గానీ యుండవలెను. కుకవినింద, సుకవి స్తుతులుండవలెను.

పద్య కావ్యములందు విబద్ధములు, అనిబద్ధములు అని రెండు బేధములు గలవని వామనుడు పేర్కొనెను. సంధి సామ శ్రీయుతమై, ప్రకృష్టమైన బంధము కలిగి విస్తు విలోదాత్తమైన ఇతివృత్తము గల కావ్యమే నిబద్ధ కావ్యము. దానినే సర్గబంధమనియు, మహా కావ్యమనియు దండి పేర్కొనెను. తెలుగున దానినే ప్రబంధమని పిలుచుచున్నారు. సంధిసాయిశ్రీ అనగా, ఒక కావ్యము లోగల పద్యము లన్నింటిని పూలదండ వలె ఏక సూత్రమునకు నిబంధించెడి ఒక కథయు, ఆ కథను అలంకరించెడి వర్ణనలును, దానిని నడిపెడి పాత్రలను, మొదలైన సాధనములతో ఆద్యంతములకు అవిచ్ఛిన్న సంబంధము కలిగించెడి రచన నిబద్ధ కావ్యము. ఇతివృత్తము కానిది, స్వయసమగ్రము, ముక్తకము, కులకము, పంచరత్నములు, నవరత్నములు, నక్షత్రమాలికలు, శతకములు,

ఆధునిక ఖండ కావ్యములు అనిబద్ధ కావ్యములే. ప్రాచీన కాలము నుండి అనేక విధములుగా కావ్య విశేషములు వెలసి యున్నవి. కావ్య విశేషములలో ప్రఖ్యాతములైన వానిని గూర్చి ప్రస్తావింపనగును.

## 5.2 ప్రబంధము

తెలుగు కావ్య భేదములలో ప్రబంధము ప్రముఖమైనది. సప్రసిద్ధమైనది. ప్రబంధమనగా ప్రకృష్టమైన బంధము కలది అని అర్థము చెప్పవచ్చును. అనగా ఆది నుండి అంతము వరకు అంతర్వాహినిగా స్రవించు వస్త్వైక్యము కలది యని వ్యాఖ్యానము చేయవచ్చును. తెలుగులో ప్రబంధమన రూఢార్థమున వర్ణనాత్మకమైన నిబద్ధ కావ్యము. అందు కథకు, పాత్రపోషణకు, భావ సంపదకు సముచిత స్థానమున్నను వర్ణనలన్నింటిని మించి ప్రాధాన్యము వహించును. అష్టాదశ వర్ణనలలో క్వాచిత్కముగా కొన్ని కొరవడినను ప్రబంధమున వర్ణనా బాహుళ్యము అపరిహార్యము. కావ్యాలంకార సంగ్రహమునందు రామరాజభూషణుడు,

పుర, సింధు, నగ, ర్త్విన, శశి
సరసీ, మనమధు, రతిప్రసంగ, విరహముల్,
పరిణయ, తనయోదయ, నయ
విరచన, యాత్రాజి, దౌత్య, విభువర్ణనముల్

పుర, సముద్ర, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరఃక్రీడా, వన క్రీడా, వసంత, రతిప్రసంగా, విరహ, పరిణయ, పుత్రోదయ, నయవిరచన (సంధి విగ్రహాదులు) దండయాత్రా, యుద్ధ, దౌత్య, ప్రభు వర్ణనములు అను అష్టాదశ వర్ణనములు కలది మహాకావ్యమని పేర్కొనెను.

అష్టాదశ వర్ణనలను విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణి యందు ఈ క్రింది విధముగా పేర్కొనినాడు.

"పుర వారాశి మహీధర ర్తు శశిభృత్పూషోద యోద్యానః పు
ష్కర కేళీ మధుపాన మోహన వియోగ క్షేమయాన స్వయం
వర పుత్రోత్సవ మంత్ర దూత్య రణ దోర్వై కాంతి సంకీర్తనా
కర మష్టాదశ వర్ణనాన్వితము తత్కార్యంబు భవ్యంబిలన్"

అప్పకవి 'అప్పకవీయము' నందు, ప్రబంధమున

"పురమును ఋతు షట్కమును బ్రయాణమ్మును
    శైలంబు వేటయు సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును, మంత్రంబు
    ద్యూతంబు పిదప నద్భుత రణంబు
విజయంబు మధ్య పానజ వికారంబును
    వన విహారంబును వారి కేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
    భ్యుదయంబు విప్రలంభోచితంబు

పద్మమిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహృదంబును సుతజననము

నసగ నిరువది రెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయు ప్రబంధంబు శ్రీనివాస"

ఇరువది రెండు వర్ణనలు కూర్చి చెప్పవలెనని పేర్కొనినాడు. అష్టాదశ వర్ణనలనుట సుప్రసిద్ధ సాహిత్య సంప్రదాయమే అయినను ఆయా ప్రబంధము లందు కొన్ని కొన్ని కొరవడు చుండినను మహా కావ్యమే యగును.

అలంకార శేఖర కారుడు కావ్య వర్ణనియములను

వర్ణశ్చ రాజా దేవీచ దేశో(గ్రామః పురీ సరిత్।
సరోஉబ్ధ్యరణ్యో ద్యానాద్రి ప్రయాణ రణవాజినః।
హస్తర్క చంద్రావుతవో వివాహోஉథ స్వయంవరః।
సురా పుష్పాంబు సంభోగః విశ్లేష మృగయాశ్రమాః।
కలాఋతువయస్సంధీ ధాతు వృషాభిసారికాః।

రాజు, రాణి, దేశము, గ్రామము, పురి, నది, సరస్సు, అబ్ధి, అరణ్యము, ఉద్యానము, అద్రి, ప్రయాణము, రణము, గుఱ్ఱములు, ఏనుగులు, సూర్యోదయము, చంద్రోదయము, ఋతువులు, వివాహము, స్వయంవరము, సురాపానము, పుష్పాపచయము, జలకేళీ, సంభోగము, విశ్లేషము (విరహము) మృగము, ఆశ్రమము, కళలు, ఋతువులు యొక్కయు, వయస్సు యొక్కయు, సంధులు, ధాతు, వృక్ష, అభిసారికలు, అను విషయముల వర్ణ్యనీయములని పేర్కొనెను.

కొందరు ఈ వర్ణ్యనీయములను బట్టియో కావ్య వస్తువు నిర్ణీతమగు చున్నదనియు అనగా, మరికొందరు ఇవన్నియు గల కథ కావలయునని చెప్పుదురు. మన కవులు నాటక వస్తువునందు చూపినంత శ్రద్ధను శ్రవ్య కావ్య వస్తువునందు చూపలేదు. భరతుని మతమున 'కావ్యం హి దశ రూపాత్మక వేవ' కావ్యమున దశ రూపాత్మకమే. అందువలన భరతముని రూపక వస్తువును, రూపక రసమును గురించియే కాని, శ్రవ్య కావ్య వస్తువును, శ్రవ్య కావ్య రసమును గూర్చి చర్చించలేదు. 'ఏతచ్ఛ రసాధి లూత్పర్యేణ కావ్య నిబంధనం భరతా దావపి సుప్రసిద్ధమేవ' నని ధ్వన్యాలోకమున ధ్వనికారుడు మాత్రమే ప్రప్రథముగా రూపకమునకవీ వలెనే శ్రవ్య కావ్యమునకును రసమే ప్రధానమనియు, దానివలననే రమణీయత్వము కలుగుననియు నిర్వచించెను. అభినవగుప్త పాదాచార్యులు వారును తమ లోచనమున 'నాట్యాట్ సముదాయ రూపాత్ రసః కావ్యేచ నాట్యాయ మాన ఇవ రసః కావ్యార్థః' అని తెలిపిరి. ప్రబంధమున వస్తువు రసవ్యంజనముగా నుండ వలెననిరి. ప్రబంధమన కావ్యమే.

"ఇతి వృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం" అని భరతముని మతము. రూపకము నందు వలెనే కావ్యము నందును వస్తువు రమణీయముగా, రసోచితముగా నుండవలయును. శ్రవ్య కావ్యమున కార్య వస్తువు రసవ్యంజకము కావలయునన్నచో, ఇతివృత్తమందలి రసవద్ఘట్టములను తీసుకొనియే రచింపవలెను. కావ్యము వస్తువును బట్టి ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రము' అని మూడు విధములు. ప్రఖ్యాత మన పురాణ ప్రసిద్ధము రామాయణాదులు. ఉత్పాద్యమన కేవల కవి కల్పితములు. కళా పూర్ణోదయాదులు. మిశ్రమన కొంత ప్రఖ్యాత వస్తువును, కొంత ఉత్పాద్య వస్తువును మిళితమైనది. మను, వసు, చరిత్రాదులు. వీనిలో నేది రమణీయమని ప్రశ్నించుకొనిన, రామరాజ భూషణుడు వసుచరిత్రలో -

"కేవల కల్పనా కథలు కృతిమ రత్నము, లార్య సత్కథల్
వావిరిఁ బుట్టు రత్నము, లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వ వృత్తములు సానలఁ దీఱిన జాతి రత్నముల్
కావున నిట్టి మిశ్ర కథగా నొవరింపుము నేర్పు పెంపునన్"

దీనిని బట్టి "ఉత్పాద్య వస్తువు కృద్రియ రత్నము, ప్రఖ్యాత వస్తువు గనిలో పుట్టిన రత్నము (అనగా మెఱుగు పెట్టని రత్నము) మిశ్రవస్తువు సానఁ దీఱిన జాతి రత్నము" అని అర్థమగును.

**క్షుద్రప్రబంధములు**

విద్యానాథుడు 'మహాకావ్యము దక్క మిగిలిన వన్నియు క్షుద్రప్రబంధములని' వ్యవహరించెను. వీనికి 'ఉపకావ్యము'లనియు నామాంతరము కలదు. 'ఉపమితం కావ్యేన ఉపకావ్యం' అను వ్యుత్పత్తిని బట్టి కావ్య సదృశము అని యర్థము. మహలి కావ్య, ఖండ కావ్యములు నిబద్ధ కావ్యములు. మిగిలిన అనిబద్ధ కావ్యములన్నియు క్షుద్ర ప్రబంధములు.

## 5.3 ఉదాహరణకావ్యము

తెలుగు సాహిత్యములో ఉదాహరణ వాఙ్మయము ఒక విశిష్టశాఖ. ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితా రీతులలో "ఉదాహరణము" మధుర రీతికి చెందినది. "ఆంధ్ర వాఙ్మయ మంతయు ప్రాయకముగ సంస్కృతానుసరణమేయైనను, అందు కొన్ని స్వతంత్ర రచనలు లేకపోలేదు. ద్విపద, దండకము, శతకము, యక్షగానము, ఉదాహరణము, మున్నగు శాఖలు పేరునకు సంస్కృతమే యైనను, గ్రంథ స్వరూపమునందును, ఛందస్సాహితీ రీతులందును, కవితా విన్యాసము నందును, ఆంధ్రతా ముద్ర కలిగిన స్వతంత్ర రచనలైనవి". శ్రీ నిడదవోలు వేంకటరావు గారి అభిప్రాయము స్వీకరించదగినది. ఆంధ్ర భాషలో నున్న ఏడు విభక్తులలో సంబోధన ప్రథమావిభక్తితో పాటు వివిధ పద్యములు అల్లి, ప్రభువును గూర్చియో, దైవమును గూర్చియో ప్రస్తుతి గల లఘుకృతి ఉదాహరణము.

**ఉదాహరణ కృతుల ప్రధాన లక్షణములు**

1. ఇందు ఒక్కొక్క విభక్తికి ఒక్కొక్క వృత్త పద్యముండును. ఆ వృత్తము శార్దూల, మత్తేభములలో నొకటి కావలెను. పిమ్మట కళిక, ఉత్కళిక, తరువాత సార్వ విభక్తిక పద్యము వుండును. సార్వ విభక్తిక పద్యము సాధారణముగా శార్దూల వృత్తమై యుండును.

2. ఉదాహరణములో విభక్తి ప్రత్యయములన్నియు ప్రయుక్తములు గానవసరము లేదు. ఆ ప్రత్యయములు వృత్తములో నాల్గవ పాదము చివరను, కళికలో ప్రతి పాదము చివరను, ఉత్కళికలో ఎనిమిదవ పాదము చివరను ఉపయుక్తమైన చాలును. ఒక్క చతుర్థీ విభక్తి మాత్రము ఉత్కళికలో ప్రతిపాదమునందును భాసింపవలెను.

3. ఉదాహరణములోని కళికలు, ఉత్కళికలు తాళబద్ధములు. తెలుగులో త్రిపురాంతకోదాహరణము సుప్రసిద్ధము. ఉదాహరణము ఆంధ్రకవితా పరిణామమున అటు రగడకు ఇటు యక్షగానములకు మధ్యస్థమైనది. ఆంధ్ర ఉదాహరణ కార్యములకు అప్పకవీయము నందలి 'కృష్ణోదాహరణమే' ప్రమాణము.

## 5.4 చతుర్విధ కవిత్వములు

ప్రాచీన లాక్షణికులు చతుర్విధ కవిత్వములను పేర్కొనిరి. 'లక్షణదీపిక' యందు ఆశు, మధుర, చిత్ర, విస్తర కవిత్వములని నాలుగు విధములుగా పేర్కొనెను.

1. ఆశు కవిత్వము - ఆశు కవిత్వమున ఏకపాద, త్రిపాద, కఠినప్రాస, విషయ సమస్యా పూర్తులు, వ్యస్తాక్షర, నిషేధాక్షర రచనలు, అష్టావధాన శతావధానములు, ఘటికాశత గ్రంథ కల్పనలు, ఆకాశ పురాణము, మొదలగు తత్కాలోచితమగు అది త్వరితగతిని రచింపబడునది.

2. మధుర కవిత్వము - 'జక్కుల పాట' అని నామాంతము గల యక్షగానము లందలి కవిత్వము మధుర కవిత్వమునకు చెందినది.

3. చిత్ర కవిత్వము - ఒక వృత్తమున మఱొక వృత్తము వచ్చునట్లు చెప్పుటను చిత్ర కవిత్వమందురు. అనగా కంద గర్భ సీసము మొదలగునవి.

4. విస్తర కవిత - విస్తర కవిత్వమన ప్రబంధ కవిత్వము.

ఆధునికలు చతుర్విధ కవితారీతులను ఈ విధముగా విభజించిరి.

1. ఆఖ్యాన రీతి - The Epic Style
2. నాటకాయ రీతి - The Dramatic Style
3. ప్రబంధ రీతి - The Descriptive Style
4. భావ కవితా రీతి - The Lyrical Style

## 5.5 ముక్తక కవిత్వము

ముక్తకమనగా ఒక పద్యము మాత్రమే "ముక్తం అన్యేన నాలింగితం స్వార్థేకన్" క్రియా సమాప్తి కై పద్యాంతరములలో ఎట్టి సంబంధమును లేక రసభావాదులు గల ఏక పద్యము. అమరుకము రచయుక్తకములందు 'అ' కారాది 'హ' కారాంతము లాద్యక్షరములుగా గల పద్య సంగ్రహమునకు 'వ్రజ్య' అని నామము.

స్వయం సంపూర్ణమైన ఒక పద్యములో ఒక గాథ విన్పించవచ్చును. గాథా సప్తశతి ఏడువందల ముక్తకముల ముత్యాహారము.

ఉదా॥ "సరస కవిత యన్న సంగీత కళయన్న
వ్యంగమన్న లలిత హాస్యమన్న
అవని విముఖులున్న అదియే వారికి శిక్ష
వేరు శిక్ష యింక వేయునేల" - (నండూరి రామకృష్ణమాచార్యులు)

## 5.6 ఖండ కావ్యము

"ఖండ కావ్యం భవేత్కావ్య స్యైక దేశాను సారిచ" అని సాహిత్య దర్పణమున ఖండ కావ్యము గురించి వివరింపబడినది. మహాకావ్య లక్షణములలో నేక దేశమును గ్రహించి వ్రాసిన కావ్యము. మహా కావ్య ఖండ కావ్యములకు 'సంఘాతము లేక సంఘాతకము' అనియు నామాంతరము భారత రామాయణ పురాణ ప్రసిద్ధములగు కథలను గ్రహించి, అష్టాదశ వర్ణనలతో పెంపొందించి, తెలుగున ప్రబంధములు ప్రాచీన కవులు రచించినట్లే, ఆధునిక కవులు పురాణ, ప్రబంధములనుండి, చరిత్ర నుండి, సమకాలీన సంఘము నుండి, వస్తువును గ్రహించి కవితలు వ్రాయుచున్నారు. ఇవియే ఖండ కావ్యములు. వీనిలో 'శీర్షిక' కే ప్రధానము గాని పూర్వోత్తర కథలలో సంధానము అవసరము లేదు. క్షణ ప్రబంధ యుగమున వెఱ్ఱి తలలు వేసిన కవిత్వమునకు విరుగుడుగా, ఆధునిక కవులు వస్తువులోను, భావములోను, రసములోను, దేశికవితామయములో నవ్యతను పాటిస్తూ అనేక లఘు కథాకావ్యములు వ్రాసినారు. వీరిలో రాయప్రోలు సుబ్బారావు గారు, జాషువా, వేదుల, జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు, మొదలగు ప్రముఖులు కలరు.

శ్రీకృష్ణ దేవరాయలపై జాషువా గారు వ్రాసిన ఖండ కావ్యములో ఒక పద్యము.

తొల్లి నిన్ను గన్న తుంగభద్రానది
బ్రదికి యున్న దిపుడు పార్థివేంద్ర
నేటి తుంగభద్ర నిన్నెరుంగని యట్లు
నడచుచుండు నంగనాచి వోలె!

ఇట్టి పద్య పరంపరలే ఆ శీర్షికలో ఇందలి వస్త్వైక్య పరిధికి శీర్షికయే కేంద్రబిందువు.

ఖండ కావ్యమున ఇతివృత్తము కవి భావపరంపరయే. ఉదాహరణము - జాషువా గారి ఖండ కావ్య సంపుటి లోని 'శ్మశానవాటి' శీర్షిక పరిశీలింపదగును.

ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పులలోన కరగిపోయె!
ఇచ్చోటనే భూములేలు రాజన్యుల
అధికార ముద్రిక లంతరించే!
ఇచ్చోటనే లేత యిల్లాలి నల్ల పూ
సల సౌరు గంగలో కలిసి పోయె!
ఇచ్చోట నెట్టి పేరెన్నికం గనుగొన్న
చిత్రలేఖకుని కుంచియు నందించె!

ఇది పిశాచలత నిటాకాక్షణుండు
గజ్జె గదిలించి యాడు రంగస్థలంబు
ఇది మరణ దూత తీక్ష్ణమౌ దృష్టులొలయ
నవనిఁ బాలించు భాస్మ సింహాసనంబు

వేముల సత్యనారాయణ శాస్త్రి గారి 'దీపావళి' యను ఖండ కావ్య సంపుటిలో 'కాంక్ష' యను శీర్షికలో ఒక 'పువ్వు' యొక్క భావ పరంపర అభివ్యక్తమయినది.

"ఈ సుమజన్మ మెట్లో ఘటియిల్లెను నాకొక నాటి పాటిదై"
"పేదల రక్త మాంసముల బెంపు వహించి దయారసామృతా
స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దఱికమ్ముకై మతో
న్మాదము పెంచు దేవునకు మాఱుగ నిల్చిన రాతి బొమ్మలం
దూదరవోవు పాడు బ్రదుకొక్క నిమేషము సైపనా హృదిన్॥"

"నాకు తలంపు లేదు లలనా జనతాక బరీ భరై కభూషా కలనన్
ద్వార తోరణ స్థానము నం దురింబడగ జాలను"

నీచపు దాస్య వృత్తి మన నేరని శూరత మాతృ దేశ సే
వాచరణమ్ము నం దసువు లర్పణ చేసిన వారి పార్థిత
శ్రీ చెలు వారు చోట తద స్ర గ్రుబులన్ వికసించి వాసనల్
వీచుచు వాడిపోవగ వలెందదు దాత్త సమాధి మృత్తికన్॥"

ఖండ కావ్యమునకు ముక్తకమునకు గల భేదము గుర్తింపనగును. ముక్తకము ఒకే ఒక పద్యము. ముక్తకము స్వయం సంపూర్ణమైనది. ఖండ కావ్యము నందు అనేక పద్యములుండును. ఉదాహరణకు జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి 'కుంతీకుమారి' లో -

"అది రమణీయమైన పుష్పవన మానమునందొక మేడ, మేడపై
అది యొక మారుమూలగది ఆ గది ముందట ఇంచుమించుగా
పదునయిదేండ్ల ఈడు గల బాలిక పోలిక రాచపిల్ల జం
కొదవెడి కాళ్లతోడ దిగుచున్నది క్రిందికి మెట్ల మీదుగన్''

ఈ పదములో 'ఎవరా రాచపిల్ల! అంతకు ముందు ఏమి జరిగినది? అను విషయము ఖండకావ్య కర్తకా కథ అనవసరము. 'గాలిలూగు జలతారు మేలిముసుగు' నొకింత జేర్చిన, ఆమె నెమ్మము గానిపించినది. ఆమే 'స్నిగ్ధ సుకుమారి కుంతీ కుమారి. ఆమె కానీనుడైన కర్ణుని ఎత్తుకొని గంగ కడ కేగినది. చివరకు ఒక పెట్టెలో 'ఒత్తుకొనకుండ పూలగుత్తులు' పెట్టి నదీ ప్రవాహములో విడిచిపెట్టి 'నిశ్చల నిర్నిమేష నయనాలతో' చూచుచు నిల్చిపోయినది. తరువాత కథ ఏమైనది? ఆ ప్రశ్న ఖండ కావ్య కర్త నడుగరాదు.

రస గుళికలు వంటి రమ్య కావ్యములను సృష్టించిన కవి రాయప్రోలు సుబ్బారావు గారు. ప్రకృతిని తల్లిగా, దేవతామతల్లిగా సంభావించినారు. భోగ్యవస్తువుగా కేవల వర్ణ్య వస్తువుగా పరిగణించబడుచున్న స్త్రీని దేవీ పీఠముపై అధివసింపఁచేసినారు. 1909లో రాయప్రోలు వారు Hermit ననుసరించి 'లలిత' అను ఖండ కావ్యమును వ్రాసినారు. ఈ ఖండ కావ్యము ఏక భాదాశ్రయమైన ఇతివృత్తము కలది. అడవిలో తిరుగుచున్న ఒక బాటసారిని ఒక ముని తన ఆశ్రమమునకు ఆహ్వానించి పలకరించును. బాటసారి తాను జయపాలుడను రాజు కూతురునని, తాను ప్రేమించిన సత్యవర్ధనుడు నిరాశుడై అడవులు పట్టెనని, తాను మనసారా వరించిన ప్రియుడు లేని జీవితము నిరర్థకమని పలుకుచున్న బాటసారిని ముని వేష ధారియైన యువకుడు హఠాత్తుగా కౌగిలించుకొని, తానే సత్యవర్ధనుడని వివరించగా, ఇరువురు అతి పరవశులై అనురాగమున విహరించిరి. రాయప్రోలు వారీ కావ్యమున ఆద్యంతమున నవ్యత కనబరచిరి. రాయప్రోలు వారి అమలిన శృంగారతత్త్వము శాఖామాత్రముగా ఈ కావ్యములోనే తళుక్కుమనుచున్నది.

## 5.7 లఘుకృతులు

లఘుకృతులను గూర్చి అప్పకవి 'అప్పకవీయములో'

ఒనరు ముక్తకమన నొక్క పద్యము, ద్వికం
 బగు రెండు, త్రికము మూడైన, బంచ
రత్నంబు లైదు, వారణమాల యెనిమిది
 నవరత్నములు పద్య నవకమైన
భాస్కర మాలిక పండ్రెండు, శశికల
 పదియాఱు, నక్షత్రపంక్తి యిరవ
దియునేడు, త్రింశద్వాహయము ముప్పదిగాన
 సంఖ్య వెండియు మెండు సాగెనేని

వరుస పంచాద శాఖ్య మవ్వల శతకము
నష్ట సమధిక శతంబు ననగ వెలయు

నేబదియు మాఱు నూటిపై నెనిమిదియును
సప్తశతి సప్తశతమైన శార్ఙ్గపాణి॥

అని సీసపద్యములో తెలుగు దేశమును నున్న నిత్య వ్యవహార నిష్ఠములైన లఘుకృతులను పేర్కొనెను. ఒక పద్యము ముక్తకము. రెండు పద్యములైన ద్వికము. మూడు పద్యములైన త్రికము. అయిదు పద్యములు చెప్పిన పంచ రత్నములు. ఎనిమిది పద్యములలో చెప్పిన గజమాల, తొమ్మిది పద్యములలో చెప్పిన నవరత్నములు, పండ్రెండు పద్యములలో చెప్పిన సూర్యమాల, పదునాఱు పద్యములలో కూడినది శశకళ, ఇరువది ఏడైన పద్యములలో కూడినది నక్షత్రమాల. ముప్పది పద్యములలో చెప్పిన త్రింశత్తు, ఏబడి పద్యములలో కూడినది పంచాశత్తు, నూఱు పద్యములలో కూడినది శతకము, నూట ఎనిమిది పద్యములలో చెప్పిన అష్టోత్తర శతకము, ఏడు నూఱులైన సప్తశతి అని లఘు కృతులను పద్య సంఖ్యను బట్టి నామములను పేర్కొనెను.

## 5.8 బిరుదావళి

"ఆచక్రవాళ లక్షణ
సూచితమై బిరుద భరిత శుభ వాఙ్మయమై
ఆచక్రవాళ విపుల
క్ష్మా చక్రము నందు బిరుద గద్యము పొల్చున్"

అని కావ్యాలంకార సంగ్రహము నందు 'బిరుదావళి' పేర్కొనబడినది.

"ప్రతాప రుద్రీయమున"
"వర్ణ్యమానాంక బిరుదు వర్ణన ప్రబురోజ్జ్వలా।
వాక్యాడంబర సంయుక్తా సామతా బిరుదావళీ।

వర్ణింపబడుచున్న రాజాదుల బిరుదములను గూర్చి వాక్యాడంబరములో వ్రాయబడిన కావ్యము 'బిరుదావళి' ప్రతాప రుద్రీయము నందు చెప్పబడిన లక్షణమును బట్టి ఇది పద్యమో గద్యమో తెలియరాకున్నది. నరసభూపాలీయము నందు 'బిరుదు గద్యము' అని పేర్కొనబడుటచే ఇది గద్యమయమని తెలియుచున్నది. సాహిత్య దర్పణమున 'గద్య' పద్యమయం రాజస్తుతి ర్బిరుత ముచ్చటే అని పేర్కొనబడుటచే ఇది గద్య పద్య ఉభయమని తేలుచున్నది. విశ్వనాథుడు 'బిరుదుమణి మాలా' అను కావ్యమును లక్ష్యముగా నిచ్చెను. అప్పకవీయమున ఈ క్రింది లక్షణము గలదు.

క్షితి మహారాష్ట్ర భాషచే చెప్పఁబడెడు
భీకరోక్తులు బిరుదులై పెక్కుఁదనరు
వాని బిరుదావళి యెనర్పవలయు నంద్రు
బుధులు సంబుద్ధి పదములు పొసగఁ గూర్చి

"సలిలిత వాక్య గుంభనల, సర్వ విభక్తుల, దీవనంబులన్
బెలువుగఁ బద్యమెక్కటి రచించిన పిమ్మట, గౌడరీతి సం
కలిత చతుష్క, షట్క, దళ గద్యము ల్మెనిదియుంబదాదునిం,
పలరగఁ గూర్చి పేర్చి బిరుదావళి చెప్పగ నొప్పు నెంతయున్"

ప్రప్రథమున సర్వ విభక్తులతో ఆశీర్వాద రూపమగు ఒక పద్యమును చెప్పి, పిమ్మట గౌడ రీతిలో నాలుగు లేక యాఱు,

లేక యెనిమిది, లేక పదనాఱు బిరుద గద్యలు తత్త్రత్ప్రతాప భుజక్రమాదులను వర్ణించునవి చెప్పవలెను. ఈ బిరుదములు మహారాష్ట్ర భాషామయములని చెప్పఁబడెను. మహారాష్ట్ర భాష అనునది ఉపలక్షణం. ఏ దేశ భాషలోనున్ననూ ఆ బిరుదముల ఆంధ్ర సంస్కృతాదుల లోనికి మార్చక అదేవిధమున వ్యవహరింపవలెను. జగనొబ్బగండ, మూరురాయర గండ, ఉభయర గండ, గండ భేరుండాది బిరుదపదములను - అట్లే వ్యవహరింపవలెను. కాని వానిని అనువదింపరాదు.

రాజుల ప్రశంస సల్పెడి బిరుదావళులు ప్రాచీన కాలమున బహుళములు. దేశ భాషలలో మహారాష్ట్ర భాషలో ఇవి తామర తంపరగ విలసిల్లినవి. ఇటువంటి బిరుదావళులు తెలుగు భాషలో కూడ అనేకములు వెలసినవి.

## 5.9 శతకములు

భగవదనుగ్రహ ప్రాప్తి కొఱకును, కవితా సృజనాభ్యాసము కొఱకును, శతకములు ఆంధ్ర సాహిత్యమున 12వ శతాబ్ది నుండి నేటి వరకును రచింపబడుచునే యున్నవి. తెలుగులో తెలుగుదనములో గుబాళించు సుప్రసిద్ధ రచన శతకము. ఇందు నూరు పద్యము లుండవలెనని శతక శబ్దము చాటుచున్నది. కాని సాధారణముగా నూట ఎనిమిది పద్యములు వరకు కానవచ్చు చున్నది. భగవన్నామ స్తోత్రములందు సహస్రమో, అష్టోత్తర శతమో నామములుండుట పరిపాటియగుటచే, శతకమునందు కూడ అష్టోత్తర శత పద్య పరిమితములై నున్నట్లు తోచుచున్నది. లౌకిక సంస్కృతమున మయూరుని సూర్య శతకము, భర్తృహరి సుభాషిత త్రిశతి మున్నగు శతకములు కానవచ్చుచున్నవి.

శతకమందలి ప్రతి పద్యము చివర సమానమైన మకుటముండును. ఈ మకుటములు సర్వసాధారణముగా భగవత్సంబోధన రూపములై యుండును. 'దాశరధీ కరుణా పయోనిధీ' శ్రీ కాళహస్తీశ్వరా, 'సుమతీ' మున్నగు మకుటములు సుప్రసిద్ధములు. సంస్కృత శతకమునందు మకుట నియమము కానరాదు. శతకములు సాధారణముగా ఒకే ఛందమున వ్రాయబడుచుండును. కావ్యము లందు వలె శతకము లందలి పద్యము లన్నింటికిని సంబంధము సమకూర్చు కథా సూత్రము కానరాదు. ఇందలి పద్యములు వేనికవే స్వతంత్రములు. అందుచే వీనిని ముక్తక కావ్యములని చెప్పవచ్చును. ప్రతి పద్యము స్వయం సంపూర్ణమై అర్థములో భాసించుచుండును. వస్త్వైక్యము లేక పోవుటచే శతకము నందు రస పాత్ర పోషణము నందు అవకాశమంతగా కానరాదు. కాని, శృంగార, భక్తి, హాస్యరస ప్రధానములైన శతకములు కొన్ని లేక పోలేదు. శతకము సాధారణముగా గ్రంధ కర్త ఆత్మ భావములను ప్రకటించునదిగా నుండును. కావున శతకములు ఆత్మాశ్రయ కవితా జాతికి చెందినవి. కావున శతకములందలి నిష్కాపట్య నిర్మాలిన్యముద్ర, చిత్తశుద్ధి సంస్కృతములను ఆకర్షించును. ప్రబోధము, నీతిగాని, భక్తిగాని, శృంగారము గాని, వైరాగ్యమును గాని బోధించుట శతకము నందలి ముఖ్య లక్షణము. శతక కవిత అనగా కవి హృదయము చేయు విశ్వరూప ప్రదర్శనమే. శతకము నందలి తెలుగుతనము, ఆత్మాశ్రయులైన భావోద్వగము ప్రసంసింపదగినది. సారళ్యము, సౌలభ్యము శతక కవితకు ఉచ్ఛ్వాస నిశ్వాసములు. అందుచేత శతక పద్యములు సహజమైన ఇంటింటి పద్యములు. అవిరాని వారు ఉండరు.

పాల్కురికి సోమనాధుడు పండితారాధ్యుడు రచించిన గ్రంధములను పేర్కొనుచు 'శతకంబు శివతత్త్వసారము దీపకళిక' అని వ్రాసియుండెను. దీనిని బట్టి తెలుగున మల్లికార్జున పండితారాధ్యుడే ప్రధమ శతక కర్త యని చెప్పవచ్చును. పాల్కురికి సోమనాధుడు రచించిన 'వషాధిప శతకము' సర్వ లక్షణ సంపన్నమైన శతకము.

ఆంధ్ర వాఙ్మయమందలి శతకములను నీతి శతకములు, భక్తి శతకములు, వ్యాజ స్తుతి శతకములు, వేదాంత శతకమలు, అని నాలుగు విధములుగా విభజించవచ్చును.

1. నీతిశతకములు - సర్వజన హితకరములైన నీతులతో కూడి, చదువు వారి ప్రవర్తనలను చక్క చేయుటకు నీతి శతకములు తోడ్పడుచుండును. ఇవి పూర్వ గ్రంధములను, లోకానుభవమును ఆధారముగా చేసుకొని వ్రాయబడినది. ఇందు రాజనీతి,

గృహనీతి, లోకనీతి, ప్రవృత్తినీతి ముఖ్యములైనవి. వీనిలో 13వ శతాబ్ది బద్దెన అను భద్రభూపాలుడు వ్రాసిన సుమతీ శతకము, మారద వెంకయ్య వ్రాసిన భాస్కర శతకము, వేమన యోగి రచించిన 'విశ్వదాభిరామ వినుర వేమా' యను మకుటముతో గూడిన పెక్కు నీతి పద్యములు ముఖ్యములైనవి.

'సుమతీ శతకమున'

"కనకపు సింహాసనమున
శునకము గూర్చుండఁబెట్టి శుభలగ్నము నం
దొనరగఁ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ"

చిన్న, చిన్న పదాలతో సారళ్యము, సౌలభ్యముతో అనల్పార్థమైన భావముతో వ్రాసిన పద&యము రాని వారుండరు.

ప్రౌఢ ప్రయోగములు శతకములలో ఉన్ననూ సౌకుమార్య మాధుర్యములే సుమతీ శతకములో ప్రబోధము లోకవృత్తాను దర్పణము.

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు తప్పిన
తమ మిత్రులె శత్రులగుట తధ్యము సుమతీ!

జీవితానుభవములే జ్ఞానోపదేశము చేయగా, జ్ఞాని అయి, విరాగి అయిన కవి వేమన భావము. భాషా సంగ్రహము - స్పష్టత - సరళతో వేమన కవితా గుణములు.

ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా
విశ్వదాభిరామ! వినురవేమా!

సాంఘిక దురాచారములతో కుల వ్యవస్థ జాతిని కలవరపెట్టు తీవ్ర సమస్య.

రామనామ పఠన రమణచే వాల్మీకి
పరగ బోయడయ్యె బాపడయ్యే
కులము ఘనము కాదు గుణమే ఘనంబురా
విశ్వదాభిరామ! వినురవేమా!

ఏ కులమునందు జన్మించినను, వాని ఘనత కులమును బట్టికాక గుణమును బట్టి ఏర్పడునని ప్రబోధించినాడు వేమన. ఆటవెలదిలో రెండు పాదములు విషయమును, మూడవ పాదము ఉపమానము, లేక దృష్టాంతము నాల్గవ పాదమున మకుటముతో అల్పాక్షరములతో అనల్పార్థమైన రచన చేసినవాడు వేమన.

**2.** భక్తిశతకములు - భగవన్నుతి పూర్వకములైన భక్తి శతకములలో, శైవకవి సార్వభౌముడైన పాల్కురికి సోమనాధుడు, 'బసవా

బసవా! కృపాధిప' అను మకుటములో వ్రాసిన వృషాధిప శతకము మొట్ట మొదటిది. యధా వాక్కుల అన్నమయ్య, 'సర్వేశర శతకము, ధూర్జటి 'శ్రీకాళహస్తీశ్వర శతకము' కంచర్ల గోపన్న అను పేర గల రామదాసు రచించిన 'దాశరధి శతకము' భక్తి శతకములలో ప్రముఖమైనవి.

ధూర్జటి కాళహస్తీశ్వర శతకమున -

'ఏ లీలన్ నుతియింప వచ్చు నుపయోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలంభ్యం బైన నీ రూపమున్
బాలుం జాలు కవిత్వముల్ నిలుచున్ సత్యంబు వర్ణించుచో
బీ! లజ్జింపరు గాక! మాదృశ కమల్ శ్రీ కాళహస్తీశ్వరా!

అని కవి తన అహంకారమును ఉజ్జగించి, ఆత్మార్పణమును సలిపెను.

3. వ్యాజ స్తుతి శతకములు - "వ్యాజ స్తుతి ర్ముఖే నిందాస్తు తిర్వా రూఢి రన్యధా" అని వ్యాజ స్తుతి అలంకారమునకు నిర్వచనము. ఇందులో స్తుతిలో నింద గాని, నిందలో స్తుతి గాని అంతర్గతమై యుండును. భగవంతుని నిందించు చున్నట్లు కనిపించినను, ఇందలి పద్యములలో భక్తి అంతర్వాహినిగా ప్రవహించుచుండును. గోగులపాటి కూర్మనాధ కవి 'సింహాద్రి నారసింహ శతకము' మొదటగా పేర్కొనదగినది. భల్లా పేరయ్య కవి 'భద్రగిరి శతకము' కాసుల పురుషోత్తమ కవి 'ఆంధ్ర నాయక శతకము' లు ప్రముఖములైనవి.

4. తత్త్వ శతకములు - ఉపనిషాదులందు నిరూపింపబడిన తత్త్వ విషయములను సామాన్య జనులకు సహితము చక్కని తేట తెలుగు మాటలతో కవులు శతక రూపమున వెల్లడించి యున్నారు. శ్రీకాళహస్తీశ్వర, దాశరథీ, వేమన యోగి రచించిన పద్యములలో తత్త్వ బోధకములయిన పద్యములు చాల కలవు.

వేమన వేదాంతము నిగూఢమైనది. భగవంతుడు కలడనియు, అతడు ఒక్కడే యనియు, అతడు సర్వ జీవకోటి హృదయ పీఠములపై అధివసించువాడనియు వేమన భావము.

"పసుల వన్నె వేఱు పాలేక వర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనంబు వేరు దైవంబదొక్కటే"

శతకములు తెలుగు భాషలో 'ధారాశుద్ధి శోభితములై, సహజ భావ పరిమితములై, చదువరుల కానందముతో పాటు విజ్ఞాన వివేకములను కూడ కలిగింప దక్షతలై' రచింపబడినవి.

## 5.10 దండకము

తెలుగు భాషలో దండకము పద్య గద్య కావ్యముల మధ్య సేతువు వంటిది. దండకము సహజముగా 'త' గణ బద్ధము. త, న, స, హ, గణములలో నొకటి మొదట నిడి, తక్కిన వన్నియు తగణములే కూర్చి తుదిన నొక గురువు నుంచవలెను. యతి ప్రాస నియమము లేదు. ఇది గద్య కావ్యమా? పద్య కావ్యమా? అని సందేహము కలుగును. కాని గద్యము నందు ఛ్ఛందస్సు ఉండదు. కాన ఇది పద్య కావ్యమే. తెలుగులో కల దండకములు సహజముగా దైవ స్తుతి రూపములో అనగా భక్తి రస కావ్యములే. ఆంజనేయ దండకము మొదలగునవి. పోతన 'భోగినీ దండకము' శృంగార ప్రధానమైనది. రాయలసీమలో బహుళ ప్రచారము

గల భాషీయ దండకము హాస్యరస సంభరితమైనది.

## 5.11 ఆఖ్యాయక

ఆఖ్యాయక ఉచ్ఛ్వాసాది విభాగములు కలిగి నడుమ నడుమ ఇతరుల పద్యములు గల గద్య ప్రబంధము.

## 5.12 ఉపాఖ్యానము

"శ్రుత స్యార్థస్య కథన ముపాఖ్యానం ప్రచేక్షతే"

ప్రధాన కావ్యములో నానుషంగికముగా ప్రవక్తమగు చిరుకథ, ఇతరుల వలన విన్న కథను చెప్పుటయు ఉపాఖ్యానమగును.

అఖ్యానము

"స్వయం దృష్టార్థ కథనం ప్రా హం రాఖ్యానకం బుధాః"

కవి తాను స్వయముగా దర్శించిన సన్నివేశమును వర్ణించుట.

## 5.13 ఇతిహాసము

ఇతిహాసమనగా పూర్వరాజాదుల కథలను తెలుపునది. ఇతి-హ-ఆస్మిన్ అస్తీది ఇతిహాసః' అని వ్యుత్పత్తి. భారత రామాయణాదులు ఇతిహాసములుగా సుప్రసిద్ధములు.

## 5.14 పురాణము

1. సర్గము - (ప్రపంచోత్పత్తి)
2. ప్రతి సర్గము - (బ్రహ్మాదులు చేసెడి ఉత్పత్తి)
3. వంశము - (దేవాసురాది విభేదోత్పత్తి)
4. మన్వంతరము (మానవుల వృత్తాంతము)
5. వంశాను చరితము (సూర్య చంద్ర వంశ రాజుల చరిత్రము)

అను ఐదు అంశములలో నున్న బృహద్రచను పురాణమందురు.

"పురాఽపి నవం పురాణం" అని వ్యుత్పత్తి. అనగా పూర్వ కథయైనను క్రొత్తదిగా భాసించునది అని వ్యుత్పత్త్యర్థము. అష్టాదశ పురాణములు సంస్కృత వాఙ్మయమున సుప్రసిద్ధములు. మొదట ఈ ఐదు అంశములకే ప్రాధాన్యమిచ్చినను, తరువాత కాలమున వర్ణనలు చేరినవి. ఇతిహాసము వలె పురాణములును పెక్కు కథలకు నిలయములయినవి. ఇతిహాసముల వ్యాప్తి చిన్నది. పురాణముల వ్యాప్తి పెద్దదిగా పరిణమించినది. ఇప్పుడే అల్ప భేదమును పాటింపక పురాణ పదమునే రెంటికిని వ్యవహరించు చున్నారు.

మణిప్రవాళము - సంస్కృతాంధ్రములను - విభక్తులతో తిలతండుల న్యాయమున గుదిగ్రుచ్చుట. పాల్కురికి సోమనాథుడు 'వృషాధిప శతకము'న మణి ప్రవాళమునకు ఉదాహరణముగా నొక పద్యము వ్రాసెను. అసలు ఇది మళయాళమున గలదు.

"తండులాని గృహమందు నసంది
తిండికైతే పదిమంది వసంది"

వాయువు వొందు యీ విగత వాన అమాపరహంబు భౌ (?)
న్యాయ విధేయ మీశతరి యన్యున బాణా కళాభి దంచు। వా
గ్ధేయమణి ప్రవాళమున దిల్లము నిన్ను నలంకరింతు దే
వా! యమిబృంద వంద్య। బసవా। బసవా। బసవా। వృషాధిపా?

ఆధునికుల భాషణములో ఆంధ్రాంగ్లములు కలిసిన మణిప్రవాళము నిత్యజీవిత యాత్రలో అనుభవ వేద్యమే.

## 5.15 చాటువులు

చాటువు అను శబ్దమునకు 'మనోహరమైనది' అని అర్థము. కవితా ప్రపంచములో సద్యోమౌవ్యనములో ఉద్భవించు ఏకైక పద్యము చాటువు. చాటువులు 'పాతాళగంగ పైకుబికినట్లు కవి హృదయము నుండి ఆశువుగా వెలువడెడి ముక్తకములు. ఈ పద్యములు గ్రంథస్థములు కాకపోయినను రసజ్ఞుల హృదయస్థములై అనేక శతాబ్దముల నుండి చిరంజీవములై వర్ధిల్లుచున్నవి. చాటు పద్యము స్వయం సంపూర్ణమైనది స్వతంత్ర ప్రతిపత్తి కలది.

చాటు పద్యమునకు (1) తాత్కాలిక ప్రేరణ, (2) స్వయం సంపూర్ణత, (3) చమత్కారము, (4) ఝటికి స్ఫూర్తి, (4) ఇతివృత్త సౌలభ్యము ప్రధాన లక్షణములుగా పేర్కొనవచ్చును. చమత్కారము చాటువునకు అంతరాత్మ. వస్తు లాఘవము గమనింపదగినది. ఝటుకి స్ఫూర్తి చాటు పద్య రచనలోని విశేషము తెలుగు కవుల స్వచ్ఛంద కవితా ప్రతిభకు, సర్వతంత్ర స్వతంత్ర ప్రతిపత్తికి తెలుగు చాటువులు నికషోపలములు ఒక్కొక్క చాటువు ఒక మహాకావ్యముతో సరితూగ గల సామర్థ్యము కలవి. ఇవి గ్రంథ నిబద్ధములు గాకపోయినను, కాల మహా ప్రవంతి కెదురీది బ్రతికిన సాహిత్య ఖండికలు. తెలుగులో వెలసిన చాటువులు అసంఖ్యాకములు. అవి నవరస భరితములు. నిత్య ప్రత్యగ్రములు. ఉదాహరణమునకు కొన్ని చాటువులు . . . .

కం॥ శివు డద్రిని శయనించుట
రవి చంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవి రతమును శేషునిపై
బవళించుట నల్లి బాధ పడలేక సుమీ

ఆవె॥ చాకివాని తోడ జగడాలు పడలేక
సిరిగలాడు పట్టు చీర గట్టి
శివుడు తోలు గప్పె సేయని మది రోసి
భైరవుండు చీర పార వేసె

ఈ చాటు పద్యములలో కవి సహజ ధర్మములను తనకు కావలసిన విషయములో సమన్వయించుకొని చమత్కారముతో వర్ణించుట విశేషము.

తిక్కన సోమయాజికి పెద్ద తండ్రి కుమారుడు, మనుమసిద్ధి మహారాజు సేనాని ఖడ్గ (రణ) తిక్కనను గూర్చి జన శ్రుతిలోనున్న చాటు పద్యములు. మనుమసిద్ధికిని, కాటమ రాజునకు జరిగిన యుద్ధములో ఖడ్గ తిక్కన కాటమ రాజు సేనను ఎదుర్కొనలేక, ఇంటికి రాగా ఖడ్గ తిక్కన భార్య, భర్త స్నానము చేయుటకు రాగా, నులక మంచము అట్ట చేసి, పసుపుటుండ దానిపై నుంచి, నీళ్ళ బిందె తెచ్చి పెట్టెనట. ఇది ఏమని ఖడ్గ తిక్కన అడుగగా,

పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెందున్?
ముగురాఁడు వారమైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్!

అని అవమానకరముగా పలికనట. తర్వాత తల్లి అన్నములో విఱిగిన పాలుపోయగా, ఇది ఏమని అడిగినాడట. అతని తల్లి 'నాయనా! నీవు పోయిన చోటకే పసులును మేతకు పోయెను. అవియు విఱిగి వచ్చినవి. పాలును విఱిగెను' అని జవాబు ఇయ్యగా, అన్నము విడిచి, లేచి యుద్ధమునకు పోయి శత్రువులను ఎదొర్కొని వీరస్వర్గము పొందినట్లు ఆనాటి కవుల చాటు పద్యముల ద్వారా తెలియుచున్నది.

"నిరంకుశాః కవయః" కవులు నిరంకుశులు అను మాట చాటు రచనము పట్ల మిక్కిలి సార్థకము. చాటువులలో కవి సర్వతంత్ర స్వతంత్రుడై ఉల్లంఘింపని నియమము లేదు. వ్యాకరణ ధిక్కారము, కావ్య మర్యాదల తిరస్కృతి, కవి సమయ భంగము, భాషా సంప్రదాయ విచ్ఛిత్తి, సర్వము చాటు కవితా జగన్నాథమయమే. అయినను అనిర్వచనీయమైన చమత్కార మాధుర్యము చాటు పద్యమును ఆపాత రమణీయమొనర్చి ఝటితి స్ఫూర్తితో సద్యోరస ప్రతీతి కల్పించుట అనుభవవేద్యము.

తెలుగు చాటువులను గురించి ఎన్నో కమ్మని కథలు ప్రచారములో నున్నవి. శ్రీనాధయుగములోను, ప్రబంధయుగములోను ఎన్నో చాటువులు వెలసినవి. శ్రీనాధుని చాటువులు సుప్రసిద్ధములు. కొండవీట నున్నపుడు శ్రీనాధుడు పల్నాటి సీమకు పోవుచుండెడి వాడు. పల్నాటి సీమపై శ్రీనాధుడి గల అనాదరము అనేక పద్యములలో తెలియుచున్నది.

కం॥ రసికుడు పోవఁడు పల్నా
డెసగంగా రంభయైన నేకులు వడకున్
వసుధేశుఁడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్

ఉ॥ అంగడి యూర లేదు వరి యన్నము లేదు శుచిత్వమేమి లే
దంగన లింపు లేరు ప్రియమైన వనంబులు లేవు నీటికై
భంగపడంగఁ బాల్పడు కృపాపరులెవ్వరు లేరు దాతలె
న్నంగను సున్న పలినాటికి మాటికిఁ బోవ నేటికిన్

పల్నాటిలో మంచినీరు దొరకక చెప్పిన పద్యము.

క॥ సిరిగల వానికిఁ జెల్లును
దరుణులు పదియాఱు వేలదగఁ బెండ్లాడన్
దిరిపమున కిద్దరాండ్రా
పరమేశా। గంగ విడుము। పార్వతి చాలున్

పరమేశ ధిక్కార పద్యము ఆపాత మధుర మనిపించును.

శ్రీనాధుడు ఈశ్వరార్చన కళాశీలుడు. సకల విద్యాసనాధుడు. పుంభావ సరస్వతి. అనేక సుకవి రాజ సన్మానములు పొందినవాడు. ప్రౌఢ దేవరాయులుచే కనకాభిషేకము పొంది 'కవిసార్వభౌమ' బిరుదును పొందిన మహాకవి. జీవితమునందు

మహాభోగములననుభవించి, తుదకు కవిత్వమును ఆదరించు ప్రభువులు లేక, వడ్డెర రాజుల చెఱశాలలలో కష్టముల ననుభవించి, బృహస్పతికి సహితము గుండియలు దిగ్గురనునట్లు స్వర్గమున కరిగిన యుద్ధండపండిత కవి.

సీ॥ కవిరాజు కంఠంబు కౌఁగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడ దండ
ఆంధ్ర నైషధ కర్త యం ఘ్రి యుగ్మంబున
దగిలియుండెను గదా నిగళ యుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురు గొడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్ల గుండు

గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె వింతఫలము
బింబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డు పల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్టు చెల్లింతుఁ టంకంబు లేడు నూర్లు

అవసానకాలమున శ్రీనాధ మహాకవి సార్వభౌముడు చెప్పికొన్న పద్యము.

సీ॥ కాశికా విశ్వేశుఁ గలిసే వీరారెడ్డి
రత్నాంబరము లేదా యుఁడిచ్చు?
రంభఁ గూడెఁ దెనుంగు రాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
సర్గస్థుఁడయ్యే విస్సన్న మంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు?
కైలాసగిరిఁ బండె మైలార విభుడేఁగి
దినవెచ్చ మేరాజు తీర్పఁ గలడు?

గీ॥ భాస్కరుడు మున్నే దేవుని పాలి కరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్టమనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాధుఁడమరపురికి!

పొగ త్రాగుట గురించి ఆధునిక కవి చాటువు.

కం॥ పొగ త్రోవికి సతిమోవికి
నగణితముగ సూర కవికి నమృతమ్మనకున్
తగనుచ్చిష్టము లేదని
ఖగవాహనునితోడఁ గాలకంఠుఁడు పలికెన్

ఈ చాటువులో ధర్మ సూక్ష్మమును చెప్పినది కవి కాదుట. శ్రీ మహావిష్ణువుతో పరమేశ్వరుడు చెప్పెనని కవి కల్పన.

ముక్కు పొడుము (నస్యము)ను గురించి ఒక చాటువు.

ఉ॥ నస్యము శీత మత్త గజ నాశన హేతు విచార ధీర పం
చాస్యము సుస్తి రోగ నిబిడాంధతమః పటతార్క బింబసా
దృశ్యము, వేద శాస్త్రచయ దీప్త సుపండిత వాగ్వి చిత్ర సా
రస్యము, రాజవర్య మహారాజ్మాణికైన నుతింప శక్యమే.

ఈ చాటు పద్యము ఎంతటి రీతి సుభగమైన గంభీర శయ్యతో సుప్రసిద్ధ మహాకవి ప్రయోగ సంభరిత సమాస ప్రౌఢ పదగుంఫనముతో అందముగా నడచినది.

ప్రతి చాటు పద&యము తెర వెనుక ఒక కమ్మని కథ పొంచి దాగి యుండును. ఒక్కొక్క పద్యము అనేక ప్రబంధ కవితాసారములను వడ బట్టి ఒకచో చేర్చి చేసిన రసగుళిక యనిపించును. ప్రతి చాటువు స్వయం సంపూర్ణత కలిగి, ఝుటిత స్ఫూర్తితో చమత్కారము కలిగించి ఇతివృత్త సౌలభ్యముతో ఆపాత రమణీయ మాధుర్యముతో సద్యో రస ప్రతీతి కల్పించుటచే, ప్రజల నోళ్ళలో అనేక శతాబ్దముల పర్యంతము నిలిచిపోయి, ఆంధ్ర సాహిత్యములో అమూల్య ఆభరణములై ప్రసిద్ధికెక్కినది.

## 5.16 యక్షగానములు

"యక్షగానములు చతుర్విధ కవితలలో మధురశాఖకు చెందునని'' వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సుగ్రీవ విజయ యక్షగాన పీఠికలో పేర్కొనిరి. ఆంధ్ర సాహిత్యములో 12వ శతాబ్దికి ముందు కాలము యక్షగాన చర్త్రిలో 'అజ్ఞాత' యుగముగా చెప్పవచ్చును. యక్షగాన పరిణామ చరిత్ర అది చిత్రమైనది. రచనలో, ప్రదర్శనలో, తరతరమునకును పరిణామమందుచు వచ్చినది. మొదట యాత్రాస్థలములందును, కామందుల లోగిళ్ళనందును, పల్లె పట్టుల రచ్చ సావడి యందును, పాడి గలిగిన రాచదేవిడీలందును యక్షగానము ప్రదర్శితమైనది. వివిధ ప్రాంతములందలి వివిధ శ్రవ్య, దృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలలో అనుబంధము పెంచుకొని, వివిధ గీతి చ్ఛందస్సులను తనలో ఇముడ్చుకొని, బొమ్మలాట రైతుల మొదలుగ జానపదుల గంటములనుండి నగరములందు రాజాస్థానముల నాశ్రయించిన పండిత కవుల పైడి గంటములకును ఎగబ్రాకినది. పలు తరగతుల ప్రజా జీవితోదంత విశేషములను ప్రతిబింబించుకొని, పలు కథలకాశ్రయమై, పాఠ్య గేయ నాట్యాత్మకములైన పెక్కు ప్రయోజనములకు స్థానమై, 'సార్వజనీనమైన బహుముఖ ప్రయోజన సనాధమైన సాహిత్య ప్రక్రియగా పరిణమించినది.

ఆంధ్ర సాహిత్యమున మొట్టమొదట యక్షాది నేపధ్యములలోడి ఆట పాటల ప్రసక్తి పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్రమున కలదు. కావున యక్ష గాన సరణి బీజప్రాయముగ పాల్కురికి సోమన కాలమున ఆరంభమై శ్రీనాధుని కాలమున విస్తరించినదని విద్వాంసుల అభిప్రాయము.

కీర్తింతు రెవ్వాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి (భీమఖండము. 3-65)

అని శ్రీనాధుడు భమఖండములో యక్షగాన ప్రశంసచేసెను. 15వ శతాబ్ది ప్రధమ పాదమున వెలసిన క్రీడాభిరామమున

కామవల్లీ మహాలక్ష్మి కైటిభారి
వలపు వాడుచు వచ్చె జక్కుల పురంధ్రి (క్రీడాభిరామము. 135)

జక్కుల పురంధ్రి గానకళా ప్రావీణ&యము ప్రస్తుతింపబడినది. అందు 'యక్షకన్యల' నృత్యము కూడ ప్రసక్తమైనది. పదనారవ శతాబ్దిలోని చిత్రభారతమున 'యక్ష కామినుల' నాట్యము, 'యక్ష వనితల పాట' పేర్కొనబడినది. జక్కల శబ్దము యక్ష శబ్దముగా మారుట భాషా సంప్రదాయానుగుణ్యమే. 17వ శతాబ్దమున తంజాపురాన్నదాన నాటకమున జక్కుల రంగసాని సత్రములో 'పదకేళిక' పట్టినట్లు కలదు.

"యక్షగాన పదంబులు నవ్విధమున
సముచితానేక విధ తాళ సంగతులను
నవరసాలం క్రియా సవర్ణంబు లగుచు"

యక్షగానము లలరారుచుండెడివని తాళ్ళపాక అన్నమాచార్యుల వారి పౌత్రుడైన చినతిరుమలాచార్యుడు 'సంకీర్తన లక్షణమను' గ్రంధమున పేర్కొనెను.

యక్షగానములలో ప్రధాన రచనాంగములు మూడు.

1. రగడ వికారము - తాళ ప్రధానమైన రేకు.
2. ద్విపద
3. ఏలలు, జోలలు - అర్థచంద్రికలు - ధవళశోభనములు.

తొలుత యక్షగానములలో వచన భాగము చాల తక్కువ. రానురాను వచన సంభాషణములు చేరినవి. దరువు, ద్విపద, గద్య పద్యములు యక్ష గానాంశములుగా చివరకు రూపొందినది.

"ప్రోలుగంటి చెన్నశౌరి సౌభరి చరిత్రము" మొట్టమొదటి యక్షగాన రచన 15వ శతాబ్ది యుత్తరార్థమున రచించినట్లు తెలియుచున్నది. కాని ఆ గ్రంథము లభ్యము కాలేదు. అది జక్కల కథయని పేర్కొనబడినది. మనకు లభ్యమవుతున్న 16వ శతాబ్ది ఉత్తరార్థమున కందుకూరి రుద్రకవిచే రచింపబడిన 'సుగ్రీవ విజయము' మొదట యక్షగానముగా పండితలందరిచే పరిగణింపబడినది. సుగ్రీవ విజయము ప్రదర్శన సౌలభ్యము కల రచనయని తోచును. సంభాషణలు వచనమున లేకపోయినను అందు ఆఖ్యాన శైలి కంటె సంవాద శైలికే ప్రాధాన్యమున్నది. ఆధునిక శతాబ్దములో యక్షగానములు కోకొల్లలుగా వెల్లివిరిసినవి. గుజ్జువాడ లక్ష్మణ మూర్చ, సంతవేలూరు - కుశలవ, పాతపట్టణము - బాణాసుర నాటకము మొదలైనవి. హరికథలను కూడ ఆదిభట్ల నారాయణ దాసు మున్నగు వారు యక్షగాన ప్రబంధములని వ్యవహరించినారు.

"అటునిటు చెరి మేకనిచే పట్టుకొన బడిన తెల్లని గుడ్డయే తెర. తెరకు అటునిటు నూనె దివిటీలు. తెర వెనుక హంగుదారులు. వంత పాటగాండ్రు, హంగుతిత్తి, మద్దెలి, తాళాపు చిప్పలు, తెర ముందు సూత్రధారుడు. అతడే ప్రదర్శన ప్రవర్తకుడు. ప్రార్థనాదికము. కథాసందర్భ వివరణము, పాత్ర ప్రవేశ సూచన, పాత్రలను పల్కరించుట, పాత్రలకు వంత పాటలకు పల్లవులనందించుట, అభినయానుకూలముగా తాళము వేయుట, సంధి వచనములు చదువుట, అప్పుడప్పుడు హాస్య ప్రసంగములు నెరపుట, మున్నగునవి అతని పనులు. ప్రదర్శనములు రాత్రి ప్రారంభమై తెల్లవారు సరికి అంతమగుచుండునని" డా.యస్వీ జోగారావు గారు పేర్కొనిరి.

తంజావూరు రాజ్యము యక్షగానములకు స్వర్గ యుగము కల్పించినది. విజయరాఘవ నృపాలుడు అనేక యక్షగానములు రచించినట్లు ప్రఖ్యాతికెక్కెను. తంజావూరును పరిపాలించిన మహారాష్ట్రులను యక్షగానములను ప్రోత్సహించిరి. విద్వత్కవి కంకంటి పాపరాజు విష్ణుమాయా విలాసము అను యక్షగానమును వ్రాయుట చేత వాఙ్మయమున ఆనాడు పర్వదిన గౌరవ

ప్రపత్తులను ఎన్నవచ్చును.

## 5.17 సమీక్ష

యక్షగానముల రచన సామాన్యముగా ప్రారంభమై, వివిధ శ్రవ్య దృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలలో అనుబంధము పెంచుకొని, వివిధ గేతి చ్ఛందస్సులను తనలో ఇముడ్చుకొని, జానపదుల గంటములనుండి రాజాస్థాన పండిత కవుల పైడి గంటముల వరకు విస్తరించి, కొటలోని రాజు గారికిని, పేట లోని ప్రజలకును సమానముగా ఆదర్శపాత్రమైనది. తామరతంపరగా అనేకము పైన యక్ష గానములు వెలసినవి. త్యాగరాజు, నారాయణ తీర్థులు, మేలత్తూరు వెంకటరామ శాస్త్రి మున్నగు వారిచేతను యక్షగానములు రచింపబడి ఆంధ్ర సాహిత్యమున ఒక విశిష్ట స్థానమును పొందినది.

## 5.18 ప్రశ్నలు

1. కావ్యమును వివరించి, కావ్య భేదములోని ప్రబంధములను గురించి వ్రాయునది.
2. కావ్య భేదములలోని ఖండ కావ్యములను గురించి వ్రాయునది.
3. కావ్య భేదములలోని చాటు పద్యములను వివరించినది.
4. యక్ష గాన ప్రక్రియ గురించి వివరించునది.
5. శతకములను గురించి వివరించునది.

## 5.19 ఉపయుక్త గ్రంథాలు


1. కావ్యాలోకము - డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య
2. కావ్యాలంకార సంగ్రహము - వివరణ కర్త - సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి
3. ఆంధ్ర యక్ష గాన వాజ్మయ చరిత్ర - డాక్టరు యస్వీ జోగారావు
4. చాటు పద్య మణి మంజరి - వేటూరి ప్రభాకరశాస్త్రి
5. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
6. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - డాక్టర్ సి. నారాయణ రెడ్డి



**అరిపిరాల హరిహరనాథశాస్త్రి**

Incharge - తెలుగు శాఖ

శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల

నరసరావుపేట - 522 601

# పాఠం - 6

# రస స్వరూపము

పాఠ్యనిర్మాణక్రమం

6.0 లక్ష్యం
6.1 రసస్థితి - స్వరూపం
6.2 రస సూత్రం
6.3 రససిద్ధి
6.4 స్థాయి భావం
6.5 విభావానుభావాదులు
6.6 సమీక్ష
6.7 ప్రశ్నలు
6.8 ఉపయుక్త గ్రంథాలు

## 6.0 లక్ష్యం

కావ్య ప్రయోజనాలలో ముఖ్యమైనది రసానందం. ఈ ఆనందం పొందటానికి రససిద్ధి ఎలా జరుగుతుంది? రసమంటే ఏమిటి? మొదలైన విషయాలను గూర్చిన అవగాహన కలిగించడం.

## 6.1 రసస్థితి - స్వరూపం

భావం, భావన, ఆలోచన, పదగుంఫన అనే నాలుగంశాలు మొత్తంగాగాని, ఏవేని ఒకటి, రెండుగాగాని కావ్యం చదివినప్పుడు మనస్సునకు హాయిని కలిగిస్తాయి. కలిగిన ఆ హాయిని బట్టి ఆ కావ్యం రసవంతంగా ఉందని అంటాం. కొన్నిసార్లు ఒక పద్యాన్ని గాని, కావ్యాన్ని గాని చదివినప్పుడు భావావేశాన్ని కల్గించే అంశం మాత్రమే ఉండి కూడా హృదయాహ్లాదం కలుగుతుంది. అప్పుడది రసవంతంగా ఉందని మెచ్చుకుంటాం. మరికొన్ని సార్లు ఎటువంటి భావావేశం కలుగకుండానే మన కళ్ళముందు కవి చిత్రింపదలచిన మూర్తి సాక్షాత్కరించి ఆనందం కలుగుతుంది. అటువంటి పద్యం కూడ రసవంతమే అవుతుంది. ఇంకొన్నిసార్లు భావావేశం గాని, రూపసాక్షాత్కారంగాని జరుగకపోయినా ఆ రచన రసవత్తరంగానే అన్పిస్తుంది.

ఉదా॥ "రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితో పి జంతుః
తచ్చేతసా స్మరతి మానమబోధ పూర్వం
భావ స్థిరాణి జననాంతర సౌహృదాని"

ఈ శ్లోకం కాళిదాస కృత అభిజ్ఞాన శాకుంతలం లోనిది. ఏ విచారము లేకుండా సుఖంగా ఉన్న మానవుడు అందమైన దృశ్యాలను చూస్తూ, మధురమైన శబ్దాలను వింటూ కూడా ఆనందం పొందడానికి బదులు మనోవ్యాకులత పొందుతాడు. అతని మనస్సులో నిగూఢంగా ఉన్న, పూర్వజన్మ స్నేహాలు స్మరణకు రావడమే కారణం - అని ఈ శ్లోక భావం. ఈ శ్లోకంలో ఒక

అసాధారణమైన మానసిక తత్వ రహస్యం ఉంది. కాని ఈ శ్లోకం రసవంతం కాదనటానికి వీలులేదు.

పోతన్న భాగవతంలోని గజేంద్ర మోక్షంలో ఉన్న "అలవైకుంఠ పురంబులో" అన్న పద్యంలోని శబ్ద గుంఫన వల్ల పద్యం మధురంగా ఉండి రసవంతంగా అనిపిస్తుంది. ఇక్కడ భావ జన్యమైన ఆహ్లాదం మాత్రమే శాస్త్రీయం అయిన రసాంశం. మిగిలినవన్నీ చిత్తసుఖాలు.

రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి అభిప్రాయం ప్రకారం రసమంటే లాక్షణికులు నియమించినట్లు శృంగారం మొదలైన తొమ్మిది భేదాలతో కూడిన అలౌకిక చర్వణా విషయమైన, వివరించరాని పదార్థంగాదు. లాక్షణికులు తర్క శాస్త్ర పరాధీనులై రస శబ్దానికి మార్గాన్ని సంకోచపరచారని వీరి అభిప్రాయం. ఏ భావాలైనా వాని తీక్షణ దశలో అవిదిత వేద్యాంతరంగా అనుభవించగల్గితే, ఆనంద స్వరూపులై రసశబ్ద వాచ్యాలౌతాయి. ఇది శిల్ప విషయ సంబంధి.

"తర్కశాస్త్రము నోరు మూసినను హృదయమును మూయజాలదు. కావున కవి భావనా బలము చేతనకు గలుగు శోకము, మోహము, అసూయ, ద్వేషము, సంతోషము, ప్రణయము మొదలగు భావములనబడు చిత్త వికాసముల మూలమున వర్ణింపవలసిన పదార్థముల స్వరూపమును నిర్ణయించి విగ్రహమును (ఏ విగ్రహమైనను సరే) సరళమగు భాషతో దీర్చి యెదుట నిలిపినపుడు రసానుభవ సంస్కారముగల సహృదయుల కట్టి మనోవికారములే కలిగి అవి యెట్టివైనను, శిల్పమందు గల యొకానొక అనిర్వచనీయ మహిమచే ఆనందముగా బరిణమించును. ఈ యర్థమందే ప్రకృతము రసపదమును నేనుపయోగించెదను" అని రాళ్ళపల్లి వారు స్పష్టంచేశారు. అంతేకాదు "ఈ రసశబ్ద వ్యాఖ్యానానికి భరత మహర్షి పాదం పట్టి లాభం లేదు. పాశ్చాత్య లక్షణాన్ని ఉపలక్షించాలి" అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యానించారు.

సౌందర్య శాస్త్రంలో రస-రామణీయకత్వాల వివేచనాన్ని పురాణం సూరి శాస్త్రి గారి మాటలలో "రసానుభవము కళోత్పత్తికి పూర్వమేర్పడుటయే గాక కారణము కూడనగుచున్నది". దువ్వూరు రామిరెడ్డి గారు "అచేతన వస్తువులు కూడ రమణీయ భావముల బ్రేరేపించును. అవి యనుభవించినపుడు ఆనందము పుట్టును. సుఖానుభవ యోగ్యమగు ప్రతి భావమును రసత్వము పొందును" అని చెప్పారు.

"నభావహీనో అస్తిరసః" అని కదా శాస్త్ర వాక్యం. భావం లేనిదే రసం లేదు. భావముంటే సామాజిక మనోవికారం. అది కావ్యార్థాన్ని భావుకులచే ఆస్వాదింపచేస్తుంది అని ఫలితార్థం. భావం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకుంటే సమాధానంగా భావయంతి - నిష్పాదయంతి రసానితి భావాః అని, భావయంతి - భావాది వ్యపదేశంజనయంతీతి భావాః అని ఉభయ విధాలుగా గ్రహించవచ్చు.

అలంకారాలు కూడ రసపోషకాలు అవుతాయా? అనే విషయమై ఆలోచిస్తే కొన్నిసార్లు అవి రసవద్భావాన్ని కలిగించే విషయం నిజమే. ఉదాహరణకు

"మొదట చూచిన కడుగొప్ప పిదప కురుచ<br>
అది కొంచెము తరువాత నధికమగును<br>
తనరు దిన పూర్వ పరభాగ జనితమైన<br>
ఛాయ పోలిక కుజన సజ్జనుల మైత్రి" అనే పద్యం.

ఈ పద్యంలో సజ్జన, కుజనుల మైత్రీ తారతమ్యం చెప్పబడింది. ఈ మైత్రికి దిన పూర్వ పరభాగ జనితమైన ఛాయను ఉపమానంగ చెప్పటం వలన సరసత్వం కలిగి మంచి కవిత్వమైంది. కవి తాననుభవించిన భావావేశాన్ని మనలో రసభావంగా ఉద్భిన్నం చేసేందుకు చేసే ప్రయత్నమే కవిత్వ రచన. మన హృదయంలో రసభావాన్ని పుట్టించి, దానిని పోషించి, రస రూపంలో ఆస్వాదింప చేసే శక్తి గల పదాలు కావ్యంలో ఉంటాయి. అందుకే 'కావ్యం రసవంతం' అంటాం. రసభావాన్ని స్ఫురింప చేసే ఆ

శబ్ద శక్తికే రసధ్వని అని పేరు.

ప్రకృతి వైచిత్ర్యాలు, ప్రియ దర్శనులు, చిత్ర శిల్పాదులు ప్రత్యక్షంగ కన్నులకు గట్టి రస సౌందర్య చింత నేర్పరుస్తాయి. సంగీతం ప్రత్యక్షంగా శ్రవణేంద్రియాలను తాకి రసధ్యానమేర్పరుస్తుంది. కావ్య పఠనం ఇట్టి సౌందర్య విచారణను కల్గించినను కావ్య నిర్దష్టాలైన విషయాలు ప్రత్యక్షంగా ఇంద్రియ గోచరం కావు. పదాలకు, భావాలకు, వస్తువులకును స్పందించి మానసకోశం ఆ పదాలు నిరూపించే విషయాలను మానస వీధిలో ప్రత్యక్షం చేస్తుంది. ఇలా సాక్షాత్కరించిన విషయచ్ఛాయలను చింతిస్తూ రసానందం అనుభవిస్తున్నాం. కావ్య పఠనం వలన జనించే రసయోగం వ్యంగ్య ప్రభూతమై, పద సూచితమై ప్రత్యక్షేతరంగా ఉంటుంది అని పురాణం సూరిశాస్త్రి గారి అభిప్రాయం.

మన చిత్తం ఒక విషయంపై చూపు నిలిపి దానిని సంతోషంగా, ఉత్సాహంగా చింతించటం మొదలుపెట్టినప్పుడు మన మానసం రసయోగం అధిష్ఠించిందని చెప్పవచ్చు. ఇట్టి స్థితిలో మన మనుభవించే మానస వ్యాపార విశేషాలు రసానుభవ మనబడతాయి. రస సౌందర్య విరాజితాలైన విషయాలను చింతించినపుడెల్ల ప్రీతి, ఆనందం, సంతోషం కలుగుతాయి. ఇట్టి రసానందం అనుభవించే సమయాలలో మన శక్తియుక్తులు పెల్లుబ్బి జీవ సంచలన వికాసం కలుగుతుంది. మన రాగ ద్వేషాలు, భావోద్రేకాలు చల్లబడి ఒక విధమైన సాధుత్వం కలుగుతుంది. మానసం అనిర్వచనీయ సంతోష తేజః పుంజంలో సంకల్ప హీనమై, నిశ్చల సంతుష్టితో తేలుతూ ఉంటుంది అనేది పాశ్చాత్య రస సౌందర్య తత్వ సమాలోచన సంప్రదాయం.

మానవ చైతన్యంలో ఉన్న ఊర్ధ్వ ప్రకృతి, అధః ప్రకృతి అనే రెండు భాగాలు ఉన్నాయి. స్థాయి భావమనేది సాధారణంగా అధః ప్రకృతిలో జనించి సుఖానుభూతిని కల్గిస్తుంది. కాని అది లౌకిక భావోప స్పర్శనం కలిగి రజోగుణ కలుషితమై ఉంటుంది. అందలి కాలుష్య క్షాళనం జరిగిన తరువాత అది పరమానందప్రదం అవుతుంది. దీనినే అరిస్టాటిల్ "పర్గేషన్" అన్నాడు. దీనికే 'భావనము' అని పేరు. ప్రతి సుఖానుభూతి ఆనందానికి పర్యాయం కాదు. సుఖం మనస్సుకు సంబంధించినది. ఆనందం ఆత్మ సంబంధి. రజో గుణ సంబంధమైన లౌకిక కాలుష్య క్షాళనమే రస పరిపోషణ ప్రక్రియ. ఆ పరిపోషణ వల్ల అధః ప్రకృతిలో జనించిన రసభావం క్రమంగా ఊర్ధ్వ ప్రకృతి గతమై భావి తత్వాన్ని పొంది, చైతన్యమంతా తానై పరమానందం కలుగుతుంది. పరమానంద జనకమైనప్పటి ఆ భావ స్వరూపానికే 'రసం' అని పేరు.

కవి చేసెడి రసపోషణ వల్ల ఆ మాలిన్యమంతా రెండు మూడు దశలలో క్షాళితమై పోతుంది.

## 6.2 రస సూత్రం

రసాన్ని గురించి, దాని పరిణామ క్రమాన్ని గురించి, దాని స్వాదుత్వాన్ని గురించి ప్రపంచంలో మొదట చెప్పిన వాడు భరతుడు. "నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే" రసాన్ని వీడి ఏదియును ఉండదు అని భావం. భరతుడు చెప్పిన రస సూత్రం ఇది.

"విభావానుభావ వ్యభిచారి సంయోగాత్ రస నిష్పత్తిః". విభావ, అనుభావ, వ్యభిచారి భావాల సంయోగం వలన రస నిష్పత్తి జరుగుతుందని అర్థం. కావ్య సామగ్రి అంతా ఆ రస వ్యంజకత్వానికే ఉపకరిస్తుంది.

"యథాహి నానా వ్యంజ నౌషధి ద్రవ్య

సంయోగాద్రస నిష్పత్తిర్భవతి" . . . . . . అనే

పద్ధతిలో బెల్లం, ఏలా మరీచికాదులైన ఓషధుల సంయోగం వలన శ్రేష్ఠమైన రసాయనంగా సిద్ధమైనట్లు బహువిధాలైన విభావాదుల కూడికచే స్థాయి భావాలు రసంగా నిష్పన్నమౌతాయి.

"రసః ఇతికః పదార్థః ఉచ్యతే - ఆస్వాద్యత్వాత్"
(రసమని ఏ పదార్థం చెప్పబడుతుంది)

"రస్యతే - ఆస్వాద్యతే ఇతి రసః"
(ఆస్వాదింప బడేది రసం)

"కథమ్ - ఆస్వాద్యతే"
(ఎట్లా ఆస్వాదింపబడుతుంది).

అనేక రుచులతో కూడిన వ్యంజనాలతో కూర్చబడ్డ అన్నం తింటూ ఆయా రసాలను (షడ్రుచులు) ఆస్వాదించి సంతోషించినట్లు, ఆంగిక, వాచిక, సాత్త్విక వ్యాపారాలచేత సముపనీతములై, వివిధ భావాభినయాలచే వ్యంజితాలైన స్థాయి భావాలను సహృదయులైన ప్రేక్షకులు హర్షిస్తారు. నాట్యం వలన రస్యమానాలైనందున ఇవి నాట్య రసాలైనవి. కాని ఈ రస ప్రక్రియ, అనుభూతి శ్రవ్య దృశ్య కావ్యాలు రెండింటికి సమానమే.

దృశ్య కావ్యాలలో నట ప్రయుక్తమైన భావాలు రసాస్వాదనకు తోడ్పడగా, శ్రవ్య కావ్యాలలో సందర్భోచిత పద ప్రయోగాదులు తోడ్పడతాయి.

రసం నుండి భావం పుడుతుందా? లేక భావం నుండి రసమా? అని ప్రశ్నించుకుంటే పరస్పర సంబంధంచే రసభావాలు నిష్పన్నమౌతాయని కొందరన్నట్లు భరతుని సమాధానం.

భావయంతి - నిష్పాదయంతి రసాన్ ఇతిభావాః
భావయంతి - భావాది వ్యపదేశంజనయుంతి ఇతి భావాః

"దృశ్యమైనను, శ్రవ్యమైనను రస భావ స్ఫోరకమైనది కవి వాక్యమే. నాటకమైనచో పాత్రలును, తదభినయమును ఆ స్ఫురణ కలుగుటకు మరి కొంత సాయపడును." అన్న పింగళి లక్ష్మీకాంతం గారి వాక్యాలిట స్మరణీయాలు.

## 6.3 రససిద్ధి

కవి మనస్సులో ఉన్న భావసంపద, మనలో రసభావాలు కల్గించేటట్లు ఉచిత పదప్రయోగం, వాక్య లేదా పద్య నిర్మాణం చేయడమే కవి యొక్క నైపుణ్యం. అనగా ఆ కవి కావ్యంలో ఉన్న శబ్ద శక్తి మన హృదయంలో 'రసభావం' పుట్టించి దానిని పోషించి, రస రూపంలో ఆస్వాదింపచేస్తుంది. కాబట్టి రసభావం యొక్క పరిణామమే <u>రససిద్ధి</u>. రసభావాన్ని స్ఫురింపచేసే శబ్ద <u>శక్తి</u> <u>రసధ్వని</u>. రసభావం పరమానందాన్ని కల్గించినప్పటి భావ స్వరూపమే <u>రసం</u>. స్థాయి భావం లౌకిక కాలుష్యమంతా క్షళనమైన తరువాత వ్యభిచార భావాల స్థాయినుండి సాత్త్వికావస్థకు చేరి రసత్వం పొందుతుంది. ఆ సాత్త్వికావస్థను కూడ దాటి ఇతర వివర్తాలు లేకుండ ఆనందామృతంగా పరిణమిస్తుంది. అదే రసానందం.

కావ్యం చదివేటప్పుడు ఈ కార్యకలాపమంతా జరుగుతుందా? జరిగితే ఆ క్రమం ఎక్కడా కన్పించడంలేదు కదా? అని అనుమానం రావచ్చు. గ్రంథంలో మొదటి పద్యంతోనే రసానందం ఎట్లా కలుగుతుందని అన్పించవచ్చు. కొన్ని కావ్యాలలో ఎంత చదివినా అసలేం కలుగలేదేమని సందేహం రావచ్చు. నిజానికి ఈ రస పరిపోషణను క్రమమనే కార్యకలాపమంతా విస్తృతమైన కథలున్న కావ్యాలకు తగిన ప్రక్రియ. విపులమైన కావ్యాలలో నిజంగా రసపరిపోషణ జరిగిన చోట మనకు తెలిసినా, తెలియకపోయినా ఈ పరిణామం జరిగితీరుతుంది. కావ్యాలలో రససిద్ధి కావ్యం చివర మాత్రమే జరుగుతుందన్న నియమంలేదు. చివరగాని,

మధ్యలోగాని జరుగవచ్చు. ఎన్నిసార్లైనా ఆ అనుభూతి, ఆనందం కలుగవచ్చు. నిపుణుడైన కవి తన హృదయ పరిపక్వదశలో భావన చేసి రచించిన పద్యమైనచో రసభావం సాత్త్వికావస్థలోనే కలుగవచ్చు. ఆ మరుక్షణమే దాని స్వచ్ఛ రూపమైన ఆనందం కల్గుతుంది. ఒక్కొక్క కావ్యంలో రస పరిపోషణ జరిగి రససిద్ధి లేకపోవచ్చు. అందుకే ఖండ కావ్యాలు, చాటు పద్యాలు మొదలైన వాటిలో రసానందం కలగాడానికి కవి నైపుణ్యమే కారణం గాని కావ్య కలాపం గాదు.

శాస్త్రీయమైన రస పరిపోషణకు అవకాశం లేనప్పుడు ఒకటి, రెండు విడి పద్యాలలో ఆనందానుభూతి ఎట్లు కలుగుతుంది. అనే ప్రశ్నకు అసంలక్ష్యక్రమంలో అని ఆలంకారికుల సమాధానం. కాని భావుకుడైన కవి చేత భావితమైన భావం కావ్యంలో వ్యక్తం చేయబడినపుడు అది మనలో భావితమైన రూపంలోనే ఆవిర్భవించి వెంటనే ఆనందాన్ని అందిస్తుంది. రసభావ స్పర్శ ఏ మాత్రం లేని పద్యాలలో ఆహ్లాదం కలగడానికి కావ్యాంశాలలో చెప్పిన భావన, ఆలోచన, పదగుంఫన అనేవాటిలో ఏవైనా కారణం కావచ్చు. రససిద్ధి కలగడానికి కావ్యం పఠించేటప్పుడు పఠిత చిత్తవృత్తి అనుకూలంగా ఉండాలి. ఆయా వర్ణనలు చేసే సందర్భంలో ప్రకృతి పదార్థాల రామణీయకతను దర్శించటంలో కవి చిత్తవృత్తి అనుకూలంగా ఉండాలి. కావ్యం ప్రతిపాదించే సత్యంలో సాధారణీకృతి ఒక భాగం. శకుంతలా దుష్యంతుల కథను చదివేటప్పుడు రసభావ జన్యమైన ఆనందాన్నునుభవించే టప్పుడు ఆయా పాత్రల పరమైన పరిజ్ఞానం నశించి సర్వలోక సాధారణమైన యువతీ యువకులు మాత్రమే మనో ఫలకంలో నిలుస్తారు. అదే తాదాత్మ్యం, శిల్ప వస్తువుగా స్వీకరింప బడే పాత్ర దేశ, కాలాల నుండి కవిచే వేరు చేయబడి సార్వ లౌకికంగా చిత్రింపబడి సార్వకాలికం అవుతుంది. ఇది కూడ సాధారణీకృతి కొక కారణం. దీని మూలంగా సహృదయులందరూ తాదాత్మ్యం పొంది రసాస్వాదన చేస్తారు.

## 6.4 స్థాయిభావం

"విభావైరనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభి చారిభిః
ఆనీయమాన స్వాదుత్వం స్థాయి భావో రసః స్మృః"

పై శ్లోకం ఆధారంగా స్థాయి భావమే రసంగా పరిణతి పొందుతుందని భావింపవచ్చు. అంత ప్రాధాన్యమున్న స్థాయి భావం అంటే ఏమిటి?" ఈ ప్రశ్నకు సమాధానంగా 'దశ రూపకం'లో ఈ క్రింది శ్లోకం చెప్పబడింది.

సజాతీయైర్వి జాతీయై రతి రస్కృత మూర్తిమాన్
యావద్ర సంవర్తమానః స్థాయీ భావ ఉదాహృతః

"భావము అనగా భావింప చేయునది" అని అర్థం. మధ్యలో విచ్ఛిన్నంగాకుండ రససిద్ధి పర్యంతం స్థిరంగా ఉండే సహజ పటుత్వం కలిగిన వాసనారూపమైన రసభావాన్ని స్థాయిభావం అంటారు. మనోధర్మ శాస్త్రం పదునాలుగు వాసనా రూపమైన భావాలను చెప్పినప్పటికిని ఆలంకారికుల మతం ప్రకారం స్థిరత్వం కలిగి స్థాయిభావం అనిపించుకో దగినవి తొమ్మిది మాత్రమే. ఈ స్థాయి భావోదయం ఇతర పూర్వ సంస్కారాల మాదిరిగానే నిగూఢంగా ఉండి, కావ్యోద్బోధకంచే తలచూపి నెలకొంటుంది. అట్టి వాసనలేని మనస్సుకు రసాస్వాదన కలుగదు.

సాహిత్య దర్పణంలోని ఈ పద్య పాదం పై భావాన్ని స్పష్టం చేస్తుంది.

"నజాయతే తదాస్వాదో వినా రత్యాది వాసనామ్"

ఆలంబన విభావం స్థాయికి కారణ భూతమవుతుంది. అది స్థాయికి ముందే సిద్ధమై, ప్రేరకమౌతుంది. ఆలంబన విభావంతో పాటు ఉద్దీపన విభావం కూడ ఉంది. ఆలంబన మంటే కావ్య గత వ్యక్తులు, వారి వాక్యాలు.

'వాగంగ సత్వోపేతాన్ కావ్యార్థాన్ భావయంతీతి భావాః'

అని భరతుని ఉక్తి. రసానికి సన్నిహితమైన భావమే స్థాయి భావం. దీనికి రసానికి నూలుకు, వస్త్రానికి వలె ఆకారమే భేదం. మగ్గం మొదలైన వాటి సాయంతో నూలును వస్త్రంగా తయారు చేస్తారు. అదే విధంగా స్థాయి భావం విభావాదుల చేరికవల్ల పరిపుష్టమైన రస వ్యవహారం పొందుతుంది.

"అవస్థితాశ్చిరం చిత్తే సంబద్ధాచ్చాను బందిభాః
వర్థితాయే రసాత్మనః తేస్మృతాః స్థాయినోబుధాః"

అనేది ఆలంకారికోక్తి. సముద్రం నదీ జలాలను తనలో కలుపుకొన్నట్లు స్థాయిభావం తక్కిన భావాలను తనలో కలుపుకొంటుంది.

యావద్రస నిష్పత్తి స్థిరంగా ఉండి తక్కిన విభావాదులకు ఆశ్రయమైనందున స్థాయి భావాలు ముఖ్యాలు.

మానవులందరిలో ఒకే విధమైన కరచరణాదు లున్నప్పటికిని కులశీల విద్యాది విశేషాల వలన కొందరే రాజులౌతున్నారు. బహుజన పరివారం గలవాడే నరేంద్రుడు గాని, పరివార హీనుడు గొప్పవాడైనను నరేంద్రుడు కాలేడు.

"యథానరాణాం నృపతిః శిష్యాణాంచ యథా గురుః
ఏవంహి సర్వ భావానాం భావః స్థాయీ మహానిహ"

ప్రజలలో రాజు, శిష్యులకు గురువు గొప్ప వారైనట్లు భావాలలో స్థాయి భావం శ్రేష్ఠం.

## 6.5 విభావానుభావాదులు

స్థాయి భావం రెండు మూడు దశలలో క్షాళనం పొంది మాలిన్యాన్ని పోగొట్టుకొని, ఉత్తమ ప్రకృతి విభాగానికి కొంత చేరువై, ఆనుషంగికములైన అనేక అవాంతర భావ రూపాలను దాల్చి రసంగా పరిణమిస్తుంది. అటువంటి స్థితి స్థాయి భావానికి కలగడంలో ప్రేరకమైనది విభావాలు. ఇవి ఆలంబన విభావం, ఉద్దీపన విభావం అని రెండు రకాలు. ఈ ఆలంబన విభావం రససమవాయి కారణమని ఆలంకారికుల అభిమతం. ఏది లేకపోతే రసం ఉండదో, అది రసానికి సమవాయి కారణం. కావున రససిద్ధికి ఆలంబన విభావం ప్రథమ కారణం. ఆలంబనమంటే కల్పిత జీవులైన కావ్య గత వ్యక్తులు, వారి వాక్యాలు. దృశ్య కావ్యాలలో నటులు, వారి వాక్యాలు.

ఆలంబన విభావం చేత ఉత్పన్నమైన స్థాయిని కొంచెం ఉద్దీపింపచేసేది ఉద్దీపన విభావం. అంటే స్థాయీ వికాసానికి ఉచితమైన వర్ణనలు మొదలైనవి. ఉదాహరణకు శృంగార రసపరంగా రతి అనే స్థాయి భావానికి రమణీయ ప్రకృతి వర్ణన ఉద్దీపన విభావం. అట్లే రౌద్ర రసానికి సంబంధించి క్రోధం అనే స్థాయీ భావానికి యుద్ధభూమి, హయహేషలు మొదలైనవి ఉద్దీపనం కల్గిస్తాయి. ఈ ఉద్దీపన విభావాన్నే రసోచితమైన వాతావరణం అని ఆధునికులంటారు.

ఆ పైన పాత్రల మనోభావాలను వ్యక్తం చేసే శారీరకమైన కొన్ని చేష్టలను అనుభావాలు అంటారు. ఇవి అభిప్రాయ సూచనాత్మకాలైన కార్యాలు. విభావం కారణంగా జనించటం వలన అనుభావం కార్యమయ్యింది. ఇది శ్రవ్య కావ్యంలో వర్ణనాత్మాకం గాను దృశ్య కావ్యంలో అభినయాత్మకంగాను ఉంటుంది. శృంగార రస ప్రధానమైన కావ్యంలో కడగంటి చూపులు, మందహాసాలు మొదలైన విలాస చేష్టలు అనుభావాలు. రౌద్ర రస ప్రధానమైన చోట ఆయుధచాలనం, పండ్లుకొరకడం మొదలైనవి అనుభావాలు.

ఇవిగాక రససిద్ధి జరగటంలో ముఖ్యమైనవి వ్యభిచారి భావాలు, సాత్త్విక భావాలు మొదలైనవి.

స్థాయిభావం రసంగా పరిణమించడానికి ఉన్ముఖమైనప్పుడు తాల్చే అవాంతర రూపాలకే వ్యభిచారి భావాలని పేరు. ఇవి ఆకస్మికంగా ఎక్కడ నుండే వచ్చి ప్రవేశించేవి కావు. నీరు మరుగుతున్నప్పుడు పుట్టే బుడగల వలె రస పరిపోషణలో తీక్షణతను పొందిన స్థాయి భావం దాల్చెడి రూప వైవిధ్యమే వ్యభిచార భావ పరంపర. అధః ప్రకృతిని వీడీ వీడక మాలిన్యం పోయీ పోక స్థాయి భావం అటునిటు వ్యభిచరించు నప్పటి రూపాలకు వ్యభిచారి భావాలని పేరు. ఇవి ముప్పది మూడు. వీటి వర్ణనలు చదివి నప్పుడు మనస్సులోని స్థాయి భావం మరికొంత పరిపుష్టి చెందుతుంది. సముద్రమందు లేచి పడెడి తరంగాలు ఆ సముద్ర జలాల విజృంభణమై గాని కొత్త నీరుగాదు. అట్లే వ్యభిచారి భావాలు స్థాయి భావం యొక్క విజృంభిత రూపాలే గాని కొత్త భావాలు గావు. రసానుభూతి అనెడి గమ్యానికి మనసు అబిముఖంగా ఉన్నప్పుడు ఉదయించే భావాలు కాబట్టే వ్యభిచారి భావాలైనవి.

వ్యభిచారి భావోదయ వేళకు చిత్తం గమ్యానికి అభిముఖంగా మాత్రమే ఉంటుంది. కాని సమీపస్థం కాదు. సమీపస్థమైనప్పుడు పుట్టే భావాలు సాత్త్విక భావాలు. గాద్గద్యము, వైస్వర్యము, మొదలైన ఎనిమిది సాత్త్విక భావాలు. రజస్తమోగుణ స్పర్శ లేని మనస్సే సత్త్వం. అదే ఊర్ధ్వ ప్రకృతి. అట్టి మనస్సులో పొడమే భావాలు కాబట్టి వీటిని సాత్త్విక భావాలు అంటారు.

"రజస్తమోభ్యామస్పష్టం మనస్సత్త్వమి హోచ్యతే"

వ్యభిచారి భావాలకు వలెనే ఇవి కూడ స్థాయి భావం యొక్క రూపాంతరాలే గాని కొత్తగా పుట్టవు. సాత్త్విక భావోదయ వేళకు స్థాయి భావంలోని రజోగుణ మాలిన్యం పూర్తిగా క్షాళితమై దానికి భావితత్త్వం వస్తుంది. అనుభావాలకు వలెనే ఇవి శరీరజాలు. అనుభావాలు పుట్టినప్పుడు మనస్సుకు పరవశత్వం ఉండదు. కాని గాద్గద్యం మొదలైన సాత్త్విక భావోదయం జరిగినప్పుడు మనస్సుకు పరవశత్వం ఉండి, ఇవి వాటంతట అవే పుడతాయి.

"పృథ గ్భావా భవంత్యన్యే ऽనుభావత్వే ऽపి సాత్త్వికాః<br>సత్త్వాదేవ సముత్పత్తేః తచ్చతద్భావ భావనమ్"

(శరీరజా లైనప్పటికి సత్త్వం నుండి పుట్టుట చేత సాత్త్వికాలనే వేరే భావాలైనాయి. అదియే క్షాళిత స్థాయి భావం యొక్క శుద్ధ రూపం). ఇట్టి సత్త్వస్థితిలో ఆత్మ ప్రతిఫలనం కొద్దిగా కలుగుతుంది.

## 6.6 సమీక్ష

విభావానుభావ సాత్త్విక వ్యభిచారాలచే ఆస్వాద యోగ్యతను పొందిన స్థాయి భావమే రసం. రసానందంత్ర గుణాతీతం. రసానందం అనుభవించే టప్పుడు శారీరక, మానసిక, వ్యాపారమంతా అణగిపోయి ఆనంద స్వరూపమైన ఆత్మ మాత్రమే ప్రకాశిస్తుంది. అంటే స్థాయి ఆత్మలో లీనమై బ్రహ్మానంద సమమైన ఆనంద రూపంలో అభివ్యక్తమౌతుంది. అదే రసానుభూతి. ఆ పరిణత రసావస్థలో వివిధ రసావిర్భావం జరుగుతుంది. విభావానుభావాది సామగ్రి అంతా ఈ ప్రక్రియలో తోడ్పడుతుంది. ఏ రసంలో నైనా లౌకిక కాలుష్యం ఉండదు. అంతా శాంతిమయమైన ఆనందం. రసధుని అని చెప్పదగిన శ్లోకం చదువుతున్నప్పుడు ఆనంద భాష్పాలు రావడం, గొంతు గాద్గద్యం పొందటం మొదలైనవి సాత్విక భావానుభావాలైతే, ఆ అనుభవంలో కళ్ళు మూసికొని పరవశం కావడం సంపూర్ణ రసానందానుభవం. ఈ రసానందాన్ని బ్రహ్మానంద సబ్రహ్మచారు అనడానికి కారణం బ్రహ్మానందం ఆలంబనాన్ని అపేక్షించదు. రసానందానికి ఆలంబనం లేక జరగదు. ఆ ఆనందం అనుభూతి కర్హమైన హృదయం గల వారికే లభిస్తుందని వారే సహృదయులని సారాంశం. అందుకే లోకోత్తర చమత్కార ప్రాణులైన కొంతమంది ప్రమాతల చేతనే (తెలిసికొనగలవారిచేతనే) ఆత్మ సాక్షాత్కారం కంటె భిన్నంగాని విధంగా రసమాస్వాదింప బడుతుంది. అది కూడ కావ్యంతో శ్రుతి గలిపిన చిత్తవృత్తి ఉన్నప్పుడు మాత్రమే.

ఇతరుల కథలు చదవడం, చూడటం మొదలైన సందర్భాలలో అందరకు ఆనందం కలగడానికి కారణం సాధరణీకరణ. దీనివలన ఇది పరునిది మనది అన్న వివక్ష తొలగిపోయి సర్వలోక సాధారణమైన భావన కలిగి ఆనందం సొంతమౌతుంది.

## 6.7 ప్రశ్నలు

1. రస స్వరూపాన్ని వివరించండి.
2. స్థాయి భావాన్ని గురించి వివరించండి.
3. రససిద్ధిలో విభానుభవాల ప్రాధాన్యాన్ని చర్చించి వ్యభిచారి భావాలను, సాత్విక భావాలను గూర్చి వివరించండి.

## 6.8 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు
3. ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం - డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం

**డాక్టర్ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు - 522 124

# పాఠం - 7

# రసనిష్ఠ

పాఠ్యనిర్మాణక్రమం

7.0 లక్ష్యం
7.1 రసం ఎవరి యందు ఉద్భవిస్తుంది? లేదా ఎవరి యందుంటుంది?
7.2 భట్టలోల్లటుని వాదం - చర్చ
7.3 శ్రీశంకుకుని వాదం - చర్చ
7.4 అభినవగుప్తుని వాదం - చర్చ
7.5 వివిధ వాదాలు ఆధారంగా చేసిన సిద్ధాంతాలు - తుది నిర్ణయం
7.6 సమీక్ష
7.7 ప్రశ్నలు
7.8 ఉపయుక్త గ్రంథాలు

## 7.0 లక్ష్యం

రస స్వరూపాన్ని గురించి తెలిసికొన్న తరువాత రసాస్వాదన చేయడానికి ఎవరు ఆధారం? రసం ఎక్కడ, ఎలా పుడుతుంది అనే విషయాలను గురించిన సమాలోచన చేయడం.

## 7.1 రసం ఎవరి యందు ఉద్భవిస్తుంది? లేదా ఎవరి యందుంటుంది?

"విభవాను భావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుడు రససూత్రాన్ని చెప్పాడు. ఈ రసనిష్పత్తిని గూర్చి వివరించటంలో ఆలంకారికులు భిన్న దృక్పథాలను ప్రదర్శించారు. వారిలో భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు, భట్టనాయకుడు, అభినవగుప్తుడు ముఖ్యులు. వీరిలో భట్టలోల్లటుడు రసోత్పత్తివాది. ఇతని అభిప్రాయం ప్రకారం రసం అనుకార్యుడైన నాయకుని యందుంటుంది. శ్రీశంకుకుడు రసానుమితివాది. ఇతని ఆలోచన ప్రకారం విభావాదులున్న చోట రసముంటుంది. అనగా నటులయందే రత్యాదులను సామాజికుడూహించును. భట్ట నాయకుడు రసభుక్తివాది. రస సూత్రంలో చెప్పిన సంయోగ శబ్దానికి 'భోజకత్వం' అనే అర్థాన్ని చెప్పాడు. అదే విధంగా నిష్పత్తి శబ్దానికి 'భుక్తి' అనే అర్థాన్నిచ్చాడు. భోజకాలైన విభావాదుల సంబంధంతో 'స్థాయి' భోజ్యమౌతుంది. అదే రసం అని ఇతని అభిప్రాయం.

అభినవగుప్తుడు రసాభివ్యక్తి వాది. వ్యంజకాలైన విభావాదుల మూలంగా సహృదయ నిష్ఠమై ఉన్న స్థాయి భావం రస రూపంగా అభివ్యక్త మౌతుందని ఇతని వివరణ.

## 7.2 భట్టలోల్లటుని వాదం - చర్చ

ఇతడు రసం అనుకార్యనిష్ఠమని ఒక వాదం చేశాడు. ఇతనిది రసోత్పత్తి వాదం. అనుకార్యనిష్ఠమనగా అనుకరించబడుచున్న రామాదులయందుండునని అర్థం. తమ నటనాకౌశలంతో ఆయా పాత్రలను పోషించి వీరే రామాదులనబడే విధంగా నటిస్తున్న

నటులయందున్నట్లుగా అన్పిస్తుంది. త్రాడును చూచి పాము అనుకొన్నప్పుడు కలిగే భయం త్రాడు వలననే కల్గుతుంది. అదే విధంగా నటునియందున్నట్లు భ్రాంతితో భావింపబడ్డ రసం కూడ ప్రేక్షకుల హృదయంలో ఒక చమత్కారం కలిగించి ఆనందింప చేస్తుంది.

ఈ వాదం ప్రకారం సామాజికుడు రసానందం పొందటం జరగదు. రసోదయం ఒకచోట, ఆనందానుభవం మరొకచోట జరగటం తర్కసహం గాదు. అనుకార్యునిలో రసచ్ఛాయలున్న వేదనానుభవం మాత్రమే ఉంటుంది. రసానందం పుట్టదు. అతని లోని వేదన ఎంత నిశితమైనను లౌకిక మనో వికారం యొక్క పరాకాష్ఠనే అందుకొంటుంది గాని లౌకిక కాలుష్య రహితంగా, త్రిగుణాతీతమైన ఆనందంగా పరిణమించలేదు. దుఃఖించే వ్యక్తి ఆ బాధలోని తీక్షణతను మాత్రమే అనుభవిస్తాడు గాని, ఆనంద రూపమైన కరుణను ఆస్వాదింపలేడు. బాధ అధికమైన కొలది కన్నీరు, గాద్గద్యం మొదలైన తీవ్ర రూపాలు కల్గవచ్చు. అది అధికమైన దుఃఖం వల్ల కలిగే తీవ్రతయే గాని, సాత్త్విక భావాలు గావు. దుఃఖంలో ఆనందాన్ననుభవించడం శాస్త్ర విరుద్ధం మాత్రమే గాదు. లోక విరుద్ధం కూడ. అట్లే సుఖం విషయంలో కూడ నాయికకు సంబంధించి నాటకుడనుభవించే సుఖం కూడ శరీరవాంఛలకు, విషయ సుఖాలకు సంబంధించిందే గాని స్వతంత్రం, అలౌకికంయైన ఆనందంగాదు. కాబట్టి లోకంలో అనుకార్యునిలో రసం లేదు.

## 7.3 శ్రీశంకుకుని వాదం - చర్చ

ఇతనిది అనుమితి వాదం. "యత్రధూమస్తత్రాగ్నిః". పొగ ఉన్న చోట నిప్పు ఉంటుంది అనే అనుమాన ప్రమాణం దీనికి మూలం. నాట్య కౌశలంతో రామాది పాత్రలను ధరించి నటించే నటులను చూచి సామాజికుడు వీరే రామాదులని భావిస్తాడు. ఆ నటులలో విభావాదులుండటం వలన ఆ నటుల యందే రత్యాది భావాలను సామాజికుడు ఊహిస్తాడు. ఎందుకంటే ఈ వాదంలో విభావాదు లెక్కడ ఉంటే రసం అక్కడ ఉంటుందనేది ప్రమాణం.

కాని అనుకర్తయైన నటునిలో రసం ఉండటం సత్యం కాదు. ఇతడు లోకులను (అంటే ఇతర పాత్రలను) వారి వర్తనను అభినయించి రసాన్ని ప్రేక్షకులు లేదా సామాజికులు అనుభవించేలా చేస్తాడు. అంతే కాని స్వయంగా రసాస్వాదన చేయడు. అతనికి రసం పట్ల ఆసక్తి ఉండి ఉండవచ్చు. అనుభవం ఉండదు. అభ్యాసం వల్ల పుట్టిన కౌశలంతో అనుభవం ఉన్నవాని వలె రంగం మీద కన్పిస్తాడు. ఈ నటుడు తనను మరచిపోయి, అనుకార్యుని ఆకారాన్ని, ప్రవర్తనను ప్రదర్శిస్తాడు. తన శరీరం అనెడి భిత్తిక మీద అనుకార్యుని చిత్రిస్తాడు. ఇది నటుని ధర్మం. సజీవ పాత్ర కావడం వల్ల కొన్ని రస భావాలను అనుభవించటంలో అప్పుడప్పుడు కొన్ని రకాల ప్రలోభాలకు అవకాశం ఉంటుంది. వేడి పాలు పోస్తే పాత్ర కూడ వేడెక్కుతుంది. అలాగే నటునికి కూడ కొద్దిపాటి అనుభవం కలగటం తప్పు కాదు. కలగకుండా నివారించటం కూడా కష్టమే.

'కావ్యార్థ భావనా స్వాదోనర్తకస్య నావార్యతే' అని దశ రూపకంలో చెప్పారు.

అయినప్పటికిని అతని అనుభవం సామాజికుని అనుభవం వలె తీవ్రమై ఆనందపారవశ్యంగా పరిణమిస్తే రంగ నిర్వహణ సాగించలేడు. అనివార్యంగా భావోదయం కలిగినా అది నిగ్రహింపబడాలి. ఏ కొద్ది భావానుభవం కలిగినా అతడు సామాజికుడు అవుతాడు గాని నటుడు కాడని 'సాహిత్యదర్పణ' కారుని ఉద్దేశ్యం.

"శిక్షాభ్యాసాది మాత్రేణ రాఘవాదేః స్వరూపతాం
దర్శియన్ నర్తకోనైవ రసాస్వాద కోభవేత్"
నాయం జ్ఞాప్యః స్వసత్తాయాం ప్రతీత్య వ్యభిచారతః
కావ్యార్థ భావనే నాయమపి సభ్యపదాస్పదమ్"

(శిక్షాభ్యాసాదులతో అనుకార్యుని సారూప్యాన్ని ప్రదర్శించే నర్తకుడు రసాస్వాదకుడు కాకూడదు. ఒకవేళ అట్టి భావన అతనికి కలిగితే అప్పుడు అతడు సామాజికుడవుతాడు గాని నటుడు కాడు).

నట ధర్మానికి భంగం కలగనంత వరకు అతని కావ్యార్థ భావన ఆమోద యోగ్యం. ఉత్తమ నటుడు తాను నవ్వుకుంటూ అధికమైన దుఃఖాన్ని ప్రదర్శించగలడు. ఏడ్చినట్లు కన్పించి ప్రేక్షకులను ఏడ్పించటమే గదా నటన. లేనిది ఉన్నట్లు నటించటమే గదా నటన. కాబట్టి అనుకార్యునిలో వలెనే అనుకర్తయైన నటునిలోను రసం లేదు.

## 7.4 అభినవగుప్తుని వాదం - చర్చ

అభినవగుప్తుని సిద్ధాంతాన్ననుసరించి రసాన్నునుభవించే వాడు నాటక విషయంలో సామాజికుడు, శ్రవ్య కావ్య పరంగా కావ్య పఠనం చేసేవాడు. ఈ అభినవ గుప్తుడు ధ్వన్యాలోక వ్యాఖ్యాత. ఇతని సిద్ధాంతం భరతుని అభిప్రాయానికి అనుగుణంగానే చేయబడింది. స్వగోచరమై, అలౌకిక చమత్కార రూపమైన, ఆస్వాదంగలట్టి దైన రసం అఖండానంద స్వరూపం. లౌకిక రసం అనుకార్యులైన రామాదులందున్నప్పటికిని అలౌకికమైన రసం సామాజికుని యందే ఉంటుంది.

రసానుభూతి ఆత్మాశ్రయమైన సత్యమా లేక పరాశ్రయమైన సత్యమా? లేక అసలు అసత్యమా? అనే ఆలోచనలకు సమాధానం ఇది ఆత్మాశ్రయ సత్యమని ఈ అభివ్యక్తి సిద్ధాంతం ద్వారా చెప్పబడింది. రస భావం ఉద్భవించటం, అది రసంగా అభివ్యక్తం కావటం కూడ సామాజికునిలోనే అనే సిద్ధాంతం (అభివ్యక్తి సిద్ధాంతం) అభినవగుప్తునిది. వాసనారూపమైన బీజం లేనిదే అభివ్యక్తి లేదు. ఆ బీజం సామాజికుని హృదయంలో వాసనా రూపంలో గూఢంగా ఉండడం వలననే, సామాజికుడు రసాభివ్యక్తి ద్వారా రసానందాన్ని అనుభవిస్తున్నాడు. ఆ అనుభవం సామాజికునికి ప్రత్యక్షమే యైనందువల్ల రసానుభూతి ఆత్మాశ్రయ సత్యమే.

## 7.5 వివిధ వాదాలు ఆధారంగా చేసిన సిద్ధాంతాలు - తుది నిర్ణయం

రసం సామాజికాశ్రయం అనేది ఆరోప మూలకమేగాని వాస్తవికం గాదని మహోపాధ్యాయ నరహరి సూరి అన్నాడట. ఆయన అభిప్రాయం ప్రకారం రసం పరిపూర్ణాఖండానంద రూపం. పరమేశ్వర పర్యయం. బ్రహ్మానందం యోగి గమ్యం. రసానందం విభావాద్యనుసంధాయక హృదయ గమ్యం. ఇట్టి దానికి ఆశ్రయ విచారం లేదు. అఖండానంద రూపం అనాధారం అయిన రసం సామాజికులచే చర్వ్యమాణం కావడంతో రసం సామాజికాశ్రయం అని ఆరోపించి వ్యవహరించారు. 'రస రత్న ప్రదీపక' అనే అలంకార శాస్త్ర గ్రంథంలో చెప్పిన దానిని బట్టి -

నిత్యానిత్య భేదాలతో సుఖం రెండు విధాలు. బ్రహ్మ స్వరూపమైనది నిత్యం. విషయోద్భవమైంది అనిత్యం.

విషయోన్ముఖమైన ఈ లోకంలో నిత్య సుఖ ప్రచారం విరళం. వైషయిక సుఖం నానారుచి వశాన బహుదాభిన్నమై దాని పరిణతత్వంలోనే సుందరమౌతున్నది. రసరూపమైన సుఖం పై రెండింటికినీ మధ్యమమై అనిర్వాచ్యమని పూర్వులు నిరూపించారు. కావున అసారమైన సంసారంలో రసమే సారం అనేది నిశ్చయం.

పాశ్చాత్యులలో రసానుభూతిని గూర్చి మొదట ప్రస్తావించిన పండితుడు అరిస్టాటిల్. అశుభాంత నాటకాల ప్రయోజనాన్ని గూర్చి చెపుతూ అవి సామాజికునిలో శోక భయాలను ఉద్రేకింప చేసి, వాటికి క్షాళనం కల్గిస్తాయని తెలియచేశాడు. ఈ వాదాలను బట్టి అరిస్టాటిల్ సిద్ధాంతం రస సిద్ధాంతానికి సన్నిహితం అని స్పష్టమౌతుంది. కెథార్సిస్ అనే పదానికి మన 'భావన' అనే పదం పర్యాయ పదం వంటిదిగా భావింపవచ్చు. మనో వికారమైన స్థాయి భావం, సాత్త్వికత్వాన్ని పొందే ప్రక్రియే భావన.

రసానందం అలౌకికం అంటే లౌకిక జీవితంలోని సుఖాల కంటె భిన్నమై, ఆధ్యాత్మికమైన బ్రహ్మానందము కంటె వేరై, రెండింటికి నడుమ ఇంకొక స్వతంత్ర స్థితి కలది అని 'సాహిత్య శిల్ప సమీక్ష' కారుల నిర్ణయం.

## 7.6 సమీక్ష

పై వాదాల సారాంశంగా రసం సామాజిక నిష్ఠం అనే అభిప్రాయం బలపడుతుంది.

## 7.7 ప్రశ్నలు

1. 'రసం అనుకార్యనిష్ఠం' అనే సిద్ధాంతాన్ని గూర్చి చర్చించండి.
2. 'రసనిష్ఠ'కు సంబంధించిన వివిధ వాదాలను తెలియచేసి, రసం ఎవరి యందుంటుందో నిరూపించండి.

## 7.8 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు



**డాక్టర్ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు - 522 124

# పాఠం - 8

# రస సంఖ్య

పాఠ్యనిర్మాణక్రమం

8.0 లక్ష్యం
8.1 రసాలు ఎన్ని?
8.2 వివిధ వాదాలు
8.3 శాంతం - రసమా - కాదా - చర్చ
8.4 వివిధ రస స్వభావాలు
8.5 రస సంఖ్య - నిర్ణయం
8.6 సమీక్ష
8.7 ప్రశ్నలు
8.8 ఉపయుక్త గ్రంథాలు

## 8.0 లక్ష్యం

రస సంఖ్య విషయంలో ఉన్న వివిధ అభిప్రాయాలను చర్చించి ముఖ్యమైన రసాలను గుర్తించటం.

## 8.1 రసాలు ఎన్ని?

రసాలు తొమ్మిది అనే మాట లోక ప్రసిద్ధం. మొదట ఈ సంఖ్య ఎనిమిదిగా చెప్పబడింది. తరువాత కొందరు తొమ్మిదిగా చెప్పారు. ఆ తరువాత కొందరు రస సంఖ్యను పదకొండు, పన్నెండుగా కూడ చెప్పారు. రసాలు ఎనిమిది అని చెప్పిన వారి లెక్కలో శాంత రసం లేదు. లాక్షణికులలో మూల విరాట్టుగా చెప్పదగిన భరతముని తన నాట్య శాస్త్రంలో ఎనిమిది రసాలను ఈ క్రింది శ్లోకంలో పేర్కొన్నాడు.

"శృంగార హాస్య కరుణాః రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
ఏతేహ్యష్టౌ రసాః ప్రోక్తాద్రుహిణేన మహాత్మనా"

భరతముని తాను వ్రాసిన నాట్య శాస్త్రంలోనే ఈ ఎనిమిది రసాలకు స్థాయి భావాలను కూడ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"రతి ర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చేతి స్థాయి భావాః ప్రకీర్తితాః"

దీని ననుసరించి కాళిదాసు, వరరుచి మొదలైన వారు ఎనిమిది రసాలనే గుర్తించారు. దండి మొదలైన ప్రాచీన లాక్షణికులు కూడ ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు.

అనంతర కాలంలో తొమ్మిది రసాలను అంగీకరించిన వారు శాంత రసాన్ని కూడ చేర్చి తొమ్మిదిగా పరిగణించారు. రుద్రటుడు ప్రేయస్సును కూడ చేర్చి రసాలను పదిగా భావించాడు. ఆ తరువాత భక్తి, వాత్సల్యం, ప్రీతి, స్నేహం, శ్రద్ధ, మృగయ,

అక్షాదులన్నీ రసాలుగా కొంతమంది చెప్పారు. వంగ దేశంలోని వైష్ణవ ఆలంకారికులు మధుర, ఉజ్వల, శాంత, దాస్య, సఖ్య వాత్సల్యాదులను రస విశేషాలుగా చెప్పారు. జైనాచార్యులు 'వ్రీడనకం' అనే క్రొత్త రసాన్ని పేర్కొన్నారు. చివరకు 'అనంతావై రసాః' అన్న మాట చెప్పినట్లయ్యింది. లెక్కకు మిక్కిలిగా ఒక వైపు రసాల సంఖ్య పెరుగుతుంటే మరొక వైపు 'రసం ఒక్కటే' అని ఏక రసవాదం బయలుదేరింది. ఒక రసానికే మిగిలినవన్నీ వికృతులని చెప్తూ శృంగారం ఒక్కటే రసం అని కొందరు, కరుణం ఒక్కటే రసం అని కొందరు, అద్భుతం ఒక్కటే రసం అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. ఈ రకంగా రస సంఖ్య కాలక్రమంలో అనియతంగా తయారైంది. విద్యానాథుడు కొంతమంది లాక్షణికుల మతాన్ననుసరించి రససంఖ్యను తొమ్మిదిగా నిర్దేశించాడు.

## 8.2 వివిధ వాదాలు

### 8.2.1 రసములు ఎనిమిది

భరతముని ఎనిమిది రసాలనే ప్రతిపాదించాడు. కాని అవి నాట్యానికే పరిమితం. లోకంలో నవరసాలుగా రూఢికెక్కిన వాటిలో శాంత రసాన్ని భరతుడు అంగీకరించలేదు. దశ రూపక కర్తయైన ధనుంజయుడు భరతుని మతాన్నే సమర్థించాడు. ఇతని ఉద్దేశ్యంలో నాటకంలో శాంతానికి స్థానం లేదు. దశ రూపక వ్యాఖ్యాతయైన ధనికుడు నాటకాలలో లేకపోయినప్పటికిని శ్రవ్య కావ్యాలలో శాంతాన్ని నిబంధించవచ్చుననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దండి మొదలైన వారు ఎనిమిది రసాలనే గుర్తించారు. కాళిదాసు మహాకవి "మునినా భరతేన యః ప్రయోగో భవతి - అష్టరసాశ్రయో నియుక్తః" అని విక్రమోర్వశీయ నాటకంలో పేర్కొన్నాడు. వరరుచి మహర్షి "షట్ స్థానాని, గతిద్వయమ్, అష్టౌరసాః" అని పేర్కొన్నదాన్ని బట్టి ఎనిమిది రసాలనే అంగీకరించినట్లు స్పష్టమౌతుంది. భరతముని ప్రసాదించిన ఎనిమిది రసాలు ఇవి. 1. శృంగారం, 2. హాస్యం, 3. కరుణ, 4. రౌద్రం, 5. వీరం, 6.భయానకం, 7. భీభత్సం, 8. అద్భుతం.

### 8.2.2 రసములు తొమ్మిది

పైన చెప్పిన ఎనిమిదింటికి శాంతాన్ని కూడ చేర్చి తొమ్మిది అని పలువురు భావించారు. మమ్మటుడు, ఆనందవర్థనుడు, అభినవగుప్తుడు మొదలైన వారంతా ఈ వాదాన్ని సమర్థించినవారే. ప్రాచీనుల్లో శాంతంతో కూడిన తొమ్మిది రసాలను మొదటగా ఒప్పుకొన్నవాడు 'వాసుకి' అని తెలుస్తున్నది. అతడు

"రజస్తమో విహీనాత్తు సత్త్వావస్థాత్ సచిత్తతః
మనాగ స్పృష్ట బాహ్యార్థాత్ శాంతో రస ఇ తీరితః"

అని అన్నాడట. కోహలుడు కూడ రసాలను తొమ్మిది గాను, శాంతాన్ని రసం గాను అభిప్రాయపడి "ఉత్సాహ, నిర్వేద, శమము"లలో ఏదో ఒకటి శాంతానికి స్థాయి కావచ్చునని చెప్పెనట. ఆలంకారికులలో నవరసాలను మొదటగా ప్రతిపాదించిన వాడు నాట్య శాస్త్ర వ్యాఖ్యాతలలో మొదటి వాడైన ఉద్భటుడు. భట్టతౌతుని వాదము కూడ ఇదే. అభినవగుప్తుడు శాంత రసంతో కూడిన నవరస వాదాన్ని ప్రతిష్ఠాపించాడు. విద్యానాథుడు, జగన్నాథుడు కూడ ఇతనినే అనుసరించారు. సాహిత్య దర్పణకారుడైన విశ్వనాథుడు శాంత రసం కావ్య, నాటకాలు రెండింటిలోను ఉంటుందని అంగీకరించాడు.

భరతుడు నాటక ప్రయోజనాన్ని తెలియచేస్తూ ఈ క్రింది శ్లోకం చెప్పాడు.

క్వచి ద్ధర్మః, క్వచిత్క్రీడా, క్వచిదర్థః, క్వచిచ్ఛమః
దుఃఖార్తానాం, శ్రమార్తానాం, శోకార్తానాం, తపస్వినాం
విశ్రాంతి జననం కాలే నాట్య మేతద్భ విష్యతి

బ్రహ్మర్షీణాంచ విజ్ఞేయం నాట్యం వృత్తాంత దర్శనం''

ఈ శ్లోకంలో ఉన్న 'క్వచిచ్ఛమః' అనే మాట ఆధారంగా భరతుడు కూడ శాంత రసాన్ని అంగీకరించాడనేది కొందరి వాదం.

## 8.2.3 రస సంఖ్యకు సంబంధించిన ఇతర వాదాలు

రుద్రటుడు అనే ఆలంకారికుడు 'ప్రేయస్సు'ను కూడ చేర్చి రసాల సంఖ్య పదిగా పేర్కొన్నాడు. మిత్రుల మధ్య తల్లీ బిడ్డల మధ్య మొదలైన చోట్ల ఉండే ప్రీతి శృంగార ప్రీతి కంటె భిన్నమైనందువల్ల దీనికి ప్రత్యేక రసంగా స్థానమివ్వాలని ఇతని అభిప్రాయం.

మధుసూదన సరస్వతి భక్తి అనే మరొక రసం ఉందని, దానికి భగవంతుడే ఆలంబన (ఆధారం) అని చెప్పి భక్తికి రసత్వాన్ని నిరూపించే ప్రయత్నం చేశాడు.

## 8.2.4 రసములు అనంతములు

లోకంలో ప్రతి హృదయ వేదనను వ్యవహారంలో రసం అనే వాడతారు. ఉదాహరణ - దయారసం కలవాడు, స్నేహరస పూరితుడు మొదలైన మాటలు.

పై లోకాచారాన్ని బట్టి 'రసములు అనంతములు' అనే మాట ఏర్పడి ఉంటుంది. అందుకే భక్తి, ప్రేయస్సు వంటి వాటితో పాటు కొంతమంది ప్రతిపాదించిన ఉజ్వల, శాంత, దాస్య, సఖ్య, వాత్సల్యాతులు కూడ అనంత రస సంఖ్యలో చేరతాయి.

## 8.3 శాంతం రసమా - కాదా - చర్చ

ఆనందవర్ధనాదులు శాంత రస ప్రధానాలైన ఇతిహాసాలు రూపకాలు ఉన్నాయంటూ భారతాన్ని, ప్రబోధ చంద్రోదయ నాటకాన్ని ఉదహరించారు. అష్టరసవాదులు వాటిని వీరరస ప్రధానాలని అన్నారు. బహుకథాశ్రయమై బహుసంఖ్యాక పాత్ర సమన్వితమైన భారతం వంటి ఇతిహాసాలలో ప్రధానరస నిర్ణయం చేయడం కష్టం.

దశ రూపక కర్తయైన ధనుంజయుడు శాంత రసానికి నాటకంలో స్థానం లేక పోవడానికి కారణం ఇలా చెప్పాడు. శాంత రసానికి స్థాయి భావం శమం. శమం అంటే నిర్వికార చిత్తత. స్థాయి భావం ఉల్లోల కల్లోలమై, క్షాళిత రజోమాలిన్యమై, సాత్త్వికమై రసంగా అభివ్యక్త మౌతుందనే సిద్ధాంతాన్ననుసరించి నిర్వికార చిత్తత అనే శమానికి ఆ ప్రక్రియ అసాధ్యమౌతుంది. సహజంగానే మాలిన్యంలేని శమానికి పైన చెప్పిన విధంగా రసంగా అభివ్యక్తం అయ్యే అవకాశం లేదు. దానిని అభినయించుట అసాధ్యం. అందుచే శమం శమంగా ఉండవలసిందే కాని రసం కాదు.

కొందరు శాంత రసం దృశ్య శ్రవ్య కావ్యాలు రెండింటిలోను అంగరసం మాత్రమే గాని, దానిని అంగిరసంగాని బంధించరాదని నొక్కి చెప్పారు. అభినవగుప్తుడు దీనిని చర్చించి శాంత యొక్క రసత్వాన్ని క్రింది విధంగా సమర్థించాడు.

చిత్తవృత్తి విశేషాలైన రతి, క్రోధాదులైన ఎనిమిది స్థాయి భావాలు రసాలుగా ఆస్వాదింప బడుతున్నపుడు వేరొక చిత్తవృత్తి మాత్రమెందుకు రసం కాకూడదు? మోక్షం అనే పురుషార్థానికి ఉచితమైన చిత్తవృత్తియైన శమం "రస స్వరూపం'' పొంది ఆస్వాద్యం కాదని అనకూడదు. సామాజికులందరు శాంతాన్ని అనుభవింప లేకపోయినా వీతరాగులైన పురుషులెందరో సామాజికులుగా, పఠితలుగా శాంత రసాస్వాదన చేయగలరు. నటుడు అభినయించలేనంత మాత్రాన శాంతం రసం కాదనరాదు. శమ ప్రధానాలైన వాక్యాలలో ఉన్న శబ్ద శక్తి వల్ల శాంతరసం అనుభవంలోనికి వస్తుంది. ఉదాహరణకు నాచికేతూపాఖ్యానం మనుచరిత్రలను నాటకీకరిస్తే

శాంతరస ప్రధానాలే అవుతాయి. రతి, క్రోధం మొదలైన వాటికి లొంగిపోక శమం బలాన్ని కూర్చుకొని తీవ్ర రూపం దాల్చి విరోధి రసాలను ఓడిస్తుంది. ఇటువంటి బల తీవ్రతలు ఉండటం చేతనే శాంతం రసమౌతుంది.

ఈ విధంగా శాంతం కూడ రసంగా అంగీకరించబడింది. నవరసాలలో స్థానం పొందింది. విద్యానాథ కవి అభినవగుప్తాదుల మార్గాన్ననుసరించి శాంతంతో సహా తొమ్మిది రసాలను అంగీకరించాడు.

## 8.4 వివిధ రస స్వభావాలు

తొమ్మిది రసాలలో శృంగారం, హాస్యం, కరుణ, శాంతం అనేవి కోమలమైన రసాలు. వీటిచే హృదయం మృదువుగా అవుతుంది. వీర, రౌద్ర, భయానక, భీభత్సాలు ఉద్ధత రసాలు. ఉద్ధత రసం మనస్సుకు ఊష్మలతను కలిగిస్తుంది. చివరగా అన్ని రసాలు ఆనందపర్యవసాయులే. అయినను కోమల రసాలలో రసోదయం త్వరితగతిన జరుగుతుంది. సూర్య కిరణాలు తగిలి తామర వికసించి మకరందం కురిసినట్లు కవి వాక్కులనే కిరణాలు సోకి భావుకుల హృదయ పద్మం స్పందించి విప్పారి కరిగిపోతుంది. ఈ చివరి స్థితిలోనే రసాస్వాదనలోని అమృతసిద్ధి జరుగుతుంది. కోమల రసాలలోగూడ శృంగార, కరుణ రసాలలో హృదయద్రవీకరణ మరింత తొందరగా జరుగుతుంది. పింగళి లక్ష్మీకాంతంగారి అభిప్రాయాన్ననుసరించి జీవయాత్రతో ప్రధానంగా అవినాభావ సంబంధం కలవి మొదటి మూడు రసాలు మాత్రమే. అవి శృంగారం, హాస్యం, కరుణ.

మిగిలిన ఆరు రసాలు ఈ మూడింటితో సంబంధం కలవేగాని స్వతంత్రాలు గావు. గృహస్థ జీవితంలో ప్రవేశించి దాంపత్య సుఖ జీవనం చేయడం కావ్యంలోని శృంగార రసానికి మూల ప్రకృతి. తన వారిని పోషించుకొనేందుకు, కాపాడుకొనేందుకు చేసే ప్రయత్నాలలో చూపే ఉత్సాహమే వీర రసానికి మూల ప్రకృతి. దైవ యోగం వల్ల తన సొత్తులో ఏదైనా నశిస్తే మానవుడు పొందే దుఃఖమే కరుణ రసానికి మూలప్రకృతి. పుణ్యశాలియైన పురుషుడు దుఃఖానుభవం లేకుండ జీవితం గడపగలడు. కాని మొదటి రెండు లేకుండ ముందుకు సాగలేడు. అవి మానవ ప్రవృత్తికి ప్రథమ, ద్వితీయ చోదకాలు. అందుకే మానవ జీవితాన్ని కావ్యంగా మలచినప్పుడు శృంగార, వీరరసాల్లో ఏదేని ఒక్కటి ప్రాధాన్యం వహించాలని శాస్త్రంలో నిర్దేశించారు. జీవితపు నిస్సారతను గుర్తించి విరక్తుడైనప్పుడు శమం ఉద్భవిస్తుంది. అప్పుడది జీవితాన్ని పరిపాలించే రసాలలో ఒకటైన శాంత రసంగా మారుతుంది. ఈ నాలుగు కాక మిగిలినవన్నీ వీటికి సంబంధించిన శాఖాంతరాలు.

## 8.5 రస సంఖ్య - నిర్ణయం

పై సిద్ధాంతాలు ఆధారంగా లాక్షణికులు కావ్యంలో ఉన్న రసాల సంఖ్యను తొమ్మిదిగా అంగీకరించారు. ఆ రసాలు - వాటి స్థాయి భావాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | రసాలు | స్థాయి భావాలు |
|---|---|---|
| 1. | శృంగారం | రతి |
| 2. | హాస్యం | హాసం |
| 3. | కరుణం | శోకం |
| 4. | రౌద్రం | క్రోధం |
| 5. | అద్భుతం | విస్మయం |
| 6. | భయానకం | భయం |
| 7. | వీరం | ఉత్సాహం |
| 8. | భీభత్సం | జుగుప్స |
| 9. | శాంతం | శమం |

## 8.6 సమీక్ష

కావ్యంలోని రసాలు తొమ్మిది. వీటినే నవరసాలు అంటారు. కావ్య పఠనం వలన రసానుభవం కలిగి అనిర్వచనీయమైన సంతోషం కలుగుతుంది.

## 8.7 ప్రశ్నలు

1. రస సంఖ్యను ఎనిమిదిగా అంగీకరించినవారు చూపిన కారణాలను, వారు చెప్పిన ఎనిమిది రసాలను గురించి వ్రాయండి.
2. 'రసములు తొమ్మిది' - అనే విషయాన్ని నిరూపించండి.

## 8.8 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు



**డాక్టర్ యలవర్తి భానుభవాని**

ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.

రీడర్ - తెలుగు విభాగం

పి.బి.ఎన్. కళాశాల

నిడుబ్రోలు - 522 124

పాఠం - 9

# త్రివిధ శబ్ద వృత్తులు

**విషయక్రమం :**


9.1 పరిచయం

9.2 శబ్ద వృత్తులు

9.3 త్రివిధ శబ్ద వృత్తులు

9.3.1 అభిదా వృత్తి

9.3.2 లక్షణా వృత్తి

9.3.3 వ్యంజనా వృత్తి

9.4 మాదిరి ప్రశ్నలు

9.5 ఆధార గ్రంథాలు


## 9.1 పరిచయం :

రస సిద్ధాంత పరిణత రూపమే "ధ్వని సిద్ధాంతం". ధ్వని సిద్ధాంత ప్రవక్త ఆనందవర్ధనుడు. ఇతడు రాసిన గ్రంథం "ధ్వన్యాలోకం". ఈ గ్రంథం భారతీయాలంకారశాస్త్ర గ్రంథాల్లో శిరోధారమై పరమ ప్రామాణికమైంది. "ధ్వన్యాలోకం" అనే గ్రంధాన్ని "కావ్యాలోకం", "సహృదయాలోకం" అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఈ గ్రంథంలో ఆనందవర్ధనుడు ధ్వన్యభావవాదాల వాదాలన్నింటినీ చాలా తీవ్రంగా ఖండించి ధ్వనియే "కావ్యాత్మ" అని నొక్కివక్కాణించి ఉదాహరణ పూర్వకంగా నిరూపించాడు కూడా.

ఈ ధ్వని సిద్ధాంతాన్ని మహిమభట్టు 'వ్యక్తి వివేకం' లోనూ, కుంతకుడు "వక్రోక్తి జీవితం" లోనూ, భట్టనాయకుడు "హృదయదర్పణం" లోనూ ఖండించారు. వీరి తర్వాత వచ్చిన ఆలంకారికులు, వీరి వాదాల్ని అంగీకరించలేదు. "ధ్వని"యే 'కావ్యాత్మ' అని అంగీకరించిన వారిలో మమ్మటుడు, విశ్వనాధుడు, జగన్నాధ పండిత రాయలు మున్నగువారు ప్రముఖులు.

అభినవగుప్తుడు "ధ్వన్యాలోకం" కు "లోచనం" అనే వ్యాఖ్యానం రాశాడు. ప్రముఖుల మన్నల్ని ప్రశంసల్ని అందుకున్నాడు. ఇతడు భరతుడు రాసిన "నాట్యశాస్త్రం" కు "అభినవభారతి" అనే పేరుతో వ్యాఖ్యానం కూడా రాశాడు. అభినవగుప్తుడు "లోచనం" వ్యాఖ్యానానికి ముందే "ధ్వన్యాలోకం" కు "చంద్రిక" అనే వ్యాఖ్యానం వున్నట్లు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ గ్రంథం ఇప్పుడు అందుబాటులో లేదు.

ఆనందవర్ధనుడు కాశ్మీరును పరిపాలించిన అవంతివర్మ ఆస్థానంలో వుండేవాడు. ఇతడు "విషమ బాణశీల", "దేవీశతకం", "అర్జున చరితం", "వినిశ్చయ టీకా వివృత్తి", "తత్త్వాలోకం" అనే గ్రంథాలు రాశాడు.

ధ్వని సిద్ధాంతాన్ని, దాని భేదాల్ని తెలుసుకోవడానికి పూర్వం, శబ్దవృత్తుల్ని గూర్చి తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఇవి తెలిస్తే తప్ప ధ్వనిసిద్ధాంతం సమగ్రంగా అర్థం కాదు. ఇందులో సందేహం లేదు.

కావ్యానికి శబ్దార్థాలు "శరీరం". ధ్వని "జీవం". అలంకారాలు "సొమ్ములు". గుణములు "గుణములు". అభిధావృత్తులు వృత్తులు. శబ్దానికి అర్థాన్ని బోధించే శక్తికి "వృత్తి" అని పేరు.

## 9.2 శబ్దవృత్తులు :

"తిస్రః శబ్ద స్వశక్తియః" - సాహిత్య దర్పణం

శబ్దవృత్తులు మూడు. అవి ఇవి.

1 అభిధ
2 లక్షణ
3 వ్యంజన

"అర్థోవాచ్యశ్చ లక్ష్యశ్చ వ్యంగ్యశ్చేతి త్రిధామతః" - సాహిత్య దర్పణం

అభిధా శక్తిచే చెప్పబడే అర్థాన్ని "వాచ్యం" అనీ, లేదా "అభిధేయం" అనీ అంటారు. లక్షణాశక్తిచే చెప్పబడే అర్థాన్ని "లక్ష్యం" అని అంటారు. వ్యంజనాశక్తిచే చెప్పబడే అర్థానికి "వ్యంగ్యం" అని అంటారు.

| వ.సం | శబ్దవృత్తులు (శక్తి) | శబ్దం | అర్థం |
|---|---|---|---|
| 1. | అభిధ వాచకం | వాచ్యం | వాచ్యం (అభిధేయం) |
| 2. | లక్షణ | లక్షకం | లక్ష్యం |
| 3. | వ్యంజన | వ్యంజకం | వ్యంగ్యం |

మూడు విధాలైన శబ్దాలకి మూడు విధాలైన అర్థాల్ని బోధించే శక్తులు కూడా మూడే. వాటినే "త్రివిధ శబ్దవృత్తులు" అని అంటారు.

వ్యంజానికి "ధ్వని", "ధ్వనకం", "గమనం", "ద్యోతకం", "ప్రత్యాయనం" అనేవి పర్యాయ పదాలు. మీమాంసకుల్లో ఒక తెగకు చెందివారు శబ్దార్థాల్ని బోధించు అభిదా లక్షణా వ్యంజనా శక్తులతో పాటు వాచ్యార్థాన్ని బోధించు తాత్పర్యశక్తి అనే నాల్గోశక్తి కూడా అవసరమని భావించారు. దీన్నే అభిహితాశ్వయవాదులు నిషేదించారు. మీమాంసకుల్లో రెండో తెగవారు తాత్పర్యశక్తిని అంగీకరించరు. వీరిని అన్వితాభిదానులు అని అంటారు. విద్యానాథుడు వ్యంజనాశక్తి కంటే తాత్పర్యశక్తి వేరు కాదని అభిప్రాయపడ్డాడు. ఆనందవర్ధనుడు వైయాకరణుల స్ఫోటవాదాన్ని ఆధారంగా గ్రహించి ధ్వని సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు.

## 9.3 త్రివిధ శబ్ద వృత్తులు :

### 9.3.1 అభిధావృత్తి (అభిధాశక్తి) :

సంకేతికార్థకమైన అర్థాన్ని బోధించు శబ్దశక్తి లేక "వృత్తి" ని "అభిధ" అని అంటారు. సంకేతితార్థకం అంటే వాచక శబ్దానికి గల ముఖ్యార్థం ప్రధానార్థం. దీన్నే "వ్యాచ్యార్థం" అని అంటారు. ఇది వ్యాకరణం, ఉపమానం, ఆప్తవాక్యం, వ్యవహారం, వివరణం, అన్యపద సాన్నిధ్యం అనే వానిచే నిర్ణయించబడుతుంది. అభిధావృత్తి నాలుగు విధాలు.

## త్రివిధ శబ్దవృత్తులు - పట్టిక

- I. అభిధావృర్తి
  1. యౌగికం
  2. రూఢం
  3. యోగ రూఢం
  4. యోగిక రూఢం
- II. లక్షణావృత్తి
  1. జగత్ లక్షణ
  2. అజహత్ లక్షణ
  3. సారోప లక్షణ
  4. సాధ్యావసాయ లక్షణ
- III. వ్యంజనావృత్తి
  1. శబ్ద శక్తి మూల వ్యం జన
  2. అర్థ శక్తి మూల వ్యం జన
  3. ఉభయ శక్తి మూల వ్యం జన

అభిధావృత్తి

1 యౌగికం
2 రూఢం
3 యోగరూఢం
4 యౌగికరూఢం

## 1. యౌగికం :

"యోగం" అంటే అవవార్థం. అవయవార్థాన్ని మాత్రమే బోధించే శబ్దం "యౌగికం". యోగం కలది "యోగికం". అంటే వ్యుత్పత్త్యర్థమే ప్రధానంగా కలదన్నమాట.

ఉదా॥ పాచకుడు పాకం చేసేవాడు అనే వ్యుత్పత్తియే ఇక్కడ ప్రధానం.

## 2. రూఢం :

వ్యుత్పత్త్యర్థంతో సంబంధం లేకుండా కూడా నియతమైన అర్థాన్ని బోధించే శబ్దం "రూఢం" అన్పించుకుంటుంది.

ఉదా॥ అవవార్థంతో ఏమాత్రమూ సంబంధం లేకుండానే ఆ పదాలు భోదించవలసిన అర్థాలని బోధిస్తాయి. కాబట్టి ఇలాంటి పదాలని "రూఢసంజ్ఞ" అని అంటారు.

## 3. యోగరూఢం :

యోగత్వ, రూఢత్వాలు రెండూ ప్రధానమైనచో అది "యోగరూఢం". అంటే వ్యుత్పత్తి, వాడుక ఇక్కడ ప్రధానమైనవి.

ఉదా॥ పంకజం, అల్లుడు.

"పంకజం" (బురద) నుండి పుట్టింది అనే వ్యుత్పర్థం వున్ననూ "పంకజం" అనే పదానికి "పద్మం" అనే అర్థమే రూఢం. "అల్లుడు" అనే పదానికి కూతురు మొగుడు అనే అర్థమేకాక, కుటుంబాన్ని విస్తరింపజేయువాడు అనే వ్యుత్పర్థం వుంది. అంచేత ఇలాంటి పదాలు "యోగరూఢం" అన్పించుకుంటాయి. సర్వసాధారణంగా ఇలాంటి పదాలకూ, రూఢికీ ప్రాధాన్యం వుంది. అయితే వ్యుత్పత్తి కూడా కన్పించుటచే ఈ పదాలు "యోగరూఢం" అయ్యాయి.

## 4. యౌగికరూఢం :

కొన్ని శబ్దాల్లో వ్యుత్పత్తి వల్ల వచ్చిన అర్థం వేరుగానూ, రూఢి వల్ల వచ్చిన అర్థం వేరుగానూ వుంటుంది. ఇలాంటి పదాలు "యౌగికరూఢం" అవుతాయి.

ఉదా॥ ఉద్భిదం. నేలను భేదించుకొని పుట్టింది అనే వ్యుత్పత్తిచే, ఈ పదానికి తరుగుల్మాదికం అని అర్థం. ఇట అవయవార్థం ప్రధానం అగుట యౌగికత్వం. ఒక యాగంనకు ఉద్భిదం అనే పేరువుంది. ఇక్కడ రూఢికి ప్రాధాన్యం. యౌగికార్థంలో తరుగుల్మాదికమునూ, రూఢిలో యాగవిశేషమూ బోధించుటచే ఈ పదం "యౌగికరూఢం" అవుతుంది.

### 9.3.2 లక్షణావృత్తి :

"ముఖ్యార్ధబాధే, తద్యోగేరూఢితో థప్రయోజనాత్
అన్యోర్ధోలష్యితేయత్సా లక్షణా రోపిత క్రియా" - - కావ్యప్రకాశం

శబ్దం యొక్క ముఖ్యార్ధానికి బాధ కలిగేటప్పుడు రూఢిచే కానీ, ప్రయోజనంచే కానీ, ముఖ్యార్ధ సంబంధం కల మరో అర్ధం దేనిచో బోధింపబడునో ఆ ఆరోపిత శబ్ద వ్యాపారమే "లక్షణ" అనబడుతుంది.

మన అలంకారికలకు "లక్షణావృత్తి"ని గూర్చి ఒక్కొక్కరు ఒక్కోరకంగా తమ తమ అభిప్రాయాల్ని చెప్పారు. అవి ఇవి.

## A కావ్య ప్రకాశం - మమ్మటుడు :

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    - 1 సారోప పాదాన లక్షణ
    - 2 సాధ్యవ సాయో పాదశ లక్షణ
    - 3 సారోప లక్షణ
    - 4 సాధ్యవ సాయ లక్షణ
  - గౌణి లక్షణ
    - 1 సారోప గౌణి
    - 2 సాధ్యవ సాయగౌణి

## B వృత్తివార్తికం :

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    - 1 నిరూఢ
    - 2 ఫల లక్షణ సారోప
    - 3 ఫల లక్షణ సాధ్యవ సాయ
    - 4 జహల్లక్షణ
    - 5 అజ హల్లక్షణ
    - 6 జహదజ హల్లక్షణ
  - గౌణి లక్షణ
    - 1 నిరూఢ
    - 2 ఫల లక్షణ సారోప
    - 3 ఫల లక్షణ సాధ్యవ సాయ

## C రసగంగాధరం - జగన్నాథపండితరాయలు

లక్షణ

- శుద్ధ లక్షణ
  - 1 జహత్స్వార్థ
  - 2 అజహత్స్వార్థ
  - 3 సారోప
  - 4 సాధ్యవసాయ
- గిణి లక్షణ
  - 1 సారోప
  - 2 సాధ్యపసాయ

## D సాహిత్యం దర్పణం - విశ్వనాథుడు :

లక్షణ

- శుద్ధ లక్షణ
  - 1 ఉపాదన లక్షణ
  - 2 లక్షణ లక్షణ
  - 3 సారోప
  - 4 సాధ్యవసాయ
- గౌణి లక్షణ

ఈ లక్షణావృత్తి సంబంధ నిబంధన, సాదృశ్య నిబంధన అని రెండు విధాలు. సంబంధ మూలకమైన లక్షణ రెండు విధాలు. ఒకటి జహత్ లక్షణ, రెండు అజహత్ లక్షణ. సాదృశ్య మూలకమైన లక్షణ రెండు విధాలు. ఒకటి సారోప లక్షణ రెండు సాధ్యవ సాయ లక్షణ. ఈరకంగా లక్షణ ప్రధానంగా మొత్తం నాలుగు భేదాలుగా వర్గీకరించవచ్చు.

లక్షణ

- 1 జహల్లక్షణ
- 2 అజహల్లక్షణ
- 3 సారోప లక్షణ
- 4 సాధ్యవసాయ లక్షణ

## 1. జహల్లక్షణ :

తనకున్న అర్థాన్ని కోల్పోయి దానికి సంబంధించిన అర్థం ఎక్కడ బోధించబడుతుందో ఆ వృత్తి "జహల్లక్షణ" అన్పించుకుంటుంది.

ఉదా॥ "గంగలో గొల్లపల్లె"

"గంగలో గొల్లపల్లె" అనేటప్పుడు "గంగ" అనే పదానికున్న అర్థం విడిచిపెట్టబడి, దానికి సంబంధించిన "తీరం" అనే అర్థం బోధించబడుతుంది. కావున ఇది "జహల్లక్షణ" లక్ష్యం అవుతుంది.

"ప్రతాపరుద్రుని జైత్రయాత్రా సందర్భంలో శత్రు రాజుల పట్టణాలు గట్టిగా ఆక్రోశిస్తున్నాయి"

అనేటప్పుడు పట్టణాలు అచేతనాలు కాబట్టి ఆక్రోశించడం జరగదు కదా! ఇక్కడ పట్టణాలు అనేపదం స్వార్థత్యాగం పొంది అంటే తనకున్న అర్థాన్ని కోల్పోయి పట్టణాల్లోని ప్రజలు అనే వాచ్యార్థానికి సంబంధించిన మరో అర్థాన్ని విడిచిపెట్టే బోధిస్తుంది. "జహత్" అంటే విడిచి పెట్టటం అని అర్థం. తనకున్న అర్థాన్ని లక్షణం వుంది. కావున ఇది "జహల్లక్షణ" అవుతుంది.

## 2. అజహల్లక్షణ :

స్వార్థత్యాగం లేకుండా దానికి సంబంధించిన అర్థాన్ని బోధించే శబ్దవ్యాపారం "అజహల్లక్షణ" అవుతుంది.

"ప్రతాపరుద్రుని పాద పీఠాన్ని, ప్రకాశిస్తున్న రత్నకాంతుల సముదాయాలు గల కిరీటములు అలంకరిస్తున్నాయి."

ఇక్కడ "కిరీటములు" అనేటప్పుడు తన అర్థాన్ని నిలుపుకొంటూ దానికి సంబంధించిన అంటే కిరీటములు ధరించిన రాజులు అనే అర్థం బోధించబడుతుంది. కాబట్టి ఇది అజహత్. అజహత్ అంటే విడిచి పెట్టని అని అర్థం. జహత్ అంటే విడిచిపెట్టే అని అర్థం.

## 3. సారోప లక్షణ :

సాదృశ్యం ఆధారంగా ఏర్పడిన లక్షణ "సారోప లక్షణ" (స+ఆరోప లక్షణ). ఉపమేయం, ఉపమానం విడిగా చెప్పబడుతూ ఆరోపించబడి అభిన్నాలని చెప్పబడితే అది "సారోపలక్షణ" అవుతుంది.

"చంద్రుని లోని నల్లని మచ్చన్ని కొందరు సారంగం అంటారు. నేను మాత్రం కాకతి ప్రతాపరుద్రుని కీర్తి సంపదచే ఓడిపోయిన చంద్రుడు ఆ ప్రతాపరుద్రుని లాంఛనమైన వరాహాన్ని ధరిస్తున్నాడని భావిస్తాను."

ఇక్కడ సారంగం ఉపమేయం. వరాహం ఉపమానం. పై ఉదాహరణలో ఉపమేయ ఉపమానాలు రెండూ విడిగా పేర్కొనబడి అభిన్నాలని చెప్పబడింది. సారంగు వరాహం అని ఆరోపించబడి అభేద ప్రతిపత్తి వర్ణించబడింది. కాబట్టి ఇది "సారోప లక్షణ".

## 4. సాధ్యవసాయ లక్షణ :

ఉపమేయాన్ని కప్పిపుచ్చి ఉపమానంతో అభేదాత్మకంగా చెప్పితే అయితే "సాధ్యవసాయ లక్షణ". (స + అధ్యవ సాయ లక్షణ). ఇది కూడా సాదృశ్య ఆధారంగా ఏర్పడిందే.

"కాకతి ప్రతాపరుద్రుని ఉద్దేశించి "కాకతీయ కులాంబోధి నుండి ఈ చంద్రుడు ఉద్భవించాడు. తన ఉదయం చేత కువలయానికి ఉల్లాసం కల్గిస్తున్నాడు".

ఇక్కడ ప్రతాపరుద్రుడు ఉపమేయం. చంద్రుడు ఉపమానం. ఇక్కడ ఉపమేయాన్ని చెప్పక అంటే కప్పిపుచ్చి ప్రతాపరుద్రుడు అనే చంద్రుడు అని చెప్పక, ఉపమానంతో అభేద ప్రతిపత్తి వర్ణించబడింది. ప్రతాపరుద్రుడను ఉపమేయం కప్పిపుచ్చబడి కాకతీయ కులాబ్ధి నుండి పుట్టిన చంద్రుడు అనే ఉపమానం మాత్రమే చెప్పబడింది. అంటే ఉపమానంతో అభిన్నంగా వర్ణించబడింది. కావున ఇది "సాధ్యవసాయలక్షణ" అవుతుంది.

## సామ్య నిబంధన లక్షణ :

సామ్యనిబంధనా లక్షణలో 1. లక్షిత లక్షణ 2. విపరీత లక్షణ అనే రెండు భేదాలు చోటు చేసుకున్నాయి.

## 1. లక్షిత లక్షణ :

వాచ్యార్థానికి సంబంధం కలుగక, వాచ్యార్థానికి సాక్షాత్తుగా ఉపపత్తి గల అర్థంకాక పరంపరగా సంబంధించిన మరో అర్థం బోధించే శబ్దశక్తి "లక్షిత లక్షణ".

ఉదా॥ ద్విరేఫం

రెండు రేఫాలు కలది అని వ్యుత్పత్తి. వ్యవహారంలో రెండు రేఫాలు గల పదం అనే భావం కలుగవచ్చు. ద్విరేఫం అంటే "భ్రమరం" (తుమ్మెద) అనే రూఢియగు అర్థం వుంది. శబ్దాన్ని బట్టి తుమ్మెద అనే అర్థం కలుగదు కదా! అయితే ఇందులో వాచ్యార్థానికి సంబంధం కలుగక, రూఢ్యర్థం అనుసరించి "భ్రమర" మైంది. ఈ విధంగా వాచ్యార్థం కాక పరంపరగా సంబంధం గల మరో అర్థం బోధించబడింది. కావున ఇది "లక్షిత లక్షిణ".

మరో ఉదా॥ రోదరం

ఉదరంలో రకారం కలది అని వ్యుత్పత్తి. చక్రవాకం ("ర" ఉదకం కలది) అని అర్థం. ఇందులో కూడా పై పదం వలే వాచ్యార్థానికి సంబంధం కలుగక, రూఢ్యర్థంలో ప్రయుక్తమైంది.

## 2. విపరీత లక్షణ :

వాచ్యార్థానికి విపరీత (విరుద్ధ లక్షణం) లక్షణం కలది "విపరీత లక్షణ".

ఉదా॥ వాడుబృహస్పతి

ఇది ఒక పామరుని గూర్చి చెప్పిన వాక్య ప్రయోగం. "వాడుబృహస్పతి" అనే వాక్యం వినగానే బృహస్పతి వలె బుద్ధిశాలి అనే లక్ష్యార్థం తోస్తుంది. అయితే ఇది పామరుని గూర్చి ప్రయోగించబడింది. కాబట్టి వట్టి మూర్ఖుడు అనే విపరీతార్థం స్ఫురిస్తుంది. ఇందులో వాచ్యానికి సంబంధం లేకపోవడం, తర్వాత దానికి విరుద్ధమైన మూర్ఖుడు అనే లక్షణార్థం తోచుటచే ఇది "విపరీత లక్షణ".

మరో ఉదా॥ అబద్ధాల కోరును చూచి సత్యహరిశ్చంద్రుడను "విపరీత లక్షణ". దీనివల్ల వ్యతిరేక అర్థం గోచరిస్తుంది.

### 9.3.3 వ్యంజనావృత్తి :

అభిదా శక్తి ప్రాకరిణతమైన వాచ్యార్థాన్ని మాత్రమే తెలుపుతుంది. లక్షణా శక్తి వాచ్యార్థానికి బాధ కలిగేటప్పుడు దానితో సంబంధం గల అర్థాంతరాన్ని బోధిస్తుందది. వ్యంజనా శక్తి శబ్దాలకు వాచ్యార్థం పొసగిన పిదప దానికి ఉత్కర్షను కల్గించునట్టి అర్థాంతరాన్ని బోధింప చేస్తుంది. అంటే ప్రకృతార్థాన్ని, దాని కంటె సుందరమైన అప్రకృతార్థాన్ని స్ఫురింపచేసేది వ్యంజన.

**ఉదా॥** "పదమెత్తం గల హంసలీల, యధరస్పందంబుసేయన్ శుభా
స్పద మౌరాగ కదంబకంబు శ్రుతి చూపన్ శ్రీ విలాసంబు,
కేర్ కదలింపన్ సుకుమార పల్లవనవైలా లక్ష్మి వీక్షింప
ట్పదియుంబొల్చు, తరంబె కన్నెగొని యాడన్ గేయవాక్ర్పౌడిమన్"

వ్యంజనా వృత్తి మూడు విధాలు

శబ్ద శక్తి మూల వ్యంజనం | అర్థ శక్తి మూల వ్యంజనం | ఉభయ శక్తి మూల వ్యంజన

### 1. శబ్దశక్తి మూలవ్యంజన :

కొన్ని శబ్దాలకు అనేక అర్థాలు బోధించే శక్తి వుంటుంది. దీన్నే "శబ్దశక్తి" అని అంటారు. అది ప్రధానంగా కలది "శబ్దశక్తి మూల వ్యంజన". ఆ శబ్దాలకు పదాల వేరే పర్యాయ పదాల గూర్చినచో వ్యంగ్యార్థం రాదు.

**ఉదా॥** "నరస భూపాలుని కరమున తనరెడు ఖడ్గము తన సమగ్ర
ధారాజలమున మునుగు వైరులకు
అనిమిష భావము (రెప్పపాటు కాని) ను గూర్చును". అనేది ప్రకృతార్థం.

నరస భూపాలుని ఖడ్గం తన ధారాజలంలో మునుగు శత్రువునకు అనిమిష భావం అంటే దేవత్వం నందించును. అనే వ్యంగ్యార్థం. దీన్నే అప్రకృతార్థం అని అంటారు. ఇందులో "నరసింహుని - నరులకు అనిమిత్వము" అనే పదాలు వ్యంజకాలైనవి. వానిని తొలగించి నరసింహుని వైరులకు అనిమిషత్వం అని ప్రయోగించినచో వ్యంగ్యార్థం లేదు. కాబట్టి ఇది "శబ్దశక్తి మూల వ్యంజన" (వ్యంగ్యం).

మరో ఉదా॥ "కేశవం పతతం దృష్ట్వా భీమంబైన గతాయుషమ్
రుదన్తి కౌరవా స్సర్వే పాండవా హర్ష మాయుయుః"

### 2. అర్థ శక్తి మూల వ్యంజన :

అర్థశక్తి ప్రభావం కలది "అర్థశక్తి మూల వ్యంజన". వ్యంజక పదాలకు బదులుగా పర్యాయపదాలు ప్రయోగించిననూ వ్యంగ్యార్థానికి భంగం లేనిదని భావం.

ఉదా॥ "నృసింహభూపా! నీ శత్రువు భార్య పర్వత ప్రదేశముల వసించుచు
నచ్చటి బోయ కాంతలతో "మయూరి యందలి చందురుడు
చల్లనివాడు మయూరి మందమారుతము గూడ చల్లనిదే అని తెలుపును".

దీనివల్ల నరసభూపాలుని శత్రువు భార్య ముగ్ధ అనీ, భర్తృవియోగంచే విరహబాధ పొందుచున్నదనీ, నరసరాజు తన శత్రురాజులనందరినీ జయించెననీ వ్యంగ్యార్థం కలుగుతుంది. కాబట్టి ఇది "అర్థశక్తి మూల వ్యంజన".

మరో ఉదా॥ విరాటపర్వంలో కీచక వధ ఘట్టంలో వున్న పద్యాన్ని దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. అది విరాట సభ. కీచకుడు ద్రౌపదిని పరాభవించుట చూచిన భీముడు ఉగ్రుడైయ్యాడు. సమయ భంగమగు ప్రమాదాన్ని గుర్తించి కంకరూపమున వున్న ధర్మరాజు వలలుడైన భీముని వారించాడు.

"వలలుండెక్కడ జూచెనొండెడన సేవ్యక్ష్మాజముల్ పుట్టలే
ఫలితంబై వరశాఖ లొప్పగ, ననల్ప ప్రీతి సందించుచున్
విలసచ్ఛాయను పాశ్రిత ప్రతితికిన్ విశ్రాంతి కావింపగా
గల యీ భుజము వంటకట్టయలకై ఖండింపగా నేటికిన్"

ఇందులోని అర్థం సుగమం. ఇందులోని పదాల్ని తొలగించి తత్సమానార్థమైన పదాలు వచ్చినప్పటికీ వ్యంగ్యం స్థిరంగా వుంటుంది.

## 3. ఉభయశక్తి మూల వ్యంజన :

ఇందులో "శబ్దశక్తి మూల వ్యంజన", "అర్థశక్తి మూల వ్యంజన" రెండూ వున్నాయి. అంచేతనే ఇది "ఉభయ శక్తి మూల వ్యంజన" అయ్యింది.

"అరిదరికరుడై, సుమనో
వరభరణధురీణుఁడై, యవారితలక్ష్మీ
స్థిరనివాస భాసురుఁడై
నరసింహుడు వొచ్చు ఁద్రిభువనస్తుత మహిమన్"

నరసింహుడు, అరిదరకరుడై = శత్రువులకు భయం కల్గించువాడై, సుమనోవర = పండిత శ్రేష్టుల్ని, భరణధురీణుడై = పోషించు భారం దాల్చినవాడై, రాజ్యలక్ష్మి = రాజ్యమచే, స్థిరనివాస = స్థిరనివాసంచే, భాసురుడై = ప్రకాశించువాడై, త్రిభువనస్తుత మహిమన్ = ముల్లోకముల పొగడిక మహిమచే, పొల్చున్ = ఒప్పును. ఇది వ్యంగ్యార్థం.

ఇందులోని "అరిదరికరుడు - సుమనోవరభరణ ధురీణుడు, నరసింహుడు" అనేవి పరివృత్తిని ఒప్పుకొనవు. లక్ష్మీ నివాస భాసురుడు అనేది సహించును. ఇలా కొన్ని పదాలు పరివృత్తిని సహించి మరికొన్ని సహింపక వుండునట్లు చెప్పడం "ఉభయశక్తి మూలవ్యంజన".

**మరో ఉదా॥**

"పార్శ్వ స్థదారో భగవాన్ మేశః
ముఖస్థదారో భగవాన్ విధాతా
ఉరస్థ దారో భగవాన్ రమేశః
శిరస్థ దారో క్వచనత్వ దన్యః"

పై శ్లోకంలో మొదటి మూడు పాదాలు అర్థశక్తిమూల వ్యంజనానికి సంబంధించినవి. చివర నాలుగోపాదం శబ్దశక్తిమూల వ్యంజనానికి సంబంధించినది.

సంగ్రహంగా త్రివిధ శబ్దవృత్తులు ఇవి.

## 9.4 మాదిరి ప్రశ్నలు :

1. త్రివిధ శబ్దవృత్తులు గూర్చి తెలియచేయండి.
2. వ్యంజనావృత్తి గూర్చి వ్రాయండి.
3. లక్షణా వృత్తి గూర్చి వివరించండి.
4. అభిధావృత్తి గూర్చి విపులీకరించండి.

## 9.5 ఆధార గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య విమర్శ - సిద్ధాంతాలు - సూత్రాలు - డా॥ వెలమల సిమ్మన్న
2. విమర్శ - వివేచన (అముద్రితం) - డా॥ వెలమల సిమ్మన్న
3. విమర్శ - మౌలిక లక్షణాలు - ఆచార్య మూదికొండ వీరభద్రయ్య
4. సాహిత్య దర్శనం - ఆచార్య కాకర్ల వేంకట రామనరసింహం
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
6. సాహిత్య సోపానములు - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
7. సాహిత్య సౌందర్య దర్శనం - శ్రీ చర్ల గణపతిశాస్త్రి


**- డా॥ వెలమల సమ్మన్న**

## పాఠం - 10

# విమర్శ - విమర్శకుడు

పాఠ్యనిర్మాణక్రమం

10.0 లక్ష్యం
10.1 విమర్శ - ప్రాచీనత
10.2 విమర్శను గూర్చిన విమర్శలు - తెలుగువారు
10.3 ఆంగ్ల భాషాభిజ్ఞుల భావాలు
10.4 సహృదయత
10.5 విమర్శకుల భేదాలు
10.6 ఉత్తమ విమర్శక లక్షణాలు
10.7 అసద్విమర్శ లక్షణం
10.8 కవి - విమర్శకుడు
10.9 సాహిత్యం - విమర్శ
10.10 విమర్శకుడి సమస్యలు
10.11 విమర్శ - ఎవరికోసం
10.12 విమర్శ భాష
10.13 విమర్శ - నిర్ణయాలు - ప్రకటనలు
10.14 విమర్శకుడికి పాండిత్యం అవసరం
10.15 విమర్శ ప్రక్రియలు
10.16 సమీక్ష
10.17 ప్రశ్నలు
10.18 ఉపయుక్త గ్రంథాలు

## 10.0 లక్ష్యం

పాఠక లోకానికి - సాహిత్యానికి విమర్శ వల్లా విమర్శకుడి వల్లా కలిగే ప్రయోజనాన్ని తెల్పటం. విమర్శ విమర్శకుల గూర్చి వివరించడం.

### విమర్శ

విమర్శ ఒక 'Work of Art'. అది ఒక కళా సృష్టి. విమర్శ అనే పదానికి నిఘంటువులలో, హేతువాదం, పరిశీలన, పరస్పర విరుద్ధాలయిన తీర్పు, సందేహం, వాదన, ఆలోచించు, చర్చించు, పరామర్శించు, పరిశీలించు, పరిశోధించు, పర్యాలోచించు, విచారించు, వివేకించు, శీలించు, శోధించు, అంటూ అనేకార్థాలున్నాయి. విమర్శ శబ్దంలో 'మృశ్' ధాతువుకు ముందు 'వి' అనే ఉపసర్గ చేరింది. 'మృశ్' ధాతువుకు పరామర్శించు, పరీక్షించు, చర్చించు వంటి విశేషార్థాలున్నాయి. కనుక విమర్శ అంటే ఒక అంశాన్ని నిశితేక్షణతో పరిశీలించి అందులోని బాగోగులను విశదంగా చర్చాపురస్సరంగా వ్యాఖ్యానించి చెప్పడం, సాహిత్య జగత్తులోని దారి తెలియని మనోహర పరిసరాలకు తీసుకొని పోయే ఉత్తమ మార్గదర్శి విమర్శ.

## 10.1 విమర్శ - ప్రాచీనత

మన ప్రాచీనులు విమర్శను దేవీ స్వరూపంగా భావించారు. లలితా సహస్రనామాల్లో 'విమర్శ రూపిణీ విద్యా' అని ఆ దేవిని విమర్శరూపిణిగా భావించారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కూచినపూడి గ్రామంలో 'విమర్శాంబా సమేత ప్రకాశ వీరేశ్వర మూర్తి' అనే లింగమూర్తి వేంచేసి ఉన్నాడు. ఈ దేవాలయమూ ఆ దేవతా ప్రాచీన కాల సంబంధులే. విమర్శ వల్ల వస్తు ప్రకాశం కలగటాన్ని ఇది సూచిస్తున్నది. వేదాంత పరిభాషలో ఆత్మానాత్మ వివేకమని అర్థం. కావ్య భాషలో గుణదోష విచార విమర్శ అని అర్థం.

## 10.2 విమర్శను గూర్చిన విమర్శలు - తెలుగువారు

1. 'ఒకరు చేసిన పనిలోని బాగోగులను గురించి చెప్పటం' - పింగళి లక్ష్మీకాంతం.
2. 'ఒక గ్రంథాని గాని కళారూపాన్ని గాని లెస్సగా పరిశీలించి మననం చేసి చర్చాపురస్సరంగా దాని బాగోగులను ప్రదర్శించటం విమర్శ' - దివాకర్ల వేంకటావధాని.
3. 'ఒక గ్రంథంలోని లోపాలను ఔచిత్యాలను భావగాంభీర్యాన్ని అలంకార రచనా పాటవాన్ని ధ్వని విశేషాల్ని శయ్యా సౌభాగ్యాన్ని వస్తు నిర్మాణ సౌష్ఠవాన్ని పాత్ర పోషణ రస పోషణ సన్నివేశ కల్పనాన్ని ఇలా విషయ సర్వస్వాన్ని కూలంకషంగా చర్చించి వాఙ్మయంలో ఆ గ్రంథానికి దక్కే స్థానాన్ని నిరూపించటం విమర్శ' - ఆచార్య కె.వి.ఆర్. నరసింహం.
4. 'కావ్య వస్తు తత్త్వ నిరూపణమే విమర్శ' - డాక్టర్ యస్.వి. రామారావు.
5. 'పరామర్శ వంటివి తెగడ్తలతోను నిండి ఉన్నాయి. నిజానికి ఆలోచనా పూర్వకమైన చర్చతో విషయ నిష్ఠమైన గుణదోష పరీక్షకే స్థానముండాలి' - బూదరాజు రాధాకృష్ణ.

ఇలా సాహిత్య రచనలోని వైశిష్ట్యాన్ని చూపిస్తుంది. సంప్రదాయ అవిచ్ఛిన్నతను పోషిస్తుంది విమర్శ.

## 10.3 ఆంగ్ల భాషాభిజ్ఞుల భావాలు

(Criticism) 'క్రిటిసిజం' అనే పదం KRITEIN (to judge) అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. విమర్శకు సమానార్థకమైన ఈ క్రిటిసిజం అనే పదాన్ని పాశ్చాత్యులనేక విధాలుగా నిర్వచించారు. మన తెలుగు సాహిత్యం మీద పాశ్చాత్య భాషా ప్రభావం అధికంగా ఉంది. అందువల్ల ఆంగ్ల నిర్వచనాలను గూర్చి కూడ తెలియటం అవసరం.

వస్తు తత్త్వాన్ని గుణగణాల్ని నిర్ధారించేది విమర్శ - హడ్సన్. అనుభూతుల తారతమ్యాల్ని వివేచించి వాటి విలువల్ని తేల్చేది విమర్శ - జె.ఎ. రిఛర్డ్స్. లలిత కళల గుణగణాల పరిశీలనకి కల్పించిన అక్షర రూపం విమర్శ - ఎడ్మండ్ గూస్, రాగ ద్వేష రహితంగా ప్రపంచంలోని ఉత్తమ విషయాల్ని నేర్చుకొని వ్యాప్తి చేయడం విమర్శ - మాత్యూ ఆర్నాల్డ్, కళా రూపాల్ని అక్షర రూపంలో వ్యాఖ్యానించేది విమర్శ - టి.యస్. ఇలియట్.

నిర్దిష్టమైన సాహిత్య రూపాన్ని పరీక్షించి గుణదోషాల్ని పరామర్శించి సిద్ధాంతాలు చేయటం విమర్శ శాస్త్రం అవుతుంది. అలాగే సాహిత్య రూపాల్ని ఉత్తేజ పరచటం వల్ల విమర్శ కళ అవుతుంది. కనుక విమర్శ, శాస్త్రంతో పాటు కళ కూడ అవుతుంది.

సారాంశంగా సాహిత్య కళాఖండాల వస్తుతత్త్వాన్ని రాగద్వేషాల కతీతంగా సాకల్య సద్వివేచనతో మననం చేసి వాటిలోని బాగోగుల్ని కమ్మని కళాత్మక గుణాల్ని విశ్లేషించి విలువకట్టి మంచి మాటల్లో అక్షర రూపంలో ఉత్తమ అభిరుచుల్ని పెంచుతూ

శాస్త్రంగానూ కళగాను వ్యవహరించేది విమర్శ. నిజానికి కావ్యాన్ని శ్రద్ధగా చదివి ఆకళింపు చేసుకున్న వారికే విమర్శ. అది వారికే అధిక ప్రయోజనకారి. పాఠకుడికి కావ్య పఠన సమయంలో కలిగిన అనుభవాన్ని విమర్శతో సరిపోల్చుకొని విమర్శకుడికి తనకు ఏకవాక్యత కలిగినప్పుడు సంతోషిస్తాడు. కలుగనప్పుడు తన అభిప్రాయాన్ని పునః పరిశీలించుకొంటాడు. ఈ విధంగా అతడి సారస్వత మననాభ్యాసాలు బలపడతాయి. సద్విమర్శ వల్ల వచన వాఙ్మయం వృద్ధి చెందుతుంది. విజ్ఞులు చిత్తశుద్ధి గల విమర్శకులు తమ దృష్టిని వర్తమాన సాహిత్యం మీదికి మరల్చి శాస్త్ర బలంతో కూడిన చర్చలు ధారాళంగా సాగిస్తే ఆ భాషలో సాహిత్య విమర్శ ప్రమాణం పెరుగుతుంది. అందువల్ల ఆ భాషలోని సాహిత్య స్థాయి కూడ తప్పక ఉన్నత శిఖరాల నందుకుంటుంది.

విమర్శ - ప్రకాశం, ఒక దానితో ఒకటి ఎప్పటికీ కలిసే ఉంటాయి. ప్రకాశింప చేయని విమర్శ విమర్శ కాదు. ప్రకాశం ఉన్న చోట, విమర్శ దానికి ముందే ఉంటుంది. ఆ రెండింటి సంబంధం విడదీయరానిగా ఉంటుంది. భారతీయాలంకార సిద్ధాంతాలన్నీ కూడ కావ్యగత సౌందర్యాన్ని వెలువరించి విమర్శకులకు ఉపకరించేవే.

ఒక రచనను చదివి చాల బాగున్నది అని అన్నా, ఆ రచనలోని కొన్ని భాగాలను చదివి చాలా బాగున్నది అన్నా, ఆ రచన మనకు తెలిసినట్లు కాదు. రచన మనకు నచ్చినప్పుడు అందులోని బాగున్న విషయాన్ని విడదీసి చూపడానికి వీలుందా? లేక పాలల్లోని వెన్నలాగా రచన మొత్తంలో వ్యాపించి దాని జీవం ఉందా! దాన్ని మన మాటల్లో చెప్పడానికి వీలుందా? ఆ చెప్పడం మామూలు మాటల్లోనా? విశిష్ఠమైన మాటల్లో చెప్పడం వల్ల కలిగే అధిక ప్రయోజనం ఏమిటి మొ॥వి మనకు తెలియాలి. స్థూలంగా చెప్పాలంటే విమర్శ అంటే ఈ ప్రశ్నలకు సమాధానమే, అంటారు డా॥ ముదిగొండ వీరభద్రయ్య.

సాహిత్య రచనలోని వైశిష్ట్యాన్ని చూపించేదే విమర్శ. మంచి విమర్శ సంప్రదాయ అవిచ్ఛిన్నతను పోషిస్తుంది. ప్రతి క్రొత్త విషయాన్ని వెనుకటి దానితో దానికున్న సంబంధాన్ని, దాని నుంచి ఎంత వరకు స్వతంత్రించింది అనే విషయాన్ని విమర్శ ప్రతిక్షణం బేరీజు వేస్తుంటుంది. ఈ నూత్న విషయం సంప్రదాయంలో ఎలా సహజంగా కలిసి పోయిందో కూడ చూపటం విమర్శలోని అంశమే. అలా వ్యాఖ్యానించి పాఠకుని అభిరుచిని తీర్చి/తీర్చుతుంది. అలా కాకపోతే అది ఒక విద్యగా పరిగణింపబడదు. ఉత్తమ విమర్శ సాధారణ పఠితను వ్యంగ్య వక్రత అలంకార ప్రధానమైన రచనలను మెచ్చుకొనే స్థాయికి పెంచుతుంది. రసానుభూతి కలిగిస్తుంది. రచనలోని సూక్ష్మాంశాలను రచనా సౌందర్యాన్ని రచన ప్రాణాన్ని విమర్శ విశదీకరిస్తుంది.

సాహిత్య సృష్టి జరిగిన తరువాతనే విమర్శ మొదలవుతుంది. రచనకు ముందుగా కవి తనకు తానుగా చేసుకొనే విమర్శ తన రచనా ప్రణాళికలో అంతర్భాగమవుతుందేగాని, అది ప్రత్యేకంగా విమర్శ కాదు. దానిని విమర్శగా పరిగణించలేము. కనుక రచన వేరు, విమర్శ వేరు. కనుక విమర్శ ఒక ప్రత్యేక శాస్త్రం. ప్రత్యేక స్థానం. సాహిత్యాంశాల్ని పరీక్షించి నిగ్గుదేల్చేవాడు విమర్శకుడు. దానికి సహృదయత్వం అవసరం.

## 10.4 సహృదయత

సాహిత్య గ్రంథాన్ని చదివే పాఠకుడు సహృదయుడు కావాలన్నది భారతీయాలంకారికుల అభిమతం. మన ఆలంకారికులు వారిని పాఠకులనిగాని, విమర్శకులనిగాని అనలేదు. ఈ రెండింటికీ పర్యాయపదంగా సహృదయ శబ్దాన్ని ప్రయోగించారు. పాఠక విమర్శకులకు కనీస లక్షణంగా సహృదయం ఉండాలని ఆశించారు. సహృదయత అనేది ఒక పరిభాషాపదం. ఇది విమర్శకుడికి ఉండవలసిన ప్రథమ లక్షణం.

"యేషాం కావ్యాను శీలన వశాత్
విశదీ భూతే మనోముకులే
వర్ణనీయ తన్మయీభావ యోగ్యతా
తే హృదయ సంవాద భాజః సహృదయాః" - అభినవగుప్తుడు.

నిత్యం కావ్యాన్ని పరిశీలించే అలవాటువల్ల హృదయ మాలిన్యం తొలగి, ఎవరి మనసు అనే అద్దంలో కావ్య ప్రతిపాదితార్థతో తాదాత్మ్యం ప్రతిఫలిస్తుందో వారు హృదయ సంవాద భాక్కులు, సహృదయులని అర్థం. హృదయ సంవాదత్వం సహృదయ ప్రధాన లక్షణం. అంటే కవి హృదయాన్ని ఉన్నదున్నట్లుగా గ్రహించగల వాడే సహృదయుడు. మలీమసమైన బాహిర ఆవరణాను ఛేదించుకొని విమలాంతఃకరణుడైతాడు పాఠకుడు. అది అతనికి నిత్య సాహిత్య అధ్యయనం వల్ల సాధ్యపడుతుంది. అటువంటి వాడే సహృదయుడు. వాడే కవితో తాదాత్మ్యాన్ని పొందగలడు. అతడు సత్త్వ ప్రధాన హృదయుడు.

### 10.4.1 సహృదయుడైనవాడే విమర్శకుడు

ఏ హృదయంతో కవి కావ్య నిర్మాణానికి పూనుకొన్నాడో అటువంటి హృదయం విమర్శకుడికీ ఉండాలి. ఆ సహృదయుడిని గూర్చి పి.వి.కాణే పండితుడు, భట్టతౌతుని విషయంలో ఇలా వివరించాడు.

'Another doctrin that తౌత (Bhatta Touta) held was that the poet, the hero (of a poem) and the (sympathitic) reader pass through the same experience' (History of Sanskrit Poetics - P.211).

సాధారణీకరణం పొందిన నాయికా నాయకుల సుఖదుఃఖాలుగా భావన చేయగలవాడే సహృదయుడు. అతడు మాత్రమే సద్విమర్శకుడు. కనుక ఉత్తమ విమర్శకుడు అధికారాన్ని ఆర్జించిన సహృదయుడే అర్హుడవుతున్నాడు. ప్రాచీన భారతదేశంలో విమర్శకుడు సహృదయ భావుక రసజ్ఞ . . . . . . శబ్దవాచ్యుడుగా ప్రసిద్ధుడు. ఆనందవర్ధనుడు 'సహృదయ హృదయాహ్లాది శబ్దార్థ మయత్యమేవ కావ్యలక్షణం' అనీ, ధ్వనాలోకలోచన వ్యాఖ్యాన ప్రారంభ శ్లోకంలో 'సరస్వత్యాస్తత్త్వం కవి సహృదయాఖ్యం విజయతే' అనీ, కవి విమర్శకులిద్దరిలో ఉండే సరస్వతీ తత్త్వం విజయమగు గాక అని ఆశ్వాసించటంలోని అంతరార్థం ఇదే.

'సాహిత్య విమర్శనం' దోషోల్లేఖనం కాదు. సాహిత్య నిర్మాణంలోని సౌందర్య తనువును చేరి ఆరాధించటానికి చేసే నిర్మల తపస్సు. విజ్ఞాన బ్రహ్మాన్ని గూర్చి ఉపనిషత్తులో చెప్పిన లక్షణాలు ఉత్తమ విమర్శకు పట్టాలి -

శ్లో॥ 'తస్య శ్రద్ధైవ శిరః
ఋతం దక్షిణః పక్షః
సత్య ముత్తరః పక్షః
యోగ ఆత్మా'

సాహిత్యంలో యోగ మంటే, కవి - సహృదయుల (విమర్శకుల) భావతాదాత్మ్యం అంటారు శ్రీ ఖండవల్లి రంజనం గారు.

కనుక సహృదయ విమర్శకుడు కావ్య పఠన సమయంలో తన హృదయంలో రుచిరాస్వాదం జనిస్తున్నదా లేదా అనీ, తన హృదయానికి ప్రకృతంలో కాక స్థలాంతరంలో ప్రచారం ఉన్నదా? లేదా అనీ తన రసాస్వాదనకు విఘాతం కలుగుతున్నదా కలగటం లేదా అని తన అంతరంగాన్ని పరీక్షించుకోవాలి. విఘాతం కలిగే కథాభాగం ఎక్కడ ఉందో అక్కడ దోషం ఉన్నట్లుగా నిర్ణయించుకోవాలి. లేకుంటే దోషం దోషంగా భాసించటం లేదని భావించాలి. ఇదే మహాకవి కాళిదాసు చెప్పిన 'సహృదయాః ప్రమాణం' అన్నది.

కావ్య రసానుభూతికి ఎవరు ఉత్తమాధికారి అనే విషయాన్ని తెల్పుతుంది ఈ క్రింది శ్లోకం.

శ్లో॥ "శైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం న భ్రాతరం తార్కికం
దూరాత్సంకూచి తేవ గచ్ఛతి పునశ్చండాల వచ్ఛాందసాత్

మీమాంసా నిపుణా నపుంసక మితి జ్ఞాత్వా నిరస్యాదరాత్
కావ్యాలంకరణజ్ఞ మేవ కవితా కన్యా వృణీతే స్వయమ్" - బిల్హణుడు

కవితా కన్య వైయాకరణుడిని తండ్రిగాను, తార్కికుడిని సోదరుడిగాను, వేదజడుని చండాలుడిగాను, మీమాంసకుడిని నపుంసకుడిగాను పరిగణిస్తుంది. కావ్యాలంకారవేత్త అయిన సహృదయునినే స్వయంగా వరిస్తుంది. మిగిలిన వారికి దాని సారస్వత పరమార్థం అంతుపట్టదని భావం.

కనుక చర్వణం సర్వసామాన్యమే అయినా సారాస్వాదనం సహృదయుడిదే అంటారు ఆచార్య యస్వీ జోగారావు గారు.

'యస్తుష్టౌ తుష్టి మాప్నోతి
శోకే శోక ముపైతిచ
క్రోధే క్రుద్ధో భయే భీరుః
స శ్రేష్ఠః ప్రేక్షక స్మృతః - భరతుడు

సంతోష సందర్భంలో సంతోషం శోక సందర్భంలో శోకం క్రోధ సందర్భంలో క్రోధం భయ సందర్భంలో భయం పొందిన వాడే ప్రేక్షక శ్రేష్ఠుడు. అంటే ఉద్దిష్ట సందర్భానికి సమానమైన అనుభూతిని పొందినవాడే సహృదయ శిఖామణి. భరతమతం ప్రకారం సరాభిముఖ్యంగల చిత్తవృత్తి గలవాడే సరి అయిన సహృదయుడు. సహృదయుడు రసానుభూతిని చెంది, ఇతర పాఠకులకు ప్రరోచన కలిగిస్తాడు. కావ్య రహస్యాల్ని తెలియపరుస్తాడు. సమకాలీన రచయితలకు భావి రచయితలకు మార్గదర్శకు డవుతాడు. విమర్శకుడికి సహృదయత ఉంటే విమర్శలోని లోపాలు చాలవరకు తొలగిపోతాయి. మహాంశాలనే పాఠకుడికి విశదపరుస్తాడు.

నిత్య సాహిత్య విమర్శన వ్యాసంగి అయిన సహృదయుని వాక్కు సజీవం ప్రచార మధుశిల - విమర్శకుడిలో సహృదయత కొరవడితే ఆతడి రచనలో కనిపించేది అతడి సొంత విషయమే అవుతుంది. అందుచేత రచయితతో విమర్శకుడు శ్రుతి కలుపు కోవడానికి ఈ సహృదయత అవసరం. దీనికి చక్కని కృషి అవసరం. అది అప్రయత్నంగా సిద్ధించదు.

రచనకు స్పందించటం దగ్గర నుంచి, రచన మీద తన నిర్ణయాన్ని ప్రకటించేత వరకు, తన పనులను చేయడంలో శిక్షణ పొంది ఉండాలి.

నిరంకుశ సూత్రీకరణలు గాని, వైయక్తిక స్పందనలు గాని విమర్శ కాదు. ఒక రచన మీద నిర్ణయం చేసే సామాన్య కృషి అని గమనించాలి. ఇది సుశిక్షితుడైన విమర్శకుడు గాని చేయలేడు. విమర్శకుడు సామాన్యంగా చేయవలసినవి (1) విశ్లేషణ, (2) తులనాత్మక పరిశీలన, (3) వ్యాఖ్యానం, (4) నిర్ణయం. నాలుగూ కూడ బుద్ధి నాశ్రయించి చేసేవే. బుద్ధి ద్వారా విచక్షణ చేసేటప్పుడు నిర్మమతతో కూడిన రచన అవుతుంది. దీనికి శిక్షణ అవసరం.

విమర్శకుడు కవి మనోవ్యూహాన్ని ఛేదించుకొని పోయి తానెరిగినంత వరకు కళా రహస్యాల్ని సూత్రీకరించి "ఇది కంఠపాశము, ఇది కవి గజాంకుశము, ఇది కవి సంశయ విచ్ఛేదమూ అని గ్రంథ రూపంలో క్రోడీకరిస్తాడు" అని శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు వక్కాణించారు.

విమర్శకుడు విమర్శ చేసేటప్పుడు తత్త్వజ్ఞుడు కావచ్చు, మానసిక శాస్త్రవేత్త కావచ్చు. భిన్నభిన్న సాహిత్య పఠిత కావచ్చు. అయితే అవి అన్నీ విమర్శ తరువాతనే రావాలి. విమర్శకుడు విచక్షణా జ్ఞానాన్ని చూపాలి. అంటే ఇది ఇది, అది ఇది కాదు అని వేరు వేరుగా చూపెట్టాలి. ఈ రచన అంటే ఇది, అది చెప్పినదేదో నేను వివరించాను, దాని అంతర్భాగాలు ఎలా పనిచేశాయో చెప్పాను. ఇది దాని ఎక్స్‌రే ఫోటో' ఇది దాని గుర్తి చీటి' అని తెలియ చెప్పాలంటారు శ్రీ నాగళ్ల వారు.

## 10.5 విమర్శకుల భేదాలు

ఇలియట్ విమర్శకులను Incomplete, Spurious, Dogmatic and Technical Criticism అంటూ చతుర్విధాలుగా విభజించాడు. విమర్శలో సమతౌల్యం భావావేశరాహిత్యం బౌద్ధికత ఉండాలి. (1) అవి లోపించిన వాడు అసమగ్ర విమర్శకుడు. (2) పాండిత్యం పరిశీలన సహృదయత విశ్లేషణలవంటి ప్రాథమిక లక్షణాలు లేకుండా కేవలం రచనాచాతుర్యం చూపేవాడు అసత్య విమర్శకుడు. (3) నియమాలను తయారుచేసి కొలతలను పట్టి చూచినట్లు రచనలను కొలవటానికి పూనుకొనేవాడు నిరంకుశ విమర్శకుడు. (4) నియమాలు రచనకు అన్వయమయినాయా? లేదా? అని పరిశీలించేవాడు సాంకేతిక విమర్శకుడు. ఇతని రచన ముఖ్యమైందిగాను ఉపయోగ కరమైందిగాను భావించవచ్చు, కాని విమర్శ మాత్రం కాదంటాడు ఇలియట్. ఈ విమర్శకుడు విమర్శ వ్యాపారపు ఆవలిగట్టునే ఉంటాడు.

### 10.5.1 విమర్శకులలో మరో వింగడింపు

1. సద్విమర్శకుడు. 2. అసద్విమర్శకుడు.

1. సద్విమర్శకుడు - సహృదయుడై దేశకాలాలకు వ్యక్తిత్వాలకు అతీతంగా నిర్మమతతో, సార్వకాలిత సత్యాలను సర్వ సాహిత్య సృష్టిహితాన్ని కూర్చే విమర్శ చేసేవాడు సద్విమర్శకుడు.

2. అసద్విమర్శకుడు - లౌకిక విషయాలకు తావిచ్చి స్వాభిమానానికి మమతకు తావిచ్చే విమర్శలు చేసేవాడు, అసద్విమర్శకుడు. ఇతడు కావ్యాన్ని అస్వతంత్రంగా భావిస్తాడు. పిడివాదం చేస్తాడు. స్వాభిమానాన్ని ప్రకటిస్తాడు. పాక్షిక దృక్పథంతో దోషైక దృక్కుగా విమర్శిస్తాడు.

## 10.6 ఉత్తమ విమర్శక లక్షణాలు

ఉత్తమ విమర్శకుడికి ఉండవలసిన లక్షణాలను టి.యస్. ఇలియట్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

1. అభినివేశం - తాను విమర్శించ దలచిన విషయం మీద చక్కని అభినివేశం విమర్శకుడికి ఉండాలి. ఆ అభినివేశం ఇతరులకు కూడ కలిగేటట్లుగా వ్యక్తీకరించే శక్తి, నేర్పు కలిగి ఉండాలి.

2. విశ్లేషణ - పోల్చి చూడటం విశ్లేషించటం అనే రెండు పద్ధతుల్ని ప్రదర్శించే నైపుణ్యం ఉండాలి.

3. గ్రహణ శక్తి - ప్రపంచ సాహిత్యంలో నుంచి గాఢతా గాంభీర్యం ఉన్న కావ్యాలను గ్రహించగల నిశిత గ్రహణ శక్తి కలిగి ఉండాలి.

4. చైతన్యం - తన కాల ప్రభావానికో స్థానిక ప్రభావానికో విమర్శకుడు స్థబ్దుడు కాకూడదు. ఆ ప్రభావాల నుండి తనను వేరు చేసుకోవాలి.

5. ప్రతిభ - విమర్శకుడికి సృజన శక్తి ఉండాలి. ఇది క్రాంత దర్శనాన్నిస్తుంది.

6. పరిష్కరణ - కళకు సంబంధించిన వర్తమాన సమస్యలతో మునిగిపోడు. ఆ సమస్యల పరిష్కారానికి గతంలోని శక్తుల్ని వినియోగించి పరిష్కరిస్తాడు.

మందేశ్వరరావు గారు మరి కొన్ని సూత్రాలను పేర్కొన్నాడు.

1. భావుకత - కవి మార్గంలో పయనించే భావుకత కలిగి ఉండాలి. ఆ కవి అలా ఎందుకు రచించాడో చెప్పగలగాలి.

2. శిల్పజ్ఞత - కవి శబ్దాలతో పాటు శిల్ప నిర్మాణాన్ని కూడ నిశితంగా పరిశీలించాలి, దానిలోని రసాత్మక విషయాల్ని దర్శించాలి.

3. వర్తమాన సాహిత్య పరిచయం - మారుతున్న సాహిత్య విలువల్ని గమనించగలగాలి.

4. నిర్మమత - రచనా విమర్శలో నిర్మమతతో వ్యవహరించాలి. మమత ప్రతిఫలిస్తే అది విమర్శకాదు. అతడి అభిరుచి వ్యాస మవుతుంది. అహంకార పరిత్యాగం ముఖ్యం.

5. ప్రభావ రాహిత్యం - ఏ దృక్పధానికీ ప్రభావితుడు కాకుండా స్వతంత్రంగా తన దృక్పధాన్ని ఏర్పరచుకోవాలి.

6. స్వతంత్రత - సమకాలీన సహృదయులకు ప్రతినిధి - వెనుకటి విమర్శలు చదవాలి, కాని వాటినే అంటి పెట్టుకోకూడదు. స్వతంత్రంగా వ్యవహరించాలి.

7. మార్గ నిర్దేశం - సమకాలీన కావ్య పరిశీలన చేసి అవసరమైతే సమాజాభిరుచిని మార్చగలగాలి.

8. నిర్ణయశక్తి - నిరంతర కావ్య పఠనం వల్ల పదనుతేరిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలను మధించాలి. వాటి విలువల్ని మదుపుగట్టాలి. పుష్కలమైన సహృదయతను అలవరచుకోవాలి.

9. సమన్వయం - అలంకార శాస్త్ర భావకుని ఆలోచనకు అడ్డుకాకూడదు.

10. జాగరూకత - విమర్శకుడికి అలంకార శాస్త్రాలలోని పారిభాషిక పదాలు తూకపు రాళ్లలాగ ఉండకూడదు. ఆలంకారిక శాస్త్ర మూల సూత్రాలను ఆధునిక విజ్ఞానంతో పరీక్ష చెయ్యడం కన్నా మహోపకారం మరొకటి లేదు.

ఇటువంటి శాస్త్ర పరాయణులైన విమర్శకుల్ని చూచి కాబోలు తిరుపతి వెంకటకవులు తమ లక్షణా పరిణయంలో ఇలా నిరసించారు.

చం॥ మతిగల వారికే నియుఁ బ్ర
మాద మెలర్పకఁ బోదు పుష్ప స
మ్మిత కవితా లతాంగిని ర
మింపుడు కేవల శాస్త్రులార! మీ
మతులకు వచ్చినట్లు రస
మాధురి గ్రోలుడు గాని, వ్యర్థ పుం
జతురిమఁ జూపి దాని స్తన
శల్య పరీక్ష యొనర్ప బోకుడీ - తిరుపతి వేంకటకవులు

అంటే విమర్శకుడు స్వారస్యాన్ని గ్రహించాలే గాని తప్పులు వెదకటమే ప్రధాన వృత్తిగా పెట్టుకోకూడదు.

యస్వీ జోగారావు గారు 'సాహిత్య భావలహిరి'లో తెల్పిన మరికొన్ని ఉత్తమ విమర్శక లక్షణాలు గమనింపదగినవి.

1. ప్రతిభావ్యుత్పత్తులతో పాటు పుష్కలమైన సహృదయ సముపేతుడు కావాలి.

2. ప్రామాణిక దృష్టి - ప్రమాణం పేరు చెప్పి గుడ్డిగా దానిని బట్టి దేవులాడినచో ఆ విమర్శలో చైతన్యం ఉండదు. ప్రమాణాలకు గాని సంప్రదాయాలకు గాని విధేయమైతే ఒక బాధ, విరుద్ధమైతే ఒక బాధ. అది విమర్శకుడికి అసిధారా వ్రతం వంటిది. సిద్ధాంతానికి రచనను మించిన స్థానం ఇవ్వకూడదు.

3. స్వాత్మ వివేచన - ప్రబోధాలకు ప్రలోభాలకు లోనుకాకుండా సద్యోహృద్యమూ సహృదయ నైవేద్యమూ పరమ స్వాదు పదార్థమైన కావ్య స్వరూపం యొక్క యదార్ధ కథనం విమర్శకుడి కర్తవ్యం.

4. సహానుభూతి - రచయిత కావ్య రచనలో పడిన శ్రమను పడిన ప్రయాసను సహనంతో సహానుభూతితో గుర్తించి వాని నభినందించటం కనీస కర్తవ్యం.

'విద్యానేవ విజానాతి విద్యజ్జన పరిశ్రమం
నహి వంధ్యా విజానాతి గుర్వీ ప్రసవ వేదనం'

అనే ఆర్యోక్తి రీతిగా విమర్శకుడు వ్యవహరించాలి. అప్పుడే ఉత్తమ విమర్శ నిగ్గుదేలుతుంది. కవి ఏది వ్రాశాడని కాదు. ఎందుకు వ్రాశాడని కాదు. ఎలా వ్రాశాడన్నది ప్రశ్న. దానిని మాత్రమే పరిశీలించి సహానుభూతితో విమర్శించాలి.

5. మనస్తత్త్వ మర్మజ్ఞత - కావ్యం కవి యొక్క మనశ్శిశువు. కావ్య రచన సమయంలో కవి మనసులో ప్రచలితమైన భావాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అలా ప్రయత్నించటం వల్ల విమర్శకుడు కావ్య జీవ నాడిని పట్టగలడు. చక్కని విమర్శను వెలువరించగలడు.

6. విశిష్ఠ పాఠకత్వం - నిత్యం సాహిత్యాను శీలనం అవసరం. కవి హృదయాన్ని అవగాహన చేసుకోవాలి. కలిగిన అనుభూతికి తన హృదయాన్ని ఎదురొడ్డాలి. తనకు కలిగిన నిండైన అనుభూతిని సర్వ సహృదయులకు సోపసత్తికంగా నివేదించటం చేతకావాలి. సాహిత్యాభిరుచిని సారస్వత లోకంలో సుసంపన్నం చెయ్యాలి. దానికి విశిష్టమైన పాఠకత్వం కావాలి.

7. తత్త్వదర్శిత - తత్త్వదర్శిత మన్నది మహాకవి లక్షణం మాత్రమే కాదు. సారస్వత ద్రష్టల విషయంలో కూడ ముఖ్యమయినదే. గ్రంథాలకు ఉన్న పేరును బట్టి మోసపోక సత్యాన్వేషకుడై గ్రంథం యొక్క అంతరంగం లోకి తొంగి చూడాలి.

"ఏతము వంగిన వంగును
పాతాళము నీరు దెచ్చి బయలం జల్లున్''

8. సృజనాత్మక మర్మజ్ఞత - విమర్శకుడికి సాహిత్యంలో సృజన సమర్ధత ఉన్నా లేకున్నా ఫరవాలేదు. కాని దాని పరిజ్ఞానం మాత్రం తప్పనిసరి. అప్పుడందులోని సాధక బాధకాలు బాగా గుర్తించగలడు. కవితో సముచిత రీతిగా సంవదించగలడు.

9. లోచూపు - ఉత్తమ విమర్శకుడు మూల గ్రంథాన్ని ముందుగా సమూలంగా చదివి కూలంకషంగా అవగాహన చేసుకోవాలి. ఇంకా సర్వ సాహిత్య రచనల పట్ల పఠనాసక్తి గలిగి వాటి విస్తృత పరిచయంతో మంచి అవగాహన కలిగి ఉండాలి. అలాగే మంచి లోచూపు గలవాడై కావ్యకళా మర్మజ్ఞుడై విమర్శించాలి. మంచి చెడ్డల రెండింటినీ నిర్ణయించే సామర్ధ్యం సహృదయం బహుముఖ ప్రజ్ఞ కలిగి సంకుచిత భావరహితంగా, అంటే విమర్శలో విశాల దృక్పథం కలిగి ఉండాలి.

10. ప్రాజ్ఞత - లౌకిక అలౌకిక విషయ సామస్త్యాన్ని తెలిసిన ప్రాజ్ఞత కలిగి ఉండాలి.

11. ఋజు ప్రవృత్తి - పాఠకుల్ని సైతం ఋజుమార్గంలో పయనింపచేసే ఋజుప్రవర్తకుడై వాస్తవాల్ని మాత్రమే ప్రకటించగలగాలి.

12. ధైర్యసాహసాలు - దానికి సంబంధించి ప్రతి విమర్శల్ని ఎదుర్కొనే ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించగలగాలి. దానికి నిశితమైన బుద్ధి, సూక్ష్మ దృష్టి, విషయగ్రహణ శక్తి అవసరం. అప్పుడే విమర్శ సమగ్రంగా సంపూర్ణంగా విజ్ఞానవంతంగా ఉంటుంది.

13. నిలుకడ - విమర్శ సమయంలో నిలుకడతో నిర్ణయాలు తీసుకోవాలి. ఆవేశం అనర్ధ నిర్ణయాలకు దారితీస్తుంది. తత్రాపి

ప్రతి విమర్శలకు దారితీస్తుంది.

14. ధారణ శక్తి - సద్విమర్శకుడికి మంచి ధారణ శక్తి కూడ వుంటే ఒక రచన యొక్క ప్రాత క్రొత్తలను నిర్ణయించగలడు. విమర్శ నూతనంగాను సత్యంగాను ఉంటుంది.

15. సమకాలీన దృక్పథం - ప్రాపంచిక అనుభవంతో పాటు సమకాలీన సాహిత్య విమర్శలపై దృష్టి సారించాలి. అంటే సమకాలీన దృక్పథం అవసరం.

16. రచనాశైలి - అన్నిటికీ మించి సులభ సుందర వచన రచనాశైలి అవసరం. చదివించేదిగా అనుమానాలకు తావీయనిదిగా రచన ఉండాలి. అలాగే కవికి ఉండవలసిన ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలు విమర్శకుడికి కూడ ముఖ్యమే. అలాగని రచనలు చేయనవసరంలేదు. వంటకాల రుచి చెప్పడానికి వంట నేర్వనవసరం లేదు కదా!

17. వివేచన - ఉత్తమ విమర్శకుడు కావ్య పఠన సమయంలో ఏ సిద్ధాంత సులోచనాల్ని ధరించకూడదు. ధరిస్తే సహృదయత కొరవడినట్లే. ఉత్తమ విమర్శకుడు విమర్శ శాస్త్రాన్ని సహాయకారిగా మాత్రమే స్వీకరించాలి. అంతేగాని శరణాగతి శాస్త్రంగా స్వీకరించకూడదు. స్వీకరిస్తే ప్రమాదం పాలుకాక తప్పదు. శాస్త్ర సూత్రాల్ని సమన్వయించగల వివేచనా శక్తి ఉండాలి. దోషైక దృక్కుగా ఉండకూడదు. కవి ఆత్మీయతను ప్రదర్శించాలి.

విమర్శ కావ్యానికి అగ్ని పరీక్ష లాంటిది. కనుక విమర్శకుడు తనకుండవలసిన పై లక్షణాలతో వర్ధిల్లాలి. అప్పుడే వర్తమాన సాహిత్యం చైతన్యవంతమైతుంది. భవిష్యద్రచనలు నిత్యనూతనమై భద్రాయితమైతాయి.

విమర్శకుడు వ్యాఖ్యానించాలి, విమర్శించాలి, వివరించాలి. అలా చేయకుంటే విమర్శ ప్రాముఖ్యాన్ని కోల్పోతుంది. ప్రయోజన శూన్యమైతుంది. పై లక్షణాలు లేని విమర్శకుడి విమర్శ సత్యాన్వేషణ చేయలేదు. కావ్య సౌందర్యాన్ని గుణాన్ని ఆత్మను పాఠకుల కందించలేదు. అతడొక చిత్తశుద్ధిగల అవయవ శాస్త్రతజ్ఞుడు కావాలి. 'మలర్మే' 'వాలరీ'ల కవిత్వాన్ని వ్యాఖ్యానిస్తూ 'ధియొనాల్డ్' చెప్పినట్లు సద్విమర్శకుడు రచన అంతరార్థాన్ని వివరించి చెబుతాడు.

## 10.7 అసద్విమర్శ లక్షణం

అసద్విమర్శ అంటే సరైన విమర్శ కానిది. ఆ విషయాన్ని ఇలియట్ ఇలా ప్రస్తావించాడు.

1. కవుల మీద యుగాల మీద కేవలం ఉత్సాహం కలిగి ఉండటం.
2. కవిత్వంలో తత్కాలీన విషయాల మీద మక్కువ పెంచుకోవడం.
3. వైయక్తికమైన ఆవేశాల్ని అభిరుచుల్ని కూర్చటం.
4. ముందుగానే ఏర్పరచుకొన్న సూత్రాలతో విమర్శించడం.
5. కవిత్వానికి చెందిన కొన్ని సాంకేతికాంశాల్ని కానీ లేదా నైపథ్యాన్ని కానీ అధ్యయనం చెయ్యటం.

అసద్విమర్శ ఇంకా ఇలా ఉండవచ్చు.

1. కావ్యానికి స్వతంత్ర ప్రతిపత్తిని అంగీకరించక పోవటం.
2. విమర్శను పిడివాదంగా భావించడం.
3. అభిమానంతో కూడిన నిర్ణయాలు చేయడం.
4. పాక్షిక దృక్పథం కలిగి ఉండటం.

5. రంధ్రాన్వేషణైక దృష్టి కలిగి ఉండటం.

పైన పేర్కొన్న విధంగా ఏ సద్విమర్శకుడూ వ్యవహరించడు. అలా చేసే విమర్శ రూపం వైశిష్ట్యం కోల్పోతుంది. ప్రయోజనం నశిస్తుంది. అపకీర్తిని విమర్శకుడు మూటకట్టుకుంటాడు. అసద్విమర్శకుడైతాడు.

## 10.8 కవి - విమర్శకుడు

కవిత్వం అప్రయత్న లబ్ధం అనటం అందరంగీకరించిందే. అందువల్లనే కవిత్వాన్ని అప్రయత్న జనకమైన కళ (unconscious art) అంటారు. భరద్వాజ పక్షి (skylark) యొక్క సంగీతాన్ని అభినందిస్తూ షెల్లీ మహాకవి చెప్పింది, అప్రయత్నంగా వచ్చే కళను గురించి మాత్రమే. విమర్శకులు చెప్పేటంతవరకు తన కవితలోని లోతుపాతులు తెలియక పోవచ్చు. వారు తమ ఆనందానికే కవితలు రాస్తారు. ఈ విషయాన్ని గూర్చి 'సుబంధుడు' అనే కవి చెప్పిన మాటలు గమనార్హం.

"భవతి సుభగత్వ మధికం
    విస్తారిత పరగుణస్య సుజనస్య
వహతి వికాసిక కుముదో
    ద్విగుణ రుచిం, హిమకరోద్యోతః" 1 - 5

"గుణి నామపి నిజరూప
    ప్రతిపత్తిః పరత ఏవ సంభవతి
స్వ మహిమ దర్శన మక్ష్ణో
    ర్ముకుర తలే జాయతే యస్మాత్" 1 - 12

భరత భామహాది ఆలంకారికులు, కాళిదాస భవభూతుల వంటి వారి రచనలను దర్శిస్తే రచన విమర్శ రెండూ స్వతంత్ర మైనవని తెలుస్తుంది. వాటికి వైరుధ్యం కన్పించదు. కవి భావ సామగ్రిని సమీకరించి కావ్య రచన చేస్తాడు. విమర్శకుడు దాని పరమార్థాన్ని విశ్లేషించి విమర్శిస్తాడు. అందరికీ అందుబాటులోకి తెస్తాడు. దీనినే ఒక కవి ఇలా అన్నాడు.

"కవిః కరోతి కావ్యాని
లాలయంత్యుత్తమో జనః
తరుః ప్రసూతి పుష్పాణి
మరద్వహతి సౌరభం"

కవులు కావ్యాలు వ్రాస్తారు. సహృదయులు ఆదరిస్తారు. చెట్లు పూలు పూస్తాయి. గాలి దాన్ని పంచుతుంది అని రచనా విమర్శ రెండింటిలో ఒక దానిలో నైపుణ్యం సాధించిన వారు రెండవ దానిలో కూడ ప్రావీణ్యాన్ని సాధించవచ్చు. అందుకు దండి రాజశేఖర అభినవ గుప్త పండిత రాయల వంటి వారే నిదర్శనం. ప్రజ్ఞావంతులైన మహాకవులు పూర్వ కవుల రచనల్ని చదివి వాటిపై అసంతృప్తితో గాని, లేదా తమ ఉపజ్ఞను ప్రదర్శించటానికి గాని స్వాతంత్ర్యాన్ని అవలంబిస్తారు. ఆ సమయంలో ఆ కవి విమర్శక పాత్రను వహిస్తాడు. విమర్శక దృష్టి కవిని సన్మార్గంతో నడిపిస్తుంది. అలాగే సృజనశక్తి దాని మర్మజ్ఞత విమర్శక దృష్టికి దోహదం చేస్తుంది. పూర్వమే రచనా శక్తి గల విమర్శకుడికి విమర్శన సమయంలో అసలైన గుణగ్రహణ పారీణతని కలిగిస్తుంది. గాంభీర్యం స్థిత ప్రజ్ఞత్వం యదార్థ దర్శన యోగ్యత కలిగిస్తుంది. విమర్శకుడికి సాహిత్య సృష్టి లేకపోయినా, లేదా అందులో ప్రావీణ్యం లేకపోయినా ఎంతో కొంత దాని పరిజ్ఞానం అవసరమైతుంది. అంత మాత్రాన కవి మాత్రమే విమర్శకుడు కానక్కరలేదు.

కవిత్వము విమర్శ వేరు వేరు. అలా కన్పిస్తున్నా మనస్తత్త్వ శాస్త్ర దృష్టితో పరికిస్తే ఆంతరమైన సంబంధాలు కనిపిస్తాయి. కవి తన వాక్కులలో చెప్పనిదాన్ని చెప్పలేకపోయిన దాన్ని వైమర్శిక దృష్టితో విమర్శకుడు వ్యాఖ్యానిస్తాడు. కవికి తోచని, అతని రచనలోని మర్మాల్ని విలువల్ని విమర్శకుడు వివరించి లోకంలో కావ్య గౌరవ కారకుడైతాడు. అపుడు కవికి ఆనంద హేతువవుతాడు. సమకాలిక కవికి మార్గదర్శకుడైతాడు. అంతేకాదు 'కవితా వనిత తొలంగు బావ విమర్శక పురుషడ'నే ఆభాణం ఉంది. అంటే కవి విమర్శకులది బావమరదళ్ల సరసంగా కొందరు భావిస్తారు. అంతే కాని విమర్శకుడిని కవి శాసకుడిగా భావించకూడదు.

కవి తన కావ్య ధర్మాన్ని గ్రహించింది విమర్శక నియమాల్ని బట్టి కాదు. తన విమర్శక బుద్ధితోను తులనాత్మక పరిశీలనతోను, మహాకవి ప్రయోగ పరిజ్ఞానంతోను తన మార్గాన్ని సుందరీకరించుకొంటాడు. దానినే విమర్శకుడు దర్శిస్తాడు. ఒక మంచి విమర్శ కవిని ఉత్తమ కవిగా మలచగలదే గాని, సామాన్య పాఠకుడని కవిగా మార్చలేదు. అయితే అతడిలో చక్కని సాహిత్యాభి రుచిని కల్పించగలదు.

ఇక ఎప్పటికీ కవులకు ఆలంకారికుల కంటె మహాకవులే మార్గదర్శకులు. తిక్కనపై అబ్బూరి, గురజాడను గూర్చి కృష్ణశాస్త్రి రచించిన గేయాలే నిదర్శనాలు. ఉదాత్త పాఠకుల వలన ఉత్తమ కవితా ప్రతిభా ప్రభంజనం మొదలవుతుంది. అందువలన సమాజం సాహిత్యం పరస్పరాభి వృద్ధి చెందుతాయి. సహృదయుడి హృదయ స్పందనలోనుంచి సాహిత్య సృష్టి జరుగుతుంది. సాహిత్య విమర్శ నిశిత పరిణత పరిశీలన హృదయం నుండి ఆవిర్భవిస్తుంది.

మహాకవి కాళిదాసు యొక్క "ఆ పరితోషాం విదుషాం నసాధు మన్యే ప్రయోగ విజ్ఞానమే బలవదపి శిక్షితానామాత్మన్య ప్రత్యయం చేతః" అనే శ్లోకాన్ని బట్టి కవి కంటె విమర్శకుడే కావ్య పరమార్థాన్ని స్పష్టీకరించటంలో సమర్థుడని తెలుస్తుంది. కవులై విమర్శకులైన వారిలో గోథే మహాశయుడిని మించినవారరుదు. బైరన్ కూడ ఈ భావాన్నే వ్యక్తీకరించాడు. పోలికను బట్టి విమర్శకుడు గూడ కవి వంటి శిల్పి. అంతే కాదు అతడి ప్రజ్ఞను ప్రదర్శించే వ్యాఖ్యాత కూడ. మహా కవులు తమ కావ్యాల ద్వారా మానవ జీవిత పరమార్థాన్ని ప్రసాదిస్తారు. విమర్శకుడు సారస్వత పరమార్థాన్ని ప్రదర్శిస్తాడు. విమర్శకుడు కవి హృదయాన్ని నిగ్గుదేల్చి, సాహిత్య ప్రపంచంలో అతడికి సముచిత స్థానాన్ని నిర్ణయిస్తాడు.

## 10.9 సాహిత్యం - విమర్శ

విమర్శ పాఠకుడి రసానుభవానికి అక్షర రూపం. విమర్శకుడు కవి ఇద్దరూ సాహిత్యం యొక్క ఉత్తమ స్వరూపాన్ని గ్రహించడానికే ప్రయత్నిస్తారు. సాహిత్య కృషి ప్రారంభమైనప్పటి నుండి నిరంతరంగా సాగుతూనే ఉంది. కవిత్వం విమర్శ రెండూ భిన్నంగా కన్పించినా సాహిత్యానుభూతి విషయంలో ఆ రెండింటి ప్రయోజనం ఒక్కటే. రెండింటి పర్యవసానం ఆనందమే. సరియైన విమర్శకుడు కావ్య పరమార్థాన్ని గ్రహించి ప్రకటించేంత వరకు ఆ కావ్యం వెలుగు చూడక పోవచ్చు. అందుకు కళాపూర్ణోదయం కమనీయోదాహరణం. కట్టమంచి వారు వచ్చే వరకు అది లోకం ముఖం చూడనే లేదు కదా! కవి ఉత్తమ ఆదర్శ పాఠకుడు. అతడు కవి హృదయాన్ని ఆవిష్కరిస్తాడు. కవి శిల్పనైపుణీ వ్యాపారాన్ని వ్యాఖ్యానిస్తాడు. ఆతని కృత కృత్యతను పాఠకులకు ఎరుకపరుస్తాడు. కావ్యాన్ని విమర్శించే సమయంలో ఒక ప్రాచీన సిద్ధాంతానికి ఒక నవీన సిద్ధాంతాన్ని జోడింప వలసి రావచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రాతదాని స్థానంలో క్రొత్తదాన్ని ఉంచవలసి రావచ్చు. సాహిత్యమూ, సాహిత్య విమర్శ రెండూ ఒకే రకమైన సామాజిక పరిస్థితులలో వృద్ధి పొందినప్పుడు, ఒక కుటుంబంలోని వ్యక్తుల లాగ పోలికలు కలిగి ఉంటాయి.

సాహిత్యంలో ఒక కాలంలో ప్రసిద్ధంగా ఉన్న ప్రక్రియల్ని, ఆ కవులు ఏ విధంగా నిర్వహించారో పరిశీలించడం విమర్శకుని విధి. అంతే కాని ఆ ప్రక్రియలెందుకు ఆవిర్భవించాయని ప్రశ్నించటం కాదు. కవిత్వం వ్యక్తిగతమైనపుడు దాని విమర్శ కూడ వ్యక్తిగతమే అవుతుంది.

ఆ విమర్శకుడు గూడ తన వైయక్తికమైన ఇష్టా యిష్టాలతో కూడిన విమర్శ చేస్తాడు. ఇటువంటి విమర్శలో విమర్శ ప్రమాణాలూ సిద్ధాంతాలు దూరమైతాయి. కొన్ని కొత్త విమర్శ లక్షణాలు, తాత్కాలికంగా సమకాలీన రచయితల భావాల కనుకూలంగా వస్తాయి. ప్రాచీన సాహిత్య యుగాలలో ఒక ప్రత్యేక శాఖకు సంబంధించిన విమర్శన సిద్ధాంతాలు తాత్కాలికమైనవే. అవి సార్వకాలికాలు కావు. కానీ ఆధునిక కాలంలో అన్ని దేశాలలోని సాహిత్య స్వరూపం ఒక్క రూపమైందే. కానీ దాని ప్రకటించే మాధ్యమమే మార్పు - అందుచేత విమర్శ సిద్ధాంతాలు కూడ సార్వకాలికంగా సార్వదేశికంగా ఉండాలంటున్నారు. సాహిత్యంలో క్రొత్త క్రొత్త ప్రక్రియలు ఉద్యమాలు వాదాలు వస్తున్నాయి. వాటిని మనం గుర్తించాలి. గౌరవించాలి. వాటికి తగిన విమర్శ విధానాల్ని రూపొందించుకోవాలి. కనుక సాహిత్యమూ విమర్శ పరస్పరాశ్రయాలు, పరస్పర వృద్ధికి దోహదాలు.

'గుణ దోషే బుధౌ గృహ్ణన్
ఇందు క్ష్వేడా నివేశ్వరః
శిరసా శ్లాఘతే పూర్వం
పరం కంఠే నియచ్ఛతి' - రాజశేఖరుడు

పరమ శివుడు చంద్రుణ్ని శిరసు మీద ధరించి, ప్రపంచానికి ప్రదర్శించి, విషాన్ని కంఠగతం చేసుకొని దాని వ్యాప్తిని అరికట్టినట్లుగా, విమర్శకుడు కావ్య గుణాల్ని శ్లాఘించటానికి అధిక ప్రాధాన్యమిస్తూ, దోషోద్ఘాటన విషయంలో సమ్యమనాన్ని పాటించాలి.

## 10.10 విమర్శకుడి సమస్యలు

కవి వలన సాహిత్యానికి జీవిత తత్త్వానికి సంబంధం ఏర్పడుతున్నది. విమర్శకుడు జీవితాన్ని విమర్శించినట్లు సాహిత్యాన్ని విమర్శించడు. విమర్శకుడు కావ్యాన్ని కావ్యంగానే విమర్శించాలి. ఈ ప్రక్రియలో విమర్శకుడు అప్పుడప్పుడు సాహిత్యానికి జీవితానికి గల సంబంధాల్ని కూడ వినియోగించే సందర్భాలుండవచ్చు.

విషయాన్ని విమర్శించడానికి బహు శాస్త్ర విషయ పరిజ్ఞానాన్ని సంపాదించాలి. సాహిత్య స్వరూప స్వభావం విమర్శకు ప్రమేయమున్న సమస్య. అందులోని వివిధ సాహిత్య గుణాల్ని తెలుసుకోవాలి. స్రష్ఠ, సాహిత్యము, పఠిత ఈ మూడింటి అనుబంధాన్ని అర్థం చేసుకోవడం వల్ల సాహిత్య స్వరూపం కొంత తెలుస్తుంది. అలా తెలుసుకున్నవాడే సాహిత్య విమర్శకుడైతాడు. సామాన్య మానవుడి కంటె సంఘాన్ని విమర్శకుడు బాగా అర్థం చేసుకోగలగడం వల్ల అతడి విమర్శలో సంఘ ప్రభావం ఉంటుంది. సాహిత్య ప్రయోజనాల్ని తెలుసుకోవాలి. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. మొత్తం మీద సాహిత్య ప్రయోజనం ఆనందమని కొందరు, ఉపదేశమని కొందరు అంటారు. సాహిత్యం కొంతవరకైనా ఉన్నత పథాలకు తీసుకపోవాలని కొందరి అభిప్రాయం.

సాహిత్యం జీవిత విమర్శ అన్నాడు ఆర్నాల్డ్. 'యధావద్వస్తు వర్ణనమే సాహిత్య ప్రయోజనమ'ని కొందరు. వీటి నన్నింటిని విమర్శకుడు పఠితకు అందించవలసి ఉంటుంది. సాహిత్య విమర్శ సాహిత్య సృష్టి యొక్క విధానాన్ని గూడ పరిశీలించాలి. రచనా వ్యాపారం జరిగేటప్పుడు కవి మనసులో ఏమి జరుగుతున్నదో విమర్శకుడు తెలుసుకోవాలి.

కవి ఈ రచన కెందుకు ఉపక్రమించాడో తెలుసుకోవాలి. కవి సృష్టి విధానంలోని ఊహా భావానుభూతుల స్వభావం తెలియాలి. ఒక్కొక్కసారి కవికి హఠాత్తుగా కవిత వస్తుంది. దానికి రచనలో గల స్థానమేమిటి. కళాత్మక శైలీ విన్యాసానికి ఎటువంటి స్థానం ఉందో తెలియాలి. ఇలా విమర్శకులు రచనా ప్రక్రియను గూర్చి ఊహలేర్పరచుకోవడానికి అన్వేషించవలసిన విషయాలివి.

కళాఖండాన్ని సక్రమంగా అభినందించాలి.

దాని సృష్టికి తగిన సిద్ధాంత పరిచయం ఉండాలి.

విమర్శకుడికి వివేకం సామరస్యాన్ని సాధిస్తుంది.

ఈ విధంగా సాహిత్య విమర్శలోని సమస్యలు ఉంటాయని ఆచార్య యస్వీ. జోగారావు గారభిప్రాయపడ్డారు. విమర్శకుడికి కేవలం శబ్దార్థం తెలిసి నంతలో అసలు అర్థం తెలిసినట్లుకాదు. విమర్శలో పది ప్రధానమైన కష్టాలున్నాయి.

ఒక రచనను విమర్శిస్తున్నప్పుడు ప్రాథమికంగా దాన్ని విశ్లేషించుకోవాలి, వ్యాఖ్యానించాలి, తులనాత్మక పరిశీలన చెయ్యాలి. ఆ పై రచన స్వరూప స్వభావ మూల్యాల్ని నిర్ణయించాలి.

## 10.11 విమర్శ ఎవరి కోసం

విమర్శ వల్ల కలిగే లాభమేమిటి అన్న ప్రశ్న కేవలం అహంకార పూరితమైనదని అంటారు ఆచార్య కె.వి. నరసింహం. కవిత్వమంటే ఏమిటో తెలుసుకోవచ్చు. కాని తెలుసుకున్నదంతా ఆచరించడం మాత్రం సర్వ సామాన్యమైంది కాదు. అప్పుడే విమర్శ మిక్కిలి ఆవశ్యకమైతుంది. కొందరు కవులకు కవిత్వ తత్వం తెలిసినా దాని నెంత వరకు జీర్ణించుకోగలరో పరిశీలించడమే కవిత్వ విమర్శలకు గల బాంధవ్యం.

సాహిత్య సృష్టి సాహిత్య విమర్శకు ఆధారం. అంత మాత్రాన స్వయం ప్రతిపత్తి లేదని కాదు. నిజం చెప్పాలంటే రెండూ వ్యతిరేక ధ్రువాలు. కవిత్వం ఆవేశ చైతన్యోద్భవం. విమర్శ ఆలోచనా లోచన గోచరం. కవిత్వం గుండెలోనుంచి పుడితే, విమర్శ మనసులో నుంచి పుడుతుంది. ఒక సాహిత్య సృజనలో నుంచి మరొక సాహిత్య సంస్కృతిని కాపాడుతుంది. రచయిత కూడ రచనకు ముందు వెనుకల వ్యుత్పన్నతను సంపాదించు కోవలసిందే. ఇది రచయిత కత్యంతావశ్యకం. దానితో అతని ప్రతిభా నైశిత్యాలు నవనవోన్మేషాలైతాయి. అది రచయితలలోను విమర్శకులలోను సాహిత్యాభిలాషను పెంచుతుంది.

ఇందువల్ల విమర్శ ఎవరి కోసం? ఎవరి కోసం? అంటే సాహిత్యాభిమానుల కోసం. సాహిత్యాభిమాని అంటే అందులో రచయిత పాఠకుడు విమర్శకుడు ముగ్గురూ వస్తారు.

కవిత మాట్లాడలేని దాన్ని విమర్శ ఎత్తి చూపుతుంది అంటాడు ఫ్రై. పాఠకుల అవగాహన కోసం విద్యార్థులకు విద్య కోసం విమర్శ పనికి వస్తుంది. ఇంకా రచన ప్రకాశించడం కోసం పాఠకుల విజ్ఞానాభివృద్ధికి, వారి ఆలోచనా ప్రేరణకు విమర్శ అవసరం. పాఠకుడికి మనః చక్షువుకు గోచరం కాని కావ్యగత రమణీయార్థాల గూర్చిన ఆలోచనలో అవగాహనలో మిత్రుడిగా సహకరిస్తుంది. రచయితలకు భవిష్యన్మార్గదర్శి. అతడికి కళా రహస్య బోధినిగా మారుతుంది. విస్పష్ట పరుస్తుంది. పాఠకుల అనిర్వచనీయాను భూతిని అందరకూ అక్షర రూపంలో అందిస్తుంది. ఇలా విమర్శ సాహిత్య జిజ్ఞాసువులందరినీ అలరిస్తుంది. సాహిత్యా స్వాదనసక్తిని శక్తిని పెంచుతుంది. "ఒక కావ్యాన్ని గూర్చిన మూఢాభిప్రాయాలు విమర్శ ద్వారా తొలగించుకోవచ్చు సద్విమర్శ వల్ల వచన వాఙ్మయం వృద్ధి చెందుతుంది. సద్విమర్శతో కవి - విమర్శకు లిద్దరికి కీర్తి ధనప్రాప్తి కలుగుతుంది" అంటారు డా॥ యస్వీ. రామారావు.

మొత్తం మీద ఉత్తమ విమర్శ సమాజంలో నూత్న చైతన్యాన్ని అవగాహనా శక్తిని ప్రసాదిస్తుంది. కనుక సర్వ సాహిత్య ప్రియులకు సమాజానికి అవసరం సద్విమర్శ.

## 10.12 విమర్శ భాష

విమర్శలో ఉపయోగించే భాష ప్రత్యేకంగా ఉండాలా? మరేదైనా మార్పు ఉండాలా అనే ప్రశ్న తలెత్తితే కొంచెం లోతుగా ఆలోచించాలి. దీన్ని గూర్చి ఐ.ఎ. రిఛర్డ్ ఒక ప్రత్యేక వ్యాసాన్నే రచించాడు.

విమర్శ భాష రెండు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. కావ్యం తన మీద వేసిన ప్రభావాన్ని, తనకు కలిగిన అనుభూతిని వ్యక్తీకరించే అతడి భాష మొదటి అంశం. రెండవది సాహిత్య విలువలను రచనలో నుండి పృథక్కరించి చూపేటప్పుడు ప్రత్యేక పరిభాష వాడటం.

కళా చర్చ సమయంలో మనం సాధారణంగా వాడే భాష తప్పుదారి పట్టిస్తుందంటాడు రిఛర్డ్స్. ఆ విషయం తెలిసీ మరిచిపోయి వ్రాస్తాడు. విమర్శకులు కాని కేవల కళాస్వాదకుల భాషకూ, విమర్శకుల భాషకూ భేదం ఉంటుంది. కారణమేమిటంటే విమర్శకుడు కళ తాలూకూ విలువల్ని అతడు దృష్టిలో పెట్టుకొని అభివ్యక్తీకరిస్తాడు. సామాన్యుడు తనకు కలిగిన అనుభూతుల్ని బట్టి భాషను వాడుతాడు. విషయం మీద సరైన అవగాహన గలవాళ్లు కళల మీద అభిప్రాయ ప్రకటనకు వాడే శబ్దాలు వేరుగా ఉంటాయంటాడు రిఛర్డ్స్. రచన రూపం సమతౌల్యం నిర్మాణం గ్రథనం అభివృద్ధి అనే శబ్దాలను అన్ని కళలకూ వాడతాం. మళ్లీ చిత్రకళ సంగీత కళ సాహిత్య కళా విమర్శలలో మరికొన్ని ప్రత్యేకమైన పారిభాషిక పదాలను వాడతారు. విమర్శ సామాన్యులు ప్రతిస్పందించే భాషలో ఉండదు. శాస్త్రకారులు పూర్వం నిరూపించిన అన్వయించిన సిద్ధాంతాలను తెలిపే పరిభాషలో ఉంటుంది. అది సంక్షిప్తతను అవగాహనా సౌలభ్యాన్ని కలిగిస్తుంది. శాస్త్రీకరించిన విషయం ఆత్మాశ్రయ లక్షణానికి దూరంగా ఉంటుంది. అందుచేత విమర్శలో ప్రత్యేక భాష అనుభూతికీ వస్తు లక్షణాలకూ మధ్య స్పష్టమైన రేఖ నేర్పరిస్తుంది.

సాహిత్య విలువల్ని వివరించేది ప్రత్యేక పరిభాష. అలంకార రీతి గుణ రస వక్రోక్తుల విషయంలో ప్రత్యేక దర్శనమూ తత్త్వమూ ఉంటాయి. ఇవన్నీ కావ్యాత్మని విలువల్ని తెలిపే ప్రత్యేక శబ్దాలు. అన్ని కావ్య విలువల మీద ఆలంకారికులు సిద్ధాంతాలను ప్రతిపాదించడంలో ఈ పరిభాష ఏర్పడింది. వాటికి తత్త్వమూ దర్శనమూ ఏర్పడి రూఢిలో స్థిరపడ్డాయి. విమర్శ శాస్త్రం ఈ పరిభాషను సాధిస్తుందని విజ్ఞుల భావన. రసం అనే పారిభాషిక శబ్దం చేత, సృజనాత్మక సాహిత్యం వల్ల పాఠక ప్రేక్షకులలో కలిగే అనుభవనానికి ఒక సామాన్య సూత్రాన్ని కల్పించి విమర్శకులకూ సాహితీ స్రష్టలకు సౌకర్యాన్ని కలిగించిన సిద్ధాంతం మరొకటి లేదు. కనుక రస శబ్దం విమర్శ భాష. అవగాహనలో రచనలో సౌలభ్యాన్ని కలిగిస్తుంది ఈ విమర్శ పరిభాష. అయితే వీటిని అనుచితంగా ప్రయోగించరాదు. వీటిని జాగ్రత్తగా వాడటం వల్ల అలంకార శాస్త్రాన్ని కాపాడుకోవచ్చు. ఇంతవరకు ఏర్పడిన జ్ఞానాంశాల సంస్కారంతో సాహిత్య విమర్శల విషయంలో ఒక అడుగు ముందుకు వేయవచ్చు. అంతే గాని అర్థం గాని ప్రత్యేక పరిభాషను సృష్టించుకొని 'విమర్శ సాటి విమర్శకుల కోసమే' అన్నట్లుండకూడదు.

## 10.13 విమర్శ - నిర్ణయాలు - ప్రకటనలు

విమర్శలో అనేక పద్ధతులున్నాయి. ఏ విధానాన్ని అనుసరించి విమర్శించినా రచన మీద కొద్ది నిర్ణయాలు తప్పనిసరి. విమర్శకుడు రచనలోని బాగోగులను గూర్చి నిర్ణయిస్తాడు. విమర్శ శాస్త్రం విమర్శక నిర్ణయాలకు సహకరిస్తుంది. విమర్శ రంగంలో క్లిష్ట భాగం నిర్ణయ భాగమే.

ఎ) అనుభవ రసానుభూతి

బి) రచనా శిల్ప సౌందర్యం

సి) గుణదోష ఔచిత్య విచారం

డి) తత్రచన వల్ల ఏ సిద్ధాంతానికి వన్నె వచ్చింది

అనే విషయాల మీద నిర్ణయాలు వెలువడాలి.

విమర్శ రంగంలో చైతన్యానికి నిర్ణయాలు ప్రధాన భూమికలు. ప్రతిభాశాలి అయిన రచయితను ఈ నిర్ణయాల విషయంలో, కేవలం సిద్ధాంతాలతోనే విమర్శించకూడదు. ఏ ప్రక్రియపైన అయినా విమర్శకుని నిర్ణయాలు సోపపత్తికంగా ఉండాలి. అంటే సూటిగా వాచ్యంగా చెప్పాలి.

## నిర్ణయ ప్రకటనలోని క్లిష్టతలు

రచనా వస్తువు నచ్చిన రచనలో కళా విలువలు లోపించినప్పుడు, కళా విలువలున్నా వస్తు వైశిష్ట్యంలేని సందర్భంలోను, సందేశంతోనూ వస్తువుతోను విమర్శకుడు విభేదిస్తున్నప్పుడు, రచనలో లేని అనుభవం శాస్త్ర విరుద్ధంగా ఉన్నా, అది బాగున్నదని తోచినప్పుడూ రచనానుభవం స్పష్టంగా తెలియనప్పుడూ, కళా విలువలున్నా సామాజిక ప్రయోజనం లోపించినప్పుడు, విమర్శకుడికి సామాజిక దృష్టి ఉన్నప్పుడూ నిర్ణయ ప్రకటనలో విమర్శకుడికి క్లిష్ట పరిస్థితులు వస్తాయి. వాటిని జాగ్రత్తగా విశ్లేషించుకొని వ్యాఖ్యానించాలి, నిర్ణయాలు చెయ్యాలి, ప్రకటించాలి. అవి పాఠకానుభవ విరుద్ధంగా ఉండకూడదు. స్పష్టంగా ఉండాలి. ఉత్తమ విమర్శకుడి నిర్ణయాలు అభిప్రాయ ప్రకటనలు పాఠకులకు జ్ఞాన తృష్ణను కలిగిస్తాయి. అవి స్పష్టంగా ఉంటాయి. సహజంగా ఉంటాయి.

## 10.14 విమర్శకుడికి పాండిత్యావసరం

ఒక సాహిత్య రచనను విమర్శించడానికి ఉండవలసిన ముఖ్యాంశాల్లో పాండిత్యం ఒకటి. ఒక గొప్ప గ్రంథాన్ని చదివే పాఠకుల్లో పలు విధాలవారుంటారు. వారి విద్యాస్థాయిలు వేరుగా ఉంటాయి. ఒక రచనను చదివే హక్కు అందరికీ ఉంటుంది. కానీ అందరూ విమర్శించలేరు.

విమర్శ సాహిత్య సంస్కృతిని వృద్ధి చేస్తుంది. పాఠకుడి అనుభూతిని రక్షిస్తుంది. సామాజిక సాంస్కృతిక లాభాలకు దోహదపడుతుంది. పాఠకుడిని చైతన్య పరుస్తుంది. ఇంత బాధ్యతను వ్యుత్పన్నుడైన విమర్శకుడు మాత్రమే చెయ్యగలడు. సామాన్యుడి తరంకాదు. విమర్శకుడు గూడ కవిలాగ ప్రతిభావంతుడైతే విమర్శను మెరిపించగలడు.

ఉత్తమ విమర్శకుడు విమర్శకు ముందు కావ్య పఠనావసరంలో పాండిత్యం మిక్కిలి అవసరం. లేకుంటే గహన విషయాలను గ్రహించలేడు. విమర్శకుడు పూర్వ సిద్ధాంతాల్ని, ప్రస్తుత సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న వ్యుత్పన్నుడు కావాలి. విమర్శకుడికి బుద్ధిగతమైన దోషాలు లేకుండా చేసేది పాండిత్యమే. సాహిత్య విమర్శ ఒక శాస్త్రం. విమర్శ ఏదో ఒక్క శాస్త్ర విజ్ఞానంతోనే దాన్ని పరిపుష్టం చెయ్యలేదు. అనేక శాస్త్ర పరిచయం అవసరం. 'నిర్లిప్తుడు గానూ నిష్పాక్షికుడు గానూ వ్యవహరిస్తూ రచన మీద నిర్ణయాలు చెయ్యడానికి, వాస్తవాలను ధృవీకరించు కోవడానికి మనం పండితుని సమీపించాలి. విమర్శకుడు తప్పక ఎంతో కొంత పండితుడు కావాలి. పండితుడేమో ఎంతో కొంత విమర్శకుడు కావాలి' అని చెప్పిన ఇలియట్ మాటలు అర్థవంతాలు.

'పాండిత్యం దేన్ని ప్రారంభిస్తుందో విమర్శ దాన్ని పూర్తి చేస్తుంది. రెండింటికీ దగ్గరి సంబంధం విమర్శకుడికి ప్రయోజనం' అని ఇలియెట్ భాషణం. మంచి పాండిత్యం విమర్శకుని బుద్ధిని మేల్కొల్పే విధంగా సాక్ష్యాలను చూపుతుంది. అది నిర్ణయం కన్న పద్ధతి నిస్తుందని ఇలియట్ ప్రకటించాడు. పండిత విమర్శకుడు రచనలోని వాస్తవాలకు అతీతంగా పోయి ఊహాపోహలు చేయడు. కారణం పాండిత్యమే. అందుకే విమర్శకుడు వాస్తవ దృష్టి కలిగి ఉండాలి.

1. రచనలోని సంప్రదాయ, లేదా అనుభూతి సంబంధమైన 'సత్యాన్ని' గ్రహించాలి. 2. దాన్ని తెలుసు కోవాలంటే రచనలోని ప్రత్యేకమైన భాగాల్ని విడదీయాలి. 3. వస్తు విమర్శన సమయంలో ఆ వస్తువు చుట్టూతా, అలాగే దానిలోపలా ఉండే భేదాల్ని వాటి

ప్రత్యేకతల్ని ఎత్తి చూపి నిలపడం మీదనే సాహిత్య పాండిత్యం అవసరం. ఈ మూడింటినీ కలిపి చూపగలగడమే విమర్శకుని పని. దీనికి విమర్శకుడు వ్యుత్పన్నుడు కావలసిందే. పాండిత్యం లేనివాడు సమీక్షకుడిగానో పత్రికా వివేకంగానో మిగిలి పోతాడే తప్ప విమర్శక పదవీ విరాజితుడు కాలేడు. గ్రాంధిక భాషలో వివరించ దలచినా, వ్యావహారికంలో పూనుకున్నా రచనా వ్యాసంగం సుబోధకంగా రమణీయంగా కమనీయంగా సాగాలి. పాఠక హృదయానికి హత్తుకు పోవాలి.

విమర్శకుడు పండితుడైతే తన విమర్శ ద్వారా, సాహిత్య సంస్కృతిని పోషించ గలుగుతాడు. కనుక పదిమందిని విద్యావంతులుగా చేయవలసిన విమర్శకుడు తప్పక విద్యాధికుడు కావాలి. కావ్య విమర్శకుడికి కవిత్వ మర్మమూ తెలియాలి పాండిత్యమూ కావాలి. తాత్త్వికతా కావాలి.

## 10.15 విమర్శ ప్రక్రియలు

విమర్శ సహజంగా స్వతంత్ర రచనా విధానం గలది. అది సామాన్యంగా వచనంలో ఉంటుంది. ఇది శ్రేష్ఠమైన ప్రకటన విధానం. వివిధ ఇతర రూపాలలో కూడ ఉండవచ్చు. ఈ వ్యాసాలు వివిధాంశాలకు సంబంధించి ఉంటాయి.

వీరేశలింగం పంతులు గారితోనే, విమర్శ కేవలం ప్రక్రియా విశేషంగా మాత్రమే కాక సామాజిక ప్రయోజన సాధనంగా కూడ ఉపయోగ పడటం మొదలైంది. తెలుగులో విమర్శ సాహిత్యం ప్రక్రియలు అనేకం. పత్రికలు ప్రత్యేక సంచికలు సాహిత్య చరిత్రలు పీఠికలు సిద్ధాంత గ్రంథాలు విజ్ఞాన సర్వస్వాలు లక్షణ విమర్శలు విమర్శలు లేఖలు ఉపన్యాసాలు విమర్శ గ్రంథాలు వ్యాసం గ్రంథ సమీక్ష పీఠిక పేరడి వ్యాఖ్యానం మొ॥నవి విమర్శ సాహిత్య స్వరూపాలు.

పూర్వ విమర్శకుల పద్ధతికి విరుద్ధంగా అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులూ, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, దువ్వూరి రామిరెడ్డి, కావ్యాలలోని గుణదోషాల్ని రెండింటినీ యుక్తి యుక్తంగా చర్చిస్తూ చర్చించారు. పింగళి లక్ష్మీకాంతం, విశ్వనాథ సత్యనారాయణ, నాగళ్ల గురుప్రసాదరావు, కొడవటిగంటి కుటుంబరావు, యస్వీ జోగారావు, జి.వి. సుబ్రహ్మణ్యం, కె.వి. రమణారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ, ఆవంత్స సోమసుందర్ వంటి కొందరు విమర్శకులు విమర్శలో క్రొత్త అందాలను తెచ్చిపెట్టారు.

## 10.16 సమీక్ష

ప్రక్రియా భేదాలతో ప్రాక్ర్పతీచీ భేదాలతో తెలుగునాట పాఠక హృదయాలకు కావ్యానందాన్ని విజ్ఞానాన్ని పంచిపెడుతూ సాహితీ విస్తృతికి దోహదం చేస్తూ సహృదయతను పెంపొందిస్తున్న విమర్శ అందరకూ ఉపాదేయం.

## 10.17 ప్రశ్నలు

1. విమర్శ లక్షణాల్ని వివరించండి.
2. ఉత్తమ విమర్శకుడి లక్షణాల్ని తెల్పండి.

## 10.18 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. విమర్శ మౌళిక లక్షణాలు - ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య
3. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు

4. తెలుగు విమర్శ - ఆచార్య యస్వీ రామారావు
5. లక్ష్మీరంజన వ్యాసావళి - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం

**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
ఎం.ఏ., ఎం. ఫిల్., పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

## పాఠం - 11

# విమర్శ - పద్ధతులు

పాఠ్యనిర్మాణక్రమం


11.0 లక్ష్యం
11.1 ప్రాచీన విమర్శ భేదాలు
11.2 అర్వాచీన విమర్శ విధానాలు
11.3 సమీక్ష
11.4 ప్రశ్నలు
11.5 ఉపయుక్త గ్రంథాలు


## 11.0 లక్ష్యం

ప్రాచీన అర్వాచీన విమర్శ భేదాల్ని తెలియచేయటం, అందులో ప్రధాన తత్త్వాన్ని అవగాహన పరచటం.

## 11.1 ప్రాచీన విమర్శ భేదాలు

విమర్శ పద్ధతులు కొన్ని ప్రాచీన కాలం నుంచీ నేటి వరకు అవిచ్ఛిన్నంగా వస్తున్నాయి. అవి, ఏ కాలంలో ఏ దేశంలో ఏ ప్రక్రియలో ఏ విషయాన్ని స్వీకరించి ఏ ప్రయోజనాన్ని ఆశించి రచించబడి నప్పటికీ, అవి ఏ సాహిత్య గ్రంథానికైనా సమన్వయమైతాయి. విమర్శకు కొన్ని నియమాలు ప్రమాణాలూ ఉంటాయి. అవి ఉండటం అవసరం. అయితే అందులో అతివాదం పనికిరాదు. అది అభిరుచికి సంబంధించింది. కనుక

'సర్వ సారస్వతమ్మభిరుచి సాక్షికమ్ము
అది భావ గమ్యము
వ్యక్తి వ్యక్తికి వాసి గలదు
అది సార్వ కాలికమైన సత్యము
కాన నానా కావ్య చర్చల వలదు
వలదతి వాద శౌర్యము'

అని సాహిత్య విమర్శకులను హెచ్చరించారు ఆచార్య ఎస్.వి. జోగారావు గారు. పర్యాలోచిస్తే ప్రాచీన కాలంలో స్వతంత్ర (ఇండక్టివ్) విమర్శ, అస్వతంత్ర (డిడక్టివ్) విమర్శలని విధాన ద్వయంగా వింగడించారు. విమర్శన రీతిని బట్టి దాని స్వరూప స్వభావాల్ని బట్టి ఆ విమర్శలకు నామకరణం చేస్తారు. ఆ దృష్టితో విభజిస్తే వివరణాత్మక అభినందాత్మక తులనాత్మక నిర్ణయాత్మక నైతిక విమర్శనా భేదాలు ప్రధానమైనవి. అనుశీలింపదగ్గవి. ప్రాచీన విమర్శ కవి కావ్యం కావ్యలక్షణాలు లక్ష్య లక్షణ సమన్వయం ప్రాధాన్యమిస్తుంది. ప్రాచీన కావ్యావతారికలు, వ్యాఖ్యానాలు పీఠికల వంటివి ఈ కోవలోవే. సంస్కృత సాహిత్య విమర్శ పంథాలోనే తెలుగు నాట కూడ విమర్శకంగ వెలిగింది.

### 11.1.1 వివరణాత్మక విమర్శ (Descriptive Criticism)

కావ్యాన్ని శ్రద్ధా భక్తులతో పఠించటమే ఈ విమర్శ ధ్యేయం. విమర్శకుడంటే సుశిక్షితుడైన సంస్కారి పండితుడు

అనుభవశాలి అయిన పాఠకుడు. కవి హృదయాన్ని చక్కగా అవగాహన చేసుకోవటంలో వ్యాఖ్యానించటంలో పాఠకునికి తోడ్పడతాడు. వాటి ఆశయాల్ని సిద్ధాంతాల్ని విశ్లేషించడంలో సహకరిస్తాడు. లోతుపాతుల్ని గమ్యాల్ని వ్యాఖ్యానిస్తుంది ఈ విమర్శ. పద్ధతుల్ని వ్యాఖ్యానిస్తుంది. సాహిత్య గ్రంథాల్లోని భాష బహుముఖ ప్రయోజనమైంది. అలంకార శాస్త్ర రహస్యాలు విశేషాలు సౌందర్యాలు కల్పనలు ఐతిహ్యాలు ఇంకెన్నో విశేషాలు నిక్షిప్తమై కావ్య శోభను ఇనుమడిస్తాయి. ఈ పద్ధతి విమర్శలో సాహిత్య ధర్మసూత్రాలు బాహిరమైనవి కాక అంతః సౌందర్య సంబంధమైనవి.

ఈ విమర్శకుడు కవి భావచిత్ర వ్యాఖ్యానంలో నిశిద దృష్టిని అలవరచుకోవాలి. కవి కల్పనలు కావ్య పరమార్థాన్ని చేరుకోవటానికి ఎలా ప్రణాళికా బద్ధంగా తోడ్పడతాయో విమర్శకుడు పాఠకుడికి మార్గ దర్శకం చేయాలి. సైకో ఎనలిస్టు లాగా పనిచెయ్యాలి. అయితే ప్రతి శబ్దాన్నీ చీల్చి చెండాడి కాకదంత పరీక్షణం చెయ్యకూడదు. కళాత్మకంగా సాగాలి.

ఈ విమర్శనాత్మక పద్ధతికి సాంప్రదాయికమైన ఒక ప్రతిపత్తి ఉంది. ప్రాచీన కాలంలో ఈ పద్ధతి ఎక్కువగా పదవాక్య ప్రమాణ లాక్షణిక వివేచనతో పదునెక్కింది. ప్రాచీన కాలంలో కొనసాగిందంతా విమర్శనాత్మకమైన పద్ధతి మాత్రమే. ఇలాంటివి కొన్ని ఉదాహరణలు.

సంస్కృతంలో మల్లినాథ సూరి వ్యాఖ్యాతా, నారామణీయం, శ్రీధరీయం, వీరరాఘవీయం, నీలకంఠీయం వ్యాఖ్యలు ఈ సంప్రదాయానికి చెందినవే. అలాగే తెలుగులోని రాఘవ పాండవీయానికి ముద్దరాజు పెద్దన వ్యాఖ్య, వసుచరిత్రకు సోమకవి, శిష్టు కృష్ణచరా శాస్త్రుల వ్యాఖ్య ఆముక్తమాల్యదకు వేదం వేంకటరాయశాస్త్రి, మనుచరిత్ర ప్రభావత ప్రద్యుమ్నాలకు వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి వ్యాఖ్యలు ఈ కోవలోవే.

ఆధునిక యుగంలో ఐ.ఏ. రిఛర్డ్స్, లీవిస్ మొ॥న వారి కృషితో ఇది పరిణతమై పరిమళించింది. నిష్పాక్షికమూ సుందరమూ వివరణాత్మకమూ అయిన విమర్శ పద్ధతి ఉపాదేయమే అయినా అంతటితో విమర్శ ప్రయోజనం పూర్తి కాదు.

వివరణాత్మక విమర్శ పద్ధతి ప్రమాణాలనంగీకరించదు, సరికదా, వాటిని అసంభావ్యాలుగాకూడ పరిగణిస్తుంది. గ్రంథాంతరంగ సంశోధనం మాత్రమే ఈ విమర్శ పద్ధతి బాధ్యత. అందుకోసం సాహిత్య స్రష్టల రివాజుల ప్రకారమే సాహిత్య ధర్మ సూత్రాలను నిర్వచించాలి. ఇందులోని వివరణ విశదీకరణల వల్ల కావ్య సామగ్రి, కళ, పరమార్థం, అనే మూడూ అవగతమైతాయి. అంటే కవి హృదయానికీ కావ్యానికి దర్పణంలాగా ఉంటుంది. అలా చెయ్యడం వల్ల కావ్యం, దాని యోగ్యతను అదే నిరూపించుకొంటుందని అంటారు. ఈ గ్రంథ విమర్శకుడు గ్రంథంలోని గుణదోషాల్ని గురించిగాని కళాధర్మాల్ని గురించి గాని తన సొంత అభిప్రాయాల్ని వ్యక్తం చెయ్యకూడదు. కవి వ్యక్తిత్వంతో గాని కాలమాన పరిస్థితులతో గాని విమర్శకుడికి ప్రమేయం ఉండదు.

### 11.1.2 అభినందాత్మక విమర్శ (Impressiocistic Criticism)

సాహిత్య ప్రయోజనమైన ఆనంద జనకత్వ ప్రయోజన లక్షణాన్ని నిరూపిస్తుంది. అభినందాత్మక విమర్శ. ఆహ్లాదాన్ని అనుభూతిక తెచ్చి కావ్యం పట్ల అభినందన స్పందన కల్గించటమే. మమ్మటుడు చెప్పిన 'సద్యః పరనివృతి' అన్న కావ్య ప్రయోజన పరమార్థాన్ని దర్శింపచేస్తుంది అభినందాత్మక విమర్శ. ఆ గ్రంథం విమర్శకుడి కెలా నచ్చిందో మాత్రమే తెల్పుతుంది ఈ పద్ధతి విమర్శ.

వివరణాత్మక విమర్శ పాఠకుల్ని కావ్యానంద విహాయస వీధిలో విహరింపచేస్తుంది. విమర్శకుడి వ్యక్తిత్వం ఈ విమర్శలో స్పష్టమైతుంటుంది. ఈ విమర్శ పాఠకుడితో ముఖాముఖి నిలిచి తన అంతరంగాన్ని వెలువరిస్తుంది. అందువల్ల ఈ పద్ధతి ఆత్మాశ్రయంగా సాగుతుంది.

| | | |
|---|---|---|
| మహాకవి గురజాడ | - | కృష్ణశాస్త్రి పాట |
| గురజాడను గూర్చిన | - | శ్రీశ్రీ వ్యాసం |
| శ్రీశ్రీని గురించిన | - | ఆరుద్ర వ్యాసం |
| విశ్వనాథ, మాధవపెద్ది సుందరరామ | | |
| శాస్త్రులను గూర్చిన | - | కానూరు వెంకటరామశాస్త్రుల వ్యాసం |
| నన్నయ ప్రసన్న కలితార్ధ యుక్తి | - | విశ్వనాథ |
| కీట్సు మహాకవి రచించిన | - | ఆన్ లుకింగ్ ఇంటు చాప్‌మన్స్ హోమర్ |

వంటివి ఈ విమర్శ కోవకు చెందినవే. ఈ రకం విమర్శలో ఉత్సాహ ఆవేశాలు పెల్లుబుకాయి. నిదానం సంయమనం అంతగా కన్పించవు. కావ్య స్వభావ జీవలక్షణాల్ని పట్టివ్వదు. దాని గొప్పదనాన్ని వేనోళ్ల కొనియాడుతుంది. అందువల్ల పాఠక హృదయం కావ్య పఠనానికి ఉవ్విళ్లూరుతుంటుంది. ఇందులో విమర్శకుడి చిత్త శుద్ధిని అభినందించవలసిందే. కాని కావ్య యదార్థం దర్శనానికి అవకాశం సన్నగిల్లుతుంది. మంచి చెడ్డల వివరణ ఉండదు. సాహిత్యంలోని సౌందర్యానందాలనే తెలుపుతుంది. ఒకప్పుడది ప్రసిద్ధమయినదే. కానీ దీని పాక్షిక దృక్పథం వల్ల అవ్యాప్తికి లోనైంది. ఈ కాలంలో పీఠికలు గ్రంథ సమీక్షలు ఈ రీతిగానే సాగుతున్నాయి.

### 11.1.3 తులనాత్మక విమర్శ (Comparative Criticism)

ఇదొక ఉన్నతమైన పరిణతమైన విమర్శన విధానం. ఒక సాహిత్య గ్రంథం ఉత్తమమైనదైనా అది సర్వతంత్ర స్వతంత్రంగా వెలిసిందో కాదో తేల్చుతుంది. ప్రకృతిలో ఏదీ సమగ్రంగా సుందరంగా ఉండదు కదా! వస్తు శిల్పరస కావ్యాంగ ప్రయోజనాల వంటి ప్రధాన విషయాలలో అది ఇతర ప్రసిద్ధ కావ్యాలతో అంతో ఇంతో అనుబంధం కలిగే ఉంటుంది. లేదా సంప్రదాయ ఒరవడిలో వచ్చి ఉంటుంది. ఈ విషయాలు బహు గ్రంథ పరిచయంగ సహృదయ విమర్శకుడు రసానుభవానంతరం తన అంతర నేత్రంతో వీటిని వీక్షించి వాటితో తారతమ్య పరీక్ష చేస్తాడు. ఇటువంటి పరిశీలన వల్ల కావ్యం నిగ్గుతేలుతుంది. సర్వోత్కృష్ట కావ్యం ఉండదు కదా! అనేక గ్రంథాలలోని సాహిత్యమర్మాలు సాహితీపరుల కందుబాటులోకి వస్తాయి. సాహిత్య కళా చైతన్యం పురివిప్పుతుంది. విమర్శ కళ వెల్లి విరుస్తుంది.

ఈ విధానంలో ఒక మహాకవి ఆదర్శమార్గాల్ని లక్ష్యంగా తీసుకొని మరొక కావ్యంలో హెచ్చుతగ్గుల్ని విమర్శించవచ్చు. అలాగే ఆధునికి రచనల్లో ఉత్తమ రచనల్ని ఈ దృష్టితో విమర్శించవచ్చు. ఈ రచన వల్ల విమర్శకుడికి ప్రపంచ భాషా సాహిత్యాల్లో పాండిత్యం అత్యావశ్యకం. అంటే విమర్శకుడు పూర్తి స్థాయి విమర్శకుడే కాదు. బహు భాషా కోవిదుడు కూడ. ఒకే ప్రక్రియలోని ఒకే రకమైన రచనల్ని అంచనా వేయడానికి ఒకే కాలంలోని కవుల్ని వారి కవితా రీతుల్ని విమర్శిస్తుంది తులనాత్మక విమర్శ. దీని వల్ల ప్రపంచ సాహిత్య ఔన్నత్యాలు సాధారణ పాఠకుడికి అవగతమైతాయి. అందువల్ల ఈ పద్ధతి ఒక ప్రమాణ విధానంలో పండిత లోకంలో ఉన్నత ప్రపంచ సాహిత్య విమర్శ కోవిదులలో ప్రముఖుడు తెలుగునాట మన గుంటూరు శేషేంద్ర శర్మ. మొత్తం మీద ఈ విమర్శ విధానంతో కావ్యతత్త్వాన్ని కవి స్థానాన్ని నిర్ణయించవచ్చు.

### 11.1.4 నిర్ణయాత్మక విమర్శ (Judicial Criticism)

ఒకే జాతికి చెందిన విమర్శ విధానంలో ఒక రచనకు గాని ఒక రచయితకు సంబంధించి గాని కొన్ని నిర్ణయాల్ని ప్రతిపాదిస్తుంది. కొన్ని విలువల్ని నిర్ణయిస్తుంది. కొన్ని సిద్ధాంతాలు కొన్ని సూత్రాల ఆధారంగా ఈ నిర్ణయాలు జరుగుతాయి. ఒక గ్రంథం యొక్క సర్వ సుగుణాల్ని పరిగణనలోకి తీసుకొని సాహిత్యంలో దాని స్థానాన్ని నిర్ణయిస్తుంది. అందులో ఆ గ్రంథ భాష శైలి వస్తు స్వభావం రసపోషణ నిర్వహణ పాత్ర చిత్రణం వర్ణనలు అలంకారాలు వ్యక్తిత్వం ప్రాముఖ్యం ఔన్నత్యం మొదలైన

సర్వలక్షణాల్ని పరిశీలించి దాన్ని నిర్ణయిస్తాయి. ఈ విమర్శలో సాహిత్య ధర్మ సూత్రాలు రచయిత పాలిటి రాజ శాసనాలలాగ పరిగ్రహిస్తారు. అందుకు విరుద్ధంగా ఉన్నదాన్ని ఉత్తమ రచనగా పరిగణించదు. అది పాటించే సూత్రాలు అనూచానంగా సంక్రమిస్తున్నవే. ఒక విధంగా ఇది సంప్రదాయ సంబంధ విమర్శ. ఈ విమర్శ విధానంలోని సిద్ధాంతాల మీద సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది నిర్ణయ ఫలితం.

ఈ విమర్శ ఇతర అన్ని విమర్శల కృషి ఫలిత సారం అనవచ్చు. ఎలాగంటే వివరణాత్మక విమర్శతో శబ్దార్థ స్వారస్యాల్ని అభినందాత్మక విమర్శతో, సహృదయ స్పందనను తులనాత్మక విమర్శతో, అటువంటి గ్రంథ సముదాయంలో దానికున్న అనుబంధాన్ని వైశిష్ట్యాన్ని వినియోగించుకొని నిర్ణయాలు చేస్తుంది ఈ విమర్శ పద్ధతి. కనుక అన్ని కోణాలలో సాహిత్యాన్ని దర్శించి విమర్శిస్తుంది, నిర్ణయిస్తుందని నిర్ణయించారు ఆచార్య యస్.వి.జోగారావు.

ఇక, ఈ విధానంలో రచయితకు రచనకు స్వేచ్ఛ ఉండదు. లక్ష్య లక్షణ సమన్వయానికే ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల రచనలో వైవిధ్యం ఉండదు. ఒక్క మూసలో నుంచి తీసినవి గానే ఉంటాయి. విలువలు మారుతున్న సమాజంలో పాత సిద్ధాంతాల్ని పట్టుకొని కొలమానంగా చెయ్యటం వల్ల ఫలితాలు అనుచితంగా ఉండవచ్చు. ఎలాగంటే? సంప్రదాయ సాహిత్య ప్రయోజనం ఆనందం. ప్రస్తుత కావ్య ప్రయోజనం సామాజిక ప్రయోజనం. కనుక ఈ విమర్శ పద్ధతి ఈ కాలపు విలువలకు తగినదనిపించదు. ఇది పాక్షికం అవుతుంది.

## 11.1.5 నైతిక (ఎథికల్) విమర్శ

నైతిక విమర్శ విక్టోరియా యుగంలో ఒక ప్రత్యేకమైన నైతిక దృక్పథాన్ని ఆశ్రయించుకొని ఆవిర్భవించింది. సాహిత్య పరమ ప్రయోజనాన్ని గురించి చేసే విమర్శ యిది. ఉపదేశమే సాహిత్య ప్రయోజనమని భావిస్తుందీ విమర్శ. సాహిత్యం మానవుడిని ఉన్నత పథాల వైపు నడిపించాలి. అందువల్ల కావ్యం విధిగా ఆదర్శపథ నిర్దేశం చెయ్యాలి అంటుంది విమర్శ.

కనుక చక్కని గ్రంథం పాఠకుడి మీద ధర్మ విశ్వాస ముద్రను వేయాలని ఈ విమర్శ పథోద్దేశ్యం. ఈ విమర్శకులకు ఆయా కాలాలకు చెందిన నీతిని గూర్చిన కొన్ని అభిప్రాయాలుంటాయి. నీతికి బహుముఖాలుంటాయి. కనుక దేశాంతర కాలాంతరాలకు చెందిన కావ్యాలను విమర్శించటం కుదరదు. అన్ని దేశాలకూ కాలాలకు నీతి నియమాలు ఏక విధంగా ఎన్నటికీ ఉండవు. పైగా కావ్యం అనేది కేవలం నీతి శాస్త్రం కాదు కదా! అది జీవిత ఆశయాల్ని ఆదర్శాల్ని విలువల్ని జీర్ణించుకొన్న కళాఖండం. కనుక కావ్యంలో ఉండవలసింది కళాధర్మమే. ఉపదేశం తదనంతరమే. అది తెరమరుగున ఉండవలసిందే. పాత్ర సృష్టి ద్వారానే నీతి దుర్నీతుల్ని కావ్యం సూచిస్తుంది. కేవలం నీతి మాత్రమే పరమ ప్రయోజనమైతే నీతి గ్రంథాలు ప్రత్యేకంగా ఉండనే ఉన్నాయి. మొత్తం మీద ఈ విమర్శ రీతిని ప్లేటోవంటి వారు సమ్మతించారు.

## 11.2 అర్వాచీన విమర్శ విధానాలు

ఈ అర్వాచీన విమర్శ పద్ధతులు ఆంగ్ల సాహిత్య విమర్శ ప్రభావంతో ప్రభవించాయి. ఇవి అర్వాచీన యుగ సాహిత్య సృష్టిలోని వైవిధ్యాన్ని, ఆయా గ్రంథాల వైశిష్ట్యాన్ని స్వభావ స్వరూపాల్ని గుణగణాల్ని విమర్శిస్తాయి. ఈ నిమర్శ విధానాలు విశిష్టమైన విమర్శ పద్ధతులు. ఇవి అర్వాచీన స్వభావానికి మాత్రమే అతికినట్లుంటాయి. ఇవి క్రొత్త క్రొత్త సిద్ధాంతాల్ని ప్రతిపాదిస్తాయి. క్రొత్త ప్రయోగ వాదాలు విశ్లేషణలతో విస్తరించాయి. వీటిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు స్వతంత్ర అభిప్రాయాలకు ఆస్కారం ఎక్కువ. తదనుగుణంగా సాగుతాయి. దేశీయ సాహిత్య ధోరణుల్ని విశ్లేషించే సందర్భాల్లో ఈ స్వేచ్ఛా విహరణం విస్పష్టంగా గోచరిస్తుంది.

వీటిలోని ప్రాచ్య రీతులకు తోడు పాశ్చాత్య రీతులు కూడ ఆదరణీయమైనవే. కొందరు ఆంగ్ల భాషాభిమానంతో దేశీయ విమర్శ పద్ధతుల్ని దూరం చేస్తున్నారు. ఇది తగని పని. ఇందువల్ల కావ్య సౌందర్య వివేచనంలో విషమ ఫలితాలు ప్రతిఫలిస్తాయంటారు శ్రీ లక్ష్మీరంజనం గారు. ఈ అర్వాచీన విమర్శ విధానం కళను కళా దృష్టితో కాక సామాజిక ప్రయోజన దృష్టితో సాగుతుంది. ఇవి వింశతి భేదాలకు పైగా ప్రధానంగా గోచరిస్తాయి. చిన్నా చితకా మరికొన్ని భేదాలు వినిపిస్తాయి. ప్రధానమైన విమర్శరీతుల్ని స్థాలీ పులాక న్యాయంగా స్పృశిద్దాం.

## 11.2.1 గ్రాంధిక (టెక్చువల్) విమర్శ

గ్రంథంలోని శబ్ద స్వరూపానికి భాషారీతికి సంబంధించింది ఈ విమర్శ పద్ధతి. దీనికి రూప విమర్శ, సత్య మీమాంసా విమర్శ అని కూడ వ్యవహారం. ఈ విమర్శకు గ్రంథమే ప్రధాన ఆధారం. కనుకనే గ్రంథ విమర్శ అని పేరు. గ్రంథంలోని వివిధాంశాలను పరిశీలిస్తుంది గాని గ్రంథేతర విషయాలను స్పృశింపదు. అంటే కవి జీవితంతో గాని, చారిత్రక సాంఘికాంశాలతో గాని సంబంధం ఉండదు. పాఠ నిర్ణయం సారపాఠ నిరూపణం, అస్పష్ట విషయం స్పష్టీకరణం శబ్ద వ్యుత్పత్తి ఛందో వ్యాకరణాంశాల చర్చ, ఇతర సూక్ష్మాంశాలు, రచనా నిర్మాణ సామగ్రి వస్తువు భావం శైలిని గూర్చిన విషయాల విమర్శ ఉంటుంది. పలు ప్రతుల లోని పాఠాంతరాలతో గ్రంథకర్త ఉద్దేశ నిరూపణం ఇందులోని ముఖ్యాంశం. అధోజ్ఞాపికలు గ్రంథ పరిష్కారం దీని పరిధిలోనివే. గ్రంథంలోని భాష మృతభాష అయినా జీవద్భాష అయినా రెండింటికీ అనువయినదీ విధానం. అలాగా ఒకే గ్రంథానికి అనేక అనువాదాలున్నప్పుడూ ఏది మూల విధేయమో నిగ్గుతేల్చగలదు. మల్లినాథుని పంచకావ్యాల వ్యాఖ్య షేక్స్పియర్ రచనలకు వెలసిన వ్యాఖ్యలు ఈ విధానానికి లోబడి సాగినవే. కేవలం గ్రంథానికి సంబంధించిన వ్యాసాలు పీఠికలు అవతారికలు గ్రంథ సమీక్షలు గ్రంథ సంబంధమైన నూతన భావావిష్కరణలుకు ఈ విమర్శ విధాన మిత్రతార వంటిది. దీనికే పరిష్కరణ విమర్శ అని కూడ పేరు.

## 11.2.2 ఆలంకారిక (రెటోరికల్) విమర్శ

గ్రీకు భారతీయాలంకారికులందరూ ఆలంకారిక విమర్శ పద్ధతినే అభిలషించారు. సామాన్య వ్యవహారానికి కావ్య ఫల్కికకు భేదాన్ని నిరూపిస్తుంది ఈ రచనా విధానం. కావ్య జగత్తుకు అలంకారమే అలంకారం అనే భావం ఈ నాటికీ చాలమంది విమర్శకులకు ఉంది. కవి రచనలలోని వివిధాలంకార భేదాల సూక్ష్మాతి సూక్ష్మ భేదాన్ని విమర్శిస్తుందీ విమర్శ విధానం. సౌందర్య గ్రంథుల్ని విప్పి మెప్పిస్తుంది. చతుర్విధ కవితా విన్యాసాల్ని ప్రదర్శిస్తుంది. పాఠకుడి హృదయ సీమను అలంకరిస్తుంది. ఈ విమర్శ పద్ధతి పరాశ్రయ సంబంధి. అంటే ప్రసిద్ధాలంకారికులు సూత్రపరచిన విధానాల్ని ప్రామాణికంగా గ్రహించి కావ్య విమర్శ చెయ్యడం. ఇది నలిగిన బాటలో నడవటం వంటిది. కావ్య సంబంధమైన శాశ్వత సత్యాల్ని ఆదరించటానికి ఈ ఆలంకారిక విమర్శ పద్ధతి ఆశ్రయణీయం. అయినా ఈ విమర్శలో కూడ సార్వత్రిక సార్వకాలిక సాహిత్య సూత్రాల్ని కల్పించటం కష్టమైన విషయమే.

## 11.2.3 సాంప్రదాయిక (క్లాసికల్) విమర్శ

ఈ పద్ధతికి రూపశిల్పి అరిస్టాటిల్. దీనికి ప్రాచీన విమర్శ అని కూడ వ్యవహారముంది. ఈ విమర్శవాదులు అరిస్టాటిల్‌ను అనుసరిస్తూనే సాంప్రదాయిక సాహిత్య స్వరూప స్వభావాల్ని గూర్చిన పాండిత్యాన్ని నిర్దిష్టమైన భావాల్ని కలిగి ఉంటారు. ఆ సంస్కార బలంతోనే సమకాలీన సాహిత్యాన్ని కూడ సమన్వయిస్తారు. ఆ సంప్రదాయపు సత్తువ చాల గొప్పదని వీరు భావిస్తారు. ఈ ప్రాచీన విమర్శ అంతా విధేయాత్మక మయిందనిపిస్తుంది. అంతా కవి, కవిత్వ లక్షణాలపైనే సాగుతుంది. పురాణాలు ఇతిహాసాలు ప్రబంధాలు శతకాలు మొదలైన సంప్రదాయ సాహిత్యం మీద సాగిన విమర్శ అంతా ఈ కోవలోనిదే. ఇందులోని

ప్రాచీన కవితా విలువలు ఆధారంగా అధునాతన గ్రంథాలను విమర్శిస్తారు. అధునాతన కవితారీతుల్ని అధఃకరిస్తారు. ఏమైనప్పటికీ ప్రాతదంతా పరమమని క్రొత్తదంతా చెత్తదని భావించలేము. విశ్వజనీన భావన చెయ్యాలి. భాషా విషయానికి వస్తే సంప్రదాయ విమర్శ అంతా గ్రాంథిక భాషలోనే సాగింది. ఆ తరువాత కొంత పట్టు సడలి వ్యావహారిక భాషలోనూ సాగింది. ఇందులో భక్తి వేదాంతాల వంటి అంశాల మీద విమర్శ సాగినా ప్రధానంగా కళకళ కోసమనే భావమే కన్పిస్తుంది. అరిస్టాటిల్ కంటె భరతుడే ఈ సాహిత్య సంబంధమైన విషయాల్ని కూలంకషంగా భావించాడు.

## 11.2.4 పునర్నవ (నియో క్లాసికల్) విమర్శ

సాహిత్య విమర్శను గూర్చి అరిస్టాటిల్ భావానికి జోడింపుగా హోరెస్, క్విట్టిలన్ వంటివారు కొంత భావించారు. తరువాత సంఘం ఎంతగానో పరిణతి చెందింది. అలాగే సాహిత్యం కూడ క్రొత్త పుంతలు త్రొక్కింది. అయినా పునర్నవ సంప్రదాయవాదులు వాటిని పూర్తిగా స్వాగతించలేక పోయారు. నిరోధించే ప్రయత్నం చేశారు. వారు ప్రాచీన సంప్రదాయ బాహ్య స్వరూపాన్ని ఉపాసించారు. వస్తు నూతనత్వానికి విముఖులైనారు. రచనా రీతిలోనూ సంప్రదాయాన్నే సమర్థించారు. ఈ విమర్శలో ప్రతీక వాదం సంగీత శాస్త్ర సిద్ధాంతాలు మమేకమైనాయి. ఇందులో కవి జీవితాన్ని గూర్చి ఆతని వ్యక్తిత్వాన్ని గూర్చిన ప్రసక్తి ఉంటుంది. విశ్వ జనీనత వాస్తవాశ్రయ ధర్మం విషయ విస్పష్టత కళాకౌశలం భాషా భావాల సమన్వయం గూర్చిన ఈక్షణ ఉంటుంది. ఇది ఆలంకారిక విమర్శకంటె కొంత భిన్నంగా ఉండే ప్రాత కొత్తల మేలు కలయిక. ప్రాచీన విలువలే ప్రాణప్రదమైన ప్రామాణికాలు ఎదిగినది ఈ విమర్శ.

"పురాణ మిత్యేవ నసాధు సర్వం
న చాపి కావ్యం నవ మిత్య వద్యం
సతః పరీక్ష దన్యతరః భజంతే
మూఢః పరప్రత్యయ నేయ బుద్ధిః"

పాతదంతా ఆ పాతమధురమనీ క్రొత్తదంతా చెత్తదనీ భావించకూడదు కదా! వైవిధ్యం లేకుండా ఒకే మూసలోని వస్తువుల్లాగా, వైవిధ్యం లేని సాహిత్యం చవులూరించదు కదా! తెలుగులో విశ్వనాథ ఆయన శిష్యులు నవ్య సంప్రదాయాన్ని నవ్య సంప్రదాయ విమర్శను ప్రోత్సహించారు. ఈ విమర్శకే నవ్య సంప్రదాయ విమర్శ అని కూడ పేరు. ఇది ఆంగ్ల సాహిత్య విమర్శ ప్రభావంతో ప్రాదుర్భవించింది.

## 11.2.5 కాల్పనిక (రొమాంటిక్) విమర్శ

కాల్పనిక విమర్శనే రొమాంటిక్ క్రిటిసిజం అంటారు. ఈ కోవలోని కవిత్వమూ విమర్శలూ మొదటి ఇటాలియన్ స్పానిష్ రుమేనియన్ మొ॥న రొమాన్యు భాషలలో ఆవిర్భవించింది. అందువల్ల ఆ పేరు వచ్చింది. తరువాతి కాలంలో జర్మనీ ఇంగ్లాండు వంటి దేశాల్లో ప్రవేశించింది. అటునుండి తిన్నగా ఆంధ్రదేశం చేరింది. ఆంగ్లభాషా సాహిత్యంలోని రొమాంటిక్ పొయిట్రీని విశ్లేషించటానికి తెలుగు సాహిత్యాన్ని ఆక్రమించింది. కాల్పనిక కవిత్వంలోని ఊహలకు భావాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అలాగే రచయితల అనుభవ సాక్షికంగా ఆవిష్కరించటం ఈ ఉద్యమ లక్ష్యం. ఇది అందువల్ల ఆత్మాశ్రయ రీతికి చెందిన విమర్శ. ప్రాచీన సిద్ధాంతాల నుండి సాహిత్య స్రష్టకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండటం దీనిలోని ప్రత్యేకత. వీరి రచనలలో వస్తు ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో వాస్తవిక దృక్పథం ఉండదు. తెలుగు నాట వెలసిన భావకవితా విమర్శ దీనికి సంబంధించినదే అనవచ్చు. కాల్పనిక కవులకు చెందిన మనస్తత్వాన్ని ప్రేమ తత్వాన్ని ప్రకృతి ప్రీతిని ఇంకా ఇతరాల్ని ఈ విమర్శ విశ్లేషిస్తుంది.

### 11.2.6 కవి జీవితానుశీలన (బయోగ్రాఫికల్) విమర్శ

ఈ విమర్శ పద్ధతి ప్రకారం సాహిత్య పఠనం సాహిత్యం కోసమే కాదు. కవి జీవిత విశేషాల్ని జీవిత గమన వైఖరిని, మనస్తత్వాన్ని సమకాలిక సమాజంలోని సమస్త విషయాల్ని పరిశీలిస్తుంది. ఆయా అంశాల్ని ఆయా శాస్త్రాల సంప్రదాయాల్ని వ్యాకరిస్తుంది. పరామర్శిస్తుంది. వాటిని ఆ రచనకు దారి తీసిన కారణాలుగా నైపథ్యాలుగా విశ్లేషిస్తుంది. వాటి ప్రభావాన్ని ప్రయోజనాన్ని విశదీకరిస్తుంది. ఇందువల్ల ఆలంకారికులు లాక్షణికులు సిద్ధాంత సూత్రాల ప్రాధాన్యం చాలవరకు తగ్గుతుంది. కనుకనే టి.ఎస్. ఇలియట్ ఈ పద్ధతి ప్రయోజనానికి ఒక పరిమితి ఉంటుందన్నాడు. అన్ని విషయాలను కవి అనుభవించి వ్రాయాలంటారీ విమర్శకులు. తిక్కన శ్రీనాథుల వంటి వారి రచనలలో కొన్ని సందర్భాల్లో ఆ అనుభవాలు కన్పిస్తాయి. కానీ అన్ని వేళలా సాధ్యపడదు. కవి క్రాంతదర్శి కనుక ఏదైనా గ్రహించి రచిస్తాడు. నోబెల్ బహుమతి గ్రహీత సోమర్ సెట్‌మాం 'పోర్టల్' అనే నవలను రచించటానికి పోర్టర్ పని చేసి ఆ అనుభవంతో సుప్రసిద్ధమైన నవల రచించాడంటారు. ఇలా అందరికీ అన్ని వృత్తులూ సాధ్యపడవు. కనుక రచనలోని వారి ఆత్మీయతను గ్రహిస్తే సరిపోతుంది. ఈ విమర్శలో ప్రధానంగా పరిశీలించ దగినవి.

1. కవి జీవించిన కాలం.
2. కవి జీవించిన సమాజం.
3. కవి జీవన యాత్ర.
4. కవి రచనా శిల్పం.

ఈ విధమైన విమర్శలో విమర్శకుడు పక్షపాత వైఖరి నవలంబించే ప్రమాదం ఉంది. మొత్తం మీద దీని వల్ల కవి ఆత్మీయత వ్యక్తిత్వం ఆతని మానసిక తాత్త్విక విశేషాలు అతని కావ్యంలో ఎలా ప్రతిఫలిస్తాయో తెలుస్తుంది.

### 11.2.7 సాంకేతిక (టెక్నికల్) విమర్శ

ఇది రచనా ప్రక్రియకు శిల్పానికి సంబంధించింది. ఇందులో ఏ సాహిత్య గ్రంథం ఏ సారస్వత ప్రక్రియకు సంబంధించిందో గుర్తిస్తారు. ఆ ప్రక్రియం సంప్రదాయాల్ని కవి ఎంతవరకు ఆ రచనా నిర్మాణంలో పాటించాడో విశ్లేషిస్తారు. డ్రైడెన్ కాలరిడ్జి, టి.ఎస్. ఇలియట్‌లు ఈ విమర్శ పద్ధతిలో విజయకేతనాల్ని ఎత్తారు. ఈ ప్రక్రియ పరిశోధనకు మిక్కిలి ఉపయుక్తంగా ఉంటుంది. అయితే ఈ విమర్శలో దృష్టి రచనా శిల్పం మీదనే ఉంటుంది. వస్తు సమీక్షణానికి ఇంత దూరం అవుతుంది. అందువల్ల గ్రంథ వస్తు స్వభావం రసపుష్టి సందేశం అంతరంగం వంటి వాటి వివేచన నీళ్లు వదలుతుంది. అంటే కవి ప్రతిభను కావ్య హృదయాన్ని గ్రహించి, విమర్శకుడు తన అనుభూతిని ప్రకటించటానికిది తగిన భూమిక కాదు ఈ సాంకేతిక విమర్శ పద్ధతి.

### 11.2.8 సిద్ధాంత విచార (థియరిటికల్) విమర్శ

ఈ విమర్శ సౌందర్య దృక్పథ పద్ధతికి మానస పుత్రిక వంటిది. ఒక కళా ఖండంలో అంతర్నిహితంగా ఉన్న సౌందర్య సూత్రాలకు సంబంధించిన ప్రక్రియా పరిశీలనతో కూడి ఉంటుంది ఈ విమర్శ విధానం. అయితే విమర్శకుడికి కళాదృష్టి ఒక్కటి మాత్రం సరిపోదు కదా! మొత్తం మీద దీనిలో సౌందర్య దృష్టి అధికం. దీని ఆద్య ప్రవర్తకుడు అరిస్టాటిల్.

### 11.2.9 సామాజిక (సోషలాజికల్) విమర్శ

రచయితకు సమకాలికాలైన సాంఘిక పరిస్థితులను గుర్తిస్తుంది ఈ విమర్శ రీతి. కవి నాటి యుగ ప్రభావం గ్రంథంలో ఎలా ప్రసరించిందో గుర్తిస్తుంది. ఆనాటి స్థితిగతులను వివరిస్తుంది. సంస్కృతీ సంప్రదాయాల్ని వెలువరిస్తుంది. ఉదాహరణకు తిక్కన నాటి రాజకీయాలు యుద్ధ తంత్రాలు, పెండ్లి తంతులు, ఆముక్తమాల్యదలోని జనజీవనం, లోకంపోకడలు, అలాగే ఇతర కవుల రచనలలోని సామాజిక విషయాలు విశేషాలు వెలుగు చూస్తాయి. ఇలా గ్రంథంలోని సామాజిక పరిస్థితులను సందర్శించవచ్చు.

ఇది చాల అవసరమే. కాని దీని వల్ల మౌలికమైన కళా ధర్మం మూలనపడుతుంది, కనుమరుగైతుంది. అయితే ప్రతి కవిలోని సామాజిక చైతన్యంతో పాటు వ్యక్తిగత చైతన్యాన్ని కూడ గుర్తించవచ్చు. ఈ విధమైన విమర్శన విధానం ప్రాచీనమే అయినా ఆధునిక కాలంలో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది.

## 11.2.10 పౌరాణిక (మైథలాజికల్) విమర్శ

పురాణాల్లోనిది గాని లేదా కావ్యాల్లోనిది గాని, ఇతర రచనలలో గాని కల కళాపరిశీలనంతో పాటు సంస్కృతీ వారసత్వాన్ని వైజ్ఞానిక మానసికాంశాల్ని ఇతర విషయాల్ని వెలికిదీసి వెలార్చుతుందీ విమర్శ. దీనిలో సూక్ష్మమైన కావ్య పరిశీలనం సాగుతుంది. ఆయా అంశాల్ని బట్టి విమర్శనా రీతుల్ని మార్చుకుంటూ సాగుతుంది పౌరాణిక విమర్శ.

ఈ విమర్శ పద్ధతి కవి భావుకతా స్థాయిని కూడ నిర్ణయిస్తుంది. రచన మీద మనకెందుకు మక్కువ కలిగిందో గుర్తించి విశ్లేషిస్తుంది. అంతేకాని ఇతర విషయాలకిందులో ప్రాధాన్యం ఉండదంటారు కొందరు. ఇది ఆధునిక విమర్శనా పద్ధతుల్లోనూ ప్రాచుర్యాన్ని పొందింది. ఇందులో విమర్శకుడి వైదగ్ధ్యం వెల్లడైతుందే కాని సత్య స్వరూప సమ్యగ్దర్శనం కాదని కొందరి అభిప్రాయం. సాహిత్యపు విలువలు సంవ్యక్తం కావంటారు మరికొందరు.

## 11.2.11 సౌందర్య దృక్పథ (ఈస్థటిక్) విమర్శ

కళను కళగా దీపించేది సౌందర్యం. ఆ సౌందర్యం మనకందించేది ఆనందం. కాళాఖండాలలో నిక్షిప్తమైన సౌందర్యాన్ని కర్తృ కౌశలాన్ని నిరూపిస్తుంది సౌందర్య దృక్పథ విమర్శ. కళ కళ కొరకే అనేది దీని సిద్ధాంతం. ఇందులో సౌందర్యం ఒక్కటే విలువైంది. దీనికి సత్య నిష్ఠతో గాని నైతిక విలువలతో గాని నిమిత్తం ఏ మాత్రం లేదు. కళా ఖండపు ఆత్మ పదార్థాన్ని మాత్రమే పరిశీలిస్తుంది. సత్యం శివం సుందరం అని మనవారి ఆశయం. కాని సత్యానికి శివానికి సౌందర్యంతో నిమిత్తం ఉండదు ఈ సిద్ధాంత వాదంలో. అదే దీనిలోని పెద్ద లోపం. ఈ విమర్శకుడు కావ్యంలోని ఇతర విషయాల్ని స్పృశించడు. విమర్శించడు విదూరుడైతాడు. శశాంక విజయం వంటి వాటిలో కవితా సౌందర్యం ఉంది. కాని సత్య శివాలకు దూరమైంది. అందుచేతనే దాన్ని అసత్కావ్యంగా భావించి అవతల పెట్టారు. కనుక నీతిబాహ్యమైన సౌందర్యాన్ని లోకం గౌరవించ దీని స్పష్టమైతుంది.

## 11.2.12 నవ్య (న్యూ క్రిటిసిజం) విమర్శ

సాహిత్య గ్రంథాన్ని గూర్చిన ఆంతరంగిక దృక్పథాన్ని వెలువరిస్తుంది న్యూ క్రిటిసిజం. మనస్తత్వ శాస్త్రీయ సామాజిక మార్క్సిస్టు పద్ధతులతో సాంఘిక మూల సంస్కార వాద విషయాల్లో నాటి మేధావులకు ముఖం మొత్తిన కారణంగా వెలిసింది ఈ నవ్య విమర్శన విధానం. ఈ త్రోవన నడిచిన ప్రముఖులు జె.సి.రస్తమే, ఎలన్సే స్టోటే, ఆర్.పి. వారెంట్, ఆర్.పి. బ్లాక్ బూర్ పండితులు. కాలరిడ్జి, హెన్రీ జేమ్సు, ఎజ్రా పౌండ్, ఐ.ఏ. రిచర్డ్స్ వీరికి స్ఫూర్తి ప్రదాతలు. కాని వారికి సజీవ స్ఫూర్తి మార్గ దర్శకులు టి.ఎస్. ఇలియట్. కవిత్వం ఒక ప్రత్యేక శాఖ అని, ఆ మాటకు వస్తే ఇతర విజ్ఞాన శాస్త్రాల కంటె కూడ గొప్పదని వీరి అభిప్రాయం. అర్థం బోధపడాలంటే కావ్యంలో ఉన్న సాంకేతిక పదాలు పరికరాలు ఆకృతి విశేషాలు అలంకార శిల్పాలు తెలియాలని వీరి పరిపూర్ణ విశ్వాసం. కావ్యానికి సంబంధించిన వస్త్వలంకార ధ్వని విశేషాలన్నీ విస్పష్టంగా ఆలోచించాలని వీరి దృఢ విశ్వాసం. ఒక విధంగా ఈ విమర్శ విధానం మన భారతీయ ధ్వని సిద్ధాంతం వంటిదే.

## 11.2.13 చారిత్రక (హిస్టారికల్) విమర్శ

ఒక కళాఖండపు పుట్టు పూర్వోత్తరాల్ని కేవలం ఆ యుగం లోని కళాత్మక స్వభావ ప్రభావలతోనే కాకుండా, దాని

సమకాలిక సామాజిక సామాన్య పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించటం చారిత్రక విమర్శ విధానం అని హెరాల్డ్ ఆన్ బోర్న్ అభివర్ణించాడు. అది ఏ విధమైన కళాఖండం అయినప్పటికీ అది స్వయంజనితం కాదని, అది ఒక చారిత్రక సన్నివేశమని ఈ విమర్శకుల గాఢ భావన. ఏ రచయిత అయినా సరే అంతో ఇంతో చారిత్రక ప్రభావానికి లోనుకాక తప్పదు. సామాజిక మానసిక ఆర్థికాది సంఘటనలెన్నో రచయిత మీద, ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావం చూపకమానవు. అవి అతని రచనలో ప్రతిఫలిస్తాయి. ఈ విమర్శ వాటినన్నింటిని విశదీకరిస్తుంది. ఒక కళాఖండం ఎంత వరకు చారిత్రక సాక్ష్యంలోను, అవిచ్ఛిన్నమైన సాహిత్య సంప్రదాయంలోను భాగస్వామ్యం వహిస్తుందో వెల్లడిస్తుంది. ఒక రచన జన్మించిన యుగంలోను దానికి ముందున్న కాలంలోను కళను గురించి సాగిన సమాలోచనాన్ని కూడ ఈ విమర్శకుడు పరిశీలించాలి. ఆనాటి సాంఘిక తాత్త్విక సాహిత్య దృక్పథ సమీక్ష కూడ ఈ పరిధిలోనిదే. ఇది కవి కాలాలను నిర్ణయిస్తుంది. గ్రంథ పరిష్కారానికి సహకరిస్తుంది. రచనలోని ఉచితానుచితాల నిర్ణయానికి ఉపకరిస్తుంది. కవి జీవిత విమర్శకులకు చారిత్రక విమర్శకులకు పరస్పరం అవసరం ఉంటుంది. మార్క్సిస్టు విమర్శ సామాజిక విమర్శ దీని శాఖలే.

## 11.2.14 మార్క్సిస్టు విమర్శ

ఈ మార్క్సిస్ట్ విమర్శకే గతితార్కిక చారిత్రక భౌతిక వాద విమర్శ అని పేరు. దీని సిద్ధాంతకర్త మార్క్స్. అతడి పేరుతో మార్క్స విమర్శ అని వ్యవహారంలోకి వచ్చింది. ఒక మార్క్సిస్టు సాహిత్యాన్ని ఏ విధంగా ఏ దృక్పథంతో పరిశీలించి విమర్శించి విలువకడతాడు అనే విషయం ఆధారంగా ఈ పదమూ ఈ విమర్శనా పద్ధతి రూపొందాయి. కనుక మార్క్సిస్ట్ విమర్శ అంటే మార్క్సిస్ట్ దృక్పథంతో చేసే విమర్శ అని గుర్తుంచుకోవాలి.

దృశ్య జగత్తులోని ప్రతి విషయానికీ అన్వయమయ్యే మూడు మౌలిక సూత్రాలమీద ఆధారపడింది మార్క్సిజం. కళలకూ కళా విమర్శలకూ కూడ అవే సూత్రాలను అన్వయించటం వల్ల మార్క్సిస్ట్ విమర్శ అనే పేరు వచ్చింది. ఇందులో చారిత్రక భౌతిక వాద సూత్రాలు మానవ చరిత్ర పరిణామ సూత్రాలు, మార్క్సిజం నైపథ్యం ముఖ్యంలో ఉంటాయి. వస్తువు ప్రగతిశీలమైందా కాదా వర్గ చైతన్యాన్ని కల్గించేదేనా, శ్రామిక వర్గ భద్రతను గూర్చి రచనలో ఉన్నదా లేదా అని దర్శిస్తాడు మార్క్సిస్ట్ విమర్శకుడు. కళార్థత ఉన్నప్పటికి సాంఘిక అభ్యుదయానికి పాటుపడనట్టయితే దాన్ని ఈ విమర్శకులు ఆదరించరు. కావ్యానంద విషయంలో అలంకార శాస్త్రంలో లేని వాటిని దానికి అంటగడతారు. చరిత్ర తెలీని సందర్భాల్లో కూడ ఆ సూత్రాల్ని అన్వయించటం ఈ విమర్శలోని లోపం. ప్రతి విమర్శ పద్ధతికి పరిమితులున్నట్లే దీనికి కొన్ని పరిమితులున్నాయి. తెలుగునాట యిది ఇంకా వికాసదశలోనే ఉంది.

## 11.2.15 మనోవిజ్ఞాన శాస్త్ర భూమిక విమర్శ

ఇందులో పాశ్చాత్య విమర్శకులు మనస్తత్త్వ శాస్త్ర పరిజ్ఞానాన్ని సాహిత్య విమర్శకు ఒక పరికరంగా ఉపయోగించుకుంటారు. స్త్రీ పురుష సంబంధాన్ని గురించి స్వప్నాల గురించి ఫ్రాయిడ్ కనిపెట్టిన అంశాలు, ఆత్మవిశ్వాసం నశించి తమను తామే కించపరచుకొనే మనుష్యుల స్వభావాన్ని గురించి ఏడ్లర్ వ్రాతలూ జాతి సామూహిక సుప్తచైతన్యాన్ని గురించిన జంగ్ సిద్ధాంతమూ - ఇవన్నీ సాహిత్యాధ్యయనానికి కూడా ఉపకరిస్తాయని ఈ విమర్శకుల భావం. ఈ మనోవిజ్ఞా శాస్త్రానికి రూపశిల్పి హెర్బర్ట్ రీడ్. కళా మూలాల్ని కళోత్పత్తిని గూర్చి ఈ శాస్త్రంలో సాహిత్య విమర్శకుడికి ఈ శాస్త్ర సాయంతో తెలుస్తుంది. మనోవిజ్ఞాన శాస్త్రానికి విమర్శ శాస్త్రానికి మౌలిక భేదాలున్నాయి. మనో వ్యాపారం వల్ల ఉత్పన్నమయ్యే విషయాల్ని గురించి వివేచిస్తుంది. ఆయా విషయాల్లో కళ విశేషమయింది. రీడ్ దృష్టిలో మనోవిజ్ఞాన భూమికలో చేసే విమర్శ సాహిత్య పరిధి దాటదు. కళా సృష్టి చేసే మనసును గురించి మనో విశ్లేషణ అనేక వివరాలు ఇస్తుంది. కాల్పనికత మనో విశ్లేషణ న్యూరోసిస్ - కళలు, సౌందర్యం - ఆనందం అనే వాటికి ఇందులో ప్రాధాన్యం ఉంది. అయితే రచయితను ఒక న్యూరోటిక్ రోగిగా భావించి మనో విశ్లేషణ చెయ్యటం నిష్ప్రయోజనం. ఈ విధానాన్ని వైద్యశాస్త్ర పరంగా రచయిత మీద ప్రయోగించటం సమర్థనీయం కాదు.

## 11.2.16 ప్రాదేశిక (టోపోగ్రాఫికల్) విమర్శ

దీని రూపకర్త డా॥ యస్వీ జోగారావు గారు. ఇందులో కవి నివసించిన ప్రదేశపు స్వరూప స్వభావాలు భౌగోళికంగా దాని నైసర్గిక శీత వాతాతపాది పరిస్థితులు, వాటి వలన అక్కడ వృద్ధి చెందిన వృక్షజాలం ప్రాణికోటి అతని పరిసరాలు అన్నిటినీ గూర్చిన పరిశీలన గతార్థమైతుంది. మానవుడి జీవిత గమన శైలి అంతా వానిమీద ఆధారపడి ఉంటుంది. అతడి ఆహార విహారాలు వేష భాషలు వృత్తి ప్రవృత్తులు సంసారపు సరిగమలు బరువు బాధ్యతలు సంబంధ బాంధవ్యాలు అన్నీ అతని రచన మీద ప్రసరిస్తాయి, ప్రతిబింబిస్తాయి. సాహిత్యంలోని నవరస పోషణలో సర్వ దేశాలలోను అవి పోషింపబడిన తీరు భిన్న భిన్నంగా ఉండటం గమనించగలం. ప్రాదేశికమైన భేదాలే వారి అభిరుచులకు, తదనుగుణమైన రచనాక్రమానికి మూలం మూలం. కనుక ఒక సాహిత్య గ్రంథంలోని ఆంతర్యాన్ని సర్వస్వాన్ని గ్రహించాలంటే ఈ పద్ధతి విమర్శ ఉపకరిస్తుంది.

## 11.2.17 సముద్దేశ నిర్ణయ విమర్శ

ఉత్తమ ప్రమాణాలతో గ్రంథ విలువల్ని నిర్ణయించటమే విమర్శ శాస్త్రం యొక్క ధ్యేయమని హెర్బల్ రీడ్ అభిప్రాయం. ఒక సాహిత్య గ్రంథంలో గల సాహిత్య విలువల్ని వెలువరించడం ఈ విమర్శ పద్ధతి విధి.

## 11.2.18 తర్కసహ పద్ధతి

మానవోన్నతికి వలసిన నైతిక ప్రతిపత్తులు గల ఇతి వృత్తాలతోను మానవాళిని ప్రభావితం చేసిన ప్రముఖ చారిత్రక సన్నివేశాల్ని సమర్థంగా వ్యాఖ్యానించగల పద్ధతులతో రూపొందింది ఈ తర్కసహ విమర్శ పద్ధతి.

## 11.2.19 మౌలిక విమర్శ

సాహిత్య సృష్టికి గల మౌలిక సత్యాలకు సంబంధించిన విచికిత్స ఇందులో ప్రధానం. కావ్యంలోని గుణదోషాల్ని వదలి, అసలు కవిత్వం ఏది, ఎందుకు ఆ కావ్యం పుట్టింది అది సాధించిన ప్రయోజనం ఏమిటి, అంటూ దాని మూల ప్రకృతిని అన్వేషించటం ఈ విమర్శ లక్ష్యం. దీన్ని 'జార్జ్ సైంట్ బరి' అమితంగా ప్రశంసించాడు.

## 11.2.20 వర్ణనాత్మక పద్ధతి

ఇది సాహిత్య గ్రంథాలకు సంబంధించిన చర్చ వ్యాఖ్యానం విశ్లేషణ అభినందన మొదలైన విషయాల మీద ఆధారపడి ఉంటుంది. చదువరి అనుభూతుల్ని విస్తృతపరచటం దీని ధ్యేయం. ఈ విమర్శకు పితామహుడు డ్రైడెన్ (1668). ఇప్పటికీ ఇది అనేక విధాలుగా దాని పరిధిని పెంచుకొంటున్నది.

## 11.2.21 మౌలిక పరిణామ దృక్పథ (ఒన్టోజెనెటిక్) విమర్శ

ఇది సామాజిక పద్ధతికీ మనస్తత్వ శాస్త్రీయ పద్ధతికీ మధ్య ఒక సౌహార్ద్ర సేతువును నిర్మించే యత్నం చేసింది. ఈ పద్ధతి సర్వ సాహిత్య విమర్శకీ మూలమయింది. అందువల్ల సాహిత్య విమర్శకీ నైతిక ఆధ్యాత్మిక ఆదర్శ దృక్పథ సంబంధం కలిగిన అన్ని విమర్శ పద్ధతులకు కూడ దీన్ని మూలాధారమయిందిగా భావించారు. కవి యొక్క వ్యక్తిగత మనస్తత్వంతోను అతడున్న సమాజంలోని ఆర్థిక వ్యవస్థను, అతడు సృజించిన కళాఖండం యొక్క మౌలిక రూపురేఖల్ని పొదుకొని ఉంటుంది. ఇలా దీని రూపకర్త అయిన హెర్బన్సురీడ్ అభిప్రాయపడ్డాడు.

## 11.2.22 ప్రమోదకాముక (హెడోనిస్టిల్) విమర్శ

ఇది ఈస్థటిక్ స్కూలుకు చెందిన ఒక అవాంతర పద్ధతి. కళాస్రష్ట ఒక ప్రవక్తలాగా వ్యవహరించిటం తగదని వాల్టన్ పీటర్, ఎడ్డింగ్‌టన్, సైమండ్స్, ఆస్కార్ వైల్డింగ్‌లు భావించారు. వారే దీని రూపశిల్పులు. 'గాట్‌మన్' వంటి 'కళ కళ కొరకే' అని చెప్పిన ఫ్రెంచి విమర్శకుల మూల సూత్రాల మీద ఆధారపడి వీరు సౌందర్య శాస్త్ర సంబంధమైన ఈ వాదాన్ని సృష్టించారు. ఈ విమర్శకులకు వాస్తవికత మీద మక్కువ మిక్కిలి తక్కువ. సమకాలీన సామాజిక నిత్య బాధా విముక్తి కోసం ఒక కళా జగత్తులో ప్రవేశించాలనీ, తద్వారా ప్రమోదాన్ని పొందాలని వీరి అభిలాష. అందువల్లనే దీనికి ప్రమోదకాముక విమర్శ అని నామకరణం.

పైన పేర్కొన్న విమర్శ విధానాలు వింగడింపులే కాక మరెన్నో ఉన్నాయి. ఆ విమర్శలను స్థూలదృష్టితో పరికిస్తే ప్రాచీన కాలానికి చెందిన ఆలంకారిక పౌరాణిక చారిత్రక నైతిక విమర్శల వంటి వాటిని ప్రాచీన విమర్శలు, ప్రాచీన విమర్శలలో కావ్య లక్షణాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. అవతారికలు పీఠికలు టీకులు టిప్పణులు ఇటువంటివే - ఈ విమర్శలు విధేయాత్మకమైనవి.

సహృదయంతో ఉత్తమ ప్రమాణాలతో రాగద్వేషాల కతీతంగా విమర్శిస్తే సద్విమర్శ అనీ, తద్భిన్నంగా విమర్శిస్తే అనుద్విమర్శ అని వ్యవహారం. ఒక కావ్యాన్ని అన్ని దృక్కోణాలతో సవివరంగా విమర్శిస్తే అది సమగ్ర విమర్శ. ఇది సాహిత్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. కావ్యాన్ని సమగ్రంగా కాక పాక్షికాంశాలనే విమర్శిస్తే అది అసమగ్ర విమర్శ.

ఇవి కాక తెలుగునాట వచ్చిన అనేక ఉద్యమాల సారస్వతాన్ని విమర్శించే సందర్భంలో ఆ సాహిత్య ఉద్యమ నామంతోనే ఆ విమర్శను కూడ వ్యవహరించారు. అలాంటి వాటిలో సంస్కరణ, సాహిత్య, పునరుజ్జీవ, కాల్పనిక, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళితవాద సాహిత్య విమర్శలు ముఖ్యమైనవి. ఆయా ఉద్యమవాద సాహిత్యాలకు వేరువేరుగా విమర్శ సూత్రాలు కల్పించుకుంటారు. ఈ ఉద్యమ సాహిత్య విమర్శలకు ప్రత్యేక ప్రయోజనాలుంటాయి.

## 11.3 సమీక్ష

మార్క్సిస్టు మనోవైజ్ఞానిక సిద్ధాంతాల కనుగుణంగాను సమాజానికి ఉపయోగకరమైన మార్గంలో సాహిత్య విమర్శ చేయడం సమంజసం.

## 11.4 ప్రశ్నలు

1. ప్రాచీన విమర్శ భేదాల్ని తెల్పండి.
2. అర్వాచీన విమర్శ పద్ధతుల్ని వివరించండి.

## 11.5 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య భావలహరి - యస్వీ జోగారావు
2. విమర్శ మౌళిక లక్షణాలు - ముదిగండ వీరభద్రయ్య
3. లక్ష్మీరంజన వ్యాసావళి - ఖండవల్లి లక్ష్మీరంజనం



**డాక్టర్ మేళ్ళచెర్వు భానుప్రసాదరావు**
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం – 12
# విమర్శా వ్యాసం – తిక్కన తెరువులు

"అమలోదాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారుగుఁ డం, గళావిదుఁ డ, నాపస్తంబ సూత్రుండ, గౌ
తమ గోత్రుండ, మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుండ, న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుడఁ దిక్కాంకుండ, సన్మాన్యుఁ డన్"
(నిర్వ.ఉ.రా.1.13)

రాజసంతో రంగప్రవేశం చేస్తున్న కవిరాజు లాగా కనిపిస్తా డీ పద్యంలో తిక్కన. సంస్కృత నాటకాలలో రాజపాత్రలు ప్రవేశించేటప్పుడూ, నిష్క్రమించేటప్పుడూ దౌవారికు డెవడో ఒకడు దారి చూపిస్తుంటాడు, 'ప్రభూ! ఇది మీరు నడవవలసిప దారి' అని చెప్పిన తరువాతనే రాజు కదులుతాడు. దాని వెనుక సెక్యూరిటీ కారణాలేవైనా ఉంటాయేమో తెలియదుగాని, సాహిత్యరంగంలో కూడా సార్వభౌముల వంటి కవుల పరిస్థితి అలాగే ఉంటుంది. తెలుగులో అటువంటి మొదటి కవి తిక్కనగారు. కేతన కథాకావ్యమార్గం చూపిస్తే ఆ త్రోవలో తన నడక తాను నడిచాడు; నన్నయ కావ్యేతిహాస ప్రక్రియా ప్రస్థానాన్ని ఆవిష్కరించి చూపిస్తే ఆ రాజమార్గంలో మహారథిలాగా ముందుకు నడిచాడు.

తిక్కనకు ముందు రెండు శతాబ్దాలలో నవ్యప్రక్రియలు తెలుగులో తలయెత్తుతూ తమ వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తున్నాయి; తమ నీడలు ప్రసరిస్తూ ఉన్నాయి. తిక్కన కాలం వరకూ ఆ పని తిక్కన ప్రక్రియలు పుట్టడమే కాని, వాటిలో వివిధ ప్రయోగాలు జరగటం తక్కువ. ఆ పని తిక్కన యుగంలో ప్రారంభమయింది. ప్రక్రియను క్రొత్తగా ప్రవేశపెట్టటానికి ఎంత ప్రతిభ కావాలనో, ప్రక్రియలో ఒక నూత్న ప్రయోగాన్ని రూపొందించాలన్నా అంత ప్రతిభ కావాలి. క్రొత్త ప్రక్రియ సర్గం లాంటిది. ప్రక్రియలో క్రొత్త ప్రయోగం ప్రతిసర్గం లాంటిది. సర్గంలో బ్రహ్మ సృష్టింపబడతాడు; ప్రతి సర్గంలో బ్రహ్మసృష్టి ప్రారంభమౌతుంది.

నన్నయ కావ్యేతి హాసప్రక్రియను సృష్టించి నారాయణ కల్పుడైనాడు. తిక్కన దానిని తన శక్తితో అపూర్వంగా పెంచి 'కవి బ్రహ్మ' గా పేరు పొందాడు. కన్నతల్లి కందిచేను ; పెంచిన తల్లి పెసరచేను. నన్నయభట్టు తన వంతు భారతాన్ని దక్షతతో నిర్వహించాడని తిక్కగారన్నారు. "తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదు నాన్" 'కవిబ్రహ్మ' రచించాడని ఎఱ్ఱాప్రెగ్గడ పేర్కొన్నాడు. నన్నయ బుజాలమీద తిక్కన నించున్నాడు. భారతం ఉభయకావ్య ప్రౌఢితో ఉవ్వెత్తుగా పెరిగింది.

తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని ప్రయోగం కోసం వ్రాశాడు కాని, మహాభారతాన్ని మాత్రం ప్రయోజనంతో కూడిన ప్రయోగంగా నిర్వహించాడు. దానికి కారణాలెన్నో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది తిక్కన చుట్టూ రామాయణం కంటే భారతమే ఎక్కువ తిరిగింది. మతావేశాలు ప్రభుత్వ రాజకీయాలూ ఏకమైతే దేశంలో

అంతర్యుద్ధాలూ, ప్రాణనష్టం, అశాంతి, ఆర్థిక సంక్షోభం, ఆధ్యాత్మిక తిరోగమనం ఏర్పడతాయని తిక్కనకు పల్నాటివీరులపోరు ప్రత్యక్షంగా బోధించింది. మనుమసిద్ధి సింహాసన చరిత్ర తిక్కనకు మహామంత్రిత్వాన్నీ, రాయబారపు నైపుణ్యాన్ని, యుద్ధ నీతినీ, లోకవృత్తాన్ని సమృద్ధిగా నేర్పింది. దాయాదుల పోరును కన్నారా చూచాడు; చేతులారా నిర్వహించాడు; విజయాన్ని సాధించి రాజుకు సమర్పించాడు. అజ్ఞాతవాసం అనుభవంలోకి వచ్చింది. గణపతిదేవుని అండ గోపాలుని కైదండగా అందింది. తానే ఒకప్పుడు ధర్మరాజై, మరొకప్పుడు కృష్ణుడై, మరొక్కప్పుడు వ్యాసుడై, జీవితభారతాన్ని నిర్వహించాడు. తిక్కన జీవితమే మహాభారతం. ముందు ఎంత కథ నడిచినా దాయాదుల కుట్రకు గురియై మనుమసిద్ధి గద్దెను కోల్పోయి అడవులలో అజ్ఞాతవాసం చేస్తున్న తరుణంలోనే తిక్కన పాత్ర కీలకపాత్రగా మారింది. తిక్కన భారతరచనం కూడా అక్కడే మొదలయింది.

సోమయాజి తిక్కన అంపశయ్య మీది భీష్ముడు, పాండవమహాప్రస్థానానంతర వ్యాసుడు. వ్యాసుని వేదనం మూలభారతం, తిక్కన సంవేదనం తెలుగు భారతం.

"హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాదులుం గూడఁ గా
బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుది ముట్టన్ రచియించుటొప్పు బుధసంతోషంబు నిండారఁగన్" (భా.విరా.1.7)

నన్నయ రెండున్నర పర్వాలలో రూపుకట్టిన కావ్యేతిహాసప్రక్రియ తిక్కన పదునేను పర్వాలలో ఏపుగా పెరిగింది. నన్నయ వాగ్వృత్తికి, తిక్కన వాగ్వైఖరికీ, నన్నయకవితాపాకానికి, సంవిధాననైపుణ్యానికీ, తిక్కన కవితా శిల్పానికి, నన్నయ సన్నివేశచిత్రణానికి, తిక్కన సంవిధాననైపుణ్యానికి నన్నయభావపోషణకూ, తిక్కన భావ వ్యక్తీకరణకూ ఇలా ఉభయులు కావ్యకళాధర్మాలలో – భేదం ఉండవచ్చు. కాని, మహాభారత ప్రక్రియా స్వభావంలో మాత్రం మార్పు లేదు.

అయితే, డా.. పాటిబండ మాధవశర్మగారు "నన్నయ భారతము వస్తు కావ్యము– లేక కథాకావ్యము అనుటకు తగియున్నది" . (ఆం.ప్ర.సా.అ. ఆంధ్ర మహాభారతము అరణ్యపర్వము – పీఠిక. పు.13) అని అభిప్రాయపడినారు. వారు తమ అభిప్రాయానికి ఉపబలకంగా పేర్కొన్న మాటలు గమనించదగినవి –"ఇతిహాసత్వ, కావ్యత్వములు అనురూప సమ్మేళనమున రూపొందిన దేశభాషాకావ్యములు ఆ తొలినాళ్లలో వస్తుకావ్యములన్న వ్యపదేశమును పొందినట్లు కనబడుచున్నది... ఇతివృత్తము, వస్తువు, కథ అన్నమాటలు సమానార్థకములుగా సంస్కృతాలంకార శాస్త్రములందు ఉపయోగింపబడియుండుట ఎల్లరు నెరిగినదే. ఇతరులు 'వస్తుకవిత' అన్న దానినే నన్నయ కథాకవిత అనే నని ఊహించుట సులభము... ఇతిహాస వస్తు సముదాయమైన భారతమును వస్తు ప్రధానముగా తప్ప ఈన్యథా నన్నయ ఎట్లు తెలుగున రచింపగలడు?" (పు.12,13). మాధవశర్మగారు కన్నడ సాహిత్య సంప్రదాయానికి చెందిన వస్తుకావ్యాన్ని, సంస్కృత సాహిత్య సంప్రదాయానికి చెందిన వస్తుకావ్యంగా సమన్వయించటానికి యత్నించి గందరగోళాన్ని సృష్టించారు. నన్నెచోడుని వస్తుకవితకూ, విన్న కోట పెద్దన కావ్యాలంకార చూడామణిలో చెప్పిన వస్తుకవితకూ సంబంధం లేదు. అందువలన నన్నయభారతాన్ని వస్తుకావ్య మనీ లేదా కథాకావ్యమనీ పిలవటం సమంజసం కాదు.

ఆంధ్రమహాభారత ప్రక్రియా నిరూపణంలో శాస్త్రీయమైన చర్చలు జరిపి, దానిని కావ్యేతి హాసంగా నిరూపించిన వాదం ఉత్తమం. ఈ వాదానికి ప్రతినిధిగా డా. కేతవరపు రామకోటిశాస్త్రి గారిని ఎన్నుకొని ఈ క్రింది మాటలు ఉదాహరిస్తున్నాను. "ఆంధ్రమహాభారతము ప్రయత్నము మీద కావ్యేతిహాసము చేయబడుచు వ్రాయబడిన శాస్త్రేతిహాసము. అనగా నిచట తాత్పర్య మిది. సంస్కృతమునందున్న దానికంటే అధికమైన కావ్య నిర్మాణ శిల్పమును ప్రవేశపెట్టి శాస్త్రేతిహాసమును కావ్యేతిహాసముగా నిరూపించుటయందు కవిత్రయమువారు శ్రద్ధ తీసికొనినారని మాత్రమే. ఇట్లనుట సంస్కృతభారతము కంటే ఆంధ్రభారతము శ్రేష్ఠమైనదనుట కాదు. ఆ రెండింటికిని భేదము నిర్మాణమునందున్నదని చెప్పుటమాత్రమేయగును. అందువలన ... సంస్కృతభారతమును శాస్త్రేతిహాసమనియు అనుకొనవచ్చును." (తిక్కన కావ్య శిల్పము; పు.129). నన్నయ ఈ ప్రక్రియకు ప్రాణంతో పాటు ప్రాయాన్ని కూడా ఇచ్చాడు. తిక్క ప్రాయానికి ప్రౌఢిమను సంతరించాడు. తిక్కన తరువాత ఎఱ్ఱాప్రెగ్గడ అరణ్యపర్వశేషాన్ని నన్నయ రచనగా పూరించి కావ్యేతిహాసగౌరవాన్ని కాపాడాడు. కవిత్రయం ముగ్గురైనా ప్రక్రియానిర్వహణలో ఒక్కరే – 'ఏక బిల్వం శివార్పణం'.

ప్రక్రియలోనే కాక ప్రస్థానంలో, కవితారుచిలో వీరికి సామ్యం కనపడుతుంది. ఆ సామ్యంలో కూడా వ్యక్తిత్వాలకు సంబంధించిన ప్రత్యేకత లున్నాయి. వాటిని సూక్ష్మంగా వివేచించటం సమంజసం.

కవిత్రయ కవులు గుణప్రధానమైన రచన చేశారు. అది వారిలో కనబడే సామ్యం. కాని, నన్నయ ప్రసాదగుణంతో చిత్తవికాసం కలిగిస్తాడు. తిక్కన మాధుర్యంతో చిత్తద్రుతిని కలిగిస్తాడు. ఎఱ్ఱయ ఓజస్సుతో చిత్తదీప్తిని కలిగిస్తాడు. వీరు ముగ్గురూ గుణప్రధానవాదులే. అయినా, వారి కవితలరుచులు వేరు; రుచులు వేరైనా వారి కవితలు ఆస్వాదస్వాదువులు.

రచనకు రూపాన్నిచ్చేది శబ్దం. ప్రాణచైతన్యాన్ని ప్రసాదించేది అర్థం. ప్రాణచైతన్యంతో కూడుకొన్న రూపమే శరీరం. అందువల్లనే భామహాదులు శబ్దార్థాలు రెండూ కలిసి శరీర మన్నారు. కావ్యశరీరమైన శబ్దార్థాలలో శబ్దానికి, అర్థానికి ప్రాముఖ్యం ఉండే రచన చేసేవారు కొందరు, ఉభయ ప్రాధాన్యం ఉండేటట్లు రచించేవారు కొందరూ కవులలో కనపడతారు. కవిత్రయంలో శబ్దార్థోభయ ప్రాధాన్యమున్న రచన చేసినవాడు నన్నయ. అర్థప్రాధాన్యాన్ని మన్నించినవాడు తిక్కన. శబ్దమాధుర్యంచేత అర్థాన్ని దీపింపచేసినవాడు ఎఱ్ఱన. అందువలన ముగ్గురి శైలులు మూడు విధాలుగా ఉంటాయి. ప్రాణచైతన్యంతో పాటు రూప వైభవం ఉన్న ఆకృతి మాధుర్యాన్ని నన్నయ తెలుగు కవితకు ప్రసాదించాడు. ఆ మార్గాన్ని తరతరాలకవులు తన్మయత్వంతో భజించారు. ఆకృతి వైభవం కంటే ఆత్మ చైతన్యం అనంతంగా ప్రకాశించే తేజశ్శరీరాన్ని కవితకు నన్నయ కవితకు తిక్కన ప్రసాదించాడు. నన్నయ కవిత వివేకానందుని లాగా రూపకాంతి మనోజ్ఞంగా ఉంటుంది. తిక్కన కవిత రామకృష్ణ పరమహంస లాగా భావతేజస్సుందరంగా ఉంటుంది. ఎఱ్ఱన ఆకృతిని అలంకృతం చేస్తాడు. భావంచేత రూపారాధనం చేయిస్తాడు. ఆహార్యం చేత అలంకృతుడైన రాజకుమారునిలాగా ఎఱ్ఱయ కవిత భాసిస్తుంది. ఈ ముగ్గురిలో తిక్కన కవిత తేజస్వి, భావతపస్వి. అటువంటి కవితను సృష్టించే ప్రతిభావంతుడు ఏ సాహిత్యంలోనైనా ఎప్పుడో కాని పుట్టడు.

ఆకారంగా అందంగా ఉంటే అభినయం తక్కువైనా, ఆత్మతేజస్సు అంతగా లేకపోయినా రూపం అస్వాదనీయంగా ఉంటుంది. రూపం రాగమోహనంగా లేనప్పుడు అభినయం, ఆత్మ తేజస్సు, గౌరవాదరాలను కల్పించి దానిని ఆస్వాదయోగ్యం చేస్తాయి. తిక్కన రచన ఈ రెండవకోవకు చెందింది. తిక్కన పద్యం నన్నయ పద్యంలాగా రాగస్రవంతిలా ప్రవహించకపోయినా, భావయుక్తంగా భంగిమలను వెలారుస్తుంది. హృద్యమైన నాదమాధుర్యాన్ని అందించకపోయినా, భవ్యమైన భావామృతాన్ని వర్షిస్తుంది. ఈ వైఖరిలో ఉన్న విశేషం అర్థగుణ సంయోజనం వలన కలిగే రీతివిన్యాసమని సాహితీమర్మజ్ఞులు గుర్తించాలి. అర్థగుణశాలి తిక్కనయజ్వ శైలి.

మూలభారతంలోని కథ వ్యాసునిదైనా, తెలుగులో తీర్చిదిద్దిన పద్యాలు, అందులోని గుణాలు కవిత్రయ ప్రతిభాజన్యాలే. అందులో శబ్దాన్ని చికిలిపెట్టి శిల్పీకరించి గుణవృద్ధిని సాధించే తారకమంత్రం నన్నయ తెలుగు కవితకు ఉపదేశిస్తే, తిక్కన అర్థాన్ని ఆవిష్కరించే అనల్పగణసిద్ధిని బ్రహ్మసూత్రంలాగా తెలుగుకవితకు ప్రబోధించాడు. శబ్ధగుణమార్గం రథాలు నడిచే రాజమార్గంలాగా తెలుగు కవితలో సాగింది. అర్థగుణమార్గం ఓడలు సాగే జలమార్గంలాగా మిగిలిపోయింది. రాజమార్గం నలుగురూ నడవటానికీ, వింతలూ వినోదాలూ, సాములూ గరిడీలూ ప్రదర్శించటానికీ వీలైన త్రోవ. జలమార్గం రసలోకంలో విహరించనేర్చినవారు మాత్రమే నిపుణంగా పయనించటానికి వీలైన త్రోవ. పాదయాత్రతో బాటను దాటవచ్చు; యానపాత్ర ఉంటేనే నీటిని తరింపగలిగేది. శబ్దగుణం రచనకు పాదయాత్ర; అర్థగుణం కవితకు యానపాత్ర. తెలుగులో అర్థగుణ ప్రస్థానానికి కర్ణధారి తిక్కన సోమయాజి.

ఇతిహాసాన్ని కావ్యస్వరూపంగా తీర్చిదిద్దిన కవిత్రయంవారు ప్రధానంగా ధ్వని ప్రస్థానాన్ని ఆదరించారు. అయితే, నన్నయ రచనలో వస్తుధ్వని, తిక్కన రచనలో రసధ్వని, ఎఱ్ఱయ రచనలో అలంకారధ్వని అధికంగా కనపడతాయి. కావ్య నిర్వహణంలో నన్నయ కథాకథన రీతిని ప్రపంచిస్తే, తిక్కన రసవృత్తి నిర్వహణాన్ని నాటకీయఫణితిలో సాగించాడు. ఎఱ్ఱయ ఆంధ్ర ప్రబంధ రచనా ప్రవృత్తికి ప్రస్తావన నిర్వహించినట్లు అలంకృతోక్తిని కవితలో వెలార్చి, వర్ణనాత్మ ప్రయోగం కోసమే చేశాడు; ఇప్పుడు ప్రయోగం ప్రయోజనం కోసం చేశాడు. అప్పుడు సాభిమానంగా తన సాహిత్యదృక్పథాలను సవాలుచేస్తూ ప్రకటించాడు. ఇప్పుడు 'నా నేర్చిన భంగి చెప్పి ధరణీయుఁడ నయ్యెడ భక్తకోటికిన్' అని వినమ్రభావంతో పరమవివేకసౌరభాలను వెదజల్లాడు. అప్పుడు కలం పట్టటానికి హేతువు రాజభక్తి, ఇప్పుడు హరిహరనాథభక్తి. అప్పటి ప్రేరణ ప్రయోగోద్యమం, ఇప్పటి ధారణ కావ్యరసపోషణం. అప్పటి ప్రయోగం రెండు కథల జంట; ఇప్పటి ప్రయోగం రెండు ప్రక్రియల అంటుపంట.

నన్నయ తన సమకాలీన కన్నడ సాహిత్యంలో ప్రాచుర్యం చెందిన సాహితీ ప్రక్రియల కంటే భిన్నంగా ఉదాత్తప్రక్రియను చేపట్టి తెలుగు వారి ప్రత్యేకతను నిలవటానికి ఆంధ్రమహాభారతాన్ని వినిర్మించనారంభించాడు. తిక్కననాటికి తెలుగులోకి వచ్చిన కావ్యప్రక్రియలన్నీ కన్నడ ప్రభావంతో వచ్చినవే. కాథాకావ్యం కూడా తెలుగులో కంటే కన్నడంలోనే ముందు వచ్చింది. మరి తెలుగువారు చేపట్టిన ఉదాత్త ప్రక్రియ – కావ్యేతిహాసం – అసమగ్రంగా మిగిలిపోయింది. దాన్ని పూరించి తెలుగువారి ప్రక్రియా గౌరవానికి పరాకాష్ఠ నందించాడు తిక్కన.

ధ్వనిత్రయంలో రసధ్వనిలాంటి వాడు కవిత్రయంలో తిక్కన సోమయాజి.

**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**